

O35,1N241
M84
10997

శ్రీ కరుటూరి సత్యనారాయణ బి. ఏ.

నము :- తూర్పుగోదావరి జిల్లా, రామచంద్రపురం తాలూకా, పామర్రు

జనకులు :- కీ॥శే॥ కరుటూరి వీరన్న, రత్తమ్మగార్లు

ం :- 18-2-1924

భ్యాసం :- ప్రాథమికవిద్య: బోర్డు హయ్యర్ ఎలిమెంటరీ స్కూలు, పామర్రు

॥ విద్య :- 1) బోర్డు హైస్కూలు, రాజోలు
2) —do— అమలాపురం
3) బోర్డు నేషనల్ హైస్కూలు, రామచంద్రపురం
4) పిఠాపురంరాజావారి హైస్కూలు, కాకినాడ

ాల విద్య :- పిఠాపురంరాజావారి కళాశాల, కాకినాడ

గురువులు :- కవితాభూషణ, విద్వత్కవిశేఖర, కళాప్రపూర్ణ
శ్రీ వెంపరాల సూర్యనారాయణశాస్త్రిగారు
కీ॥శే॥ కోపల్లె శివకామేశ్వరరావుగారు

కృతులు :- రసమంజరి, తిష్యరక్షిత, కరుణా సౌగతము ఆమ్రపాలి, సత్యదర్శనము, ఆశ్రమ సందర్శనము

్యగము :- అసిస్టెంటు కమీషనర్ ఆఫ్ కమ్మర్షియల్ టాక్సెస్ (రిటైర్డు)

స్తుతనివాసము } "పద్మప్రభాస"
ప్రతిష్ఠానము:- } 25-7-9/1 వేలూరివారి వీథి
జయకృష్ణపురం, రాజమండ్రి-533 105

రణ :- సుభద్రా పబ్లికేషన్సు, రాజమండ్రి

మముద్రణ :- 1984 సెప్టెంబరు, 1000 ప్రతులు

సర్వస్వామ్య సంకలితము

ల్యము :- రు. 30/-

పంచవటి

కరుటూరి సత్యనారాయణ

PLACED ON THE SHELF
Date 11.12.95

035,1N24
M84

S. V. Central
Library
and
Research Centre,
T. T. D. TIRUPATI
Acc. No. 10997
Date

035,1N24,1
M84

THIS BOOK IS PUBLISHED
WITH THE FINANCIAL
ASSISTANCE OF TIRUMALA
TIRUPATI DEVASTHANAMS
UNDER THEIR SCHEME
AID TO PUBLISH RELIGIOUS BOOKS

ఆమోదము

మిత్రవర్యులు శ్రీ కరుటూరి సత్యనారాయణగారు రచించిన "పంచవటి" అను రామాయణము నందలి తృతీయ భాగము నాదరముతో పఠించితిని. ఇందు సీతారామలక్ష్మణులు పంచవటి చేరినదిమొదలు సీతాపహరణమునకు పూర్వము లక్ష్మణుడు సీతనొంటరిగావిడిచి యేగువఱకును గల వృత్తాంతము కలదు. శ్రీ సత్యనారాయణగారేది రచించినను చిత్తశుద్ధితో వ్రాయుదురు. అందుచేతనే వారి రచన వాల్మీకి చెప్పినట్లు "సన్మనుష్య మనో యథా" అనునట్లుండును. వారు కథాకథన విషయమున ప్రధానముగ వాల్మీకి రామాయణమునే అనుసరించినను, కొన్నిచోట్ల నితరరామాయణ గాథలనుకూడ సందర్భానుగుణముగా ప్రవేశపెట్టుచుందురు. పూర్వభాగ మందట్లే భాసుని ప్రతిమానాటకము నందలి సన్నివేశములను కొన్నింటి ననుసరించియుండిరి. ఈ భాగమున జటాయువరుదెంచి ముందుగనే శూర్పణఖ వృత్తాంతమును రామాదుల కెఱిగించుట అవాల్మీకమైనది. అకంపనుని ప్రబోధమునను సరించి రావణుడు మొదట మారీచుని సదుపదేశము నాలించి తిరిగి వెళ్ళిపోయెను. తరువాత శూర్పణఖాప్రేరితుడై కామ వాంఛతోవచ్చి మారీచుని యుపదేశము పెడచెవినిబెట్టి తన కార్యక్రమమును కొనసాగించెను.

ఈభాగము హేమంతవర్ణనముతో ప్రారంభమగుచున్నది. ఈవర్ణనము పెక్కు సీసములతోకూడి అత్యంత సహజమై శూర్పణఖ కామోద్రేకమునకు కారణమైనది. ఇందలి పంచవాహినులలో రెండు యుద్ధవర్ణనముతో కూడి యున్నవి, రామచంద్రుఁడొంటరిగా ఖరదూషణ త్రిశిరులను, అసంఖ్యాకమైన రాక్షస బలమును సంహరించుట యిందు సవివరముగా వర్ణింపబడినది. సహజముగా సాత్త్వికులయ్యు శ్రీ సత్యనారాయణగారు

యుద్ధమును చాల వివరముగా కన్నులకు కట్టినట్లు వర్ణించియున్నారు. ప్రతిభ నవనవోన్మేషశాలినియైన ప్రజ్ఞకు పర్యాయము కావున ఏ వర్ణ్య విషయమునైనను కవికి సాక్షాత్కరింప చేయుచుండును. మారీచుని ఉపదేశము శ్రీరాముని పరాక్రమస్ఫూర్తిని చక్కగా వ్యక్తముచేయుచున్నది. శూర్పణఖ కావించిన సీత వర్ణన మనౌచిత్యము పొంతపోక ఎంతో సహజ సుందరముగానున్నది. అట్లే కాంచనమృగము వర్ణనమును, శ్రీరాముడు దానిననుసరించుటయు మనోహరములుగా నున్నవి. సీత లక్ష్మణుని బలవంతముచేసి రామరక్షణమునకై పంపునప్పుడు పల్కిన పల్కులు రామాయణమునందే తీవ్రావేశ సహితములై యున్నవి. అపల్కులే ఆమె భావిదుస్థితికి హేతువులైనవి. మొత్తముమీద నీభాగమున ప్రతి సన్నివేశమందును కవిగారి వర్ణనాకౌశల మప్రతిమానమై పాఠకుల కానందపారవశ్యము కలిగించుచున్నది.

శ్రీ సత్యనారాయణగారిశైలి సరళమయ్యు శక్తిమంతమై, ప్రౌఢమయ్యు సర్వసుబోధమై, భావగంభీరమయ్యు ధారాశుద్ధిశోభితమై, ఆధునికమయ్యు నిర్దుష్టమై యలరారుచుండును. ఈరోజులలో నిన్నిపద్యములనింత హృద్యానవద్యముగా రచించువారు-రచింపగలవారు-ఎందరోలేరు. మిగిలిన భాగములనుకూడ త్వరలో పూర్తిచేసి ప్రకటించి శ్రీ సత్యనారాయణగారా మర్యాదా పురుషోత్తముని అనుగ్రహమునకు పాత్రులగుదురుగాక! వారి రచనల కుచితమైన మన్నన లభించుగాక !

"సాహితీ లోకబాంధవ" "కళాప్రపూర్ణ"
డాక్టర్ దివాకర్ల వేంకటావధాని
ఎం.ఎ. (ఆనర్సు) పి.హెచ్.డి.

★

సమాలోచన

'నీ కనుగోనలందొలఁకు నిర్మలహాస మరీచి మాలికల్
ప్రాకటమై విలోకన విభారుచిరంబును బ్రస్ఫుటమ్మునై
నాకొక క్రొత్తలోకముఁ గనంబఁడజేసె మదీప్సితంబు నీ
వే కరుణించి తీర్పవలె! విజ్ఞుఁడవౌదువు-మాటలేటికిన్

(1-187)

ఇది శ్రీ కరుటూరి సత్యనారాయణగారి పద్యరచనా పాటవానికి ప్రస్ఫుటమైన దర్పణం. ఇవి శూర్పణఖ రామునితో విన్నవించుకొన్న మాటలు. ఇలా కొనసాగుతుంది రచన.

శ్రీ కరుటూరి సత్యనారాయణగారు సుప్రసిద్ధకవులు. కరుణాసౌగతము, తిష్యరక్షిత, ఆమ్రపాలి అనే బౌద్ధ గాథల్ని తీసుకొని అత్యుత్తమ ప్రబంధాలు రచించి పేరెన్నికగన్నవారు. అలానే సత్యదర్శనము, ఆశ్రమ సందర్శనము, అనే రామాయణేతివృత్తాన్ని స్వీకరించి రమ్యాతిరమ్యంగా కావ్య రచనచేసి రసజ్ఞ హృదయాలను రంజింపజేసి అందరి మెప్పులకు పాత్రమైన కవివరేణ్యులు. ఆవెనుకటి కథతో ప్రస్తుతం 'పంచవటి' కావ్య రచన చేయడం ముదావహము. పద్యవిద్యకు పెద్దగా ప్రాధాన్యంలేని ఈ నవీనకాలంలో పద్యాన్ని వదలక కవితచెప్పి భేషు భేష్ అనిపించుకొంటున్న వారు కరుటూరి వారు. వృత్తిరీత్యా కమర్షియల్ టాక్సెస్ అసిస్టెంటు కమీషనరుగా పదవీ విరమణచేసి విశ్రాంతి తీసుకొంటున్నప్పటికీ, ప్రవృత్తి రీత్యా అబ్బిన కవితను కొనసాగిస్తున్న అవిశ్రాంతమైన కలం వారిది. అందుకు వారిని అభినందించకుండా ఉండలేము. దీనికి మరోకారణం గూడా లేకపోలేదు. సామాన్యంగా కవితాధార అనుస్యూతంగా ప్రవహిస్తూ ఉండడం విశేషం. అదిపైగా ఉత్తమ కవిత కావడం మరోవిశేషం.

శ్రీ కరుటూరి వారి ప్రస్తుతకావ్యం 'పంచవటి' రామాయణాంతర్గత విషయం. దీన్ని గ్రహించి ప్రబంధ రీతిలో రచించడం వారి ప్రత్యేకత.

'పంచవటి' కావ్యంలోని ఇతివృత్తం రామాయణాంతర్గతమే అయినప్పటికీ స్వయం సంపూర్ణంగా ఉంది. అంటే సత్యనారాయణగారు ఇతివృత్త నిర్వహణలో చూపిన సామర్థ్యం స్పష్టమవుతుంది. 'పంచవటి' కావ్యం పంచవాహినులుగా విభక్తం. సీతాలక్ష్మణసమేతుడై శ్రీరాముడు పంచవటి ప్రవేశమూ, శూర్పణఖ శ్రీరాముని మోహించి తనకోరిక తీర్చుమని ప్రార్థించడం, రాముడామెను లక్ష్మణుని వద్దకు పంపడం, క్రుద్ధుడైన లక్ష్మణుడు శూర్పణఖ ముక్కు చెవులుగోసి పంపించడమూ ప్రథమవాహిని లోనివిషయం ద్వితీయ వాహినిలో శూర్పణఖ తనకు కలిగిన అవమానాన్ని, దుఃఖాన్ని తెలిపి రాముని సంహరించిరమ్మని యుద్ధానికి ఖరదూషణులను పంపడం ప్రాముఖ్యం వహిస్తుంది. ఖరదూషణులు త్రిశిర సహాయంతో సైన్య సమేతంగా శ్రీరామునిమీదికి యుద్ధానికి వెళ్ళి అనహాయ శూరుడైన శ్రీరామునిచేత సర్వనాశనం కావడం తృతీయ వాహినిలోని విషయం. అకంపనుడనే గూఢచారి ఖరదూషణుల మరణవార్తను, శ్రీరాముని పరాక్రమాన్ని గురించి రావణునితో చెప్పడం, శూర్పణఖ సీతసౌందర్యాన్ని వర్ణించి వివరించడం, కాముకుడైన రావణుడు సీతాపహరణకు మారీచుని సాయంకోరగా మారీచుడు హితోపదేశం చేయడం, రావణుడు పెడచెవిని పెట్టగా భయపడి మాయామృగరూపధారణకు అంగీకరించడం చతుర్థవాహిని లోని ముఖ్యాంశాలు. చివరిదైన పంచమవాహిని మాయామృగరూపంలో మారీచుడు పర్ణశాల ప్రాంతంలో తిరుగాడుచుండగా సీత దానిని కొనిరమ్మని రామునికోరడం, రాముడు మాయామృగాన్ని వెంటాడి, బాణప్రయోగం చేసి చంపగా రామునిలాగ 'హాసీతా! హాలక్ష్మణా!' అంటూ మరణించడం, ఆ కంఠధ్వని రామునిదే అని భ్రమించిన సీత అన్న రక్షణార్థం లక్ష్మణుని వెళ్ళమని చెప్పడం, అన్న పరాక్రమమెరిగినవాడు; అన్న ఆజ్ఞను జవదా

టునివాడు అయిన లక్ష్మణుడు అది మారీచుని మాయఅని వదినతో చెప్పగా సీత లక్ష్మణుని నిందించడం, భరించలేక లక్ష్మణుడు సీతను ఒంటరిగావదిలి వెళ్ళడంతో ముగుస్తుంది. ఇది పంచవటి కావ్యంలోని ఇతివృత్తం.

ఇతి వృత్తం సర్వజన విదితమే అయినా ఆ ఇతివృత్త నిర్వహణలో, పాత్రచిత్రణాచణత్వంలో, నాటకీయతలో, సంభాషణ రచనారీతిలో, తద్వారా పాత్రల మనః ప్రవృత్తుల ప్రకటీకరణలో పద్యరచనా పాటవంలో, వర్ణనా వైదగ్ధ్యంలో, ఆలంకారిక శైలీవిన్యాసంలో, తదుచిత భాషా ప్రయోగ పావీణ్యంలో, వీటన్నిటా వెలయించిన శిల్పంలో శ్రీ కరుటూరి వారి ప్రతిభానై పుణ్యాలు కవికి ఉండవలసిన లక్షణాల్ని సంతరించిపెట్టాయి.

ఇందులో సీతారామలక్ష్మణులు, శూర్పణఖారావణ, మారీచఖరదూషణులు ప్రముఖ పాత్రలు. సందర్భోచితంగా జటాయువు, భరతుడు, కైకా కౌసల్యలు ప్రస్తావింపబడ్డారు. ఆయాపాత్రల ప్రాధాన్యాన్ని తమరచనా పాటవంతో ఎంతో సముచితంగా సహజసుందరంగా చిత్రించి ఉండడం గమనించగలం.

కరుటూరి వారి హృదయం మిక్కిలి ఆర్ద్రం. అందుకే మొదటినుంచీ వారి హృదయం కరుణరసపరిప్లావిత మైనది. కరుణాసాగతాది కావ్య రచనకులోనై మానవతను మన్నించిన వీరు మహాకవులుగా ప్రసిద్ధులు. ఆవెనుక వారి మనస్సు భక్తిసంభరితమై రామునికథపై మళ్ళింది. మధుర మంజులగానం చేయడం ఆరంభించింది. నవవిధ భక్తులలో కీర్తనం. స్మరణం మొదలై నవాటితో శ్రీరాముని ఆరాధించ మొదలిడింది. అందుకే రాముడు సాక్షాద్విష్ణువుగా వారి హృదయంలో స్థిరపడ్డాడు.

'మునుల సంకల్ప బలమునఁ దనిసె జగము
క్రూరకర్ములు ముడిసిరి ధీరుఁడవయి

ఒక్కఁడవె సంహరించితి వ్యూహకంద
రాని విధమున నీవు నారాయణుఁడవె' (3-113) అని

'సాక్షాద్విష్ణువు రామచంద్ర విభుఁడేసందేహమున్‌లేద, నా
కక్షయ్యంబగు పుణ్యలోకములు ప్రాణాంతమ్మునన్ లభ్యమౌ
శిక్షం బొందను నీదుహస్తముల-వై శిష్యమ్ము లేదందులో
రక్షించున్నను, స్వామి తప్పక పునర్జన్మమ్ము లేకుండగన్'
(4-182)

అని వర్ణించడంలో ఈవిషయం స్పష్టమవుతుంది. ఎందరో ఎన్నో విధాల రాముని కీర్తించి తరించారు. కరుటూరి వారునైతం సందర్భోచితంగా రాముని సురూపదర్శనం కావించిరీపద్యంలో

'రాముడిందీవరశ్యాముండు, ప్రియదర్శ
నుఁడు మదగజగమనుడు, సరోజ
పత్రాక్షుఁడాజానుబాహుడు, సింహసం
హనుఁడును, క్షత్రలక్షణ విరాజి
తుండును, ద్రిదశోపముండును, దీప్తవ
దనుఁడు. జటాచీరధారి యయ్యు
సుకుమారుడును, మహాశూరుండుగా నేత్ర
పర్వముగా .... (1-72)' తోచినాడట. అది శ్రీరాముని సురుచిర రూపం.

ఇంతటి సుందర రూపుడైనా అసహాయశూరుడు. పరాక్రమ సంపన్నుడు. అందుకు త్రిశిర, ఖరదూషణులను సైన్యసమేతంగా ఒక్కడే సంహరించడంలో ఇది స్పష్టమవుతుంది. ఇది భారతంలో ఉత్తర గోగ్రహణంలో కౌరవవీరులను విజయుడు జయించి రాబోవు యుద్ధవిజయాన్ని సూచించినట్లే, రామరావణయుద్ధంలో రాముని విజయాన్ని సూచించేఘట్టం

ఈఘట్టాన్ని శ్రీ కరుటూరి కవిగారు సర్వసమర్థంగా నిర్వహించారు. ఇది కథానిర్వహణంలో చూపిన మెళకువ. ఇంకా అనేక సందర్భాలలో కావ్యార్థ సూచన ధ్వని ప్రాయంగా వీరు చిత్రించారు. అది అలవోకగా చిత్రితమైనది. అది కవి ప్రతిభావైభవానికి నిదర్శనమైన అంశం. శూర్పణఖ రాక:

'పిడుగుపాటున వచ్చినవెలఁది కతనఁ
దప్తమయ్యెఁ బ్రశాంత వాతావరణము
పొలుపుఁ దప్పుచు ముందు రాబోవు కష్ట
కాలమున కిద్ది నాందిగాఁ గానిపింప.' (1-83)

శూర్పణఖ రామునితో అన్నమాటలు :

'ఎచ్చటనుండి రాక? కతమెయ్యది? కాననసీమ నిల్వగా
ముచ్చట కల్గెనేమి? కడుముష్కరులుందురు కాన నేదియో
పొచ్చెము వచ్చితీరు సుమి-పోటుమగండవ? వారి ధాటికిన్
కచ్చియలోన భంగపడు కాలము దాపురమయ్యె క్రూరమై' (1-91)

అని చెప్పడంలో రాబోవుకష్టాల్ని సూచించడం జరిగింది.

మారీచుడు రావణునకుచేసిన హితబోధలో కావ్యార్థ సూచన ఉంది.

'ఒక్క నను మాత్రమే చంపి యూరకొనఁడు
చంపు నిన్నును, రాక్షసజాతిసంత
నాకు రామునిఁజూడఁ బ్రాణములు పోవు
సీతను హరింప నీవు చచ్చెదవు నిజము'

'నాసాయమ్మున సీతదొంగిలిన నన్నా! నీవుతే, వేసునున్
కోసుల్ కోసుల్నెట్టఁ జావసగు నుల్కుం బల్కులేకుండ, వి
శ్వాసుల్, దైత్యులుకూడలేనటులె-తేవల్ మాఋ నామాటలన్
గాసింతైనను లెక్కసేయ వదియే గండంబగున్ రావణా!'
(4-183, 184)

ఈ పద్యాల్లో కావ్యార్థ సూచనతోపాటు మరికొన్ని విషయాలు స్పష్టమవుతున్నాయి. శూర్పణఖరాక పిడుగుపాటు అయిందట. 'పోటు మగండవ' అనడంలో శ్రీరాముని పరాక్రమం చెప్పక చెప్పినట్లయింది. ఇది ప్రశ్న. కానీ నిశ్చయార్థకమైనది. 'ఒక్క నను మాత్రమే పంపి' అన్న పద్యంలో ప్రత్యక్షరసత్యముంది.

'నా సాయంతో సీత నపహరిస్తే నీవులేవు. నేనును—జావనగు నుల్కుంబల్కులేకుండ' సర్వము నాశనమైపోతుంది.' అనీ, నామాటలన్ గాసింతై నను లెక్కసేయవదియేగండంబగున్ రావణా!' అని మారీచుడు చెప్పడంలో అనేకానేకాంశాలు స్పష్టమవుతాయి. పిడుగులాంటిదపడిందనడం లోకసహజం. 'దుష్టురాలైన శూర్పణఖ రాక' అలాంటిదని తెలుస్తుంది. శ్రీరాముని పరాక్రమం, మారీచుని హితబోధ, రావణుని మూర్ఖత్వం, అన్నీ స్పష్టమవుతున్నాయి. ఇది కవితా శిల్పం; శ్రీ కరుటూరి వారి కవితలోని శిల్పనైపుణ్యం ఇలాగే వివరిస్తూ వెళ్ళితే ఎంతైనా చెప్పవచ్చు. లక్ష్మణుని భ్రాతృభక్తి, వదినపై గౌరవం, సీతాదేవి సౌశీల్యం, రావణుని దౌష్ట్యం, మూర్ఖత్వం, ఇలాగా ఎంతోచక్కగా సందర్భోచితంగా సత్యనారాయణగారు చిత్రించారు.

కవిగారు పాత్ర చిత్రణలో ప్రతియోగం (contrast) నాశ్రయించడంవల్ల ఆయాపాత్రల శీలవృత్తులు, ఆకారవికారాలు విస్పష్టమవుతున్నాయి. ఉదాహరణకి శూర్పణఖా శ్రీరాముల సంభాషణలో (ప్రథమ వాహిని 147-181) ఈ అంశం చక్కగా వ్యక్తమవుతుంది. ఇంతేగాదు, కవిగారి వర్ణనలో ఇది మరీ మనోహరంగా సహృదయ పాఠకుల మనస్సులను చూరగొనే అంశంగా ఉండడం కవిగారి కమనీయ రచనా విశిష్టతకు మచ్చుతునక.

'రాక్షసి దుర్ముఖి, రాముండు సుముఖుడు-
దనుజ విరూపాక్షి, దాశరథి వి
శాలనేత్రుండు నిశాచరి భైరవ
స్వర, రామమూర్తి సుస్వరుఁడు శూర్ప
ణఖ మహోదరి, రాజనందనుఁడో వృత్త
మధ్యుండు- రక్కసిమాట పెళుచు
రఘువీరుఁడో ప్రియాలాపి- యాసురివృద్ధ,
తరుణుండు జానకీధవుడు-తామ్ర

కేశిని నిశాటి, యతఁడు సుకేశుఁడామె
యెంతయొ విరూప, కందర్పు నిట్టె గెలుచు
సుందరుఁడు రాఘవేంద్రుఁడు - డెందమందుఁ
గలఁతపడె నామె రాముపై కాంక్షమిగుల' (1-74).

ఇలాగ ఇంత సుస్పష్ట రేఖలతో ప్రతియోగం (contrast) వల్ల పాత్రల చిత్తవృత్తులను చిత్రీకరించడం కవిగారి కవితా పాటవానికి, పటుత్వానికి నిదర్శనం.

లోకనీతిని వివరించే పట్టులలో కవికిగల లోకజ్ఞత మనఃప్రవృత్తుల చిత్రీకరణ, వ్యక్తీకరణలో స్పష్టమవుతుంది. విద్యుజ్జిహ్వుని సంహరించిన రావణునిగూర్చి చెప్పిన మాటల్లో ఇది వ్యక్తమవుతుంది.

'ఎట్టి భావముఁ గూడను కట్టుబాటు
లందునున్నంతవఱకె సవ్యముగనుండు
కట్టుతప్పిన నిఁక జెప్పగాఁ దరంబె?
ఆప్రవాహవేగమ్మున కవధియున్నె?' (1-57).

రావణుని మూర్ఖతకి నిదర్శనం. రచనారీతిలో కరుటూరి వారి లోకజ్ఞత స్పష్టం. ఇంకా ఇలాగే మారీచ రావణుల మన స్తత్వాల్ని మనోహరంగా మలిచారు కవిగారు, వారిద్దరి సంభాషణలో లోకజ్ఞతాస్ఫోరకంగా చెప్పడంలో ఎంతో విశిష్టత గోచరిస్తుంది.

'.... ....

....

ఆ విషయమ్ము నాకనుమానముగ నుండె
హేతు వేమియొ తెల్పుమీ నృపాల!
భయమేల? వదనము వాడిపోయెను చెప్పు
మా? యన మారీచు డాయనరిగి

రావణుండును హీన స్వరంబుతోడ
బలికె నిటు 'దెబ్బతినెను నావై భవమ్ము
రాముడను మానవునిచేత- ప్రాణములను
గోలుపోయె జనస్థానమేలు ఖరుడు'

'దూషణుడుం గూలె వాహిని ద్రుంగెనంట' (4-40,41)

'వదనము వాడిపోయెను, హీనస్వరంబుతోడ, దెబ్బతినెను నావై భవమ్ము' అనే ప్రయోగాలు బహు చతురతతో రావణుని మనఃప్రవృత్తిని చిత్రించిన తీరులో కవిగారి లోకజ్ఞత విశదమవుతుంది.

ఇది శ్రవ్యకావ్యమైనా కవిగారికి నాటకీయంగా రచన చేయడమంటే నల్లేరుమీద బండినడక. ఇది కావ్యమంతటా కనిపించే లక్షణం. దీనికి సహకారి సంభాషణ. చతుర సంభాషణాయుతమైనప్పుడే నాటకీయతాస్ఫూర్తి. మూర్తిదాల్చి సహృదయ హృదయాలను పరవశింపజేస్తుంది. ఈ గుణం కవిగారిలో మిక్కుటంగా ఉంది. శూర్పణఖా రావణుల సంభాషణ నాచన సోమనాథుని ఊర్వశీనరకాసురుల, తిక్కన అంతకంటే కంకంటి పాపరాజు

రంభారావణుల, పెద్దన వరూధినీప్రవరుల సంభాషణలను తలపింపజేస్తూ ప్రాచీనాంధ్ర కవులకు వన్నె బెట్టిన తీరుతెన్నులు తెల్లమవుతాయి,

ఊహ, కార్యకారణ సంయుతమైన కల్పన మనోజ్ఞంగా చేయగల దిట్టలు కవిగారు. హేమంత సమయాన ప్రకృతి పరిసరాలు ప్రస్ఫుటమైన తీరు ప్రకృతి పరిశీలన, ఊహ, సముచితమై ఒప్పారుతూ ఉన్నాయి,

'దక్షిణదిశ c గర్మసాక్షి యుండుటc బట్టి
తిలకహీన సుదతి వలెనుదీచి
వెలవెలcబోవుచు వెలితిగాc గాన్పించుc
గాంతిని గోల్పోయి - ఖరకరుండు
దూరమైనందున దుహిన భూధరమును
సార్థక నామమ్ము సంతరించు
కొనుcగాదె! దినములు మనుజుల బాధింప
నత్యంతరమ్యమ్ములగుచు - నిశలు

దీర్ఘతరమయి యెంతకుc దెల్లవాఱ
కాపసోపమ్ములం బ్రజలోపరాని
చలికి దుప్పటులందూఱి సదమదమయి
బెగ్గడిలుదురు సగ్గిసముగ్గిసలుగ (1-16)

ఇలాగే ఖరదూషణాదుల్ని అసహాయ శూరుడై రాముడొక్కడే సంహారం చేసి విజేతయైరాగా సీత రాముని కౌగలించుకొన్న సందర్భంలోని-

'కాంతు కాయమ్మునంగల గాయములను
గాంచి మూర్తిని గొను బరాక్రమమెతోcచ
పతికినౌషధ ప్రాయమై పరిథవిల్లc
జేయగను స్వయంగ్రాహమే సేవధియగు, (3-120)

అనిచెప్పడం కవిగారి ప్రతిభకు నికషోపలం. మరో ఉదాహరణ. మారీచుడు రావణునకు హితబోధచేస్తూ రాముని గుణగానం రూపకంలో వర్ణించిన తీరు-

'రామచంద్రుండు పారావార సదృశుండు
శరములు, ధనువు మకరములు, ఝష
ములగును- సంధాన మోక్షణ రూపమౌ
భుజవేగమే దాని బురద-సాయ
కములె భరింపగా కష్టమౌ కెరటము
లాహవోత్సాహమే యందుఁ గలుగు
సుడిగుండమగుఁగాన చూచి సంద్రమ్ములో
దిగుట శ్రేయస్కరంబగునె చెపుమ' (4-48)

కరుటూరి వారి కవిత్వ పటుత్వానికి పరమ నిదర్శనం. ఇంతకంటే కవికి ఇంకేంకావాలి? ఇలా వివరిస్తూ వెళ్ళితే కావ్యమంతా ఉదాహరణ కాగలదు. కానీ మచ్చునకు మాత్రమే అక్కడక్కడా ఉదాహరిస్తూ ఉన్నాను.

రస పరిపోషణలో కవికిగల సామర్థ్యం స్పష్టమవుతుంది. శూర్పణఖా శృంగారాభాసం (1-80, 87-89, 97-99) రాముని పరాక్రమంలో వీరరసం (2-75, 80, 81, 144-146), శూర్పణఖాశోకం (2-83-92), హాస్యం (1-147, 148, 151, 153, 3-93) సముచితంగా సత్యనారాయణగారు నిర్వహించడం ప్రశంసాపాత్రమైన గుణం.

కవికుండవలసిన లక్షణాలలో వర్ణన ఒకటి. 'వర్ణణానిపుణః కవిః' అనిగదా ఆలంకారికులమతం? అష్టాదశవర్ణనలు కావ్యానికి తప్పనిసరిగా ఉండాలన్నది సైతం లాక్షణికులే పేర్కొన్న విషయం. ఇలాంటి వర్ణనలు

కోకొల్లలు ఈ కావ్యంలో చూడగలం. ఇవి సందర్భోచితమై ఆనందాపాది అయి ఉండడం మరీవిశేషం. రామలక్ష్మణ భరతులు (1-33, 62, 63, 64); సీత (3-58), ఋతువర్ణనలు (1-10-22), యుద్ధవర్ణన (3-5-108) వనవర్ణన (3-154, 160, 161, 162), రావణునికోప వర్ణన (4-5) మొదలైనవెన్నో ఉన్నాయి. కవికికీర్తిని తెస్తున్నాయి.

కవితాకన్యకలంకారాలు అలంకారాలు గదామరి? ఉపమ (1-17, 48, 62, 227, 2-32, 53, 62, 66,76, 3-7, 133, 4-36, 74); రూపకం 1-234, 4-48) ఉత్ప్రేక్ష (3-6, 4-103), అర్థాంతరన్యాసం (3-121), స్వభావోక్తి (1-131, 3-8, 3-158), లోకోక్తి (1-40, 58, 191, 196, 208, 281, 2-26, 3-130, 4-188, 5-174) ఇలా ఇంకెన్నో మనం గమనించగలం.

చెప్పేతీరులో సున్నితమేగాదు ఔచితీసహంగా ఉండడం విశేషం. ఎన్నైనా ఇందుకు ఉదాహరించవచ్చు.

'పిట్టలు నీరుముట్ట వడవిన్ ఖరదానవుపేరు విన్నచో
చెట్టులచేమలన్ రవముసేయక నిల్చును-జోదులందఱున్
నిట్టలమైన భక్తిహవణిల్ల నశాంతికిఁదావులేదు-యే
జెట్టియు సంచరించుఁగ్రమశిక్షణతో దొరయన్నఁబ్రీతితో (2-112)

ఇలాగే 'కాలముశాంతసుందరముగ (114, 3 66), 'కనులతోడనతనినొబ గునుగ్రోలుచు' (1-72), 'ప్రావృట్కాల పయోద సన్నిభశరీరా' (1-99); 'లసన్నాళీక పత్రేక్షణా' (1-140); 'మూపులు మూడయ్యె (1-222), నారీశిరఃప్రసూనము పృథ్వీపుత్రియు (1-233), జానకీదేవి యెడఁదవసంత

ముద్భవించి (3-117), వచ్చెనాపద వాకిటవరకు (4-69), గుండెగూడులన్ (5-87) మొదలైన ప్రయోగాలు సార్థక సుందరమూ, సున్నితమూ అయి మనోరంజకమై ఒప్పుతున్నాయి.

చివరిగా కరుటూరి వారికి భాషమీదగల అధికారాన్ని సూచించే పలుకుబళ్ళు, ప్రయోగాలు గమనించదగ్గవి. ఆపనోపములు, సగ్గినముగ్గినలు, సదమదమయి, బెగ్గడిలుదురు (1-116), కంటికిరెప్పవోలె (1-44) చెవుల నించుకబెట్టక (1-165), అలపునొలపు (4-32), ఉల్కుంబల్కులేకుండ (4-184), ఇలాగ ఎన్నైనా చూపించవచ్చు. ఇకపోతే వృత్తరచనచేసిన కరుటూరి సత్యనారాయణగారు సలక్షణమైన గ్రాంథికభాషనే వాడారు. కానీ మధ్యమధ్య తెలుగుదనం ఉట్టిపడేట్టు వ్యావహారికరూపాలు లాంటి ప్రయోగాలు తమకుతామై అలవోకగావచ్చి పదాల్లో కుదురుకొన్నాయి. ఆయా పద్యాలలో ఈ ప్రయోగాల్ని పరిశీలిస్తే ఈ విషయం స్పష్టమవుతుంది. ఎంతగనొచేయన్ (1-35), అబ్బా (1-38), పట్టపగ్గాలులేక (1-56), తప్పఁబుట్టెను (1-138), ఇంకనొకమాట (1-159), కొంపలేమి మునుగున్, కూడ సోదరులన్ నీపనిఁ బట్టఁ బోదురనుచింతంబొంద రాదింతయున్ (1-162), నానయెచెపుమా (1-163), ఇఁక నీదు వాదమ్ములోఁబస యున్నదా? (1-164), పైగా (1-166), దొరకక దొరకక (1-168), ఎర్రగబుర్రగనుండు (1 179), తీఱదునాకున్ (1-204), మొదటికే మోస మయ్యె (1-235), సున్నము నేయఁడే (2-21), బెంబేలు పడగ (2-72). ఆడినదాటగాఁ బాడినదెల్లను బాటగా సాగెను (3-80), కనులునెత్తికెక్కెనొయేమొ? (4-117), కాసింతైనను లెక్కసేయవదియే (4-184), రాయింబలెన్ నిల్చువే (5-85), పోనేపోను (5-110) ఇలాంటి వ్యావహారిక ప్రయోగాలు ఎంతో సముచితంగా ప్రయుక్తమయినట్లు స్పష్టమవుతుంది.

ఇలాగ ఎంతో మనోహరంగా మానవమనఃప్రవృత్తుల చిత్రీకరణతో లోకవృత్త పరిశీలనా దక్షతతో ఈకావ్యరచనచేసి పద్యం కనుమరుగవుతున్న ఈరోజుల్లో పద్యకవిగా సమున్నతస్థానాన్ని ఆక్రమించారు కరుటూరి సత్యనారాయణగారు. ఇలాగే రామాయణం పూర్తిగా వారిచేతి మీదుగా ప్రతిభా ప్రాభవాలతో సంపూర్ణం కావాలని, ఆంధ్రులకు మరో రామాయణం, మిత్రులు డా॥ వి.వి.ఎల్. నరసింహారావుగారి మాటల్లో 'సత్యకవి రామాయణం' రావాలని ఆశిస్తున్నాను. వారి కవితాపాటవాన్ని శతథా, సహస్రథా ప్రశంసిస్తున్నాను!

ఈ సమాలోచన మూలంగా వారి కవిత నాస్వాదించే అవకాశం కల్పించిన పూజ్యులు శ్రీ కరుటూరి సత్యనారాయణగారికి నా కృతజ్ఞతలు తెలుపుకొంటున్నాను.

డా॥ ఎస్ గంగప్ప,
ఎం.ఏ., పి.హెచ్.డి.



"పంచవటి"

ఒక రసవాహిని

"అహో సకల కవి సార్థ సాధారణీ ఖల్వియం వాల్మీకీయా సుభాషిత నీవీ" అని మురారి చమత్కరించినాడు. శోభనములైన పలుకుల ముత్యాల రతనాల బంగరు రాసులుపోసి వాల్మీకి ఏర్పరచిన విపణి కవితా వ్యాపారముచేయు కవులందరకు సాధారణమై పోయినదన్నాడు. సకల కవులకు వాల్మీకీయమే శరణ్యమన్న అర్థమట్లుండగా, లోకోత్తరమైన వాల్మీకీయమైన కవితా మూలధనము అందరు కవుల చేతిలోపడి సాధారణమై పోయినదన్న అభాండము కూడ వేసినాడు. అది తనకు కూడ వర్తించునదే, రామాయణమును తిరుగ చెప్పదలచిన ప్రతి కవికి అదియొక హెచ్చరిక. ఆహెచ్చరికతోనే తాను రామకథను తిరుగచెప్పినచో అది అనర్ఘమైనది కావలెనని కృతశ్రముడై అపూర్వముగా అనర్ఘరాఘవ నాటకమును తీర్చినాడు. ఆ ముత్యములు, రతనములు, బంగారము-అంతయు వాల్మీకిదే. ఆ సామగ్రిని ఏ కవి ఎంత ప్రయోజన వంతముగా, శోభాయమానముగా వినియోగించికొనినాడన్నదే ప్రశ్న. బంగారము బంగారమే. స్వర్ణకారుడు దానినేమి చేయునో ?

ఈరీతిగా రామకథను కావ్యవస్తువుగా స్వీకరించిన కవికి ఒక సౌలభ్య మున్నది. ఒక పరీక్ష యున్నది. ఈపరీక్ష తప్పదనియే కాళిదాసు "హేమ్నః సంలక్ష్యతే హ్యగ్నౌ విశుద్ధిః శ్యామికాపివా" (బంగారముయొక్క వన్నెవాసి అగ్నిలోనే తేలవలెను) అన్న హెచ్చరికతోనే నిలచినాడు.

ఛందస్సుందరమైన కవితా పరిణతిగల ఏ కవియు, రామకథ చెప్పుటకు మనసు పడకుండ నుండజాలడు. శ్రీ కరుటూరి సత్యనారాయణగారు తెలుగు పద్య రచనలో సుకుమారమైన కథాకథనశైలి నలవరచుకొన్నవారు

'తిష్యరక్షిత' 'ఆమ్రపాలి', 'కరుణాసౌగతము' మున్నగు బౌద్ధకథలెన్నో, వారు నిర్వచనముగా కథాకథన ప్రధానమైన ఒక విలక్షణమైన శైలిలో పద్యకావ్యములుగా సంతరించినారు.

కథను చెప్పుటలోని ముచ్చట నెఱిగిన వాడగుటచే, ఆ చెప్పుటలో పద్యములో కథ నిముడ్చుటగా కాక పద్యముతో కథ చెప్పుట ప్రియతమ ప్రార్థనా చాటుకారమువలె, గోదావరి నీటి తరగపై తేలిన కమ్మ తెమ్మెర వలె తీర్చగలవాడగుటచే, రామకథ సహజముగా మధురము, సుందరము, సుకుమారము నైనదగుటచే తన కథాకథనశైలికి మెరుగులు తీర్చుకొన వచ్చునని తలచి కాటోలు సత్యదర్శనము ఆదిగా రామకథ చెప్పసాగెను.

> "ప్రతిలేని రామచరితము
> మృత సంజీవనము కాదె"

అని యీ పంచవటిలో శూర్పణఖా ఘట్టమున ఈయన అనుట ఒక చమత్కారము. రామచరితముచే మృత్యువును తరించి అమృతత్వమును పడయ వచ్చును. కాని శూర్పణఖ రామచరితముచే మృత్యువును పొందినది. నేటి కాలమున రాక్షసమైన ప్రవృత్తి ప్రబలి మానవులలో కామ క్రోధాదులు విలయ తాండవము చేయుచున్నవి. ఇది మృతసదృశదశ. దీనినుండి సమాజమును సంజీవింప జేయునది రామచరితమే అన్న కవి హృదయమిచట గమనార్హము.

> "గుణగతము రాక్షసత్వము కులగతమ్ము
> జన్మగతమును మఱియును జాతిగతముకాదు"

ఈరీతిగా కుల, మత, జాతుల కతీతముగా రామకథలోని శూర్పణఖా వృత్తాంతమును వ్యాఖ్యానించి కవి ఆధునికులకు రామకథా రహస్యము లెంత యవసరమో సూచించును.

కవితలో అనేకములైన విప్లవాలు వచ్చిన కాలమిది. నేటి వారికి పద్యము గిట్టదు. గ్రాంథిక భాషనచ్చదు. సంప్రదాయము సరిపడదు. ప్రాత కథలన్నరోత. అతిశయోక్తులు, అలంకారములు, శబ్దాడంబరములు మనసుల కెక్కవు. బృహత్కావ్యములు ఒంటపట్టవు. ఇట్టిస్థితిలో శ్రీ కరుటూరివారు పద్యమును వదలరు. గ్రాంథికము విడువరు. సంప్రదాయమునకు తల యొగ్గుదురు, ప్రాతకథలలో క్రొత్త రుచులు కనుగొందురు. పలుకులకు పలు కులే అలంకారములు. ఉక్తులకు హృదయములే లక్ష్యములు, శబ్దములకు శ్రోత్రములే గ్రాహకములు. తానెంత పెద్దకథ చెప్పినను అది బృహత్కా వ్యము కాదు. చెప్పుటకు గాని వినుటకుగాని విసువు పుట్టదు- ఓపిక తర గదు. ఈమొదలైన లక్షణములు గల ఒక రచనా ప్రణాళికతో పరంపరగా రామకథాకావ్యములను కూర్చుచు పండితులను, పామరులను ఆకట్టుకొను చున్నారు. తెలుగులో పద్యము నేటివారికి కావలసిన రీతిలో నందించు చున్నారు.

వచనములో రామకథ చదువుట వేరు. పద్యములో చదువుకొనుట వేరు. పద్యములోని తృప్తి వచనములో రాదు. కాని పద్యము పూర్వల ధోరణిలో నేడు చదువువారు కరువగుచున్నారు. చదివిన వినువారు అంత కంటె కరువగుచున్నారు. కాని, సంగీత మాధుర్యముతో మృదువైన భావ మును సుకుమారముగ, ఒడుపుగ, ఒక అందమైన నడకతో చెప్పినచో హృదయమునకు హత్తుకొనునని శ్రీకరుటూరివారి కావ్యశైలి నిరూపించును. ఇట్టికవిత Edgar Allen Poe నిర్వచనమునకు సన్నిహిత లక్ష్యమనిపించును. "Music, when combined with a pleasurable idea is Poetry; Music without the idea, is simply Music; the idea, without the Music, s prose, from its very definiteness.'

శ్రీ కరుటూరి వారి రచనలో చిత్రమేమనగా భావము విస్పష్టముగా నుండును. అది ఛందోబంధురమైన పాదములలో సన్నని సంగీతపు

ఒయ్యారములు పోవును. అందుచే గద్యమునకున్న స్పష్టత, పద్యమున కుండు సంగీతచ్ఛాయ కలిసి భావము సుకుమారముగా హృదయమును స్పృశించు లక్షణము కలదియగును.

"ఈ హేమంతము ప్రీతిపాత్రమగుగాదే! చూడుమీ లోకమే
నీహారావరణమ్ముగా వొలుచుచుండెన్ హేమ సంపన్నముల్
గేహంబుల్-జలమాన జివ్వమను, నగ్నింగూర్చి కూర్చుండగా
నూహల్ పుట్టును శీతుబాధ తొలగన్ హూతమ్ములై పెల్లుగన్".

ఇది వాల్మీకమునుండి అనువదించినదే. కాని ఈ పద్యము 'పాఠ్యే గేయేచ మధురమ్' అన్నట్లే యున్నది. వాల్మీకి భావము ననుసరించినపుడు ఇంత మెత్తగా, ఒత్తుగా పలుకుటచే కరుటూరి వారు రామకథను చెప్పు నొక మర్మము కనుగొనిరనుట స్పష్టము.

"నీడజావాసముల్ నిబిడముల్, పాదప
వనములు, కననయ్యె, బత్రశూన్య
మై మొండిగా నిల్చి మంచుతో జగమెల్ల
నెఱ్ఱదాళుగ నుండె నే కడఁగన''

ఇత్యాది పద్యములు వర్ణనలలో వాల్మీకి అడుగులకు మడుగు లొత్తును.

ఇక కథలో తన లఘు వ్యాఖ్యలు కవి కథను లోకమునకు చెప్పుట లోని ముచ్చటలుగా నుండును.

"కామమున కిగురు బెట్టును
హేమంతము - - ''

"ధరణిలోఁగల్గు సర్వసౌందర్య సార
మచ్చటను దాశరథులలో నద్భుతముగ
నయన పర్వమ్ముగాన్ జూప్పనాక తెప్ప
పాటు లేకుండ దర్శించె పరవశతను''

ఇట్లు హేమంతములో రాక్షసమైన కామ విజృంభణము సూచించి దాని పర్యవసానమును నిరూపించుటలో నీయన యొక రహస్యమును వెల్ల డించినారు.

వట్టి కథ అందరకు తెలియును. ఆ కథలోని రహస్యములు ఏమైన చెప్పినచో అది ఆ కవి కథ చెప్పుటలోని ప్రయోజనము.

శూర్పణఖ ప్రేరణపై ఖరుడు రామునిపై యుద్ధమునకు తలపడి నాడు. దూషణుని నాయకత్వములో కొన్ని వేల రాక్షసులను యుద్ధమునకు పంపినాడు. వారినందరిని రాముడు ఒక్కచేతిమీదగా వధించినాడు.

"ఖరుఁడీ సత్యము నమ్మజాలకయె దుఃఖంబందె నొక్కొక్కచో
జరుగున్ కల్పన కన్న సత్యమె మహాశ్చర్యమ్ముగా మిన్నయై"

రామునిలో సత్యమే కల్పన కన్న ఆశ్చర్యమట !

ఈ కవియే ఈ కావ్యముననే మరొకచోట - ''కల్పనయె వాస్తవత మించుగాదె సతము" అన్నాడు. మారీచుడు మాయలేడిగా తన రూపకల్పన చేసికొన్నాడు - ఆ కల్పన ఎట్లున్నదనగా నిజముగా ఏ లేడియు అంత అందముగా నుండదు. ఇచ్చట కల్పన వాస్తవతను మించిపోయినది. అని కవి వ్యాఖ్య. అక్కడ సత్యమే కల్పన కన్న మిన్న అన్నాడు. ఈ రెండు పైకి విరుద్ధములుగా కన్పించును. కాని కవి యిక్కడ ధ్వనింపజేసిన

రహస్యము - రాముని విషయమున సత్యమేమిన్న. రాక్షసునిలో కల్పనయే మిన్న అనగానేమి? సత్యము దివ్యమైనది. మాయ రాక్షసమైనది. మఱియు అవధులు లేని ఆశ్చర్యము రాముని విషయముననే గాని రాక్షసుని విషయమున కాదు. కాని సీత రాక్షస మాయలో పడి ఆ లేడికై వ్యామోహపడినది. అక్కడ కవి ఆమె ఆశ్చర్యపడినదని చెప్పడు. ఆ లేడిని చూచిన ఆమెను వర్ణించును.

> "అసలే వెడఁదలు కన్నులు
> రసజాప్తములగుచు వఱలు రమణికి, సపుడా
> బిసిబిసి లేడిం గనుగొన
> నసమముగ మఱింత వెడఁదలయ్యె వెలుఁగునన్"

ఇది చాల అద్భుతమైన వర్ణనము. కవి యొక్క కవితాత్మకు నిదర్శనమైన పద్యరచన వెలుఁగును వర్ణించు తెలుఁగు - 'బిసి బిసి లేడిం గనుగొన నసమముగ మఱింత వెడఁదలయ్యె వెలుఁగునన్" —— ఇందులో ప్రతిపదము వ్యామోహ లక్షణమును చూపును గాని ఆశ్చర్యమును కాదు. 'వెలుఁగు' అన్న తెలుగు మాటలో ఆశ్చర్యమున కున్న బరువు లేదు.

ఇక్కడనే కవి కథను పలుకు మెలకువలు ఎంత కవితామయములో వివరింతును,

> "ఏగును ముందుకు మఱలను
> వీగును వెనుకకును భీతి విస్మితిగదురన్
> మ్రాగన్ను వడును —— లేచును
> సాగును కుప్పించుఁదరుల చాటగు మృగమున్"

SRI VENKATESWARA CENTRAL LIBRARY & RESEARCH CENTRE
TIRUPATI.
10997

లేడి యొక్క చాంచల్యము క్రియాపదపరంపరచే వ్యక్తమగును. దాని వెంటనే పద్యము ——

"ఇటు తిరుగుచు నటుపోవుచుఁ
బటుతాళించుచును" .... ఈ రీతిగా

లేడి యొక్క చాంచల్యమును వర్ణించునదే — శ[త్రర్థకములతో సాగినది. లేడికి చాంచల్యము సహజ లక్షణమే ! మారీచునకు భయముచే చాంచల్యము ఇటు లేడి వర్ణనలో చాంచల్యము [ప్రధానాంశముగా కవి వర్ణన సాగినది. కథ చెప్పుటలోనిది యొక మెలకువ.

"ఆ మాయా మృగముంగని
సౌమిత్రి యెడందఁబొడమె సంశయమేదో
ఆ మారీచుని పనియిది
సామాన్యుడు కాఁడు వాఁడు సాహసి యనుచున్" —

ఈ పద్యము మెత్తని మాటలతో నున్నదిగాని సౌమిత్రికి ఆ లేడిని చూడ గనే పథకమంతయు మనసులో మెదిలెను. "ఆ మాయా మృగము" "ఆ మారీచుడు" ఇందులోని "ఆ" — ఒకే అక్షరము కాని ఎంతో అర్థాంతర సంక్రమితవాచ్యధ్వని గలది.

ఈ కాలమున ఛందోబద్ధమైన కవితలో స్పష్టత, ఝుడితిగా సర్థావబోధ, భావము సారవంతమై రసోన్ముఖముగా నుండుట యన్న లక్షణము లున్నచో అట్టి కవిత జన సామాన్యములో తన పలుకుబడిని పెంచుకొన గలదు.

ఈ రహస్యము పసికట్టియే శ్రీ కరుటూరి వారు ఏ వర్ణన చేసినను, ఏ సంభాషణా చమత్కృతి చూపినను, ఏ సన్నివేశకల్పన చేసినను — మాటలలో మెత్తదనము, రచనలో సారళ్యము, శైలిలో ప్రసన్నతయు వెసికిపోనీయరు. ఇట్లు పద్యమునకు బాహ్యసౌందర్యము ఘటించుటతో బాటు అంతః సౌంకర్యపోషకమైన భావగాంభీర్యమునకు లోటు రానీయరు.

"మునులందింతటి యందచందముల పొల్పులె కూన్య మీతేవ నె
ట్టిన నీరేడు జగంబులన్; బిరుసుగడ్డాల్ మీసలున్ దప్ప మో
హన రూపమ్ములఁ జూడమెయ్యెడల నాహా! యింత సౌందర్యమున్
గనులంజూచుచు నుండబట్టఁదరమా ! కందర్పసౌమ్యాకృతీ !"

తెలుగు పద్యమునకు ప్రాణభూతమైన సర్వ లక్షణములు ఈ పద్యములో తళతళ లాడుచున్నవి. తెలుగు పలుకుబడుల పొడులతో శూర్పణఖలోని కామపు విసురు ప్రస్ఫుటమైనది. "బిరుసుగడ్డాల్ మీసలున్ దప్ప —" "........ పొల్పులె కూన్య మీతేవనెట్టిన నీరేడు జగంబులన్ —" పొల్పులె, గడ్డాల్ — ఈ హలంత బహువచనాంతములు చాలు శూర్పణఖ మాటలలోని రాక్షసత్వవ్యంజనకు — "ఉండఁబట్టఁదరమా !" — అనుటలో దాని కాముకత్వము పరాకోటికందుకొన్నది. మెత్తని మాటలతో ఒత్తైన భావగాంభీర్యము ఈ కవి పద్యములలో ఆపాతమాధుర్యమునకు ఆలోచనామృతమునకు నిధానము.

అనువాదమైనను మూలమును అపేక్షించని స్వతంత్ర రచనగా చేయుటలో ఈయన ఎంత చేయి తిరిగిన వాడో !

"దక్షిణ దిశఁగర్మసాక్షియుండుటఁబట్టి
తిలకహీన సుదతి వలెనుదీచి
వెలవెలఁబోవుచు వెలితిగాఁగాన్పించుఁ
గాంతిని గోల్పోయి —"

"సేవమానే దృఢం సూర్యే దిశమంతక సేవితాం
విహీన తిలకేవ స్త్రీ నోత్తరాదిన్ ప్రకాశతే" — వాల్మీకీయము.

"శతపత్రములు జరాజర్జరితమ్ములు
జీర్ణ కేసర శీర్ణ కర్ణికములు
తుహిన నష్టమ్ములు తోఁచును ముదిరిన
నాళముల్ గల్గి యనామికలుగ
కొలఁకులు సౌందర్యములఁ గోలుపోయెను,
మార్గశిరమ్ము హేమంతమునకుఁ
బ్రారంభమాసమ్ము, రాజులు విజయ యా
త్రలకయి సిద్ధమై తరలిపోదు
రీ ఋతువునందె – కాన నీ ఋతువుతోడ
వత్సరారంభమగుట సాంప్రతము – హాయ
నాగ్రమున నుండుటం బట్టి యాగ్రహాయ
ణికముగాఁ బేరుకొనుచు గణింపనెలల"

"జరాజర్జరితైః పత్త్రైః శీర్ణకేసర కర్ణికైః
నాలశేషాహి మధ్యస్థానభాన్తి కమలాకరాః" – వాల్మీకీయము –

ఈ కవిసంస్కృతమునెఱుగడు. కాని వాల్మీకి శ్లోకములను ప్రతిపదార్థ తాత్పర్యములతో చదివి యుండును. ఆ భావములను తెలుగులో పలుకుటలో ఈయనకు భావమే మార్గదర్శకము. అనువాదములో భాషా దాస్యమునకంటె భావప్రతిధ్వని ప్రధానము.

ఈకవి సీసపద్య రచన విశిష్టమైనది. వర్ణనలకు కథా కథనమునకు, సంభాషణలకు, అనువుగా సీసమును కడుసొగసుగా నడపుట చెప్పుకోదగినది

"పంచవటీ భవ్యవన సీమలన్ విహా
రము సేయ ప్రీతియో రామచంద్ర!
గోదావరీ పావనోదక స్నానముల్
సలుపంగ వాంఛయో సారసాక్ష!" 1-142

ఇత్యాది పద్యము;

"క్షత్రియ జాతిలో సామాన్యముగ నేక
పత్నీ వ్రతస్థులు పరఁగుటరిది-
దశరథరాజు కెందఱు పత్నులుండిరి ?
అతఁడొక్క సతితోడ హాయిగనెనె" - 1-164

ఇత్యాదిపద్యము

"ఎవఁడురా ? తెలుపుమా ! యేపారు మన జన
స్థాననాశమునకు సాహసించె"

ఇత్యాదిపద్యము

"వినియుండవే లోకభీకరుఁడైన మా
లంకాధినాథుని ప్రతిభమున్న !
బింకమ్ముగా, నిరాటంకమ్ముగా మూడు
లోకాల శత్రువుల్ లొగ్గడిల్లఁ
బదితల లిర్వది బాహువుల్ తన ప్రతా
పమునకు విజయ చిహ్నములు కాగ
పంచ భూతముల శాసించెను- దిక్పాల
కుల గూబలను బట్టి నిలువరించె

చంద్రశేఖరు భక్తుఁడే - సాహసమున
భుజబలమ్మున గైలాసభూధరమ్ము
నెత్తెనవలీల - ధనదు జయించి యతని
పుష్పక విమానమును గొనెఁ బొనుగుపఱచి"- 1-125

ఇట్టి పద్యములు విశ్వనాథ ఒరవడిలోనివే ఈ ఒరవడి యెట్టిదనగా
పెద్దనగారు శ్రీనాథుని సీసాల కేర్పరచికొని నట్టిది.

ఈపద్యము, ఇంకను ఈరీతిగానున్న ప్రతి సీసపద్యమును గమనించినచో తెలుగున విశ్వనాథ సీసమును MILTON ఆంగ్లమున ఇతిహాస కావ్యరచనకు Blank Verse ను ఎంత వైవిధ్యములో, విస్తృతితో, ప్రాముఖ్యముతో వినియోగించెనో అంతగా ఈకవి సీసములో రామకథకొక మూస నేర్పరచికొని నాడనిపించును.

"నాలోఁ బత్యణువుం గదల్చెను లసన్నాళీక పత్రేక్షణా !
నీలాలిత్యము, నీవిలాసమును. నీనీలాంబుదచ్ఛాయయున్-"

"ఓయందమ్ముల బ్రోవ ! నావలన మాయోపాయులౌ రక్కసుల్
మీ యీ ప్రాంతమునందుఁ దొల్లిటి వలెన్ మిట్టాడగా జంకుచున్
వేయం బోవరు వెట్టివేషములు సేవింపంగ నేనుండగా"-

"నరులట ! బాహువిక్రమమునన్ గడితేఱిన శూరులంట"

"వారే నన్నుఁ బరాభవించిన రిపుల్వారేసుమీ ! వారెసూ!"

"నేనొక్కండనె పోరువాడ - వదినెన్ నీతోడగొంపోయి, యే
దేనిన్ భద్రతగల్గు నొక్క గుహలో నేర్పాటుగా నుంచుమా"

"నీకనుగోనలందొలఁకు నిర్మల హాసమరీచిమాలికల్"

"తొడవులనెన్నొ తాల్చినది తోయరుహానన ! దానిరూపమే
తొడవగు నన్ని భూషలకు-"

ఇత్యాది పద్యముల ఎత్తుగడలు, పదముల పోహళింపులు ఉత్తమ సాహిత్య సంపదలకు నెలవులనుటలో అతిశయోక్తి లేదు.

"దొరకక, దొరకక వలపుల
దొరవలె దొరకితివి -"

"వాడు రూపమున నెఱ్ఱగ, బుఱ్ఱగనుండు"-

"అందమునకు నందంబా
కుందరదన - చంద్రవదన"

ఇంత ఒడుపైన తెలుగు కవితపలుకు ఈ కవినిగూర్చి పలుకుచో ప్రతి పద్యమునందును నుదాహరించి పలుకవలసిన వెన్నో కలవు!

ప్రతి పద్యము కావ్యమున భావించుటలో నా యానందమును కొన్ని పద్యములతో వెల్లడించితిని. ఎవరియానందము వారిది! ఎవరేమి వ్రాసిన మెచ్చనివారు కొందరు-ఏమివ్రాసినను మెరమెచ్చులు మెచ్చువారు కొందరు- వ్రాసినదానికి మత్సరించు వారుకొందరు.- తత్త్వాభినివేశముతో వివేచించు వా రేకొందఱో!

అస్మద్గురువర్యులు కవిసమ్రాట్ శ్రీ విశ్వనాథ సత్యనారాయణగారు రామాయణం వ్రాసిరి. ఆ ప్రణాళికవేరు. ఈ ప్రణాళికవేరు. కాని ఈయనపై విశ్వనాథ భావనా ప్రభావమెంతో యున్నది. రామకథా కథనములో వారు వీరికి గురువు.

ఈ కవిగారికి చెప్పవలసినది మాత్రమొక్కటి యున్నది- పద్యము ధారాళముగా నడచునప్పుడు కొన్ని వ్యర్థపదములు, కొన్ని వికృతములైన తద్ధితరూపములు, కొన్ని బిగువుసడలిన పాదములు పరిహరించుట, పరిష్కరించుట అవసరము.

“పరుషం బెన్నడు రాదు.... ....” 1-34 పద్యములో పరుషంబెన్నడనండు- అనుకొనినగాని ప్రక్రమ భంగదోషము పరిహారముకాదు. “సాకేతమ్మున.... ప్రాకాశ్యమ్ముగా........ లాంపట్యశూన్యంబుగా....” 1-52 పద్యములో ప్రాకాశమ్మ-లాంపట్యశూన్యము - వంటివి కవితామధువును చిందింపవు. ఇట్టివి నూటికి కోటికి కొన్నికనిపించినచో విమర్శకులలో దోషైకదృక్కులు వానిని మాత్రమేచూపి కావ్య గౌరవమును భంగింతురు. కనుకనే కవి ప్రతి పదమునందు జాగ్రత్తపడుట లోకభీతిచే అవసరము.


ఈయన కవిత పాకమున బడినది. ఆపాకము సమగ్రమైన సాహిత్య లక్షణయుక్తమైనది. రసజ్ఞునకు పాకము ప్రధానము. "పంచవటి"-కావ్యము పంచవాహినులలో విభక్తమైనది. ప్రతివాహిని ఒక రసవాహిని.

"సతివక్తరి సత్యర్థే శబ్దేసతి రసే సతి
అస్తి తన్నవినా యేన పరిస్రవతి వాఙ్మధు"

వక్త ఉన్నాడు. అర్థమున్నది. రసమున్నది. ఎన్నియున్నను ఏదిలేనిదే వాక్కున తేనెలొలుకవో అది ఒకటి యున్నది- అదియే పాకము- అది అనిర్వచనీయము. అది సహృదయ ప్రసిద్ధి సిద్ధమైన వ్యవహారాంగమని రాజశేఖర నిర్ణయము. "పంచవటి" రసవాహిని సహృదయానుభవమున సరసామోదము కల్గించుగాక!

శ్రీ విశ్వనాథ సాహిత్య పీఠము
కాకినాడ
25-8-84

పేరాల భరతశర్మ M. A.



శ్రీ కరుటూరి సత్యనారాయణగారు



గురుదక్షిణ

[కవితా భూషణ, విద్వత్కవిశేఖర, కళాప్రపూర్ణ శ్రీ వెంపరాల సూర్యనారాయణ శాస్త్రి గురుపాదులకు]

కవితా భూషణ ! విద్వ
త్కవిశేఖర ! వెంపరాల గాఢప్రతిభా !
సవినయముగ మత్కృతమభి
నవకృతి "పంచవటి" నర్పణమొనరింతున్

అవధారోగురుదేవ ! ''పంచవటి'' కావ్యంబంకితం బిచ్చి మ
ద్భవమున్ సార్థకముం బొనర్చు కొన సంభావించితిన్ ప్రీతిమై
భవదాశీఃకృతి నిచ్చిదీని గ్రహియింపన్ ధన్యుఁడన్ - దేశిక
ప్రవరా ! ధీనిధి ! వెంపరాలకులదీపా ! సూర్యనారాయణా !

విద్యార్థి జీవితంబున
కాద్యగురుండగుదువీవె ! ఆరాధనతో
విద్యంగఱచితి నదియే
పద్యరచనసేయ సాయపడెనాకెంతో

చిఱుప్రాయమ్మున యందె మీయెడల రాశీభూతనై భృత్యతన్
నెఱపన్ బూనితి భక్తిగౌరవము లున్నిద్రమ్ముగా బుద్ధిలో
మెఱుఁగుల్ దిద్దుప్రయత్నముల్ సలుప నెమ్మిన్ మీరలే హేతువై
పఱగన్ నారచనాప్రరోహమున కుత్పాదించె నుత్సాహమున్

వ్యాకరణమ్మునందు హృదయమ్మున కాస్థఘటించు పద్ధతుల్
మీకె తిరంబుగాఁ దెలియు, మెత్తని మీయెడఁదన్ రహించుహే
వాకము లోకవృత్తముల వైనము లెన్నియొ పోహళించెగా
సాకిరులే కదా ! యిపుడు సన్మతి ! శిష్యులు కావ్యసీమలో

శ్రీయుత వెంపరాలకులశేఖర ! గీష్పతికల్ప ! సూర్యనా
రాయణశాస్త్రివర్య ! రుచిరంబగు మీమృదు మందహాసశో
భాయతనేత్ర కోణముల నాయితమౌ కరుణాదరమ్ములన్
పాయకనిల్చు నిత్యము శుభప్రదమై కడుశీతలమ్ములై

ప్రాచ్యపాశ్చాత్య కళాశాలలందు ను
న్నత పాఠశాలల నతిసమర్థ
ముగను నధ్యాపకులుగఁ బెక్కుఛాత్రుల
బసన్ననల్ మీరందు కొన్నవారు
వ్యాఖ్యానములను ప్రభావతీ ప్రద్యుమ్న
మనుచరిత్రములకు వినిచినారు
ప్రతిభకుమీకు "కళాప్రపూర్ణ" బిరుద
మర్పింప గౌరవ మందినారు

వ్యాకరణ లక్షణమ్ముల మీకుసాటి
ఆంధ్రదేశము నందు లేరనుచుఁ బేరు
గాంచితి రగణ్యపాండితీగరిమ నొకవి
శిష్టమగునట్టి స్థానమార్జించినారు

అద్వైతమతమునం దాస్థమై "శంకర
విజయమ్ము" గ్రథియించి వెలసినారు
వ్యాకరణమ్మునఁ బారగులై " ముని
త్రయ చరిత్రము"ఁ జెప్పి తనరినారు

లీలమై ప్రతిభ "మదాలసచరితమ్ము"
నద్భుతమ్ముగ వ్రాసి యలరినారు
"శబరశంకర విలాసము" "వేంకటేశ్వర
శతకమ్ము"ల రచించి చాలినారు

సక్తులగుచు విద్యారణ్య సంయమి కథ
సంతరింపగ యత్నమ్ము సలిపినారు
బహుముఖప్రజ్ఞ పాండితీపాటవముల
సభల సన్మానములు బొందిసాగినారు

సంస్కృతాంధ్రముల భాషారహస్యోపద
ర్శకులుగా శబ్దశాస్త్రము నెఱింగి
అనుకొంత సూర్యరాయాంధ్రనిఘంటుకా
ర్యాలయమ్మునసుండి యశముఁ గాంచి
బహుకావ్యములను నిబంధించి కవిపండి
తులయెడందలకు విందుల నొనర్చి
వాగ్మివై సభల నుపన్యాసముల సభా
స్తారుల సంతోషజలధిముంచి

కబ్బములలోని మేలిసంగతుల నుడివి
మానితమ్ముగ కావ్యనిర్మాణమార్మి
కతను వివరించి మంజు వ్యాఖ్యానగరిమ
పులకితశరీరులను జేయు పుణ్యమతివి!

ఆరసి బహుశాస్త్రమ్ముల
పారగులై మీరు తత్త్వభావము కలసన్
ధారణ, సద్యఃస్ఫురణము
పేరిమి నెగడితిరి మిగుల విశ్రుతిఁగనుచున్

చంద్రునికి నూలుపోగుగా సంతరించి
నా కృతిని మీకు గురుదక్షిణగ నొసంగు
చుంటి దయతో గ్రహింప ధన్యుండనగుదు
లలిత కవితా మనోజ్ఞ ! కళాప్రపూర్ణ ! !

ప్రతిభావ్యుత్పత్తుల మీ
రతిమాత్రవిపశ్చితులరు - హ్యాకృతిని మహా
మతి ! శిఖరప్రాయులు రూ
పిత ధర్మలు వెంపరాల వేవెల్గ ! నతుల్

ప్రియాంతే వాసి
కరుటూరి సత్యనారాయణ



శ్రీ వెంపరాల సూర్యనారాయణశాస్త్రిగారు

ఆశీర్వచనము

కం। కరుటూరి కులసముత్ప
న్న ! రసాంచిత హృదయ ! సత్యనారాయణ కవి చం
దిర ! సుందరాంధ్ర కవితేం
దిరావదోపాస్తి కృత్య నిత్య తపస్వీ !

ంగ నన్ను నెంచి - తన కూర్చిన పంచవటీ సమాఖ్య సుం
ృతి నిచ్చినావు 'గురుదక్షిణ' గా - నది కొన్న నేనొ యే
ంన సత్కరింతును 'కవిన్' నిను దీవననేత దక్క - నో
ంరి వంశ్య ! సత్యకవి ! కాంచు మితోధికసర్వసంపదల్

ంకెక్కృతి సలక్షణ సార సారస్వ
తామృతంబును గ్రోలినట్టిడగుచుఁ
ంధితి బుధ జనామోదమ్ము సత్ప్రవ
ర్తన కల్మి సంఘగౌరవము నెంతొ
యించి నాఁడ హాంధ్రమున నిందనుకఁబ
ద్య ప్రబంధము లసంఖ్యాకములుగఁ
సితి సిరులు, సంపదలు - రాజోద్యోగి
వై యకలంక చర్యల మెలంగి

లుబిడ్డ లనారతం బోలగింప
మల కవితా తపోదీక్ష విడక, కడవు
ెనఁగదే భావిజీవితమును సుఖాప్తి
న్న ! కరుటూరి సత్యనారాయణ కవి !

గీ। కాళిదాసనె రఘువంశ కావ్యమందు
వృద్ధ దశ రాఘవులు మునివృత్తులనుచు
అటులె ముని వృత్తిఁగూర్తు రామాయణంబు
పున్నెములు పండి జర రాక మున్నెసుకవి !

— వెంపరాల సూర్యనారాయణశాస్త్రి

వక్తవ్యము

ఈ 'పంచవటి' కావ్య కథాంశము వాల్మీకి రామాయణాంతర్గతమగు అరణ్యకాండములోని ఏకదేశమగు నితివృత్తము. ఇంతకుమున్ను నేను రచించిన 'ఆశ్రమ సందర్శనము' కావ్యము తరువాత కథ నుండి యీ కావ్యము ప్రారంభమగును. ఇందు సీతారామలక్ష్మణులు పంచవటి చేరినది మొదలు సీతాపహరణమునకు పూర్వము లక్ష్మణుఁడు సీత నొంటరిగా నాశ్రమమున విడిచి యేఁగు వఱకు గల వృత్తాంతము పంచవాహినులలో వర్ణితము.

శూర్పణఖా నిరాకృతి, ఖరదూషణాదుల వధ, మారీచోపదేశము, శూర్పణఖాభిగమనము, కాంచన మృగము, మారీచవధ, సీత లక్ష్మణుని రామరక్షణమునకు ప్రణిహితము సేయువఱకు కథ యీ కావ్యేతివృత్తము. కథాకథన విషయమున ప్రధానముగా వాల్మీకి రామాయణమునే అనుసరించి నను కొన్నిచోట్ల నితర రామాయణములలోని గాథలనుకూడ సందర్భానుసారముగా ప్రవేశపెట్టియు, కొంత స్వకపోల కల్పన చేసియు మూలకథ కేవిధముగను భంగము చేయకయే యథాశక్తి రచన సాగించితిని. సహృదయపవిత్రులోకము నిది యే మాత్రమలరించినను నా జన్మ ధన్యమైనట్లు నేను భావించెదను. ఈ కావ్యమును అస్మద్గురుదేవులు, పూజ్యులు. కవితాభూషణ, విద్వత్కవిశేఖర, కళాప్రపూర్ణ శ్రీ వెంపరాల సూర్యనారాయణ శాస్త్రి మహోదయుల కరకమలములలో సభక్తికముగా 'గురుదక్షిణ' గా సమర్పించి నాభవమును సార్థకము నొనర్చుకొనుచున్నాను. వారు ప్రసిద్ధ

వైయాకరణులు, సత్కవులు, ధార్మికచింతనులు, శిష్యవత్సలులు. నాట కకర్తలు, కావ్యవ్యాఖ్యాతలు. అట్టి మహనీయున కీగ్రంథమును చంద్రుని కొంతకాలము జాగుగా సమర్పణమొనర్చి చరితార్థుఁడనయ్యెదను.

ఈ కావ్యమును సహృదయతతో విపులసమీక్ష నొనరించిన సాహితీ లోకబాంధవ, కళాప్రపూర్ణ, డాక్టర్ దివాకర్ల వేంకటావధాని ఎం. ఏ. (ఆనర్సు) పి. హెచ్. డి మహోదయులకు, డాక్టర్ యస్. గంగప్ప ఎం. ఏ. పి. హెచ్. డి మాన్యమిత్రులకు, శ్రీ పేరాల భరతశర్మ ఎం. ఏ. సుహృద్వరులకు నా హృదయపూర్వక నమస్సుమనస్సులు. ఈ గ్రంథముద్రణమునకు ద్రవ్యసహాయ మొనరించిన శ్రీ తిరుమల తిరుపతి దేవస్థానముల కార్యనిర్వహణాధికారులు శ్రీ జి. కుమారస్వామిరెడ్డి I.A.S గారికి, పబ్లిక్ రిలేషన్సు ఆఫీసరు శ్రీ రావుల సూర్యనారాయణమూర్తి ఎం. ఏ. ఎమ్. ఒ. డి గారికి, సంపాదకులు శ్రీ కొత్రపాటి సుబ్బారావు ఎమ్. ఏ. గారికి నా సవినమ్రప్రణామ సహస్రములు.

గ్రంథముద్రణము నత్యంతసుందరముగా తమ సరస్వతీ పవర్ ప్రెస్సులో చేయించిన సహృదయులు శ్రీ అద్దేపల్లి నాగేశ్వరరావు గారికి, పంచవటి ముఖపత్రమును చిత్రించి యిచ్చిన శ్రీ బాపుగారికి నా కృతజ్ఞతలు.

నాకు మార్గదర్శకులుగా నుండి నాకు కలుగు సంశయములను నివృత్తి చేయుచు నితోధిక సహాయము చేయుచున్న మాన్యమిత్రులు మహాకవులు, కళాప్రపూర్ణ శ్రీ మధునాపంతుల సత్యనారాయణశాస్త్రి గారికి నా హృదయపూర్వకాభివందనములు.

— కరుటూరి సత్యనారాయణ

పంచవటి

ప్రథమ వాహిని

శ్రీమంతంబగు రమ్యపంచవటిలో శ్రీరాముఁడున్, జానకీ
రామాలక్ష్మణసంయుతుండగుచు స్వారస్యమ్ము పెంపారగా
క్షేమోల్లాసపరీత చిత్తుఁడుగ వాసిం గూర్చు మౌనీంద్రసే
వామాధుర్యము తృప్తినీయ గడపన్ వాంఛించెఁ బ్రసన్నుఁడై 1

ధరణీనందన ప్రీతిమై ప్రకృతి సౌందర్యమ్ము వీక్షించుచున్
మురియున్, భీతకురంగనేత్రముల డంబున్ గాంచు, చాంచల్యమున్
బరికించున్ బహుధా విలాసముగఁ బర్వన్ ఱెప్పలల్లార్చుచున్
జరియించున్ బరితుష్టి నెమ్మదిని వాత్సల్యమ్ము పొంగారఁగన్ 2

దశరథ నేత పుత్రులని, తన్వియు వెంటను గల్గఁ గా సహ
ర్నిశమును వారిసేమము గణించుచు నెంతయు నప్రమత్తుఁడై
భృశము చెలంగఁ బుణ్యజనభీతిం దొలంచె జటాయు వర్మిలిన్
కుశలత ప్రాంతభూమి సమకూడెను మౌనుల కార్తి వీడగన్ 3

కాలము శాంతసుందరముగాఁ జనుచుండె జటాయుమైత్రితో
పాలసులెవ్వరయ్యెడకు బాధలుపెట్టగ రాకపోవగా
వీలు రవంతలేదు రఘువీరున కాలము సేయనేరితో
తాలిమికాఁడుకూడ శతధాపొలుపారె ప్రమోదమందుచున్ 4

మునిపత్నీసహవాసభాగ్యమున నామోదించుచున్ బెల్లుగా
తనివింజెందుచుఁ గ్లేశముల్ మఱచె సీతాదేవి వ్యాసక్తిఁ బ్రా
క్తనగాథావళి సావధానముగ సాకల్యంబుగా సంస్పృహన్
వినయాధిక్యము పిచ్చలించు కనులన్ విన్పింప వారాదటన్ 5

ప్రతిసాయాహ్నము రామచంద్రుఁడును భార్యం గూడి వాహ్యాళికై
తతమానోజ్ఞవనీపథమ్ములను గోదావాహినీకూల మం
దతులానందవిలాసమానసుఁడుగా హార్దంబుగా సౌఖ్యజీ
వితమున్ దృప్తిగ సాగుచుండఁ గడపెన్ విశ్రాంతిమై హాయిగన్ 6

ఫలమూలమ్ములఁదెచ్చు లక్ష్మణుఁడు సేవాధర్మసంవిత్తితోఁ
బొలియించున్ మృగరాజి వేటలను రేపుల్ మాపులాహార్థమై
తెలియంబూను శరణ్యసీమ సత మాదేయమ్ములౌ వార్తలన్
ఖలులుం జేరగరారు పంచవటి కెక్కాలమ్మునన్ భీతులై 7

లవలీపల్లవశయ్య సిద్ధము నొనర్పంబూనునే ప్రొద్దు, రాం
కవమున్ శ్రాంతము నందు నుంచు చలిలోఁగాపాడగా వారలన్
సవరించున్ బ్రతికార్యమున్ మిపుల విశ్వాసమ్మునన్ భ్రాతకై
జవదాఁటన్ దలపోయఁడన్నయిడు నాజ్ఞల్ తమ్ముఁడెవ్వేళలన్ 8

ఒక్కపాషాణఫలక మందొంటిగా ని
విష్టుఁడై, యప్రమత్తుఁడై వింటికొప్పు
పైని సౌమిత్రి చిబుకమ్ము నానుకొనుచు
నిశల దానవమృగబాధ నెట్టు ద్రఢిమ 9

వారు పంచవటిం బ్రవాసమ్ము సేయు కా
లమ్మున గడచె శరత్తు; వచ్చె
హేమంతఋతు, వది యిష్టమై భాసించె
రఘురామునకు – దాన రమణి సీత

లక్ష్మణుండును వెంటరాగ గోదావరి
　　కేఁగె మజ్జన మాడు నిచ్ఛ కొలఁది
నొక్క ప్రభాతమందుత్సుకతన్ దమ్మఁ
　　గుబ్జ సౌందర్యముల్ గూడుకట్టు

కొనిన రమ్యస్రోతస్వినీకూల మందు
నిలిచి దేహమ్ము పులకింప నేత్ర పర్వ
మగుచు నది తోప ననఘుతో ననియె వినయ
ముట్టిపడు భాషణమ్ములనుచితరీతి 10

ప్రకృతి సంబంధమౌ ప్రతిఋతువును దాని
　　వివిధ రూపమ్ములు; వివిధ మండ
నమ్ములఁగూర్చుసు నయనాభిరామముల్
　　దానితో మానవ మానసములు
వెల్లిగొనున్ రసస్విన్నమ్ము లానంద
　　మయముల్తె, శరదృతు మధుర చంద్రి
కలు జగమ్మున బర్వఁగమనీయ కాంతితో
　　ధవళమ్ముగాఁజేసి ధరణి నెల్లఁ

బ్రమదముం గూర్చి యమృత వర్షమ్ముఁ గురిసి
చల్లగా, నిండుగా హాయి సంతరించి
కదలిపోయెను ప్రకృతి రంగమ్ము నుండి
కాలుమోపె హేమంత మగ్రజ ! వివశ 11

ఈహేమంతము ప్రీతపాత్రమగుకాదే ! చూడుమీలోకమే
నీహారావరణమ్ముగాఁ బొలుచుచుండెన్ హేమసంపన్నముల్
గేహంబుల్ - జలమాన జిప్వమను, సగ్నింగూర్చి కూర్చుండగా
నూహల్పుట్టును సీతుబాధ తొలఁగన్ హూతమ్ములై వెల్లగన్ 12

నడకఁ బరికింపఁ దుహినమ్ము నదిని గ్రమ్మ
కానిపించుటలేదు వృక్షములు పుష్ప
రహితములు - తోఁచుచుండె నిద్రాణములుగ
జగము జగమెల్ల నేఁడు తుషారమయమె. 13

అదిగో ! చూడుము ప్రియంవద ! సాంద్ర నీహార
పరుషమైనది లోక మరుగుదేర
హేమంతఋతు - వదిహేమంతమే ! సస్య
సంపన్నమయ్యెను క్షమయు - జలము
లనుపభోగ్యమ్ములు - హవ్యవాహనుఁడు సు
భగుఁడయ్యె - సూర్యాతపమ్ము తగ్గి
చలిపోవనెంతొ ముచ్చటయయ్యె నెండలో
నడవంగఁ క్రొత్తధాన్యమ్ములిండ్లఁ

జేరఁ పితృదేవతలను బూజించి జనులు
నాగ్రయణము నొనర్చి తా మఘువిదూరు
లగుడు - క్షీరముల్, దధులు నత్యధికములుగ
లభ్యమై పల్లెసీమ లుల్లాసమొందు 14

దూరమందున నుదయించు ద్యుమణికూడ
చంద్రు నట్టులఁ జూడ ముచ్చటగ నుండె
నాతని మయూఖములు తుషారావృతమ్మ
లగుచుఁ గాంతి హీనమ్ముగా నెగడుచుండ 15

దక్షిణదిశఁ గర్మసాక్షి యుండుటఁబట్టి
తిలకహీన సుదతివలె నుదీచి
వెలవెలఁ బోవుచు వెలితిగాఁ గాన్పించుఁ
గాంతిని గోల్పోయి - ఖరకరుండు
దూరమైనందున దుహిన భూధరమును
సార్థకనామమ్ము సంతరించు
కౌనుఁగాదె ! దినములు మనుజుల బాధింప
నత్యంత రమ్యమ్ములగుచు - నిశలు

దీర్ఘతరమయి యెంతకుఁ దెల్లవాఱ
కాపనోపమ్ములం బ్రజలోపరాని
చలికి దుప్పటులందూఱి సదమదమయి
బెగ్గడిలుదురు సగ్గిసముగ్గిసలుగ 16

నీడజావాసముల్, నిబిడముల్, పాదప
వనములు కనసయ్యెఁ బత్రశూన్య
మైమొండిగా నిల్చి మంచుతో జగమెల్ల
నెట్టిదాళగ నుండె నేకడఁగన

పచ్చికబయళులు బాలభానుని లేత
యెండలో సొంపుగా నుండె - విధుఁడు
బ్రధ్నసంక్రాంత సౌభాగ్యుఁడై మిహికావ
కుంఠనమ్మున గాంతిఁ గోలుపోయి

తోఁచుచుండెను నిశ్వాసధూసరిత ము
కురము భంగిఁ బ్రకాశము కొలఁదియగుట
వెన్నెలల్ పున్నమింగూడ వేడ్కనీయ
వకట ! నీహారమలినమ్ములగుట వలన 17

వత్సరం బంతయు బాగుగా గడచునో
చెడ్డగా నడచునో చెప్పుటకును
హేమంత మాధారమేసుమీ ! గరుసెక్కు
నెల్లరిమేనులీ ఋతువునందు;
పశ్చిమ వాయువుల్ స్వాభావ్యముగ శీత
లస్పర్శములు, మంచు రాలి యిపుడు
ద్విగుణశీతలములై వీఁచుచున్నవి చూడు
యవగోధుమలు పండి యడవి హిమన

హితముగా క్రౌంచపక్షుల శ్రుతిహితమగు
కూజితమ్ములు సొంపుఁ జేకూర్చుచుండె
పూర్ణతండులభార ముదీర్ణమగుచు
వరిపొలము లీషదానమ్రమై శుభములు 18

సూర్యాతపమ్ములఁ జూడగా నగ్రాహ్య
వర్యములౌచుఁ బూర్వాహ్ణమందు
నిరుపయోగముకద - తరువాత మధ్యాహ్న
మున స్పర్శతస్సుఖమును నొసంగు
సంరక్తముగ నుండి సాయాహ్నమున గించి
దాపాండురము - వనమంత మంచు
పడిన కారణమున వారణ మెంత ద
ప్పికఁ గొన్న జలములఁ బెట్టవెఱచు

తుండమును జివ్వుమని లాగ, నెండపడిన
హిమముసందెన్నొ యింద్రచాపములు విరిసి
వింతశోభ వెలార్చుచుఁ బ్రాంత భూమి
దర్శనీయమ్ముగాఁ దోఁచు-తమిని రేఁచు 19

జలచర పక్షులు సహితము
జలముల స్పృశియింప వెఱచు సాంద్రతుషార
మ్ములు క్రమ్మ నప్రగల్భులు
ఔలికలనుం జూచి నిల్చిపోవు తెఱఁగునన్. 20

నది కన్పించుటలేదు మంచుతెరలోనన్, బెగ్గురుల్ కూయగా
పదముల్ చల్లని సైకతస్థలుల మోపంగా, శిలోద్ఘట్టనన్
బొదలంగా మఱి కూలముల్ కలుగగాఁ బోల్పం గ వీలౌనుగా
నదియంచున్, దరిచేరవచ్చినటు మాన్యా! లేక ముప్పేకదా! 21

శతపత్రములు జరాజర్ఝరితమ్ములు
జీర్ణకేసర శీర్ణకర్ణికములు
తుహినసష్టమ్ములు తోఁచును ముదిరిన
నాళముల్ గల్గి యనామికలుగ
కొలఁకులు సౌందర్యములఁ గోలుపోయెను;
మార్గశిరమ్మె హేమంతమునకుఁ
బ్రారంభమాసమ్ము రాజులు విజయ యా
త్రలకయి సిద్ధమై తరలిపోదు

రీ ఋతువునందె కాన నీఋతువుతోడ
వత్సరారంభమగుట సాంప్రతము-హాయ
నాగ్రమున నుండుటంబట్టి యాగ్రహాయ
ణికముగా బేరుకొనుచు గణింపనెలల. 22

వనములందున రాము తా ననుచరించు
వాఁడెయయ్యును రాము వ్యాపార మనుస
రించుటయెలేదు - భరతుఁడో రేయి,పవలు
రామమార్గావలంబి పురమ్ము నందు. 23

తలపునం బాటి యీభావ మలముకొనఁగ
లజ్జనందుచు మనమున లక్ష్మణుండు
భరతునెడ దనకుఁ గల్గు దుర్వహప్రవృత్తి
వదలి వచియించె నా రామప్రభువుతోడ 24

అన్న! యీకాలమందు మహాత్ముఁడైన
భరతుఁ డెటులుండు? నీపైని భక్తిగలిగి
పురమునందుండియును దాను మునివరుచందఁ
దపమొనర్చుచు నుండు నిత్యంబుదీక్ష 25

సకల సుఖముల వర్జించి శాంతచిత్తుఁ
డగుచు నిర్లిప్తుఁడై వల్కలాజినముల
తోడ మునివృత్తిఁబూని పాదుకలె సర్వ
మనుచుఁ గాలమ్ముఁ గడపుచు మను నతండు 26

వదలె నధిగతరాజ్యమ్ము, వదలె వివిధ
భోగముల, గడపు నియమిత భుక్తితోడ
శీతలమహీతలమ్ముపైఁ జింతఁ దక్కి
నిదురవోవును – నీరాక కెదురుచూచు 27

తానీవేళకుఁబోవుచుండు సరయూత్వంగత్తరంగమ్ములన్
స్నానంబాడగ మంత్రులన్‌గలిసి విశ్వాసమ్ముతోడన్ గురు
స్థానీయుండుగ నిన్ను నెంచుచు విలాసంబుల్ వెసన్ వీడుచున్,
వానప్రస్థుఁడుకాకయే పురిని నీపాదూద్వయిన్ గొల్చుచున్. 28

ఆతఁడు సుకుమారుండుగ
మాతామహులిండ్లఁ బెరిగె మున్ననతోడన్
శీతోదకముల సరయూ
స్రోతస్విని నెట్లు మునుఁగుచుండెనో కానీ! 29

నీవలెనే ధర్మజ్ఞుఁడు
నీవలెనే సత్యవాది, నియతిఁజరించున్
నీవలెనే పావనుఁ డగు
నీవలెనె జితేంద్రియుండు, నిర్మలుఁడతఁడున్. 30

వనములందున నీవు తపస్వివైనఁ
బురమునందుఁ దపస్వియై వరలునతఁడు
ఆశ్రితుఁడు నీకు, ప్రియభాషి, యవరజుండు
పరమభాగవతోత్తమ ప్రథవహించు 31

రూపములో, భావములో
చూపులలో, భాషణముల, సునిశిత ధర్మ
స్థాపనలో నినుఁ బోలుచు
నాపాదించును యశమ్ము ననఘా! యతఁడున్ 32

దీర్ఘబాహుండు, వీరుఁడు, స్థిరమనస్కుఁ
డంబుజాక్షుఁడు, సింహమధ్యముఁ డజాత
శత్రువు, మనస్వి, సుగుడి, తేజస్వి భరతుఁ
డనిన సామాన్యుఁడా! కాదు ఘనుఁడుకాని 33

పరుషంబెన్నఁడురాదు-సత్త్వగుణసంపన్నుండు, సంసేవనా
నిరతుండార్యులపట్ల గౌరవముతో నిత్యంబువర్తించు, సం
దటికిన్ దాఁదలలోని నాల్కవలె మోదం బిచ్చి మన్నించుచున్
పరసత్వమ్ము వెలార్చు సర్వజనవిశ్వాసమ్మె పాథేయమా 34

మునిరూపమ్మునఁ గాలమున్ గడపుచున్ మున్నెన్నడో స్వర్గమున్
దనయాధీన్యమునందు నుంచుకొనె నాతండెంతొ నిష్ఠాత్మ నీ
యనుభావమ్మనుమార్ప నెంతగనొ చేయన్ యత్నముల్ రిత్తలై
చనగా మానసమందు ఖేదపడె నాజ్ఞాబద్ధుఁడయ్యెన్ మదిన్ 35

మానవులు తల్లిగుణముల మార్గమందె
పోదురనియున్న లోకప్రవాదమునకు
భిన్నముగ భరతుఁడిప్పుడు పికరు ననుస
రించి చనుచుండెఁ దల్లిదారిని త్యజించి 36

ధవుఁడు దశరథుఁడెంత సాధువో, తనయుఁడు
కూడనంతటి సాధువే - క్రూరురాలు
కైక యెటులైనదో యెంచఁగష్టమగును
కాదె ! యిదిలోకరీతిగాఁ గానఁబడదు 37

నేనా కైకనొకింతమాటయనినన్ నీవొప్పఁబో వామెయున్
ప్రాణంబట్లు గణించునిన్నెపుడు నబ్బా ! యేమిప్రేమంబులిం
తేనిన్ నాతును నర్థమై చనవు కాదే ! నీదు సాన్నిధ్యమం
దే నిత్యంబును బాధతోఁ గుములుదున్ హెచ్చింప నా సంగతుల్ 38

నీతోఁబాటుగ నామదిన్ నిలిచియుండెన్ గైకపుత్రుండు, నీ
వాతర్కంబున బెత్తిదైన దిగిరావా ప్రార్థనన్ మెచ్చకే
కాతాళమ్మున దండ్రి యాజ్ఞయనుచున్, గైకేయి మాటంచు నీ
రీతిన్ సత్యపథాక్రముండవయి మూరింటోవయత్నించుచున్ 39

పెదతల్లిన్ గమనింపలేదు నృపుఁ డావిష్టుండుగాదయ్యమై
పోవవన్ గైక దురంతవేదనను రేపుల్ మాపులల్లాడుచున్
గుదురేమాత్రము లేక తల్లడిలెగా గోర్చుట్టుపై రోకటన్.
జిదుకంగొట్టినపోటువోలె నిటు విస్సీ ! వచ్చెనీయాపదల్ 40

భరతుఁడు, నీవు, నేనుఁదన వద్దను నిల్వమి పెద్దతల్లిలే
బరముగ జీవికన్ గడప పాపము ! సాధ్యమె ? దిక్కులేనటుల్
పురమున దీనయై నిశలు, ప్రొద్దులు నీ కొఱకై ప్రతీక్షలన్
బురపుర పొక్కుచున్ మనగఁబోలునె రాముని మాతయై తగన్ 41

దశరథుని పట్టమహిషి - ఆదర్శమహిళ
కోసలేంద్రు తనూజ - సద్గుణ వరిష్ఠ
తనువు దాల్చు సమాయికతా గుణమ్ము
కష్టపడుచుండె నశ్రువుల్ క్రమ్మ కనుల 42

కైక తల్లి ప్రసక్తి దుఃఖమున ముంచె
నంత రఘుసింహుఁడిట్లనె ననుజుఁగాంచి
'కైక నిందకు దొరఁకొన ఘనమె ? దాని
విడిచిపెట్టుము - లేదేని బిడియపడుదు 43

భరతుని జ్ఞాపకమ్మెడఁద బ్రద్దలు సేయును నాకు శాంతియే
దొరకదు దానితో నతని ధూర్వహతన్ వివరించి చెప్పుమా !
కరము ప్రశస్యమౌనమృత కల్పము లాతని భాషణమ్ము లం
దఱము నయోధ్యలోఁగలిసి తన్మయతన్ వసియించు టెప్పుడో ! 44

కించిద్యశమును నేనా
ర్జించితిఁ జిరకాలయత్నసిద్ధిగ, భరతుఁ
డంచితముగఁ దద్యశమా
ర్జించె నచిరకాలమునఁ బ్రసిద్ధుండగుచున్ 45

అనుచు నిగదించు రామునియాస్య సీమ
బాష్పరూషితమైనది - వారు మువ్వు
రమల గోదావరిన్ స్నాన మాచరించి
తనిపి పితృదేవతల, మ్రొక్కి రినున కెలమి 46

రాముఁడు సత్యపరాక్రముం డనిశమ్ము
భరతుండు నిష్కామ భక్తితోడ
భగవంతునర్చించు భాగవతోత్తముం
డద్వైతసిద్ధిఁ దా నందుకొనియె
నిర్మోహమగు భక్తినేరిమి నది పొందె
సౌమిత్రి దీననాశ్చర్యమేమి ?
భిన్నమార్గముల వారెన్నుచు భగవాను
సేవించి లక్ష్యమ్ముఁ జేర నలవి

యగునటంచు నిరూపించి రమలమతులు
బ్రహ్మము నుపాసన మొనర్చు భక్తుఁడగును
కడకు బ్రహ్మపదార్థమ్ముగా నతండు
మాఱిపోయిరి భరతలక్ష్మణులు నటులె 47

స్నాతుఁడగు రామచంద్రుఁడు సాంబమూర్తి
వోలె భాసించె, సౌమిత్రి, పుడమి పట్టి
నంది వలె, పార్వతీదేవి చందమునను
నేత్ర పర్వమ్ముఁగాఁగ కన్పించిరంత 48

వారు కృతావగాహులయి వచ్చిరి వెన్కకుఁ బర్ణశాలకున్
వారలఁ జూడవచ్చిరి ప్రపత్తి మహర్షులు ధర్మచింతతో
సారతరంబుగా నచట సాగెను చర్చలు రాముఁడాస్థ వి
స్మేరముఖాబ్జుఁడై మునులమెప్పును బొందె నిరర్గళంబుగా 49

వారేవో కథలు, గాథలు
పేరిమి. వాక్రుచ్చుచుండఁ బ్రియపడి రాముం
డారజమగు శ్రుతిహితమౌ
పారత్రిక విషయలగ్న భావ్యుండయ్యెన్ 50

మునులుఁ గొంతవడికిఁ జనిరి వీడ్కొని రాము
నతఁడు సీతతోడ ననుజుతోడఁ
బంక్తిరథుని ప్రేమ భావమ్ము నిస్తుల
మనుచు హర్షజలధి మునిఁగియుండె 51

సాకేతమ్మున వారు పూర్వము మహాసౌధమ్ములం దృప్తిగాఁ
బ్రాకామ్యమ్ముగ సౌఖ్యజీవితములన్ బ్రహ్లాదముం జెందుచున్
రాకల్ పోకలు తేరులందె జరుగన్ లాంపట్య శూన్యంబుగా
వీఁకన్ గాలముఁ బుచ్చినట్టి దినముల్ పేర్కొంచు నందించుచున్ 52

మధురసంభాషణమ్ముల మైత్రితోడ
మెలఁగు సఖులను, వినయంబుఁ దొలఁకు కనుల
మన్ననన్ సల్పు మంత్రుల మంచి తనముఁ
దలఁచి యానంద మందిరి తన్మయతను. 53

కామమున కిగురుపెట్టును
హేమంతము ప్రాజ్యకామ మింతులుఁ బురుషుల్
కాముఁడు నెఱపగ హెచ్చగు
సామంతము కామభావసక్తులుకారె! 54

శూర్పణఖ విశ్రవసుపుత్రి, శూరుఁడైన
రాక్షసేశ్వరుఁడైన పౌలస్త్యుభగిని
తండ్రి విజ్ఞాన పూర్ణుఁడు - తనయఁగూడ
నంతటిదె కాని దుర్యోగ మింతినడఁచె 55

తొందరతోడ విద్యుజ్జిహ్వుఁ దసబావ
మఱఁదిని గడతేర్చె మమతవీడి
దశకంఠుఁడేదొ క్రోధమున జెల్లెలి భర్త
యనిచూడకే సుంత నామదవతి
ప్రౌఢనిర్భరవయఃపరిపాకమున నుండి
కామోపహతయై విఘాతమొదవ
నున్నత స్థాయిలోనున్న యాయుద్రేక
మును దుండగపు రూపమును ధరించి

మాతెదుర్మార్గముగ నన్ను యూరకొనెను
తానుచేసినపనికి సంతప్తుఁడగుచు
కాలుఁ ద్రవ్వును పట్టపగ్గాలు లేక
మంచిదిది, చెడ్డదిదియను మాటలేక 56

ఎట్టి భావమ్ముఁ గూడను కట్టుబాటు
లందునున్నంత వఱకె సభ్యముగనుండు
కట్టుతప్పిన నిఁకఁ జెప్పగాఁ దరంబె?
ఆ ప్రవాహవేగమ్మున కవధియున్నె? 57

మనసు మాఱిన నెట్టి సామాన్య మనుజు
నైన యత్నించి సరి చేయనగును, కాని
సాధు రేఁగిన సాధ్యమె? చక్కఁబెట్ట
తల పౌలముఁ జేరు నాఁప దుస్తరముకాదె! 58

కలరు తమ్ములు కుంభకర్ణుండును, విభీష
ణుండను వారలు దండి మగలు
పౌలస్త్యునకు - నాడుఁబడుచు చొక్కారిత శూర్ప
ణఖ నామధేయ - యనన్య గతిక
యగుట రావణుని కాయమ యన్న నొక జాలి
ముద్దు సేయుచునుండుఁ బెద్ద పెరిమ
ఖరుడు, దూషణుఁడు సోదరులై పిన్నమ్మ పు
త్రులు జనస్థానమందునను నిల్చి

యుండు - రధిపతిగా ఖరుఁడుండు నచటఁ
బ్రతినిధిగ దోర్బలుఁడతండు - పక్షికూడ
నీరు ద్రాపగ వెఱచును నిట్టలముగ
దానవుని పేరు విన్న మాత్రమున భీతి 59

వచ్చి పోవుచునుండు శూర్పణఖ తమ్ము
లైన ఖరదూషణులఁ జూచి నచటి కప్పు
డపుడు - కొంతకాలము నిల్చునామె - దాన
ననునయముఁబొంది లంకకుఁజనుచునుండు 60

కుంభకర్ణ విభీషణుల్ కూడ లంక
నన్నకు విధేయులగుచు సాయమ్ము సేయ
నిలిచి యుందురు దశకంఠుఁగొలుచుకొనుచు
భక్తిగౌరవభావముల్ పరిఢవిల్ల 61

ఆమె స్వేచ్ఛావిహారిణి యగుటవలన
నామె దశముఖునకుఁ జెల్లెలగుటవలన
నామె నడిగెడు వారు లేనందువలన
శూర్పణఖ సంచరించు నాగమువోలె 62

తృప్తిగాఁ బొట్టనిండుగఁ దినుట యొకటి
మునివరేణ్యుల వేధించు ఘనత యొకటి
అడ్డునాఁకయు లేకుండ నడవులందు
హాయి విహరించుటొకటి యాయమ యెఱుంగు 63

వనమున నొంటిమై తిరుగు వారక నామె విశృంఖలమ్ముగా
మనుజుల సంహరించు దయమాలి మదావిలచిత్తవృత్తితో
మునులను హింసఁబెట్టు సుఖమున్ దఖమున్ మృగపక్షిజాతులన్
కనఁబడఁబోవ దంతదనుకన్ గతమేదియొ కాననంబునన్ 64

ముగ్గురు మానవుల్ కలరు ముచ్చటఁ గొల్పెడి రూపసంపదన్
ముగ్గురిలోన నొక్కరిత ముద్దియ - యిద్దరు పూరుషుల్, వనిన్
పగ్గెను సంచరింతురు-నృపాలకుమారకు లట్లుఁదోఁచు సం
చగ్గలికన్ వచించుచు వియాతులు వారని చెప్పి రెవ్వరో ! 65

వారిని గాంచగా దనుజ వచ్చెను-పంచవటీప్రదేశమున్
వారలు స్వీయరాజ్యముగ వర్తిలుచున్నటుఁదోఁచె నామెకున్
దూరమునన్ జటాయువును దొయ్యలికిన్ గనిపించె చెట్టుపై
పేరిమి హెచ్చి చేరువగ వేశమ పోయెను దాఁగిచూడగా 66

ధరణిలోఁ గల్గు సర్వ సౌందర్యసార
మచ్చటను దాశరథులలో నద్భుతముగ
నయన పర్వమ్ముగాన్ జుప్పనాక తెప్ప
పాటు లేకుండ దర్శించె పరవశతను. 67

చిత్రానక్షత్రముతో
చిత్రముగాఁగూడియున్న శీతాంశుక్రియన్
మిత్రకులుల, జానకిఁదా
నాత్రముగాఁ గాంచఁ దోఁచి రద్భుతఫణితిన్ 68

చూడగ రామలక్ష్మణులు, సుందరి మైథిలి యాశ్రమంబులో
వేడుకతోఁగనంబడగ విభ్రమ మందుచు రామచంద్రుపై
వీడని కాంక్షతోడఁ గనువేఁదుఱు మిక్కుటమై చెలంగగా
నీడిచె నేత్రపర్వముగ నీరము చాటున నున్న దానవిన్ 69

రాము సురూపమ్ము రాక్షసిఁ గామమో
హితఁజేయ నందు రమించె నామె
తన విరూపమును మాత్రము తానెఱుంగును
తనవాంఛఁగల సభ్యతను దెలియదు
దనుజప్రవృత్తిలోఁదనరును జీవుని
లక్షణ మానందలాలసతయు
దివ్యతేజస్సుతో దిక్కుల వెలిగించు
నాకర్షణమ్ములో వోకలాఁడి

కనుల ననుభవతాదాత్మ్యమును భజించి
భౌతికమ్ముగ రాముని వలచి, వొంద
నుత్సహించెను – కోరికనూఁగిపోయె
మఱచిపోయె రాక్షసిననుమాటఁగూడ 70

మరులుకొనె శూర్పణఖ రఘుమండనుండు
రామమూర్తి సౌందర్యమాలేమ హృదయ
దఘ్నమై నిల్వనీయక తమకమందు
ముంచె సలజడిరేఁపి తీవులవిరాశి 71

రాముఁడిందీవరశ్యాముండు, ప్రియదర్శ
నుఁడు మదగజగమనుఁడు. సరోజ
పత్రాక్షుఁడాజానుబాహుండు, సింహసం
హనుఁడును, క్షాత్రలక్షణ విరాజి
తుండును, త్రిదశోపముండును, దీప్త వ
దనుఁడు, జటాచీరధారియయ్యు
సుకుమారుఁడును, మహాశూరుండుగా నేత్ర
పర్వమ్ముగాఁదోఁపఁ బడఁతికెంతో

కామ ముత్పన్న మయ్యెను- కనులతోడ
నతని సొబగును గ్రోలుచు, నతని నుండి
త్రిప్పు కొనలేక యెడఁద సాధించి యెటులఁ
గూడ సాధ్యంబొ యంచును కొట్టుకొనును 72

ప్రతిలేని రామచరితము
మృతసంజీవనముకాదె ! మేమెయి దనుజన్
ప్రతిలేని రాము రూపము
మృతకామమురేఁపె వలపు మిన్నంటంగన్ 73

రాక్షసి దుర్ముఖి, రాముండు సుముఖుఁడు-
దనుజ విరూపాక్షి, దాశరథి వి
శాలనేత్రుండు నిశాచరి భైరవ
స్వర, రామమూర్తి సుస్వరుఁడు శూర్ప

ణఖ మహోదరి, రాజనందనుఁడో వృత్త
మయ్యుండు - రక్కసిమాట పెఱచు
రఘువీరుఁడో ప్రియాలాపి- యాసురివృద్ధ,
తరుణుండు జానకీధవుడు - తామ్ర

కేశిని నిశాటి, యతఁడు సుకేశుఁడామె
యెంతయు విరూప, కందర్పు నిట్టె గెలుచుఁ
సుందరుఁడు రాఘవేంద్రుఁడు- డెందమందుఁ
గలఁతపడె నామె రాముపై కాంక్షమిగుల 74

మునివేషముతో నుండిన
మనసిజుఁడొ, జయంతుఁడౌనొ, మఱి మాధవుఁడో
యనిపింపగ రఘువీరుఁడు
మనసు నిలువకుండె నేమి మాయయొ కానీ ! 75

రాముని సౌందర్యముఁగన
నేమయ్యెనొ ? దుష్టభావమెటు కరఁగినదో ?
అమెను జగ్గు, నిగ్గును
తామసము నడంచి వలపు దరికొనె నామెన్ 76

హేమంత ఋతువు నందున
కామిని యరుదెంచెఁ బంచవటి క్షేత్రముగా
కామము ప్రవృద్ధ మగుచును
సీమోల్లంఘన మొనర్చి చిగురులఁ దొడిగెన్ 77

SRI VENKATESWARA CENTRAL LIBRARY & RESEARCH CENTRE
TIRUPATI.
10997

తన రూపముతో రాముఁడు
తనియుట సాధ్యమ్ము కాదు - తరుణుఁడతఁడు కా
వున కామరూపమున జ
వ్వనిగాఁబోవంగఁ దలఁచె భావమున నిటుల్ 78

కుంపటియు, నున్నిసాలువ
వెంపరతో రతినిగోరు వెలఁదియుఁగలుగన్
సంపాదితమౌ సౌఖ్యం
బింపుగఁబురుషులకు రమ్య హేమంతమునన్ 79

గురుసుగనున్న పంచవటిఁగోరిక లీరికలెత్తఁజేయు సుం
దరవని, కామమున్ బెనుప ధర్షణమిచ్చు ఋతుప్రభావమున్
పరువము, నందచందములు, బంధురమౌ సుకుమార భావముల్
పరువడి పుట్టి యుత్సుకత భామినిలో ననలెత్తఁ బెల్లుగన్ 80

క్షణకాలమ్మున మాఱిపోయె సరితిన్ చక్షుష్యగా లాలసన్
గనులన్ ద్యోతితమైన మోహమున నాకంజాక్షి మోరిలన్ ధరా
తనయన్, లక్ష్మణుఁబుల్కుపుల్కున విచిత్రంబైన దృష్టిన్ బ్రసా
రణమున్ సేయుచుఁబోయి నిల్చె శ్రుతిమీఱన్ రాగమాయింతిలో 81

తన్మయమ్మున వారయోధ్యా పురమున
హాయిగా వెళ్ళఁబుచ్చిన హారి మధుర
దినములఁదలంచి, తెప్పలఁదేలు దాశ
రథుల కంతరాయము కల్గె రమణి వలన 82

పిడుగు పాటుగ వచ్చిన వెలఁది కతనఁ
దప్తమయ్యెఁ బ్రశాంత వాతావరణము
పొలుపుఁదప్పుచు ముందు రాబోవు కష్ట
కాలమున కిద్ది నాందిగాఁగానిపింప 83

అనవద్యాంగి యొకర్తు కట్టెదుటఁ బ్రత్యక్షమ్ముగాన్ లక్ష్మణుం
డనిమేషత్వముఁబొంది కొంతవడి 'కన్నా! యెంతో యాశ్చర్యమౌ,
మునికాంతామణి భంగికన్పడదు - గోముందళ్కు-బెళ్కుల్ బెడం
గును గాన్పింపవు మౌనికాంతలను - సిగ్గున్వీడి తోతెంచెగా! 84

మానవాంగనలో సౌకుమార్య మింత
యుండఁబోవ దయోనిజ యూడి పడదు
అప్సరోంగన లాశ్రమప్రాంగణముల
నడుగుఁబెట్టరీ రీతిగా నడఁచిపడుచు 85

ఎంత నిర్భయముగ నేతెంచె నీతన్వి
పొడమె సంశయమ్ము పొలఁతిఁగాంచ
దితిజ మోసబుద్ధిఁగుతుకమ్ముతోనిటు
లేఁగుదెంచఁబోలు వీఁగు హృదిని 86

గుణగతము రాక్షసత్వము - కులగతమ్ము
జన్మగతమును మఱియును జాతిగతము
కాదు - రాముని వీక్షింప కరగిఁపోయి
శూర్పణఖ యుపేక్షింపక చూచె తమిని 87

ముద్దుఁగొలుపుచు మునివేషమున, విలాస
సుందరుని, నీలమోహను డెందమందు
నిలుపుకొని పంచశరవిద్ధ పొలుపుమీఱ
సభిముఖంబుగ నిలిచి తా ననియె నిట్లు 88

మునులందింతటి యందచందముల పొల్పుల్ శూన్య మీతేవ నె
ట్టన నీరేడుజగంబులన్ బిరుసుగడ్డాల్, మీసలున్ దప్ప మో
హన రూపమ్ములఁ జూడమెయ్యెడల నాహో ! యింత సౌందర్యమున్
గనులంజూచుచు నుండఁబట్టఁదరమా ! కందర్పసౌమ్యాకృతీ ! 89

అరగలియో జటాభరణసుందరరూప
మునుగాంచఁజెంతను ముదితఁ గనిన
మునివె ? ధనుర్బాణములు ప్రక్కనుండెను
వీనితోఁబనియేమి ? వెలఁది యేల ?
ఘోరరాక్షసుల విహారభూములు వనుల్
క్షేమమ్ము కాదిట లేమ యున్న
వయసులో పిన్నవు వైరాగ్యమేలను
గలిగెను - తెలుపుము కలతెఱంగు
గోత్రనామంబు లెయ్యవి ? గుండెదిటవుఁ
జూడగను మెచ్చుఁ గొలిపెను - సుడియు బెడఁద
మదిగణింపక వచ్చితి వదుపువీడి
పైనము లెఱుంగఁ జెప్పుమో బాగరి ! వెస 90

ఎచ్చటినుండిరాక ? కతమెయ్యది ? కాననసీమ నిల్వగా
ముచ్చటకన్నైనేసు ? కడుముష్కరులుందురు కాన నేదియో
హెచ్చెము వచ్చితీరు సుమి - పోటుమగండవ ? హారిధాటికిన్
కచ్చియలోన భంగపడు కాలము దాపురమయ్యె క్రూరమై 91

చతురుఁడు రాముఁడెల్లపుడు సత్యవచస్కుఁడసత్యమాడగా
మతిని దలంపఁబోవఁడు ప్రమాదము వచ్చినఁగూడ సున్నతో
న్నతుఁడు - ప్రవాసకాలమున నాతినిగూడి నివాసముండెఁదా
నతిధృతి - ధర్మతత్పరుఁడు, నాశ్రమవాసి వచించె నివ్విధిన్ 92

వివరంబుల్ ప్రకటించు వాఁడ వినుమీ ! వేద్యంబుగా సంగతుల్
రవివంశప్రభువైన పంక్తిరథపుత్రజ్యేష్ఠుఁడన్, రాముఁడన్
యువతీరత్నము సీత పత్నియగు, నాయుష్మంతుఁడీ లక్ష్మణుం
డువిదా ! తమ్ముఁడు - తండ్రియాజ్ఞ వనులందుండంగ నేతెంచితిన్ 93

తనపుత్రు రాజుఁజేసిన గాని యొప్పనం
చును పినతల్లి నాజనకుఁగోర
నతఁడు సమ్మతిఁ జూపె నామె నందను భూపు
నొనరింప, నను వనమ్మునకుఁ బంప
రాజేంద్రు వాంఛ మేరకు నేను నడవుల
వసియింపవచ్చితి - వనిత, తమ్ముఁ
డనుసరించిరి నన్నుఁ దనతల్లి కోరిక
నిరసించి పుత్రుఁడు భరతుఁడమిత

భక్తి వెనుకకు రమ్మని ప్రార్థనమ్ము
సేయ రాజ్యముఁ జేకొను చింతలేని
నాకు బదులుగఁ బాదుకల్ స్వీకరించి
పోయె నగరికి నాకు చెప్పులును లేవు 94

మునివృత్తిఁ గొంతకాలము
మనవలసెన్ గాననముల - మా ప్రాణములన్
గొనకుండ మృగనిశాచర
గణములు పూనితిమి యాశుగములు, ధనుస్సుల్ 95

మేమును ధర్మరక్షనకై
నేమమ్మున నుంటి మిచట, నీవృత్తాంతం
బేమియొ తెలుపుము - వినగా
కోమలి ! యొకకోర్కె యెదఁదఁ గొనలొత్తె సుమీ ! 96

అన విని బిట్టునవ్వుచు నొయారముగా రఘువీరుఁ బుల్కుపు
ల్కున గను,గొంచుఁ బుల్కలుప్రరోహములై రసరాజ్య డోలలన్
దనుకుచుఁనూఁగు లాడుచు, వితాకున నిల్చుచు, వెచ్చనూర్చుచున్
ఘనకుచ వెల్లడించెను బ్రకామము, హృద్గతప్రేమ భావమున్ 97

ఇంత యందము, నీహాసు నెందు గనము
సుందరులలోన నత్యంత సుందరుఁడవు
నలినపత్రాయతాక్ష ! ధన్యను - త్వదీయ
దర్శనమున హేమంత ప్రతాపవేళ 98

ప్రావృట్కాల పయోదసన్నిభ శరీరా ! మోహనాంగా ! మనో
జావిష్టశ్లథమానసంబున రసాస్వాదమ్ము సేయంగ సం
భావింతున్ గనుగోనలన్ దొలఁకు ప్రేమన్ వచ్చితిన్ కాంక్షతో
నావిశ్వాసము వీటఁబుచ్చకయె మాన్యా ! నన్ను లాలింపుమా ! 99

నేనొక దేవకాంతను వనిం జరియించుచు నిన్నుఁ గాంచగా
మానసమందు వాంఛ పొడమన్ బరివిగ్నము కాగ వచ్చితిన్
కాననమున్ బ్రశాంతము - ప్రగాఢముగాఁ బెనగొన్న కోరికన్
గాన మదీప్సితమ్ము పొసగన్ గరుణింపుము శ్యామసుందరా ! 100

నాహృదయమ్ము దొంగిలిన నాయఁడ వౌదువు, రూపసంపదన్
మోహము పెచ్చరిల్లఁ బరమో, గిరమో మదినెంచకే దయా
వాహిని మళ్లఁ జేయుము నృపాలకుమారక ! రామచంద్ర ! సం
దేహము వీడి నామమతఁ దీర్పుము నీ బిగికౌఁగిలింతలన్ 101

శివఫాలాగ్నిని భస్మమైన స్మరుఁడున్ చిత్రమ్ము నీ సాటియే
నవలావణ్యపయోధి వీవగుదు వన్యాయ్యమ్ముకాదే ! మఱీ
జవసత్త్వములు, రూపమున్ గలిగి పౌష్కల్యమ్ముగా మౌనివై
నవరింపందగు కార్యముల్ కలవె ? నీ సంకల్పమేపాటిదో ! 102

నాకములోని దేవలలనారతి సౌఖ్యము లిత్తు నీకు నీ
లోకమునందె - యేతపములున్ గొఱమాలుఁ బరిగ్రహించి య
స్తోకమనీష వాంఛితము శోభితమై తనరార నాదుహే
వాకముఁ బ్రీతిఁ గాంచుము నెపంబుల నెంచక భీతినందుచున్ 103

ప్రక్కను గల్గు సీతరుణి వంకను జూడుము, నన్నుఁ గాంచుమా !
చక్కఁదనాన నిర్వరకు సామ్యము శూన్యము - సాంప్రతమ్ము కా
బెక్కరణిన్ విలాసవతినే ! తగుదున్సుమి నీకు నేన, నా
మక్కువఁ దీర్చుమా ! బయిసి మాలిన నీ వనితం దృజించుచున్ 104

చుక్కలలోన చంద్రుఁడవు - సుందరి నౌదును - ప్రేమ భావముల్
మిక్కిలి కల్గుదాన ననుమేయముగా రహిమీఱ మన్మథున్
బుక్కిలి బంటి సేమ పరిపూర్ణముగాఁ జరితార్థుసేయగా
మ్రొక్కెద నన్నుఁ గాదనకు మోదముతోడ ననుగ్రహింపుమా ! 105

వలచి వచ్చిన కాంతను 'వల్లె' యనిన
స్వర్గసౌఖ్యము నీకు సాక్షాత్కరింపఁ
జేతు - మదనాగ్నిఁ జల్లార్పఁ జేయు మంద
గాఁడ ! ననుఁ గూడిమాడి భోగములనంది 106

చూపులలో, చేష్టలలో
నేపుమిగులు భాషణముల నేర్చుచు శతధా
ఆపూవిలుతుఁడె ప్రాపై
తోపింపగఁ జేసె నసురి ద్యుమణికులునకున్ 107

దరిఁజేర నుంకించు దానవిఁ బరికించి
వైదేహి భయముతో వణఁకిపోయె
రఘువీరుఁడా రజ్జులాఁడియత్నమ్ముమను
నిరసించి యుదుటున నిలువరించె

నవధియే కన్పించదా లక్ష్మణుని కోప
మునకుఁదుందుడుకుతోఁ బుడమిఁదన్నె
కామరూపిణి వగక త్తెగా నేతెంచఁ
దనయందమును లెక్కఁగొనఁడిదేమి ?

రాముఁడింత జితేంద్రియుఁడా ! మదవతి
ప్రణయమును ద్రోసిపుచ్చు విలక్షణుండె ?
యని యవాక్కుగ నిలిచె నా దనుజ - రాము
భ్రుకుటి ముడివడెఁగండరమ్ములును బిగిసె 108

అంతలో వచ్చెనటకు విహంగరాజు
వృద్ధమూర్తి జటాయువు - విహ్వలించె
నతని వీక్షించి వంచకి యవగతమగు
గుట్టుమట్టులటంచని కొంకుపడుచు 109

పక్షవిక్షేపమున బుట్టు ధ్వనికి, మారు
తమ్మునకు శూర్పణఖయు దూరమ్ము జరిగి
నిలువ, నికటమ్మునన్ వ్రాలె నీడజమ్ము
రామచంద్రుని కామె వార్తలను దెలుప 110

మహితునకుఁబక్షిరాజు నమస్కరించి
'నాయనా ! దీనిమాటలు నమ్మరాదు
కామరూపిణి శూర్పణఖ యను దనుజ
రావణుని చెల్లెలగు నీమె ప్రజ్ఞఁగలది 111

మాయోపాయము తోడ నిన్నుఁగలియన్ మత్తిల్లుచున్ వచ్చె, నీ
స్థాయిన్ జూడక - భర్తృహీన దురవస్థందెచ్చి కొంచున్ మహా
కాయంబయ్యెను, వృద్ధయయ్యె నపమార్గంబందుఁదానేఁగుచున్
పోయిన్ బొందఁదలంచె నీ పగిది రామా ! కైతవ ప్రక్రియన్ 112

దీనిభర్త విద్యుజ్జిహ్వుఁద్రెళ్లనేసె
రావణుండెట్టొ కోపమ్ము రగులనేదొ
కారణమ్మున బ్రాయంపు కాలమందు
దాన కామోపహతయౌచు దీనయయ్యె 113

వయసు ముమ్మరమందున భర్త పోవ
కామభావ మకస్మాత్తుగను నడంగె
మరల నీ దర్శనమున హేమంత మందు
చిగురుఁదొడఁగెను కామమామగువ హృదిని 114

పంక్తి గళుఁడును దన ప్రతాపంబు పేర్మి
దిక్పతుల నొంచె - ప్రతిలేని ధీరుఁడతఁడు
శర్వునారాధన మొనర్చు సతము - కాని
కాముకుఁడు - కోపి - కఠినుఁడు - కపటియగును 115

ఆ దుర్మార్గుఁడు లోకకంటకుఁడు, మాయాత్ముండు, నిశ్శంకుఁడౌ
లేదే మాత్రము పాపభీతి, జడియున్ లేఖర్షభుండెంతయో
మీదుం గ్రిందు నెఱుంగకుండఁదిరుగున్ మిండాటమున్ సేయుచున్
వైదుష్యమ్మును, జంద్రశేఖరపదవ్యాసక్తితో నుండియున్ 116

ధనదుఁడీతని యన్నయే - తమ్ముఁడనిన
వణఁకి పోవుచునుండుఁ బుష్పకవిమాన
మును బలిమిమై గ్రహించె నాతని జయించి
హద్దుపద్దులు లేక యహంకరించు 117

రక్కసు లున్మత్తులు, కడు
వెక్కసమున మిడిసిపడుచు వేధింతురొగిన్
చిక్కులఁదెచ్చెడి దృప్తులు
వక్కాణింపంగఁదరమె వారల చెడుగుల్ ? 118

నేను వృక్షాగ్రమందున నిలిచి దీని
వెకిలిచేష్టల గమనించి వెఱఁగుపడుచు
వచ్చితిని సర్వవిషయముల్ పలుక నీకు
జాగరూకత వర్తించు సమయమిద్ది 119

ఖగపతి సర్వమున్ దెలుపగా విని సంతసమంది రాఘవుం
'డగు' 'నగు' దీనిఁదెల్పితివి - యాసురి యెంతయు మోసబుద్ధితో
తెగువరియౌచు వచ్చె సొరిదిన్ బితృకల్పుఁడ ! నా కృతజ్ఞతల్
సుగమము చేసి మార్గమును జూపితి వాదృతిఁబుణ్యమూర్తివై 120

తన కాకృత్యము వెల్లడింప వినుచున్ దైన్యంబుతోపంగ, జం
కెన చూపుల్ ప్రసరించి రాముదెస, పక్షిశ్రేష్ఠు నీక్షించుచున్
జెనయంబూనుచు స్వస్వరూపమును దాల్చెన్ చాన తత్రత్యులా
దనుజంగాంచుచు విస్వరం బెదియొ ప్రాప్తంబౌనటంచెంచగన్ 121

కొంతవడి కండజముఁ బోవఁ గుదుటఁబడుచు
కనులముందు శ్రీరాముని కమ్ర రూప
మెంతొ యాకర్షణీయమై రంతు సేయ
భయము, లజ్జయు విడనాడి పలికె నామె 122

మాకౌటుంబిక వృత్తమున్ వినిచె రామా ! నీకుఁబక్షీంద్రుఁడున్
ప్రాకాశ్యమ్ముగ రాక్షసేశ్వరుఁడు దుర్ధర్షుండు శ్రీరావణుం
డాకూతమ్మున సర్వలోకముల శౌర్యజ్వాల నల్లాడఁజే
కాసంబెట్టి విధేయతన్ మెలపు–లంకాద్వీపభూపాలుఁడై 123

ఆతఁడు నాకగ్రజుఁడగు
మా తండ్రియు విశ్రవసుఁడు - మాన్యుఁడు, నన్నున్
ప్రీతింగాంచుచు రావణుఁ
డాతతముగ గారవించు ననిశము ప్రేమన్ 124

వినియుండవే లోకభీకరుఁడైన మా
    లంకాధినాథుని ప్రతిభ మున్ను !
బింకమ్ముగా, నిరాటంకమ్ముగా మూఁడు
    లోకాల శత్రువుల్ లొగ్గదిల్లఁ
బదితల లిర్వది బాహువుల్ తన ప్రతా
    పమునకు విజయచిహ్నములు కాగ
పంచభూతముల శాసించెను - దిక్పాల
    కుల గూబలను బట్టి నిలువరించె

చంద్రశేఖరు భక్తుఁడే - సాహసమున
భుజబలమ్మున గైలాస భూధరమ్ము
నెత్తె నవలీల ధనదు జయించి, యతని
పుష్పక విమానమును గొనెఁబొనుగుపఱచి 125

సలుపు నవకోటి శివలింగములకుఁబూజ
ప్రతిదినము దైత్యపతి తెల్లవాఱు సరికి
అతఁడొకపరి చండకరాసి నవ శి
రముల ఖండించి నలువ కర్పణముఁజేసె 126

కలరు మఱియన్నదమ్ములు నలువురందు
కుంభకర్ణవిభీషణుల్ కూడ లంక
నుండెదరు పెద్దవారు - ఖరుండు, దూష
ణుండు ననుజు లీప్రాంతమందుండు వారు 127

వేదవేదాంగములఁదాము వేద శిక్ష
ణమున జదివిరి తోఁబుట్టు లమిత భక్తి
వారు నిష్ణాతు లన్నిట బ్రహ్మలోక
మును దపశ్శక్తి గెలిచిరి మునుపె రామ ! 128

ధాత మా వంశకర్త ముత్తాత మాకు
గారవము సేసి నను బ్రహ్మ కామరూప
దూర శ్రవణమ్ములనెడి శక్తుల ననుగ్ర
హించెను - సురూపమంది యేతెంచినాను 129

సోదరులలోన దశకంఠు చూపె వేఱు
సకల విద్యల నెఱిఁగిన చతురుఁడతఁడు
వీను మిగిలిన విజ్ఞాన వేత్తకాన
జగములతనికిఁదలవంచు సాహసియని 130

మున్నుఁదినిన పెంజెరవోలెనున్నఁగాని
ఉదరమొక చిన్నమడుగుగా నున్నఁగాని
నిద్రతో జోగుచున్నను నన్న కుంభ
కర్ణునకుఁగలుగు వేయినాగముల బలము 131

ఇఁకవిభీషణుఁడనినఁడానింగితజ్ఞుఁ
దెపుడు ధర్మపథమ్మున నేఁగువాఁడు
బాహువిక్రమమందున బ్రతిభలోన
సతని కతఁడె సాటి - నైయాయికుండు 132

వచ్చుచును బోవుచుందు నీప్రాంతమునకు
నప్పుడప్పుడీమధ్య రానైతి నందు
వలన మీదర్శనము సేయ వలను పడదు
చూచితిని కనువిందుగా సుందరాంగ ! 133

వెలుచును గట్టిగా వీవంగఁబవనుండు
కినుకతో నన్న శిక్షించుననుచు
జాతవేదుఁడును జాజ్వల్యమానమ్ముగా
వెలుగుటకే జంకు నులికి పడుచు

రావణునకును నాగ్రహమేమి వచ్చునో
యనుభీతి మనులెంత యగడువడిన
దేవేంద్రుడనిశంబుఁ గైవారములెనేయు
నెంతొవిధేయుఁడై యింతదనుక

యముఁడు వరుణుఁడు, నిరృతి భయమ్ము మిగుల
వణఁకి పోవుచు నిలుతురు - ధనదు నన్న
భాతి గణియింపఁడీశాను భక్తిఁ గొలుచు
వానినెదిరించు త్రాణ యెవ్వరికిలేదు 134

అడుగులకు మడుగు లొత్తుచుఁ
బడియుందురు వాని భవన ప్రాంగణమందున్
దడబడుచు నప్సరోంగన
లుడిగపుఁ జెలులట్లుమసలు చుందురు సతమున్ 135

రంభశయ్యామందిరము సుందరమ్ముగా
రాజార్హముగను నలంకరించు
నృత్యసంగీత సాహిత్య రసామృతా
ర్ణవమందుఁ దేల్చు నూర్వశి కరంబు
పేచోపులిడును ఘృతాచి కొల్వునసుండ
కరకంకణమ్ములు మొరయుచుండ
పరిమళద్రవ్యసంపాదనమ్మున దిలో
త్తమ తొందరన్ నిరతమ్ము నిలుచు

సౌసపై గంధముందీయు చాన మేన
కుసుమమాలికలన్ సమకూర్చు హేమ
అతిథిసత్కారములఁ జూచుహారిణి, విజయ
గీతములఁ బాడుశశిరేఖ ప్రీతుఁజేయ 136

కుంభకర్ణుఁ డాకృతిలోన గొండ బోలు
నాతఁడు ప్రవృద్ధనిద్రుఁడు, నమితబలుఁడు
మఱి విభీషణుఁడనిన ధర్మమ్మురూపుఁ
గొన్నసౌజన్యమూర్తి - వాక్రుచ్చు నిజము 137

నిరతము న్యాయాధ్వమ్మున
నరుగువిభీషణుఁడు దానవాన్వయ మందున్
పరముండు - తప్పుఁబుట్టెను
కరుణాత్ముఁడు, వినయశీలి, క్షమిత, సుగుడియున్ 138

నే నాఁడబడుచు నొకరితఁ
గానన్ బ్రాణమ్మువోసె గారాబముగా
మానోన్నతి ననుగాంచెద
రానందితచిత్తులగుచు నన్నలుఁ దమ్ముల్ 139

నాలోఁ బ్రత్యణువుంగదల్చెను లసన్నాళీకపత్రేక్షణా !
నీలాలిత్యము, నీవిలాసమును, నీ వీలాంబుదచ్ఛాయయున్
వ్యాలోలమ్ము నొనర్ప మానసము నీపై లగ్నమయ్యెన్ - ననున్
బాలార్కోపమతేజ ! చేర్పుము పరిష్వంగమ్మునన్ బ్రీతిమై 140

నా వాంఛాపరిపూర్తిసేయగల త్రాణన్ వెల్గు నీపట్లఁదా
మేవైషమ్యముఁ బూనిసోదరులు రారేమాత్రమున్ - నీవనన్
సేవాధర్మముతో చరించెదరు రాశీభూతనై భృత్యమై
నీవాల్లభ్యము నిచ్చగించెదరు నిన్నేకొల్తు రత్రాంతమున్ 141

పంచవటీ భవ్యవనసీమలన్ విహా
రముపేయ ప్రీతియో రామచంద్ర !
గోదావరీ పావనోదక స్నానముల్
సలుపంగ వాంఛయో సారసాక్ష !
లంకాపురీ భర్మరమ్య హర్మ్యములలో
సుఖియింపఁ గోర్కెయో సుందరాంగ !
ఆకాశవీథి విహంగ దంపతులట్లు
లెగురంగ నెంచెదో యెమ్మెకాఁడ !

నీవు మనసుపడిన నిర్ణయమ్మునకేను
కట్టువడెదనేమి బెట్టువలదు
మాంస భోజనమ్ము మానెద ఫలమూల
ములను దినుచుఁ దృప్తిఁ బొందుదాన ! 142

మంచిగా నన్ను లాలించి ప్రేమించిన
నించుచు నిన్ను మెప్పించుదాన
ననుపుక త్తెగఁ బ్రీతి ననుఁజూడ నీపైని
నీగ వ్రాలగ నీయ నెపుడు కూడ

సర్వవేళలను నీ సాన్నిధ్యమందుండి
యేమఱకుండ నిన్నోముచుందు
నిరువురి యూపిరి యేకీకరించిన
సాధింపరాని కర్జములు లేవు

సంతసించును రాక్షస చక్రవర్తి
మానసంబున మనపొత్తు మాట వినిన
మనకు నచ్చిన తావుల మసలి పోయి
సంతరించు కొనంగ స్వేచ్ఛయు లభించు 143

కంటికి ఱెప్పవోలె నినుఁగాఁచెద - లోకము లెత్తివచ్చినన్
వీంబలు నాదుసోదరులు - దాండికు లోదురు నిల్చియుండి నీ
వెంటను నిత్యమున్ దనుజవీరులు నీకు సహాయులౌదురే
కొంటెతనమ్ము నీ యెడలఁగొంచెము కూడను సోగదెమ్మెయిన్, 144

ఆ మదిరేక్షణ వాలక
మామికఁగనుఁగొంచు నధికమైన జుగుప్సన్
రాముఁడు కన్నుల దాఁచుక
భామకు స్మిత పూర్వకముగ వచియించె నిటుల్ 145

నీకును నాకును పొంతన
లేకుండెను - నిన్నుఁబొందలేనుదనుజ ! నీ
యీ కోరిక మన్నింపఁగ
ప్రాకటమగు సరణికాదు పరికించినచో 146

ఈవు సడగొండవలె నుంటివేను బడుగు
దేహమును గల్గువాఁడ సందేహమగును
ఇంతయుఁది కాదె ! వ్యత్యాసమెంతయుండె
పూర్వమిట్టి సంబంధముల్ పొసఁగవెపుడు 147

దానవ వనితవు కద – నే
మానవుఁడను నీకు మనుజ మాంసము వలయున్
నేనొక్క పంటి క్రిందకు
రాను సుమా ! నన్ను మ్రింగ లాభము కలదే 148

దనుజేశ్వరుఁడగు రావణు
ననుజవు నీ వేను క్షత్రియాన్వయుఁడను, మీ
కొనరును త్రిలోక పూజ్యత
వనముల జరియింతు నేను పాలన మెడమై 149

విప్రవంశ సంజాతవు – విబుధుఁడైన
విశ్రవోబ్రహ్మపుత్రివి – వేత్తయైన
రావణుని ముద్దుచెల్లెవు – రాముఁడెవఁడొ
తెలియరాని సామాన్య క్షత్రియుఁడొకండు 150

పర్వతాకార నీదురూపంబుఁగాంచి
వెఱఁగుపడెదరు మానవుల్ – ప్రేమకలుగ
దింతయుంగూడ – సరిపడు హేమంతకారి
దొరకకుండునె యత్నింప ధూర్వహతను 151

ఎంతయొ భేదముండును సుమీ ! నరదానవ జాతులన్ బరి
క్రాంతిని, సౌమనస్యమున, రాగమునన్, సుభగమ్మునన్ గ్రుధా
స్వాంతమున , వినోదమున, సంగతమందున, సఖ్యమందునన్
వంతలఁజింతలన్ గనుక భ్రాంతిని వీడుచు సంచరింపుమా ! 152

కాటికి కాళ్లు చాచుకొను కాలమునందిదియేమి కోర్కెయో
బోటి ! వయస్సులన్ గలుగు పోలికలేమియు నెంచఁబోవు, జం
జాటములేల ? నీ మనసు చక్కఁబడన్ సమకట్టన్యాయ, మా
పాటి యెఱుంగవే ? చిఱుత వానిని బొందగ నుత్సహింతువే 153

శివధనుర్భంగ మొనరించి సీతఁబెండ్లి
యాడితిని వహ్నిసాక్షిగా - పాడియగునె
నిన్ను గ్రహియించి యిప్పుడానెలఁత వీడ
లోకమందిది ధర్మ విరుద్ధమగును. 154

ముదివయస్సునందు మోహమ్ము మిక్కుటం
బౌచునన్నుఁ గూడ నరయనేల ?
ధర్మకామమందుఁ దప్పనీప్రేమకు
సమ్మతింపఁ బోవ చాన యెపుడు 155

ఏకపత్నీ వ్రతస్థుఁడ నీవిదేహ
నృపతనూజను పెండ్లాడి నేను జనకు
సత్యసంధత నిలుపంగ సతినిగూడి
విపినములఁ గాలువెట్టుట వేడ్కకొఱక ! 156

ఆమాటలవిని రక్కసి
రామా ! బెదరంగనేల ? రాయిడి రాదీ
కామముఁ జల్లార్పంగను
నామేనిన్ గొంచెపఱచినన్ సరిపోదే ! 157

కామరూపము ధరియించి కన్నెపిల్ల
వోలెఁగన్పింతుఁ గన్నుల కఱవుతీఱ
నామనోహరరూపమ్ము రామచంద్ర !
నీకు చక్షుఃప్రియమ్మగు నిక్కముగను 158

ఇంక నొకమాట నిను మ్రింగనెంచఁగలనె ?
వలచి వచ్చిన దానను - వలపుకంటె
నధికమగునేమి నాకు మాంసాశనమ్ము ?
ఏమి చతురోక్తు లాడెద విటుల నీవు ? 159

మనుజుల యందము వేఱును
దనుజల యందమ్ము వేఱు - తరుణులలోనన్
మనసులుఁ గామమునొకటే
పనిగొని నన్ననుభవింప భావ్యముకాదో ! 160

పురుషులకంటెను గామము
తరుణీమణులందుమిన్న - దనుజలయందున్
మఱియదియెక్కువ - నాతోఁ
బరమావధిగా సుఖమ్ముఁబడయుము తృప్తిన్ 161

తరుణీమానస సూనసాయక ! విచిత్రంబైన వాదమ్ముతో
నరధర్మమ్ముల వక్కాణించెదవు మాన్యంబెట్లు మూపట్ల, నా
దరముంజూపిన గొంపలేమిమునుగున్ ద్రస్తుండవే ! కూడ నో
దరులున్ నీపని బట్టబోదురను చింతంబొంద రాదింతయున్ 162

నీవయసు చిన్నదైనను
నే వయసున బెద్దనైన నీయెడదవిలెన్
నావాంఛ - స్వీకరింపుము
నావలపున్ సుందరాంగ ! నానయె - చెపుమా ! 163

క్షత్రియ జాతిలో సామాన్యముగ నేక
పత్నీవ్రతస్థులు పరగు టరిది
దశరథరాజు కెందఱు పత్నులుండిరి ?
అతడొక్కసతి తోడ హాయిగనెనె ?
ఒక భార్యయుండిన ప్రకటించి నిను భూపు
గా నిల్పియుండడె ? కాననముల
కేలబంపును తండ్రి ! యికనీదువాదమ్ము
లోబసయున్నదా ? లొట్టపోయె
నిద్దిసాధ్యమ్ముకాదు భూమీశులందు
నన్ను రెండవ భార్యగా నెన్నుకొనిన
నడుగరెవ్వరు గ్రామంబు నడగు నాకు
మేలు మనయిద్దఱకు గల్గు ! జాలమేల ? 164

ఇంతకుముందె చెప్పితిని - ఇక్షుశరాసనసాయకవ్యథా
స్వాంతను - నీదువక్షమున బ్రాలిసుఖింపఁ దపించుచుంటి, నీ
కెంతగఁ జెప్పినన్ జెవులనించుకఁ బెట్టక సాకులెవ్వియో
వింతగఁ బల్కఁబూనెదవు - వేదన మాన్పక, వాంఛఁదీర్పకే ! 165

పైగాధర్మవిరుద్ధమంచుఁ బలుకన్ భావ్యమ్మె ? ప్రేమమ్ముతో
భోగింపన్ వినుఁ జేరవచ్చితిని గోముంజూపి మన్నింపకే
రాగోద్దీపిత మానసంబున దమిన్ లాలింపకే నీతులన్
యోగింబోలె వచింపన్యాయమొకొ ? అయ్యో ! యింతరాద్ధాంతమా ! 166

అయినన్ నీవయసెంత చెప్పుమ ? సమీహాచిత్తతన్ గాలమున్
గయిముట్టన్ దరుణీమణుల్ వలపు పోకల్ పోక నిర్వీర్యున
ట్లయయో ! యౌవనమంత మంటఁగలుపన్ హర్షింపనేమాత్రమున్
గయిదండన్ దయచేసి దివ్యసుఖసాక్షాత్కారముం జేయుమా ! 167

దొరకక, దొరకక వలపుల
దొరవలె దొరకితివి నాకుఁ దుంటవిలుతుఁడున్
గఱకటి పువ్వులబాణము
లఱిముఱిపడ వేయఁదొడఁగె సంకిలిపడుమా ! 168

మానవధర్మము వేఱొక
మానినిఁ బెండ్లాడనీదు-మఱి నే దనుజన్
గాన గ్రహింపుము నను లే
దేనిన్ గబళింతు సీత నీక్షణమందే 169

ఏదీ నడు మిసుమంతయు
లేదే నీసతికి? సొబగులేదు-కృశత్వ
మ్మే దేహమందుఁ దోఁచును
వాదాడక స్వీకరింప వలె నన్నింకన్ 170

కాకుత్థ్సుం డీపల్కులు
వ్యాకులుఁడై వినియె దనుజవర్తన మతనిన్
జీకాకు నందఁజేయఁగ
వాకొనె మదిఁగుదురుకొనుచుఁ బడఁతింగనుచున్ 171

తొల్లిటినుండి దేవతలతోడను వైరముమీకు-యుద్ధముల్
పెల్లుగ నెన్నియో జరిగె- వేల్పులమిత్రులు మాదుపూర్వులా
ప్రల్లఁదనమ్ముఁ గ్రిందుపఱపన్ గడుసాయముఁ జేయువారు, సి
ద్ధిల్లినగెల్పుతోడఁ జనుదేరెడివార లజేయులై తమిన్ 172

ఎన్నోనాళ్ళుగ మాకు మీకుఁగల దీయిబ్బంది-నీకాంక్షతోఁ
జన్నే! కష్టము! నీప్రయత్నము ప్రశస్యమ్మౌనె? నాపత్నియున్
నన్నేనమ్మి విధేయతన్ మెలఁగు-వన్యాసీమ నీకోసమై
మిన్నుల్పడ్డ ప్రదేశమందు విడువన్ మేలే? కృతఘ్నత్వమౌ! 173

నాయిల్లాలికి సాటి రాఁదగిన చానన్ గాంచ మీపృథ్విలో
పాయంజేసెఁ బ్రవాసకాలమున నధ్వక్లేశముల్ శాంతితో
స్థేయంబౌ వరివస్య నాయెడఁద రంజించెన్ సుమీ భక్తితో
జాయన్ నీకొఱకై త్యజించుటన తుచ్ఛంబేకదా దానవీ! 174

మోహము పొంది స్వీయను బ్రపూతచరిత్రను సీత వీడి వై
వాహిక జీవితమ్మునకు వన్నెయు, వాసియు వీటఁబుచ్చెదే?
దైహిక సౌఖ్యముల్ ఘనమె? ధర్మపథమ్మును వీడఁజాల నా
సాహసమున్ వ్యతిక్రమము సారతమే నసువంటి వానికిన్ 175

నాకొక్క భార్యయున్నది
నాకాయమ చాలు-వేలు నాతియదేలా ?
నీకొక సుందరుఁ డొకరుం
డీకాలమునందు వలయు నింపెసలారన్ 176

నాగరిక జీవితముమాది-నాతిఁబెండ్లి
యాడినన్ దానితోసరి-యన్యకాంత
మాటఁదలపోయ సుంత సమ్మతము కాదు
ఆటవిక సంప్రదాయంపు బాట మీది 177

పుత్రు లెవ్వరుఁ గలుగక పుడమితేఁడు
సతులమువ్వురఁ బెండ్లాడె-సంతుకలిగె
నందఱకుఁ బుత్రకామేష్టి సనఘుఁడొనరు
పగను-సత్యంబు-కామమ్ము వలనఁగాదు 178

ప్రక్కను భార్య యుండగను భావ్యమె పొందగఁగోరనన్ను? తాఁ
జక్కనివాఁడు లక్ష్మణుఁడు, సారసనేత్రుఁడు, పత్నిచెంత లే
దిక్కడ-వాఁడు రూపమున నెబ్బగ, బుబ్బగసుండు, నీయెడన్
మక్కువఁజూపునేమొ? కనుమా! కడునల్లనివాఁడు కాదుగా ? 179

పదుమూఁడు వత్సరములుఁగ
మదవతి! సతి పొందులేని మానవుఁడతఁడౌ
ముదమున నీసంగాతము
పదిలపడం జూచుకొను విభావము పేర్మిన్ 180

మేరువు నర్కప్రభవలెఁ
జేరుము ప్రియదర్శనుని విచేష్టను నిపుడే
పోరా దాకొ? యవసరమా
వీరునకుంగలదు పోయివేఁడుము వానిన్ 181

రాముని మాటలతో నా
కాముకి సౌమిత్రికడకు గ్రక్కున వెడలెన్
ధామను గనుఁగొనె లక్ష్మణుఁ
డాముకొనుచు వచ్చుదాని నాశ్చర్యముతో 182

లోలోన ఖేదపడె నా
లోలాక్షి తెఱంగుఁజూచి, రోయుచు నెటులా
ఖీలంబగు నీ బెడఁదను
దూలింపగ నగునటంచుఁదూఁగె సతండున్ 183

అంతటఁజుప్పనాక తనువంతయుఁగన్నులు కాగ లక్ష్మణున్
వింతగఁజూచుచున్ బలికె "వింటివె ! రాముని పల్కు, లాతనిన్
స్వాంతమునందు నిల్పుకొని వచ్చితి నిట్టుల పొందుఁగోరుచున్
చెంతను భార్యగల్గు నినుఁ జేరు మటంచు వచించె నాతఁడున్ 184

ఆతఁడు నీలమోహనుఁడె ! అందము, చందము మెచ్చుఁగొల్పెడిన్
సీతనుఁబెండ్లియాడినటుఁజెప్పెనతండు - త్యజింపలేనటం
చాతనిమాట న్యాయమగునా యనిపించెను - ఆఁడుతోడు లే
దా ! తరుణుండ వేపగిది తాలిమి నుంటివి నిగ్రహమ్మతో ? 185

నీవును సుందరాంగుఁడవె ! నీకును భామిని చెంతలేదు - నా
భావము మార్చుకొంటి సుమి - పచ్చని నీ మృదుదేహకాంతులన్
వావిరి నీ పయిన్ మనసు వాటముగాఁబెనఁగొంచు నిల్చెనో
దావరి ! ప్రేమతోఁగుసుమధన్వి ప్రతాపము నుజ్జగింపుమా ! 186

నీకనుగోనలందొలఁకు నిర్మలహాసమరీచిమాలికల్
ప్రాకటమై విలోకనవిభారుచిరంబును బ్రస్ఫుటమ్మనై
వా కొాక క్రొత్తలోకముఁగనంబడఁజేసె మదీప్సితంబు నీ
వే కరుణించి తీర్పవలె ! విజ్ఞుఁడవౌదువు - మాటలేటికిన్ 187

ఓ యందమ్ముల ప్రోవ ! నా వలస మాయోపాయులౌ రక్కసుల్
మీ యీ ప్రాంతమునందుఁదొల్లిటి వలెన్ మిట్టాడగా జంకుచున్
వేయంబోవరు వెట్టివేషములు సేవింపగ నేనుండగా
సాయంబున్ జొనరించుదాన నిరతిన్ సంతోషముం గూర్చెదన్ 188

చక్కని వాఁడవు, నా మది
కెక్కిన తేజస్వివగుదు వింపుఁదలిర్పన్
మక్కువఁజూపుచు నుంటిని
సొక్కించుము నన్ను రతుల సోమించి ధృతిన్ 189

నేనున్ మీవలె కందమూలములతో నేమించి మాంసాశనం
బేనెట్టంగలదాన దూరముగ, నేయిష్టంబుఁజూపన్, నినున్
బ్రాణప్రాణముగాఁగఁజూచుకొనెదన్ బ్రావేల్పునై నంత మా
త్రానన్ నమ్మిక లేదె ? వాంఛితముఁదీర్పన్ వేఁడెదన్ బాగరీ ! 190

అడివింగాసిన వెన్నెల
వడువున వ్యర్థమ్మ కాదె పడుచుఁదనమ్మే
నడుమంత్రపు మునివృత్తిని
నిడుమలపడ నేమిటికి నహీనగుణాఢ్యా ! 191

వనములకేఁగు మటంచును
బినతల్లియు రాముఁగోరె వెంటను బత్నిన్
గొని వచ్చె నతఁడు మతినీ
పనియేమిట స్వార్థమింత వలదే నీకున్ ? 192

భరతుఁడు రాజ్యము వలదని
నిరసింపగ నౌరసుఁడవు నీవే కద - రా
జ్యరమం బొందగ నీ వన
చరణముఁగోరితి వదేల సాహసికుఁడవై 193

రామచంద్రుని వలె నీవు రమణిఁగూడి
కానసములకు రావు లక్ష్మణ ! అదైన
నీకు దాంపత్య ధర్మమ్ము నెఱప వీలు
కలిగెడిది కాదె రాముని కరణి వసుల ? 194

ఇవియన్నియు నా కోసమె
సవరింపంబడెను నీదు జాతకమందున్
వివరింపనేల విషయము
లవలీలగ గుర్తెఱుంగనగును విలాసీ ! 195

కాలము, కర్మము కూడిన
నోలి ని నుసిరికయు లవణ మూరక కలియన్
వీలుంగల్గును మన కను
కూలించెన్ సమయ మిటుల కూటమికొఱకై 196

తానొకటితలఁప దైవ మ
నూనముగా వేఱొకండు నూల్కొలుపుఁజుమీ
నేనారాముని గోర, ని
ధానముగ లభింపనీవు-ధన్యను కాదే ! 197

ముచ్చటగ రాచపుట్టువు పుట్టి గిరుల
వనములందిరుగాడుచు, వాడివత్త
లైనదేహమ్ముతో నందమంత నెండ
పాలొనర్చుట మంచిదే వలపులేక ? 198

అదియేమో నినుఁ గాంచనాయెడఁద కామావిష్ట మైపోయె నీ
ముదిపాయమ్మున గూడ సంస్పృహను - గోముంజూపినీ చేరికన్
ముదముం గూర్చిన సంతసించెదను - ప్రాపున్ మీకుఁ గల్పించెదన్
గదియం జేసి దృఢోపగూహనము నన్ గాంఛన్ వెసందీర్పుమా ! 199

వలసినప్పుడు కామరూపము ధరింప
పరము దయచేసెను విధాత - పరిఢవింపఁ
జాలుదు మనోహరాకృతి - సమ్మతించి
మనసు నెఱుఁగుచు మన్నింపుమా ! దయఁగొని 200

యువతీనవమన్మథ ! న
న్నవగతముం జేసికొనుచు నభిమానముతో
కవగొని యేడ్తెఱఁ జేతో
భవుఁజరితార్థునిగఁ జేయఁ బ్రార్థింతు నొగిన్ 201

ఆపలుకుల నాలించుచుఁ
గోపమున సుమిత్రసుతుఁడు ఘూర్ణిల్లుచు నీ
పాపంబేమియటంచుఁ బ్ర
లాపించెడి యసురిఁ గనుచు లాయుచుఁ బలికెన్ 202

నాకును బత్నియున్నది యూర్మిళాభిధ
సాకేతపురి నుండు - శ్రీకరుండు
శ్రీరామచంద్రుండు సీతామహాలక్ష్మి
తోఁబ్రవాసముఁ జేయ దొరఁకొను స
మయమునఁ భాతృధర్మముగ సేవలొనర్ప
వచ్చితి వారికి వనములందు
బావగారు నడచు బాటను మఱఁదలు
పయనమ్ము సేయు టొప్పదు కులాంగ

నలకుఁగావున విడిచితి నాతినచట
నన్నువరివస్య కాటంక మగుటఁగూడ
జరుగ దాబిడలేకున్న - సంతసమున
నొక్కఁడన వచ్చినాఁడ నో యువిద ! నేను 203

అన్నకు, వదినెకు వలసిన
వన్నియు సమకూర్చ వలయు ననుజుఁడ నగుటన్
నన్నేలఁ గోరెదవు నీ
తెన్నున నుపయోగపడగ తీఱదు నాకున్ 204

నిత్యనైమిత్తికమ్ముల నెఱప సకల
వస్తుసంచయముంగొనివచ్చు టొకటి
కందమూలఫలమ్ముల గ్రాసమునకు
సంగ్రహించు టొక్కటి దినచర్యనాకు 205

మృగనిశాచరభయము వారించు కొఱకు
చాపినై యప్రమత్తత సంచరింప
వలయుఁ బరితోషమును గూర్పఁ గలనె నీకు
తీఱికయె యుండి చావదోదిటవరి ! యిఁక 206

పదునాల్గేడుల లోపల
పదుమూఁడు సమల్ గతించెఁ బదపడియొక్కఁ స
న్నది మాకొక సంవత్సర
మదిగో ! యిదిగోయటన్న నదియున్ గడచున్ 207

0351, 11241 MBR
S. V. Central Library and Research Centre, T.T.D. TIRUPATI

తను దూర సందు లేదట
తన మెడకొక డోలు కలుఁగఁదరమె యెవనికిన్
ఘను నొకనిఁజూచుకొని నీ
మనసుఁదీర్చికొనినమేలు మఱచుచు నన్నున్ 208

నీకళనమ్మఁగూర్పగలనేరిమి, పోఁడిమి నాకు లేవు, నీ
యాకలికై మదావళము లన్నియు, నిన్నియు, చాలునే ? వనిన్
జోకలు కట్టు జంతువుల నూనరినై వధియింపగావలెన్
నాకు సమస్యగా నిలువ న్యాయమె ? పొమ్మునిశాచరీ ! వెసన్ 209

నేనే దాసుఁడ నీక నీ
పూనికతో భార్యవైనఁబొందెడి సుఖము
న్నే ! నీయందము సార్థక
మౌనన్నకు చిన్న భార్యవై రాణింపన్ 210

నీ వంటి కాంత దొరకిన
పోవదు నిజపత్ని పైకి పూబోఁడి ! మన
స్సావిష్టమౌను తప్పక
కావున శ్రీరాము కడకు గ్రక్కున పొమ్మా ! 211

అని పరిహాసమాడగ రయంబున లక్ష్మణు వీడి చుప్పనా
క నిభృతమున్ వెలార్చుచుఁబకాపక నవ్వుచు రాముఁజేరగన్
ఘనుఁడు తిరస్కరింపగను గన్నుల రాల్చుచు విస్ఫులింగముల్
జనకజపాలికిన్ జనెను సైరణఁదప్పగ మ్రింగఁబోవుచున్ 212

రాముఁడో ప్రేమమూర్తి శూర్పణఖ కామ
మూర్తియగుఁగోపమంధత్వమును, బశుత్వ
మును బ్రబలఁజేసి క్రౌర్యము పుట్టి వక్ర
పథమునకు నీడ్చి రాక్షసత్వమును బెంచు 213

తాలిమిఁదూలిపోయి ఫలితం బొకయింతయు లేక పోవ నీ
తాలలనంగనుంగొనుచుఁదామసమెల్లను వెళ్లఁగ్రక్కుచున్
ప్రేలగసాగె వాంఛితము పెల్వలఁబాయుచు రిక్తవోవగా
వ్రీలు హృదిన్ విరోధమున వేదన నంది వచించె వారితో 214

'అచ్చర లేమ యొక్కరిత హాళిమెయిన్ బరతెంచెనేని నీ
వచ్చికబుచ్చికన్ మెలఁగి, యాయమ తోడిదె సర్వలోకమై
ముచ్చటలాడు వాఁడవె ప్రమోదమునందుచు నన్నుఁగాంచినన్
ముచ్చుముడింగి ధర్మముల మూర్తి వచించెదు మూలముట్టుగన్ 215

ఊర్మిళవోలె నీవును సయోధ్యను నిల్వక యేలవచ్చి నా
వోర్మిని కానసంబుల కయో ! దయమాలి తిరస్కరించె నే
కూర్మిని నాయెడన్ నిలుపఁగోరఁడు - దీనికి హేతువీవె, నీ
పేర్మిని జూచి సీత ! రఘువీరున కెల్లిదమైతి నివ్విధిన్ 216

నీ పతి యందగాఁడె యగు - నేసటువంటి మనోజ్ఞరూపమున్
చూపులు ధన్యమైతనరఁజూడగఁబోవను నేఁటి దన్క నా
రూపముఁగాంచి డీలుపడి రోతగ నెంచును నన్ను - నీ వసన్
చూపును ప్రేమమున్, ప్రణయ సూక్ష్మ మెఱుంగఁడొయేమొ పైదలీ ! 217

ఇంతటి యందము నీకిటు
లింతీ ! దక్కుటకు నొప్ప నింతయు, వలపున్
చింతాకంత గణింపఁడు
పంతముతో మీ సుఖమ్ముఁబాడొనరింతున్ 218

నిన్నున్ లక్ష్మణు మ్రింగి పైచినను గానీ ! రామభూపాలుఁడున్
నన్నున్ మెచ్చుఁడు, ప్రేమఁగాంచఁడు, బిరానన్ గౌఁగిటంజేర్పఁడీ
బన్నంబుల్ సమకూడె మీ వలన దర్పంబున్, బలంబున్న మా
యన్నన్ రావణుఁగూడ లెక్కగొనరే యాధిక్యముం జూపుచున్ ? 219

భీతింబొందుచు వడి వడి
సీతాతరళాక్షి నాథు చెంతకుఁజనగా
కాతర్యముఁగాతాళము
నాతతమై రాముఁడనుజు నాజ్ఞాపించెన్ 220

"జానకి పైకి వచ్చు దనుజన్ గను మెంతటి క్రూరచిత్తయో
దీని విరూపఁజేసి సొరిదిన్ దగురీతిగ సాగనంపుమా !
కాని పసుల్ బొనర్చు పలుగాకులతోఁబరిహాసమాడగా
మానితమౌనె ప్రాజ్ఞులకు, మంజుపథమ్ములనేఁగు వారికిన్" 221

మొదలపెట్టిగ నన్న తమ్మునకు సంత
సమున మూఁపులుమూఁడయ్యె,సరభసముగ
జానకిని జేరఁబోవు రాక్షసిని మధ్య
లో నివారించెఁ బోకుండ లుబివడంగ 222

వెంటనె లక్ష్మణుఁడాక్రా
గ్గంటిని వెలుపలికి నల్లెత్రాటన్ బలిమిన్
గెంటెను - ముక్కును జెవులును
గంటువడఁగ ఖడ్గధార ఖండించెనొగిన్ 223

"పో ! పొమ్మ ! మఱల రావల
దీపొలమునకెపుడుఁ గూడ నింతీ ! ప్రాణుల్
వైపుల్యమ్ముగ నిర్భయ
మేపారగఁ దిరుగు నిచట నీపై హాయిన్ 224

అడవికి నీశని వదలెను
బుడిబుడిపడి చనినమేలు బుద్ధిఁ గలిగి నీ
వాడికముననుండు" మనుచును
విడిచి యనిపె నతఁడు దానవిన్ హెచ్చరికన్ 225

అసలేదుర్ముఖి నాసికన్ జెవులఁ గోయన్ లక్ష్మణుం డా మెయున్
నసిఁగోల్పోయి కురూపియయ్యెఁ బెలుచన్ సంరావముం జేయుచున్
దుసికిల్లెన్ గడకెట్లొ ప్రాణములతో దోదూయమానమ్ముగా
శ్వసితంబుల్ నిగుడంగఁ బర్విడె జనస్థానమ్ముఁ జేరన్ త్వరన్ 226

ప్రావృషేణ్య వర్జన్యము పగిది యుఱిమి
బాధ సైపంగ నోపక పల్లటిలుచు
బాహువులనెత్తియఱచుచుఁ బరుగుఁ దీసె
భీతినెఱుఁగని రక్కసి భీతి మిగుల 227

ఘోరున నేడ్చుచున్ దనుజ పోయెను వ్యోమపథాన నెత్తురుల్
కాఱఁగ ఖండితాంగములఁ గాతరయై ఖరుడుండు చోటికిన్
వీరుల రాజపుత్రుల శపించుచుఁ దిట్టుచు, నిందసేయుచున్
వారిజనేత్ర సీతకు సహాయ మొనర్పగ నెంచు చివ్విధిన్ 228

"నీసౌఖ్యమ్మను జూచుకొంచిటులఁ బత్నింఁదెచ్చితే కానకున్
దోసంబంచును నాంక్షఁ బెట్టితివి ముద్దున్ ముచ్చటల్ లేక ప
త్నీసౌఖ్యమ్మడివోవ. లక్ష్మణున కేదీన్యాయమోరాఘవా !
నీసంతోషము నీకుముఖ్యమగు కానీ తమ్ముఁడేమైననున్ 229

ఘోరాకారులు. బాహువిక్రములు, దుర్మానుల్. దయాహీనులౌ
వారల్ సుందు మదీయసోదరులు - దుర్వ్యాపారులన్ మిమ్ము న
న్నూరార్పన్ దెగటార్చి తీతెదరు – రాహుగ్రస్తులై నారలీ
దౌరాత్మ్యమ్మన భుగ్నమానసులుగా దండించు టాశ్చర్యమే ! 230

ఒక్కతె - నాఁడుదాని నిటు లుక్కువులై దయమాలి వీనులన్
ముక్కును జెక్కువీరులబె ! ముందుననున్న ముసళ్ల పండుగన్
గుక్కినపేలుమీరు - సమకూడును కష్టము లింకమీఁదటన్
బక్కబలమ్ము నమ్మకొని పాపము వాసముఁ జేతు రియ్యెడన్ 231

ముద్దులభార్య సీతకును మోసమువచ్చును రామచంద్ర ! నీ
వెద్ది వచింప సోదరుఁ డొకించుక తప్పఁడటంచుఁదెల్పినా
వద్ది యసత్యమయ్యెసుమి - అబ్బురమయ్యెను - తోడుదొంగలై
యిద్దరు సంచరించితిరి హేయముగా - ఫలితంబు వేద్యమౌ !" 232

ఆనిశాచరి గోడు నాలించి యాపద
యేదియోరానుండె నిప్పుడనుచు
దానికి వారు సిద్ధముగనుండిరి - మున్ను
రాజ్యమ్ముపోవఁ గారణము మంథ

రకుతంత్రమైన నీరక్కసి కొనితెచ్చు
చుండె వేఱొక కష్ట ముండి యుండి
నారీశిరఃప్రసూనము పృథ్వీపుత్రియు
పడవడ వడఁకెను భయముపేర్మి

నంత రాఘవుఁడున్సతి నాశ్వసించి
భీతి నుడిపెను — సౌమిత్రి బెడఁద గుఱిచి
యెట్టిరూపముతోవచ్చు ? నెవరివలన ?
నెటుల మార్కొన వలెనొ తానెంచుచుండె 233

రామసౌందర్యమా నాతి కామవహ్ని
కాజ్యమయ్యెను - దానితో నతఁడు హుంక
రించి నాసయుఁ జెవులఁ జెక్కించె నామె
కదియె తొలిసారి కష్టమ్ము నెదురు కొనగ 234

పడఁతి యనఘునితోఁ గుల్కవచ్చు ననుచు
నెంతొయాసించెఁగాని యీచింత కలిగె
మొదటికేమోసమయ్యె నామూఢమతికి
వికృతరూపము సిద్ధింప విహ్వలించె 235

కేకలు పెట్టుచు దానవి
శోకించుచు మింటినుండి సోదరులకడన్
మైకము క్రమ్మగఁ బడెఁ బిరు
వీకున దత్రత్యులెల్ల వెఱఁగుపడంగన్

ద్వితీయ వాహిని

శోణితోక్షితదేహ శూర్పణఖం గాంచి
క్రోధంబుతోడ ఖరుండు కలఁగి
ప్రశ్నించె నామె "నెవ్వఁడు సాహసించె వి
రూపఁ జేయగ నిన్ను - శ్రుతపఱపుము
శయనించియున్న భుజంగముం గాలఁ ద్రొ
క్కఁగఁ బూనుకొనిన వెంగలి యెవండు ?
కాలపాశమ్మును గంఠమ్మునన్ వైచు
కొనెనె? ఘోరవిషమ్ముఁ గ్రోలువాఁడె ?

కామరూపివి - బలపరాక్రమము లందుఁ
దెగువరివి దేవజాతులు తేఱిచూడ
రెవరు - ఋషులన్న లెక్కయే - యింద్రుఁడైన
వప్రియము సేయ వెఱచు సహర్నిశమ్ము 1

కామగమనమ్ముఁ గూడను కలదు నీకు
ముక్కుఁజెవులను ఖండింప మూర్ఖుఁడెవఁడొ
యత్న మొనరించు చుండంగ నచట నేల
నిలిచితివి - అంతమాత్రము తెలివిలేదె ? 2

నీరు కలిసిన పాలను నిరుపమముగ
హంస క్షీరమ్మునే క్రోలి యంబువులను
విడుచు తెఱఁగున నాతీవ్రవిశిఖములను
వాని ప్రాణమ్ములందోడివైతు నేను 3

తెంపరియె వాఁడు ? గుండెలు తీసినట్టి
బంటువలెఁదోఁచు - చెప్పుమెవ్వఁడో ? యెవండో ?
ములుఁచ నులిగొనెఁగాలమ్ము మూఁడఁబోలు
విపుల వాని రక్తముఁదృప్తిఁబీల్చుఁగాక ! 4

మృత్యువువంటి నీకు బలిమిన్ వికృతింగలిగించి పర్వతో
పత్యకలందు ధైర్యముగ వైరిభయమ్ము రవంతలేకఁదాఁ
బ్రత్యయబుద్ధితో మెలఁగు వాఁడె మహాబలుఁడైన నెంతగాఁ
బ్రత్యహమాతడున్ బ్రదికి బట్టనుగట్టఁగలండె సోదరీ ! 5

స్విన్నకపోలయై పరితపించుచు, వెక్కుచు, నాగ్రహించుచున్
చెన్నటి తమ్ములంగనుచుఁ" జెప్పెద నొక్కఁడు కాక యిద్దఱీ
బన్నముఁదెచ్చిపెట్టిరి - విపన్న నొనర్చిరి - వారు రూపసం
పన్నులు - సోదరుల్ - కొమరుఁబ్రాయపువీరులు, రామలక్ష్మణుల్ 6

పంచవటి కేఁగితిని నే
నంచితముగ నెప్పటివలె నట మోదమునన్
సంచారము సేయుచుఁబొడ
గాంచితి దుర్ధర్షులైన ఘనులిర్వురనేన్ 7

చీరకృష్ణాజినాంబరుల్; సౌరమతులు
రమణకెక్కిన గంధర్వ రాజసములు
మనుజులో, దేవతలో చెప్పననువు కాదు
వారి రూపానుభావమ్ము వలనఁదొలుత 8

ఫలమూలాశను, లర్కవంశజులు సౌభ్రాత్రమ్ములో మిన్నలై
పలుకుందోడుగ సంచరించు ఘను, లాపద్ధర్మసంభావ్యులై
తలకూర్పన్ దమతండ్రి పంక్తిరథు వాగ్దానమ్ము లీకానలన్
లలితోరస్కులు కాలముంగడపు ధర్మప్రాభవుల్, దాంతులున్ 9

అన్నదమ్ములు వారిద్ద అంబుజాక్షు
లమిత బలులు, సుక్షత్రియు లంతకంటె
మఱియొక విశేషముంగల్గు - మగువ కలదు
వారివెంట - చక్కని చుక్క వారిజాక్షి 10

రాముఁడు నీలమోహనుఁడు - లక్ష్మణుఁడుండుఁబసిండి చాయతో
రాముఁడు పెద్దవాఁడు మఱి లక్ష్మణుఁడాతని తమ్ముఁగుఱ్ఱ - యా
లేమయు రాముపత్ని - కనలేమటువంటి విలాసినిన్ సుమీ !
ఏమని దానిరూపమును నెంతగ వర్ణన సేయఁజాలుదున్ 11

తొడవుల నెన్నొ తాల్చినది తోయరుహానన ! దానిరూపమే
తొడవగు నన్ని భూషలకు - తోడ్కొని వచ్చెను రాముఁడామె - ఆ
నడుమును, గన్నులన్ బొగడినన్ సరిపోవునె ? యందమెట్లు నే
నుడివెద ? నంత యందమును నోట వచింపగ నాకు సాధ్యమే! 12

నామార్గమ్మున కడ్డుగా నిలిచె దానన్ రాముఁడున్, లక్ష్మణుం
డేమోచెప్పుచు వైమనస్యమున సన్నిరీతి హింసింప నా
సామంతమ్ముసు జూడ వారిబలమున్ సామాన్య మంచెంచరా
దీమాలిన్యము పక్షిరాజు వలనన్ హెచ్చెన్ సుమీ వారిలో 13

అందుకొఱకెంతొ రగడ యైనందు వలనఁ
గినిసి నాముక్కుఁ జెవుల జెక్కిరి బిరాన
నన్నదమ్ములు - చంపుడు - ఖిన్ననైతి
నడ్డుగా నుండె నామె ముఖ్యముగ నాకు 14

ఆకమలాక్షి యందమొక యద్భుతశిల్పమె - అట్టి భామ ము
ల్లోకములందుఁ జూచినను లోచన గోచరమౌట దుర్లభ
మ్మాఁకువ దాని బొందగల యర్హత నొందఁడవౌదు నీవు, నన్
లోకువఁజేసి చూచిరి ప్రలోభమటంచుఁ దలంచి రంచఱున్ 15

ఆమె త్రిలోకసుందరి - సురాంగనలందలఁదన్ను జాణ - ఆ
సామజయాన చూపులను సర్వజగమ్ములఁ గట్టివైచు, నే
మేమొ వచింప నేమిఫల మీపగతీఱగ దానిఁ దేవరెన్
బూమెలు మీకు క్రొత్తవె ? సముచ్ఛ్రయమున్ మదినెంచుఁడీ తగన్ 16

అందమునకు నందంబా
కుందరదన - చంద్రవదన - క్షోదీయముగాఁ
బొందిన నీవామె మహా
నందంబునఁ దృప్తిపడుదు - నాకాంక్షయిదే ! 17

తాదేవిని, రామచంద్రుని సతిన్, శీతాంశురేఖాకృతిన్
తఃప్రీతిగ స్వీకరించిన ఖరా ! చేకూడు సౌఖ్యమ్మునీ
త్రప్రోతముగా సమర్షమది యెంతోయుండె నాకాంతపై
తర్యమ్మును బాపి నాపగ తొలంగన్ జేయ యత్నింపుమా ! 18

నన్నుఁ బరాభవించి యిటు నాసను, గర్ణయుగమ్ముఁ గోయగా
చిన్నతనమ్మ కాదె ? పరిశిష్టము ప్రాణముఁ దీయుటొక్కటే
వన్నెయు, వాసి యుండునొకొ ? వారి నఖంపచరక్తమానకే
కన్నుల నిద్రరా దెడఁద కాఁగుచునుండును శాంతిదూరమై 19

నిన్నేమి యింతవఱకును
మున్నెన్నఁడుఁ గోరలేదు - పోరున వారిన్
మన్నిగొని రుధిర మిచ్చుచు
మన్నింపుము వేఱుకోర్కెమాటఁ దలంపన్ 20

అన్నదశాస్యుఁడు విన్నన్
గన్నులతో నిప్పులుమియఁ గఱకఱి తోడన్
సున్నము సేయఁడె వారల
బన్నపడన్ నన్నుఁగాంచి బాధఁ గుములఁడే ? 21

పైకి సౌమ్యాకృతులుగఁ గన్పట్టువారి
శక్తిసామర్థ్యములను నెంచకుఁడు తక్కు
వగను - తగిన బలమ్ముతో పగఱ నెద్రిచి
పోరుసన్ సంహరించినఁ దీఱు కినుక 22

అని వాపోయెడి సోదరింగనుచు దుఃఖావిష్టుఁడౌచున్ ఖరుం
డనిదంపూర్వము లిట్టివైదములు శ్రీ యంచున్ దలంపంగ నే
రనిదుష్టాత్ములె ? చూడు మొక్కత్రుటిలో రాత్రించర వ్రాతమున్
బనిగొంచున్ రణమందు నిర్వ్వర నిదే మ్రందించెదన్ వీఁకమై 23

ఏడువకమ్మా ! నీకయి
సూడుగొనుచు సంహరింతుఁ జూడుము భగినీ !
ఏడాగోడమె ? ఖరుఁడిట
నేడుగడగ నుండ సాధ్యమే యిటు సేయన్ ? 24

పరుగెత్తించెద సైన్యమున్ రిపుల నిర్వాసమ్ముఁ గావింప ను
క్కురులౌ వీరుల నాయకత్వమున సంగ్రామమ్ములో వ్రేల్మిడిన్
పరిభూతిం గృశియింపమేలె ? హృదయస్వాస్థ్యమ్ముతో నుండుమా !
ఖరుడుండన్ దశకంఠుఁడేల ? సొలయం గార్యంబె దుఃఖింపగా ! 25

గోటితోఁ బోవుదానికి గొడ్డలిపని
యేల ? మానవు లిర్వుర నిడియఁగొట్ట
నేనుఁదమ్ముడుఁ జాలమే ? నీవు మేము
కూర్చు సోదరులము కామె? కోపమేల ? 26

వారి మాంసము గ్రద్దలు, వాయసములు
ప్రీతి భక్షించు చూడు ! నాచేతఁబడిన
మందభాగ్యుని రక్షింప మగటిమి కల
వాఁడు కనరాఁడు యక్షదేవతలలోన 27

వరులఁట ! బాహు విక్రమమునన్ గడితేఁరిన శూరులంట! సో
దరిని విరూపఁ జేసిరఁట ! దర్పముఁ జూపుచు రాచబిడ్డలై
యరగలి లేక సుంతయును నాఁడుది యంచు గణింపఁబోక యీ
దురితము నాచరించిరఁట! దూషణ ! దుష్టుల చెయ్వి చూచితే ? 28

పదునలుగురు నాయకులను
ముదలఁ గొనుచు, పిలిచి బొమలు ముడివడ ఖరుఁడున్
వదరులు వదరుచు సరుణిమ
వదనమునన్ గనులఁ దోఁప వాకొనె నిటులన్ 29

ఎవరో యిద్దఱు రాజపుత్రు లిటకున్ హేలావతిం దోడుకన్
నివసింపం జనుదెంచినారలఁట ! పూన్కిన్ సోదరిన్ నొవ్వఁ జే
య, వినిందించుచు వారి రక్తముమ దా నాసక్తిమై త్రావఁ గో
రె-విరోధమ్మున నామె - చంపవలె వారిన్ యుద్ధ రంగమ్మునన్ 30

వారలను జంపుటయె కాదు - వారి చాన
దెప్పరంబున నిటకు నీడ్చికొని రండు
శీఘ్రముగ నిక్కడున్నటు సేనఁ గొనుచు
పొండు ! పొండని తఱిమె నప్పుడు ఖరుండు 31

వారు వాతేరితములైన వారిదముల
వోలెఁ బరువెత్తిపోయిరి - వ్యోమపథము
వెంట నా చుప్పనాకయు వెడలె రామ
లక్ష్మణులఁ జూప వారికి లాగులాడ 32

మహితుఁడగు రాముఁ శక్తిసామర్థ్యములను
దెలిసికొనవలె ముందుగా - మెలఁత వాక్య
సత్యము నెఱుంగవలెఁ గాన సైనికులను
బంపె ఖరదైత్యుఁ డంత శూర్పణఖ వెంట 33

పంక్తిరథు పుత్రు లిర్వురు, వారిజాక్షి
సీత దూరమునుండియె నేనఁ గాంచి
వారితో శూర్పణఖ యుండ వారిరాక
నర్థముం జేసికొనిరి కుయత్నములను 34

తమ్మునిఁ జూచి పల్కె నిటు తామరసాక్షుఁడు "చుప్పనాతి సై
న్యమ్మును గొంచు వచ్చెఁ బరిణామముఁ గాంచితె ! సీత కేయపా
యమ్మును గల్గరాదు సుమి ! ఆమె కడన్ నిలువంగ నౌను-బా
ణమ్ములు, విల్లు నాకొసఁగినన్ దెగటార్చెద యాతుధానులన్" 35

సీతారక్షణ మొసరుప
నాతతముగ లక్ష్మణుండె యర్హుండనుచున్
ప్రీతి నియోగింపగ నతఁ
డాతామరసాక్షుఁ గాంచి యనె నిప్పగిదిన్ 36

నీవుండ వదినెకడ, నే
నే వెడలెద నాజి సలుప.నీ వేలను ? నా
సౌవీర్యముపై లేదే
యే విశ్వాసమ్ము ? పంపుమీ కృపఁ గొనుచున్ 37

ఆపలుకులు విన రాముని
చూపులలో సానుభూతి చుమ్మలు చుట్టన్
'నా పౌరుష మెఱిఁగియు న
న్నాఁపెదవే ! ఆలసింప వ్యవధియు లేదే ! 38

తన యభిమత మీడేర్పగ
వనజాక్షుం డియ్యకొనక వాదాడంగన్
వినయమున వంచెఁ దల, ల
క్ష్మణుఁడున్ మఱుమాట పలుకు మార్గములేకన్ 39

ఆతఁడందించు బాణశరాసనములఁ
జేతఁ బూని కవచమును స్వీకరించి
తొడిగికొని ధనుష్టంకార మడవియంత
మాఱు మ్రోగ నొనర్చె నామాన్యుఁ డపుడు. 40

రాక్షసుల కభిముఖుఁడయి రామమూర్తి
కన్నులందున విస్ఫులింగములు కురియ
వారిరాకఁ బ్రతీక్షించి భయముఁ గొలుప
నెఱచిదిండులవైపు విల్లెక్కుపెట్టె 41

రాక్షసులు రజ్జులాడుచు రణమొనర్ప
నాశ్రమోపాంతసీమకు నరుగుదెంచి
రేఁగు దావాగ్ని వీక్షించు నాగములటు
లుగ్రతేజునిఁ బరికించి యుదిలగొనిరి 42

"వారే నన్నుఁ బరాభవించిన రిపుల్ వారే సుమీ ! వారె సూ!
క్రూరాత్మల్, బలశాలు లాహవకళారూఢిం బ్రసిద్ధుల్ - మఱే
వీరుల్ వారికి సాటిరారు కనుకన్ వీడించి, తాడించుఁడీ
చేరం బోవుచు నుక్కడంపవలె నాజిన్ - రక్తముం గ్రోలెదన్" 43

దూరమందున్న దాశరథుల, జనకజ
గోలసేయుచు చూపుడువ్రేలి తోడ
చూపి "యిఁకఁబోయిరండ" ని చెప్పనాక
పంపె రాక్షసవీరులఁ బ్రథనమునకు 44

రామావరజుఁడు సీతను
క్షేమంబగు స్థానమునకుఁజేర్చెన్ భక్తిన్
రాముని శక్తినెఱుంగుచుఁ
బ్రేమందిలకించె నామె వీరుని, బతినిన్ 45

సజ్యకార్ముకుఁడై రామచంద్ర విభుఁడు
ముందునకు వచ్చినిలిచె "నోమూర్ఖులార !
వినుడు మేమెవ్వరమొ తెల్పు వేడ్క కలిగె
నడుగుఁగదపక నిల్వుఁడక్కడనె మీరు 46

తరణికులదీపకుండగు దశరథేశు
పుత్రులము మేము - నేను రాముఁడను, జ్యేష్ఠ
తనయుఁడను - తమ్ముఁడతఁడు లక్ష్మణుఁడటంద్రు
జానకీదేవి యా కాంత జాయ నాకు ! 47

జనకుని మాటపై యిటుల జానకి, తమ్ముఁడు వెంటరాఁగ నీ
వనములఁగాల్నడన్ దిరుగువాఁడను - చేరితి నీ ప్రదేశము
తినుటకుఁగందమూలములె తెచ్చును తమ్ముఁడు, ధర్మమార్గమం
దనిశము పోవువారమె మహాత్ముల, మౌనుల పాదసేవతో 48

ఒకరితో వైరముండ దింకొకరి జోలి
పొంటియున్ మాకులేదు - మాచూపు సతము
జపతపంబులపై నిల్చు - కపటమేమి
కానిపించెను మాలోన ? కక్ష యేల ? 49

వేషమాత్రమ్మనసె కాదు - వృత్తి చేతఁ
గూడ తాపసులము మేము - కొంచెతనము
లేదు - దాంతులమై యుండ లేదె వీలు ?
పంచవటి సీమ నుండ నొప్పదె రవంత ? 50

పాలసులార ! మాపయికి వచ్చుట ధర్మమె ? మీర లిట్టులన్
ప్రేలుచు, హింసఁబెట్టుటన బేరిమిగాఁదలపోసినారలే ?
కూలుదు రాహవంబున గకుప్పలఁబ్రాణములంద్యజింపగా
నేల ? తొలంగుఁడాసకలదేని - రయంబున బాఱిపోవుఁడీ 51

మముఁగవ్వించుట కుద్యమించెదరు క్షేమంబౌనె మీపద్ధతుల్
సమరంబందున నాశనంబగుట కిష్టంబే ! మదోన్మత్తులై
ప్రముఖుల్ వోలెను వచ్చి రాత్మహనన వ్యాపారముల్ మంచివే ?
సమయింతున్ మిము నేనొకండనె వివక్షందెల్పితిన్ వింటిరే ! 52

శలభములు వహ్నిఁజొరఁబాఱు చందమునను
మత్స్యములు జాలములఁబడుమాడ్కి, నాదు
తీవ్రమార్గణజ్వాలలఁదెగువ నెద్రిచి
యమునిపాలికిఁబోవుదు రథములార ! 53

మీదౌష్ట్యమ్ముల, నాగడమ్ములను, సంప్రేషంబులన్, హింసలన్
క్షోదిష్ఠంబగుచేఁతలన్ ముసులవాక్కుల్ లోనసే వింటి ము
న్నే ! దాక్షిణ్యముఁ జూపు చింతపఱకున్ నేరాను మీపైకి మీ
రే దుర్వృత్తులు, రూక్షభాషణములన్ రేఁగన్ నివర్తింపనే ? 54

ఆపలుకులు విని వీరులు
కోపంబున మండిపడుచుఁ గుంతమ్ములతోఁ
గై పెక్కి యెదురు కొనుచుఁ బ్ర
లాపముల వచించి రిటులఁ దరణికులునితో 55

"మాదొరయైన ఖరాసురు
సోదరి నొప్పింప మాకు సూడు కలుగదే!
వాదంబులేల మాతో
రాఁదగునిఁక నీవు యుద్ధరంగమ్మునకున్ 56

ఎంతటి వీరులొ ? మీరొక
కాంతను శిక్షింప గొప్పకలుగునె ? మాతో
బంతమునకు దిగుచుఁ బరా
క్రాంతిని జూపింప మెచ్చుఁగాదె జగమ్ముల్ ! 57

మే మందఱ మిట నుంటిమి
తామసము వెలార్చుమిపుడు - తథ్యము మరణం
బామంత్రించెద మాజికి
రామా ! దయసేయుమయ్య ! రణమొనరింపన్ 58

నీవొక్కఁడవే యుంటివి
చావఁగఁదలపోసినావె ? సాహసివగుదే ?
నీవంత కార్యకారుఁడ
వే ! వయసునఁ జిన్నవాఁడవే ! చాలుదువే ? 59

అనుచున్ గాఱులు ప్రేలుచున్ దితిజు లభ్యామర్దముం జేయఁగా
గనులన్ నిప్పులురాల, శూలముల నాకంజాక్షుపై వైవగన్
బనిగొంచున్ రఘురాముఁ డూర్జితుఁడు సంహారచాపట్టుల్ త్రుటిన్
దునుమాడెన్ దన బాణఘాతములఁ జిత్తుంజేయుచున్వానినిన్ 60

పరిఘాపట్టసముద్గరప్రదరముల్ వారల్ ప్రయోగింప నా
పరముండన్నిటి దారిలో సఱకె నప్పాటన్ విడంబించుచున్
బురుషాదుల్ భయమంద నాశుగములన్ బుంఖానుపుంఖమ్ముగా
వరుసన్ గుప్పె రణోర్వియెల్ల రుధిరవ్యాప్తమ్ముగాఁ దోఁపగన్ 61

వాసవుఁడుతొల్లి భిదురమ్ము వైచి పర్వ
తముల ఛేదించినట్లుగా దాశరథియు
మార్గణమ్ములఁ గురిపింప మడిసిరంత
భిన్నమూలములైన యుద్భిజ్జములటు 62

వారి రక్తమ్ముతోఁ గింశుకారుణముగ
మారె ధారణి - వసములు వారి యఱపు
లను గడిందిగ దద్దరిల్లెను - శ్మశాన
వాటివలెఁ దోఁచె నాశ్రమ వాటి బయలు 63

క్రోధమూర్ఛితయై తేఱి కొంతవడికి
నొడలినిండ భయమ్మున నుడ్డుగుడిచి
శూర్పణఖ పరువెత్తె నశ్రువులు నేత్ర
యుగళి జాఱఁ జలించుచు నుత్కటముగ 64

రాముఁ డెక్కటి వీరుఁడు - రణమునందు
దనుజసైన్యమ్ముఁ బొలియించె ననుజు సాయ
మైనఁగొనకుండ నిదియెంత యద్భుతమ్ము ?
చుప్పనాక ధైర్యమ్మెల్ల సురిగె దాన 65

నాసికాకర్ణములఁ గాఱు నల్ల కొంచె
మెండిపోవగ జిగురుతోనిండియున్న
సల్లకీభూజ మట్టుల జాలిఁగొలుప
రోదనము సేయుచున్ ఖరుప్రోల వ్రాలె 66

చెప్పక, చేయక, యేడ్చుచు
రొప్పెడి నాశూర్పణఖ యరుంతదభంగిన్
చప్పున జూచుచుఁ గోపము
గుప్పుమనన్ ఖరుఁడు పలికె ఘూర్ణిలి పెలుచన్ 67

"నేనాసరులను జంపగఁ
బ్రాణంబులఁ దీయఁ జాలు బలశాలుల నీ
తోనపుడె పంపియుంటిని
గానే ? మఱి యెందు కేడ్వగావలె మరలన్ 68

సామాన్యులె వా రందఱు ?
నామాటకు విలువ నిచ్చి, నా కొఱ కెంతో
దీమసమున బగఱను యమ
ధామమ్మున కంప గలరు-దైన్యంబేలా! 69

వార లజేయులు, శూరులు
వారు విధేయులుగ నుండి వైరులఁ ద్రుటి సం
హార మొనర్ప సమర్థులు
కారే! యా రాముఁ డంత ఘనుఁడా ? కాదే ! 70

రోదించుచు మరలను నా
పాదమ్ముల చెంత నిటులఁ బడి పొరలెదవే
లా దర్వీకరమద్దుల ?
నేదో మున్గిన విధాన శ్రీ శూన్యముగా 71

దీనికి హేతువులేదే!
నే నెందఱినైన గాని నిలుపగ లేనే ?
ప్రాణముల లెక్క సేయను
గానే! బెంబేలు పడగఁ గార్యంబగునా !" 72

అని యూఱడింప ఖరుఁడును
గనులను బాష్పములఁ దుడిచి, గద్గద కంఠం
బున జుప్పనాక బదులిడెఁ
దనువు వడఁక నేలకీలతవలెన్ బెలుచన్ 73

"ఇంకేమున్నది ? సర్వనాశనమె యయ్యెన్ సైన్యమున్, నాయకుల్
పంకేజాక్షునితోడ యుద్ధ మొనరింపం బూని రాభూతి న
ల్వంకన్ మూఁగుచు, సత్త్రశస్త్రముల నవ్వారిం బ్రయోగించి, ని
శ్శంకుండై పరిమార్చె నందఱిని బిశ్యత్పాలుఁడై రాముఁడున్ 74

కార్ముకమ్ములు. గదల్, ఖడ్గమ్ములును, బర
శ్వథములుఁ జక్రముల్, శక్తులుఁ బరి
ఘలు, శూలములును, ముద్గరములుఁ బట్టస
ములు, భిండివాలముల్, ముసలములును
తోమరవ్రాతమ్ముఁ దోరణముల్. బాణ
ములు, వజ్రములును సమోఘ శక్తిఁ
తోఁ బ్రతివీరునితో తుములరణము
సలుప నిశాటులు సారసాక్షుఁ
డించుకయు సంచలింపక యెన్నొ తీక్ష్ణ
పుంఖ విశిఖముల్ నవ్వుచు, ముఖమునందు
సలపు సొలపును గనరాని సులువు మిగుల
విడిచి పరిమార్చె నందఱి విక్రమమున 75

అల్పమీనముల్ జాలమ్ములందుఁ జిక్కు
కొనిన రీతిని, శలభమ్ము లనల మందుఁ
బడిన విధమున బలశౌర్య పాటవములఁ
గలిగి కూలిరి రిపుబాణఘాతములను 76

రాముఁ డుద్యుక్తుఁడై రణరంగమునకు
దూఁకు వేళను సౌమిత్రితో వచించె
"సీత నొక చేరువ గుహ వసింపఁ జేసి
కాఁచుచుండుము యుద్ధ మొక్కఁడనె సేతు" 77

దండు వచ్చుటఁ గాంచి కోదండపాణి
సాహసమ్మున బలికె విశ్వాస మెంత
కలదొ తన శక్తిపైని, నుక్కరి, కృతాస్త్రుఁ
డగును - రణపండితుండగు సతఁడు నిజము ! 78

అతఁ డసహాయ శూరుఁడయి యందఱి కన్నివిధాలఁ దోఁచుచున్
మతి చెదరంగఁ దాఁ బఱపె మార్గణముల్ గడితేఱుచున్-మతే
ప్రతికృతి కానిపింపదు-దురాసద మాతని విక్రమంబు-దు
ర్గతి యనివార్యమయ్యెను ఖరా ! తలపోయుము వాని శౌర్యమున్ 79

వివిధాయుధమ్ముల విసరిన మన వీరు
లధరమ్ములన్ దరహాస మలర
చలియింప కా రామచంద్రుండు నస్త్రశ
స్త్రములను మార్గ మధ్యమున దునిమె
నాచాపమీను నారాచమ్ములను గూలి
పోయి రొక్కొక్కరుఁ బుడమిపైని
ఒక ప్రయోగమ్మున నొక బాణమా? కాదు
పదునాల్గు బాణముల్ బయలు పడును

తగిలినవి పదు నల్వుర తనువులకును
ప్రాణఘాతమ్ముగా వేఱె పలుకనేల ?
శక్తి సామర్థ్యముల నెంచఁజాల రెవరు ?
విస్మయంపడి నిల్చుటే విధిగఁదోఁచె 80

కంటి మంటను మున్ను ముక్కంటి మరుని
భస్మ సాత్కృతునింజేసె - పంచకమున
రామ విశిఖాగ్నిమడిసిరి రయత మనదు
వీరులెల్లరు మేటి హంవీరులయ్యు 81

అతఁడు కోదండరాముఁడే ! అద్భుతముగఁ
గసిమసంగెను నలవోకగా సమస్త
సైన్యమును దానొకండె! ఆశ్చర్యమయ్యె
స్వప్నమో! వాస్తవమొ! దైవ బలమొ కాని 82

వచ్చిన వారలల్ గనుచు సాహసినైనను భీతిఁజెంది నే
వచ్చితి నేడ్చుచున్ - వణఁకు వచ్చెను-నీశరణమ్ము వేఁడెదన్
కచ్చియలోన రాఘవుని గ్రక్కునఁ జంపగఁబొమ్ము నాయెడన్
గ్రచ్చుఱ ప్రేమయుండినను, గౌరవముండిన, జాలియుండినన్ 83

వారేదొ మచ్చు మందిడి
నారో! మఱియేమొ! చెవులు, నాసికఁగోయన్
వారక నిల్చితి మైకము
తో, రక్తము కాఱుచుండఁ దొందరపడితిన్ 84

నీవొక ధైర్యశాలివని నిర్వ్యథనంబున బ్రాణమూలముల్
తావులు తప్పుచుండ నకటా! యిటు లుంటిని నీ సమీప మం
దావురుమంచు జాలిఁగొనుమా! రఘురాముఁడు దండకాటవిన్
సేవక వృత్తిలో మెలఁగఁజేయును మిమ్ముల - హెచ్చరించెదన్ 85

ఒక రాముని గెలువంగ రాక్షసులు తా ముద్యుక్తులై పోయి, చా
లక దుర్యోగమునన్ గతింపగను మేలా? పట్టినట్లుండ ని
మ్మకు నీరెత్తిన ఖాతి ? నా కొఱకునై మాష్టిలకై యేమి చే
యక కూర్చుండిన మెచ్చ నెవ్విధిని నాయావేశమున్ మాన్పవా ! 86

ఇదియే రావణుఁడైనచోఁదనకుఁదానే పోయి వారిద్దఱిన్
దుదముట్టించెడివాఁడె - నీ పగిది మత్తుండౌచునున్నే ? దురా
సద మీనెంజిలి మాన్పఁజాలవె ? పరిష్కారమ్ముఁగావింపగా
సుదతింజేకొని రామలక్ష్మణుల మెచ్చుంగొల్పఁగూల్పంగదే ! 87

ఒకవేళ నరాధములను
గికురించుచుఁ జంపకున్నఁ గేడెద నేనే !
ముకు చెవులులేని సోదరి
మొకముంగని యూరకొనగ మోదంబగునే ? 88

మానవులను జంపలేని నీవేమి శూ
రుఁడవౌదు ? వొక రాముఁడడఁచె నొక్క
క్షణములో మనసేన సర్వమున్, నాశోక
వార్ధికి లేకుండెఁబారమేమి

తరియింతు నెటుఁబరిత్రాసోర్మిమాలియౌ
యీ సాగరము ముంచునేమొ నన్ను
దండకాటవు లింతదన్క నధీనముల్
మనకు - ప్రతిష్ఠ పోయినది నేఁడు
ఇంకనేముండె రాముని యెదుట నిలిచి
మార్కొనెద నన్న నాకు నమ్మకము లేదు
అతఁడు నీపైనిఁబడితీఱు నడవి విడిచి
ప్రాణరక్షణ కెటకేనిఁబాఱిపొమ్ము ! 89

నీదారి నీవు పోయిన
నాదారింజూచుకొనెద - నాశోకమ్మున్
బోదెట్టులన్న రావణుఁ
డే దిటవరి యౌచుఁదీర్చు హేలగఁద్రుటిలో" 90

అనుచు నెదఁగొట్టుకొనుచుండె నశ్రువారి
తో రుధిరధార మిశ్రితమై తోఁచెఁగించి
దరుణపై వర్షఋతువునఁగురియు వర్ష
ధారఁదాననుకరించుచు ధైర్యమెడల 91

ఇట్టుగా శూర్పణఖ మొఱవెట్టుకొనెను
మరల ఖరునితో దుఃఖసంభరితయగుచు
మగువ పల్కులతో నవమానమయ్యె
పగను కొలువున హెచ్చరింపగను ఖరుని 92

ఖరుఁడు కొంచెము కన్నులఁ దెఱచె నతని
కబ్బురంబయ్యె రక్కసు లంతరింప
నుక్కడీఁడు సామాన్యుఁడై యుండఁడామె
ధైర్యమును వీడె నంచును దలఁచి పలికె 93

"పంపిన దనుజుల నందఱిఁ
జంపుటతో రాముఁడనిన సాహసికునిగా
బెంపార మెచ్చికొనుచును
బెంపఱగా నిందసేయఁ బేరిమియగునే ? 94

సోదరి ! కోపగింపకుము - చూచెద నిప్పుడు నా ప్రతాపమున్
చేఁదును మ్రింగువాఁడనె ? యిసీ ! మఱి రాముఁడు నాకు లెక్కయే
ఖేదమునంది నాబలముఁ గ్రించుఁదనమ్మున దూఱు చిట్లు దు
ర్వాదముఁ దెచ్చిపెట్టకుము - పాయును నీ పరితాపభారమున్ 95

ఈ పరశ్వథముంగొని యినకులుల న
వక్ర విక్రమముంజూపి పగయడంగ
శిరములం ద్రెళ్లఁజేయుదుఁ జింత పడకు
నీ పరాభూతి నాదియే నిక్కముగను 96

వారి రక్తము వారి కపాలములనె
త్రావెదవు కడుపార నుత్సాహముగను
రమ్ము నావెంట నాసమరమ్ము నీకు
సంతసము నిచ్చు - నీ యభీష్టమ్ముఁ దీఱు 97

చింతింపకుమా ! వారల
సంతకు సదనమున కనుప ననుజా ! సేనన్
బంతమ్మున నడిపి పరా
క్రాంతిన్ నిర్జించి, చెనఁకి రమణిందెత్తున్ 98

ఒక సామాన్యుఁడు నల్పజీవియగు వాఁడో మానవుండౌను, నీ
వొక దైత్యేశ్వరు ముద్దుచెల్లెలివి కాదో ! నిన్నుఁదర్జించుచున్
వికలాంగింబొనరింపనేర్చునఁటె ! తా వీరుండఁటే ! యిద్ది చా
పక సైన్యమ్మును నొంచు నట్టె ? యిదె నే లావొప్ప శిక్షించెదన్" 99

సంతోషించెను చుప్పనాతి ఖరుఁడాస క్తింబ్రదర్శింపఁ గే
రింతల్ కొట్టుచు సూర్యవంశజుల నిర్జింపంగ నౌనంచు ని
శ్చింతన్ గాలముఁబుచ్చుమైథిలికి వచ్చెన్ జేటుకాలం బటం
చెంతో పొంగెను సర్వమున్ జరిగినట్లే తృప్తి భావించుచున్ 100

పకపక నవ్వెను దానవి
వికసించెను ఖరుని మోము - వేదన లెక్కిం
పక హర్షము తొలఁకించెడి
వికలాంగింగనుచు మదిని భీతి యుడుగఁగన్ 101

ఏకకంఠమ్మునం బక్కెనెల్ల సైన్య
మదరిపడఁబర్వతమ్ములు, నడవియంత
"విజయమో ! వీరమరణమో ! వెన్నుసూప
మెన్నడును మా ప్రతిజ్ఞయిదే !" యటంచు 102

కొట్టుమిట్టాడు ఖరున కప్పట్టునందు
గుండె గూటిలోఁజేరెను మెండుకొనుచుఁ
దన బృహత్సైన్యబలమున దాశరథులఁ
గసిమసఁగ సాధ్యమే యని కాఱుకొనెను 103

ఖరుఁడు దూషణుఁగాంచి కర్కశ స్వరముతో
మొండి ధైర్యమ్మున ముదలపెట్టె
'నాయత్తమొనరింపుమోయి దూషణ ! చతు
ర్దశసహస్రముతైన దనుజ సైన్య
ముల - ముందువరుసలో మోహరింపుము క్రూర
కర్మమ్ములం జేయఁగల్గు వారి,
జీమూతవర్ణుల, భీమ వేగుల, ఘోర
చిత్తుల, జనహింస సేయు వారి

పలువలను, నుక్కుతునకల వంటి వారి
వెఱపెఱుంగని వారిని, భీకరాకృ
తులను, మొఱకుల క్షణములో తుముల సమర
మునకు-ముందుగ బొమ్మ్మ-నే వెనుక వత్తు 104

అనుటయె తడవు వాహిను లెల్ల సిద్ధమై
తరలెను - శార్దూలదర్పులైన
సైనికుల్ జయజయ ధ్వానముల్ సేయుచు
సాగిరి-వారి యాస్యములు బిలము

అట్టులుండెను పాదఘట్టనచేఁ బృథ్వి
కంపింపఁ గెంధూళి కప్పె నభము
అట్టహాసమ్ముల నాటోపగరిమ భూ
ధరములు పెద్దగా దద్దరిల్లె

కవచములు, శిరస్త్రాణముల్ సవదరించి
వివిధశస్త్రాస్త్రధారులై వెడఁగుచేత
లెన్నొ సేయుచు నికట మహీరుహములు
వేళ్ళతోఁ బెల్లగించుచు వెడలి రపుడు 105

దైత్యనాశనము సిద్ధంబయ్యె రథ-మది
భానువర్ణము-పారువములు శబల
ములు-మేరు శిఖరమ్ముఁబోలు నాయరదమ్ము
తప్తకాంచన భూషితమ్ము-హేమ
చక్ర సంయుతము-వజ్రమయ కూబరము, శి
ల్పాభిరామమ్ముగా నర్కసోమ
బింబముల్, మత్స్యముల్, వృక్షముల్, లతలు వి
హంగముల్, కుసుమముల్, హరిణములును

తారకలుఁ జెక్కఁ బడెను సందముగ-ధ్వజము
గగనమంటుచుఁ గింకిణుల్ కదలుచుండ
మృత్యుదేవ్యట్టహాసమున్ మించె రవళి
ప్రోది నిలిచె సర్వాయుధభూతి మిగుల 106

వజ్రభూషణముల్ దాల్చె వజ్ర మకుట
మును ధరించెను మైమఱువును దొడిగెను
ఖరుఁడు తీవిగ రథమెక్కి కలయఁ జూచె
మ్రోగెఁ బ్రస్థాన భేరి ప్రథమం గనుగొని 107

ఇక్ష్వాకు వీరుల నిరుపుర సంగర
　　రంగమం దోడింప పొంగలించు
సర్వసైన్యమ్మును సరభసంబుగను ప్ర
　　స్థానమ్ము సేయుచుఁ గానఁ బడగ
నొకవంక నుత్సాహ మొక ప్రక్క సంభ్రమం
　　బుయ్యేల లూపగా నొడయఁ డాత్మ
సదమదమగుచు విషాదపరిస్థితి
　　యెదురౌనొ ? విజయమ్ము కుదురుకొనునొ ?

ఊహ కందని విషయమై యూఁచముట్టు
గొనగ సాధ్యమె రామచంద్రునకు నొక్క
రునకు-భగవంతుఁడా యేమి ? చెనఁకఁగలఁడె ?
యనుచుఁ జింతించుచును ఖర దనుజుఁ డుండె, 108

యమ భటులవోలె నెంతొ భయంకరముగఁ
గదలు పదునాల్గువేల రాక్షసులు నేత్ర
పర్వముగఁ దోఁప క్షణములో గర్వరేఖ
ప్రస్ఫుటించెను ఖర దైత్య వదనసీమ 109

పోటరియే ఖరుండు మును పోరులలో నసమానుఁడే - నిరా
ఘాటముగాఁ జరించు మొనగాఁడె యితఃపర మేమి చిత్రమో
చేటును దెచ్చె రాముఁ డొక చేఁతనుఁ బెక్కురు వీరులన్ బరి
స్ఫోటనముం బొనర్చెనని పొల్తి వచింపఁ జలించె ధీరుపై 110

సదసత్సంశయ దూరుఁడై ఖరుఁడు రాజ్యమ్మేలుచుండెన్ దురా
సదుఁడున్ శత్రుభయంకరుండగుచు దోష్ట్వ్యమ్మం బ్రదర్శించి, దు
ర్మదమే తోఁచును నిత్యకృత్యముల ధర్మగ్లానియే జీవితం
బుదుటుం జూపును వాఁడి మాటల కరం బుద్వృద్ధ హూచున్ దగన్ 111

పిట్టలు నీరు ముట్ట వడవిన్ ఖరదానవుపేరు విన్నచో
చెట్టుల చేమలన్ రవము సేయక నిల్చును-జోదు లందఱున్
నిట్టలమైన భక్తి హావభిల్ల నశాంతికిఁ దావులేద-యే
జెట్టియు సంచరించుఁ గ్రమశిక్షణతో దొరయన్నఁ బ్రీతితో 112

మొఱకు - కర్కోటకప్రతిముండు ఖరుఁడు
రాజసము మిక్కుటమ్ము - శౌర్యమ్ముఁగలఁడు
రాక్షసేశ్వరుఁడైన పౌలస్త్యునకు స
తండు నభిమాన పాత్రుఁడై తనరు ఘనుఁడు 113

దూషణుఁడు తమ్ముడును గూడ ధూర్వహుండె
అన్న నే పురుడించుఁదా నన్ని యెడల
సతనికి విధేయుఁడై యుండుఁబృతన కతఁడు
నాయకుండగు ఖరుని యాజ్ఞల మెలంగు 114

తన పరిస్థితి గమనించి దనుజపతియు
ధైర్యమును బుంజుకొనియెను - దాశరథుల
నిర్జితులఁజేయ నుత్సాహనిర్భరుఁడయి
సారథింబోవఁబనిచె నాసక్తి ప్రబల 115

అతని హుంకారములను దిగంతము లగ
లింపఁబడె వాహినులుఁగదలివలె నడచె
వారి యాయుధమ్ములను నంబరము నిరవ
కాశమయ్యె జనస్థాన కాననములు 116

అదలింపందురగమ్ములం జబుకుతోనంటించుచున్ సూతుఁడున్
గదలెన్ శీఘ్రముగా రథమ్మును బతాకం బాకసంబంటుచున్
బొదలంజేరె ఖరుండనీకమును నుబ్బుంజూపుచున్, సేన వా
రిదముల్ చప్పుడు చేయు భంగి బలమున్ రెట్టించి నాదింపగన్ 117

అనుసరించుచు నుండె శూర్పణఖ సైన్య
ములనుఁబంచవటికి మార్గమును దెలుపగఁ
గామగమనమ్ముతోడ నాకాశవీథిఁ
బగఁగొనుచుఁబట్టరాని కోపము నులిగొన 118

సైన్యమ్ములటులఁ బ్రస్థానమ్ముఁగావించు
తఱి నెన్నొ దుర్నిమిత్తములు తోఁచె
వారిదముల్ గర్దభారుణమున్, రక్త
వర్షముఁగురిసె నంబరము, సూర్య

బింబ మలాతచక్రంబును బోలెను
రుధిరపర్యంతమై - రూషితముగ
నల్లని పరివేష మల్లన నేర్పడె
ధ్వజముపై గృధ్రంబు వ్రాలె, బిట్టు
వక్రముగ మాంసభుక్కులౌ పక్షులును మృ
గంబు లఱచె జనస్థాన గహనములను
బెద్దగా సృగాలము లూళపెట్టె నశుభ
సూచకమ్ముగ - చీఁకటుల్ చుట్టుకొనియె 119

అంధకారము రోమహర్షణమై మన్ను
మిన్నేకమై మిసిమింతలయ్యె
గ్రద్దలు, నక్కలు, రాబందులును గ్రూర
రవముల నెంతో ఘోరముగ దారి
కెదురు వచ్చెను భీతిగదుర సైన్యములకు
ఖరునకున్నటులుండి పరిగొనుచును
పర్వకాలము కాక భానునిఁబట్టె స్వ
ర్భానువు - గాలి తీవ్రముగ వీఁచె

పగటె చుక్కలు మెఱసెను - పద్మినీస
ముదయములు శుష్కపంకజములుగ మాడె
పుష్పఫలపత్ర శూన్యమైపోయె తరులు
పిడుగులుంబడె - సుడిగాలి కదలు కొనెను 120

శారికలు ఘోరశబ్దముల్ సలిపె మిగుల
భూమి కంపించె ఖరు వామభుజ మదరెను
వామనేత్రంబు నదరె నవారితముగ
కారణములేక బాష్పముల్ కాఱెఁగనుల 121

ఫాలమున నొప్పి పుట్టెను - వార్ధక మ్మ
కాలమున వచ్చినట్లయ్యె ఖరుని కనులు
దిర్దిరందిరిగె నెదియొ దిగులు పుట్టె
తోఁచు విషయమ్ము లెవ్వియుఁదోఁచకుండె 122

ఎన్ని యుత్పాతములనైన, నెన్నిదుశ్శ
కునము లెదురైన ఖరుఁడు తేఁకువను వీడ
కసురవీరులఁ గాంచి తా ననియె నిట్టు
లాత్మవిశ్వాసమును దెల్పు నక్షీయుగళి 123

"లక్ష్యపెట్టుదునె యుల్కాపాతములనైన
ప్రళయమ్ము వచ్చిన భయములేదు
నాపరాక్రమము సంగతి మీరెఱుంగుదు
రపజయంబనుమాట లర్థరహిత
మగును ఖరునిపట్ల - నాకసమ్ములఁ బ్రయో
గమ్మున నక్షత్రగణము రాల్పఁ
గల శస్త్రసంధాతఁగానె ? మృత్యువునైన
విలుకుమార్చెదఁ దీవ్ర విశిఖములను

దాశరథులను జంపి రక్తమును సోద
రికి నొసంగెదఁ ద్రావగ, రిక్తభాష
ణముల నేమౌను - దుశ్శకునములఁ జూచి
బెదరి వెనుకకుఁ బోవంగఁ గుదరదిపుడు 124

నాయెదందాఁకి శక్రు దంతావళమ్ము
దంతములు మొక్కవోవ వితాకుపడుచుఁ
బరుగుతీయును దిక్కులఁబట్టి పాక
శాసనుఁడుఁ గూలు నాసాహసంబు పేర్మి 125

ఇంక నీక్షుద్రమానవు లేమి లెక్క?
ముందునకు సాగి రణభూమి యందు వైరి
వీరులను సంహరింపగఁ జేరి పౌరు
షమ్ము నెఱపగఁ బగతీఱ - సాగిపొండు! 126

ఖరు దర్పంబును గాంచి రాక్షసులుఁ బ్రాగల్భ్యంబు మీఱంగ, భూ
ధరముల్, కోన ప్రతిధ్వనింపగ జయధ్వానమ్ములన్ సల్ప, నిం
దఱఁదా నొక్కఁడు రామచంద్రుఁడెటు యుద్ధంబందు గెల్వంగనో
పు- రహిన్ జూడ మహర్షి సత్తములు వేల్పుల్ నిల్చి రభ్రమ్మునన్ 127

"గోవులకున్ బ్రాహ్మణులకు
సేవేళ శుభంబుఁగోరు నీడ్యులకు జయ
శ్రీవైభవమున్ మంగళ
మావటిలం జేయుగాత మావరదుండున్ 128

చక్రధారియై దనుజుల సంహరించె
శ్రీమహావిష్ణు వెప్పుడా క్షీరసాగ
ర మథనావసరమున శ్రీరాముఁడటులె
యసుర సంహార మొనరించు నద్భుతముగ" 129

అనుచుఁ జెప్పికొనుచు నాయువు మూఁడిన
    ఖరుని సైన్యములను, ఖరునిఁ గనుచు
నుత్సుకతను దుములయుద్ధమ్ముఁ బరికింప
    సిద్ధమైరి వ్యోమసీమ నిలిచి 130

అవతారపురుషుఁడై దా
నవసంహారమ్ము సలిపి నయమొనరింపన్
భువిమానవుఁడై పుట్టిన
ప్రవర్తకుఁడు రామచంద్ర ప్రభువగుఁగాదే! 131

దర్పమ్ముతోనేఁగు దానవపతి వెంట
    కలరు పెక్కురు వీరు తెలమి దాశ
రథులపై నెప్పుడు రణముసేయగఁ బడు
    వారమోయను కాంక్షఁ బ్రభునియాజ్ఞ
కై నిరీక్షించుచు కాకుత్స్థతిలకుండు
    గమనించె వారి రాకను - నపళ
కుసముల నాశ్రమముననె నిల్చుచు మేను
    రోమాంచితంబుగ - రుచిరహాస

మధురముల నిల్వ వాచించె "సనుజ ! ప్రకృతి
యెంత భీభత్సముగ నుండె - యిద్ది దనుజ
నాశనమ్మను సూచించు - నాశరములఁ
బొగలఁ గ్రక్కుచు నాజికై నిగుడుచూడు ! 132

కోదండమ్మను సట్టులే కురియు నగ్నుల్ పోరికిన్ సిద్ధమై
మోదించున్ గనుఁగొంటివే ? రణము రావుల్ తప్ప విప్పట్టునన్
లేదేమాత్రము సందియమ్ము - ఖరుఁడున్ రేఁగెన్ మహోత్సాహుఁడై
సాధింపన్ జనుదెంచు నల్లదిగో వైషమ్యమ్ము నిండారగన్ 133

ఇదె ! నాదక్షిణబాహువు
సదరెన్ - రణమైన విజయ మబ్బునుసకు నీ
వదనము చక్కగనున్నది
కద ! యుద్ధోద్ధతులకెట్లుఁ గలుగు జయమ్ముల్ 134

దానవులు చేరవచ్చిరి - వీనులొగ్గి
వినుము - భేరీనినాదముల్ వినఁబడునవె !
ఆపదలు రాకమున్నె మహాపురుషులు
మేలు కొనెదరు - మనమిది మీఱఁగాదు 135

అదిగో ! వచ్చుచునుండె దైత్యబలముల్ వ్యర్థమ్ముగా వ్యగ్రతన్
బదులుందీర్పగ నుత్సహించి మరలన్ వ్యాసక్తి దుష్టాత్ములై
ప్రథనంబందు జయించి తీతెదను. భూభారమ్ముఁదగ్గించెదన్
వదరుంబోతుల రూపుమాపెద శుభప్రాచుర్య మేపారగన్ 136

నేనొక్కండనె పోరువాఁడ - వదినెన్ సీతోఁడఁగొంపోయి, యే
దేనిన్ భద్రతఁగల్గు నొక్క గుహలో నేర్పాటుగా నుంచుమా !
కానీ జాగొనరింపరాదు - భవదీయాకాంక్ష గుర్తించితిన్
రానీ సైన్యము నంత నేనె పరిమార్పం జాలుదున్ తమ్ముఁడా ! 137

శూరుఁడవగుదువు నీవును
క్రూరుని, వాహినుఁల గూడఁ గూల్పఁగలవు కా
నీ రక్షోమారణ కా
ర్యారంభము నేనె చేయనగు సౌమిత్రీ ! 138

దండకాటవిలోనున్న దానవాళిఁ
గసిమసఁగి శాంతిఁజేకూర్పఁగలనటంచు
సమయముం జేసి మునులకీ సమయమందు
నీ సహాయమర్థింపగ నేరననుజ ! 139

వారు నాచేతిలో చావ వలెను గాని
పరులు చంపిన వాగ్దాన భంగమగును
సమయపాలనమొనరింతు సాహసమున
సకల రాక్షస బలమును సంహరించి 140

భయపడనేల నా కొఱ ? కపాయమురాదు రణోర్విలోనఁ వ్య
త్యయమును బొంద నెప్పుడుఁగదా ! వ్యపదేష్టల నుక్కడంతు ని
ర్భయముగ నిల్చి లోకహితచర్యలకున్ జతనింతు నిత్యమున్
నయమొనఁగూడు - వచ్చునె యనర్థము ? నాకు జయమ్ము సాధ్యమా ! 141

మీ వదినెను గాపాడఁగ
బోవలెను సమీపగుహకుఁ బోరిత మాడన్
నేవెడలెద - నా మాటకు
నీవేదియు నడ్డుచెప్ప నేనొప్ప సుమీ ! 142

ఇంక మాటాడగా నేమియు మిగులక
రఘురాము వీడ్కొని రమణిఁదోడు
కొనుచు దగ్గరనున్న కొండగుహం జేర్చి
యొక భద్రమగుచోట నునిచె నామె
సౌమిత్రియును ధనుష్పాణియై రక్కసుల్
ఘాతుక మృగము లక్కడికిఁజేరి
యెట్టి యుపద్రవ మింతి కొవంతైనఁ
జేయఁజాలని రీతి స్థేయుఁడగుచు
తద్గుహా ముఖస్థిత శిలాతలమునందు
నప్రమత్తుఁడై కూర్చుండె నన్న విక్ర
మమున కబ్బురపాటు, స్థేమమున కరుస
మును గలుగ నేకతమ తల మున్కలగుచు 143

రాముండున్ మనసార నవ్వుచుఁదనుత్రాణమ్ము నగ్నిద్యుతుల్
శోభింపన్ ధరియించె వైష్ణవధనుస్సున్ఁదూణముందాల్చె సం
గ్రామాటోపము దుర్నిరీక్ష్యముగ సారప్రజ్ఞుఁడై వాహినీ
స్తోమంబుంబరికించుచున్ నిలిచె నచ్చో నారిమ్రోగించుచున్ 144

జ్యానాదమ్ములు నిండిపోయెను దిశావ్యాప్తమ్ముగా దైత్య భే
రీ నాదమ్ముల మించి దేవతలు వర్షింపంగ దీవించుచున్
సూనంబుల్ - రఘువీరు నెమ్మొగము నస్తోకత్వమున్ దేజమున్
మానంబున్ వెలయించె నద్భుతముగా మానోజ్ఞమై ధుర్యతన్ 145

ప్రళయార్క-ప్రతిమాన తేజమున వెల్గన్ రామచంద్రుండు తా
నలికాక్షుండగు క్రుద్ధరుద్రువలె వైయగ్ర్యమ్ముఁగల్గింపగా
బొలిచెన్ దాన సమస్తభూతములు రాముంగాంచి జంకెన్ మహా
బలశాలిన్ విజిగీషు వ్యగ్రతను నిర్వర్ణించుచున్ భీతితో 146

అంతటఁ జేరె నాప్రాంతమ్మునకు దైత్య
సేనలు బొబ్బలు, సింహనాద
ములును, హెచ్చరికలు పలువిధంబులఁ గోలఁ
బెట్టుచు, నఱచుచు, నెట్టుకొనుచు
జయజయ ధ్వానముల్ సలుపుచు, కాహళల్
భేరులు మొరయంగ వీరు లడవి
మాఱుపల్కఁగ కాఱుమాటల నాడుచు
ప్రాణులు నటునిటుఁ బరుగుఁ దీయ
సాగరము పొంగి వచ్చెడి సరవిఁ దోఁపఁ
గలయఁ జూచెఁ గృతాస్త్రుడు ఖరకరకుల
దీపకుఁడు, రణపండితుఁ డాపరముఁడు
దాశరథి ఖరు వాహినిఁ దనుకు కనుల 147

యుద్ధాభిముఖమైన యూహిని వీక్షించి
దనుమాడ రాముఁడుద్యుక్తుఁ డగుచు

దక్షాధ్వరమ్ము విధ్వంసమ్ము సేయఁబూ
నిన శూలి రౌద్రమ్ము ననుకరింప

వనదేవతలుకూడఁ బరువిడి పోవ సూ
ర్యోదయసమయాన వ్యోమవీథిఁ

గ్రమ్మిన నీలమేఘసమూహముంబోలి
వివిధాయుధములతో, వివిధకేత

నములతో, ధనుస్సులును, బాణములతోడ
వివిధ భూషణ రాజితో వెలిగిపోయె
నటకువచ్చినదైత్య సైన్యములు ఖరుని
నాయకత్వములోన నర్ణవమురీతి 148

చిత్తమున రామునకుఁ బురాస్మృతులు మెదలె
నంత సందడిలో గూడ సమర ప్రార్థ
నమ్ము, తన రాజ్యభ్రష్టత, నాతి, తమ్ముఁ
డనుగమింప వనుల కేఁగు నవసరమ్ము 149

చిత్రకూట వాసమ్మును, జింతఁగూర్చు
జనకు నిధనవార్తయు, భరతుని వివక్ష
తన నిరాకృతి, తల్లుల దర్శనమ్ము
పాదుకాప్రదానమ్మును బాటెనెడఁద 150

దండకాటవులఁ బాదము మోపి తాపసా
శ్రమముల దర్శించు సమయమందు
సంయమీంద్రులు రామచంద్రుని కిట్లని
పలికిరి" రక్షణీయులము నీకు
నీరాజ్యమున మేము నివసించుటం బట్టి
నగరమందున్నఁ గాననములందు
నుండిన నొక్కటే - యొడయఁడ వగుటను
విష్ణుస్వరూపుఁడు పృథ్వీపాలుఁ

డుత్తమము ధర్మపాలన మూర్జితుఁడవు
కావునన్ దండధారివై కలుషమతుల
రక్కసుల నుక్కడగింప రామ ! కంక
ణము ధరింపుము - మని శరణమవు మాకు 151

పరమ పావన ! యశోవంతుఁడ వగుదువు
పూజనీయుండవు, భూవరుఁడవు
మాన్యుండ వగుదువు, మహనీయుఁడవు, గురుఁ
డవుఁ బురుషోత్తముఁ డవు కదయ్య !
రాజదండముఁ గల్గురామ ! నీకును - మాకు
యోగదండమె కల దోమహాత్మ !
ఉరక తపోధన మండిన నేమి? శి
ష్టప్రాయులము మేము - సూత్ర పడితి

వయ్య ! ధన్యుల మింకపై నసురబాధ
లడఁగు నను నమ్మకముఁ గల్గె" పనుచు వేఁడ
గామహర్షుల కొసఁగు వాగ్దాన మిపుడు
సఫలమగు సాధనము నేటి సమరకాంక్ష 152

కానన భూములఁ గాపురముందురు
కందమూలమ్ములె గ్రాసమునకు
పరప్రాణులకుఁగాని, ప్రభువులకుంగాని
కష్టనష్టమ్ములఁ గలుగనీరు
తమ తపోధనమున ధర్మపరులగు భూ
పతులకు నాఱవ భాగమిడుదు
రాసంయములును బ్రహ్మజ్ఞాన తత్పరు
లగుచు వానప్రస్థులై చరించు
చుండెదరు వారి ధర్మముఁజూచుకొనుచు
వారె పరిపాలకుల నమ్మి, వారిసేమ
మరసి కాపాడు విధి భూపునందుఁగలదు
దాని కొఱ కభయమిచ్చెనా దాశరథియు 153

క్రూరకర్మలవీడి వారు తపోభూము
లను నాశ్రయించిరి బ్రహ్మపదము
ప్రాపింప, దండమున్ బరమహింస్రకులపైఁ
గూడఁ బ్రయోగింపఁ గోరరెపుడు

అట్లైనచో తపమంతయు వ్యర్థమౌ
నిది విరుద్ధము కానఁబడటఁబుచ్చ
రెవరుఁదపోధనయేమియు శాపముల్
పెట్టి శిక్షింపరు పీడయున్న

పాలకులె **వారి** రక్షింపవలెను - వారి
కెట్టి స్వార్థము లేకుంట నిట్టులముగ
జగతికిన్ శ్రేయమొనఁగూడు - జయము కలుగు
రాజులకు - దీని నెఱుఁగు శ్రీరామ విభుఁడు 154

ఒకనిమేష మాత్రమ్మున నూహ నిన్ని
దృశ్యములు వెంటవెంటనె తెరలు, తెరలు
గాఁగనంబడె జరిగిన కథలు, వ్యథలు
మధురముగ, విషాదమ్ముగ మఱపు రాక 155

సాధుశత్రువులైన రాక్షసుల సొంప
రాయమునఁజపి మునులకు రక్షణంబుఁ
గలుగఁజేయగ నిపు డవకాశ మొదవె
ననుచుఁదలపోయుచుండ వాహినులు దరిసె 156

క్షణములో రామచంద్రుండు సజ్యకార్ము
కుండగుచు నారిమ్రోగించుకొనుచు నిలిచె
ప్రక్కను శరాసనములెన్నొ ప్రదర తూణ
ములను బెక్కులు దరినుంచి ముఖ్యుఁడంత 157

చేరె నిశాచర బలములు
భేరీనాదములతోడ ప్రేలుచు నొకఁడే
శ్రీరాముఁడు నిల్వంబడ
పోరునకున్ - వెలుఁగుపడుచు ముట్టడివేయన్ 158



తృతీయ వాహిని

రహిమీఱ నాశ్రమప్రాంగణమ్మును జేరె
ఖరుఁడు సైన్యమ్ముతో - కార్ముకమును
సజ్యమొనర్చి, భీషణరూపమున నిల్చి
యున్న రాఘవుఁగాంచి యుత్కటుఁడయి
యార్చె ఘనరథములు నదరిపోవగఁ గోప
మున నానవెట్టె రామునకుఁజేరు
వగ రథమ్మును బోవ, వడిగ సూతుఁడు వారు
వముల నదల్చెను - తుముల సంగ
రమ్ము ప్రారంభమయ్యెను - రామచంద్రు
హస్తములు శస్త్రరూపమ్ములయ్యె - బాణ
ముల నెపుడు తూణములనుండి వెలికిఁదీయు
నో యెపుడు వాని సంధించునో తెలియదు 1

చూపఱకు నద్భుతంబుగ శుక్ర శిష్య
లంపఱకుఁదట్టుకొనలేక యవనిఁగూలు
చుండిరే కాని యెదిరింప కుండిపోయి
రిద్ది వేల్పుల కవగతమేమి కాదు 2

భీతి నూహిని కకావికలమై పోయెను
రథముతో ఖరుఁడు శ్రీరాము దరిసె
విభుని మంత్రులు పరివేష్టించి యుండిరి
సచివమధ్యగతనిశాచరేంద్రుఁ

దపుడు తారల మధ్య యామినీపతిఁబురు
డించి బాణముల గుప్పించె వేయి
రఘువీరుపై లాతి రక్కసులుం గూడఁ
గెలనమ్ము నంబ్రయోగించి రంత
వివిధ శస్త్రాస్త్రములనప్లై కవిసి - పర్వ
తాథములు సామజమ్ములు, నమితవేగు
లైన వాజులు, వ్యోమమ్ము నంటు తేరు
లెచటఁజూచిన సైన్యమే విచలితముగ 3

దానవారులు, సిద్ధ, గంధర్వగణము
లును, మహర్షులు పెక్కురు దనుజు లటుల
చుట్టుముట్టుచు సనిసేయ బెట్టిదముగఁ
బరితపించిరి రాముని పాటుగుఱిచి 4

వారి యస్త్రమ్ములు వర్షధారలు శైల
మును దాఁకురీతి నా ఘనునిఁగప్పె
నెంతవీరుండైన నంత సైన్యము ధాటి
కాఁగుట కొక్కింత యలఁతకలిగె
నతఁడు దివాకరుఁ డాతని గాయముల్
సంధ్యాభ్రములు - రాము చాప మపుడు
మండలీకృతమయ్యె దండిగా శరములు
వేసవేలుగ బయల్వెడలె నవియుఁ

గాలదండోపమమ్ములు - కలను రక్త
పంకిలము - తెగిన ధనువులు, పడిన కేత
నములు, భిన్న వర్మమ్ములు నలినలియగు
బాహువులు, ఛిన్నశిరములు - భయముఁగొలిపె 5

కూలిన వారువంబులవి గుట్టలుగాఁ బడియుండె నేలపై
వ్రాలిన సామజంబులు ధరాధరముల్ వలెఁ దోఁచుచుండె ని
ర్మూలములై పదాతిబలముల్ కనిపించెను చాపకట్టుగా
చీలికలై రథమ్ములు విశీర్ణముగాఁ బొడకట్టె నచ్చటన్ 6

శరవర్షమ్మును గురిసిరి
పరిపంథులు రాముపైని వారిదములు భూ
ధరముపయి గురియు పగిదిని
ఖరకర వంశజుఁడు వాని ఖండించె నొగిన్
7

శిరములు మొండెముల్, చేతులు, పాదముల్
ఖండింపఁబడి పట్టిఁ గఱచు వారు
ప్రాణోత్క్రమణవేళ పరిఘోషములతోడ
రిత్తవోవగ బొబ్బరించు వారు
పతయాళువుల్ మృత్యువదనమ్ములోనుండి
యాక్రందనము సేయునట్టి వారు
కృత్తశిరోధులై క్షితికి కిమ్మనకుండ
శైత్యమ్ముఁ దోఁపగ జాఱువారు

వింతశబ్దమయమ్ముగా విపినసీమ
మాఱుమ్రోగెను – రాముని మార్గానంగ
సాధ్యమే కాకపోయె నిశాచరులకు
వేనవేలున్నగాని యావేళనేమి ! 8

నదులెన్ని వచ్చి పడినను
గుదురుగఁబాథోధి కల్పుకొను విధమున దు
ర్మదమున శత్రులు తనపై
వదలిన నస్త్రములఁదరశి వంశజుఁడదిమెన్ 9

దలు, వేలు బాణముల పైచుచు రాముఁడు దైత్యసేనలన్
దురునట్లుఁ జేసె ననివార్యములన్ మఱి దుస్సహంబులై
దడిచేయుచున్ మెఱపు చందమునన్ బ్రతిపక్షవీరులన్
దొనరించె మిత్తికిఁబ్రవీణతఁజూపుచు యుద్ధభూమిలో 10

బాణముల్ విడువగఁబ్రాణముల్ తీయుచు
నిప్పులగ్రక్కుచు నింగినిండె
విఱిచె విండ్లను వేఱువఱచె బాహువులను
భూషణప్రకరమ్ము పుడమి రాల
కరికరోపమములు ఖండితోరువులయ్యె
మానవతుల్, సారథుల్ గ్రుంది, రాక్ష
సులును, గాల్బంటులుఁగూలి నాశంబైరి
పీనుఁగుపెంటలే కానసయ్యె

రామబాణాగ్ని దావానలమ్ము భాతి
కాల్చివైచెను రక్కసవృక్షముల - భీతిఁ
గాందిశీకులుగా నలుగడలఁ బాఱి
రెండవతో యోధులత్తఱి డిందుపడుచు 11

తండతండములుగా ధరణిపైఁ బడుచుండె
తాటికాయలవోలెఁ దలలు తెగుచు
ఖరుని చుట్టును గల కఱటులు, సచివులు
నిసకులు విశిఖవహ్నిని మడిసిరి
హతశేషులగు కొంద ఱక్కజంబుగఁ జూచు
చుండిరి రాముకోదండప్రతిభ
నీ సన్నివేశము నీక్షించి దూషణుం
డేడ్తెఱఁ జేవీచి యెలుఁగుసూపె

నపుడుఁ గడుశూరులగువార లరిగి రాము
మార్గణంబుల కెఱయౌచు బ్రమంది, రంత
ఖరుని సారథియును దేరుఁగడపె నెటకొ
రాముఁ డాతని వేధింప ఁప మరసి 12

రక్కసులేడువ సాగిరి
పిక్కబలము సూపి పరుగుపెట్టిరి రాముం
డొక్కఁడె వారి సందటి
ప్రుక్కింపగ నాశుగముల శోణితఝురులన్ 13

ఆమంత్రింపగ దూషణుం డసురసైన్యస్తోమ మప్పట్టునన్
సామంతప్ముల నల్కుచున్ వెనుక కాస్థన్ వచ్చి గర్వమ్ముతో
రాముండాఁకిరి సాలతాలశిలలన్ రాథస్య మేపారగా
వేమారాతని గెల్చి కొంతమెయి గుప్పింపఁగ రూక్షత్వలై 14

దూషణుఁడు దాశరథిపై
రోషమ్మున దలపడంగ లోఁగక యతఁడున్
శోషింపఁజేసె వాహిని
నిషికలన్ నొవ్వి పెట్టె నిహితమతియై 15

ముసలములు, గండ్రగొడ్డళ్లు, ముద్గరములు
కత్తులు, కటార్లు, శూలముల్, కార్ముకములు
గదలు, చక్రములున్, బరిఘలును, బట్ట
సములతో దనుజు లెదిరింప సాగిరంత 16

తుములయుద్ధము జరిగెను – తోయజాక్ష
నకును, దితిజులకుంజూపటుకు శరీర
ములు గగురుపొడిచె నికటభూమి యపుడు
తెఱపిలేని ఘోషముతోఁ బ్రతిధ్వనించె 17

ద్రుమవర్షము గురిపించిరి
విపతులు రఘువీరుపైని విసరిరి శిలలన్
విమలిమ, తీరును, దెస్నను
సమగ్రతయుఁదోఁచుకుండె సమరముఁగాంచన్ 18

గులన్ జిత్తము వారి చేష్టితములన్ రాజీవపత్రాక్షుఁడున్
గురితిన్ సవరించె శీఘ్రమెయి గాంధర్వాస్త్రమున్ వారిపై
గలన్ గ్రక్కున వెల్వడెన్ విశిఖముల్ పుంఖానుపుంఖమ్ముగా
గఁబుట్టెన్ శతముల్, సహస్రములుగా హెచ్చించి తాడింపగన్ 19

డంబుగా నవ్వి తానుమండలముఁగప్పె
దశ దిశల నిండెరాముని విశిఖములను
పుచ్చుకొనుటయుఁదొడుగుట, గ్రుచ్చుకొనగ
నెటుఁ బ్రయోగించుటయుఁగూడ నెఱుఁగరెవరు 20

ఫలిత మింక వేల యెట్లుండు బాణహతిని
నేల వ్రాలుట, చచ్చుట నిజము, నిజము
రామబాణము గుఱితప్పునా ? మరణము
దాఁటగా నెవ్వరికిఁగూడ తరము కాదు 21

రాముఁడును నోట బాణముల్ గ్రక్కుచున్న
వానివలెఁగనుపట్టెను గాని వింటఁ
దొడుగుచున్నట్లు లేదు - ప్రొద్దును మణుగున
బడెను - రక్కసులు వెలుఁగుపడుచు నిల్వ 22

మృత్యుదేవతానిలయమై మేలమాడు
చున్న రీతిని దొడగట్టుచుండె సమర
భూమియు వికీర్ణమైనదప్పుడు భృశమ్ము
దనుజవీరుల దేహరక్తమునఁదడిసి 23

తనసైన్యమ్ము నశించుటం గినిసి చింతాస్వాంతుఁడై దూషణుం
డినవంశోద్భవుపైకి వాహినుల నెన్నేన్ బంపెఁదోడ్తోడనే
మొనగాండ్రాసురవీరు లెయ్యెడ భయమ్మున్ లేక వర్తించు వా
రనిలో శూరులు, ధైర్యవంతులు, వృథావ్యాహారసంపన్నులున్ 24

వారు శౌర్యమ్మునకు మాఱుపేరుఁగల్గు
వారు ధైర్యహేమాచలుల్, బలియు, రమిత
వేగులై యెట్టిరుల లక్ష్యపెట్టఁబోవ
రట్టి క్రూరుల దూషణుండనికిఁబంపె 25

ఆయుధముల వర్షించిరి
స్థేయునిపై ఖరుని వీరసేనాధిపతుల్
ఆయన నయ్యవి యేమియుఁ
జేయగలేదెంతబలమొ ? చెండాడెఁ గ్రుధన్ 26

నాగ్నింబలె రామచంద్రప్రభువున్ ధైర్యమ్ముతో నెంతయో
ఁజూపి పరాక్రమించి వదలెన్ శిక్షింపగా దుష్టులన్
కేల్ బాణము లొక్కపెట్టున గ్రుధావిష్టుండుగా వేయుచున్
వేల్పుల్ బెగడొంది భ్రాంతిమెయి నిల్వన్ జేష్టలన్ దక్కుచున్ 27

శత్రుదూషణుఁడైన దూషణుఁడు కూడ
రాము నెదిరించి యశనికల్పమ్ములైన
బాణముల నొవ్వఁజేయఁగోపమున విభుఁడు
వాఁడిశరముల ఖండించె వాని విల్లు 28

తునిమె నాలుగు శరములతోడ వాని
వారువములను, నొక్కట సారథిని వ
ధించె రఘురాముఁడెల్లరుఁ దెల్లవోవ
దూషణుని పక్షమున గూడ దూర్చె ములికి 29

గిరిశృంగాభమహోగ్రమైన పరిఘన్ గేలన్ గ్రహించెన్ వ్యథా
భరితుండౌచును దూషణుండు భయదంబౌ దాని వీక్షింప ని
బ్బరముంబోవును - వజ్రమట్టులను దుర్వారమ్ముగా నుండుటన్
గరుపాఱంగ శరీరముల్ మునులు వ్యాఖ్యానమ్ములన్ మున్గగన్ 30

ఊటాడించుచుఁ బరిఘను
బోటరి దూషణుఁడు దర్పమున డగ్గఱగా
వాటముగ రెండు ప్రదరము
వేటుఁ బఱచె రామచంద్రుఁడేపు మిగులుచున్ 31

జల జల రాలుచు భూషణ
ములు బాహుద్వయము తెగుచు భూమిం బడియెన్
బలసూదను ధ్వజమట్టులఁ
బలలాశియు నేలఁగూలెఁ బదపడితోడ్తో 32

సంతసించిరి విబుధులు, జనులు, మునులు
దూషణుని దుష్టనాయకు దునుమ రాముఁ
డతని మరణమ్ము ఖరునకు సంతులేని
దుఃఖభాజనమే యయ్యెఁ దోడు వోవ 33

స్థూలాక్షుఁడు ప్రమాథి స్థూలోచ్ఛ్రయమును, మ
హాకపాలుండు వృద్ధాగమములఁ
గాడుష్ణతిలకుని క్షతిసేయ విసరగ
ఖండించె వాని మార్గమున నతఁడు
బల్లెముల్, పరశువుల్, పట్టసములఁ బ్రయో
గింపగఁ ద్రుంచి, ప్రయోగించి నారి
విడుచుచు వారిపై పెక్కునారసముల
యమసదనంబున కనపెఁ ద్రుటిని

పది సహస్ర సంఖ్యాకులు దరిసినంత
వేలకొలఁది నారాచముల్ వెంట, వెంట
వచ్చిపడి దనుజ వీరుల ద్రచ్చ - సమర
భూమి యొక్కెడే రుధిరము పొంగవెత్త 34

రసపరిష్కృతవేదిగా గోచరించె
రక్తపంకిలమాయెఁ దత్ప్రాంత భూమి
వచ్చినవి వేనవేలు రాక్షసులు - కాని
రాముఁ డొక్కఁడె ప్రతివీరుఁడై మసఁగెను 35

ఖరుఁడీ సత్యము నమ్మఁజాలఁడు దుఃఖించెనే - నొక్కొక్కచో
అనుపమ గర్వము కన్న సత్యమె మహాశ్చర్యమ్ముగా నున్నదై
ఖరుఁ డింకేమి యొనర్చు దానవులు లక్షల్ యుద్ధరంగమ్ములో
పురికొల్పెన్ దననేన రాఘవునిపై పోరాడ సన్నద్ధుఁడై 36

దైత్యనాథుని గాంచి దండనాయకుఁడు త్రి
        శిరుఁడిట్లు వాచించె 'క్షితిప ! నన్ను
యుద్ధమ్మునకును నియోగింప రాముని
        తలఁదెచ్చి నీదు పాదముల కడను
బడవైతు చిటికెలో - బాణముల్ ముట్ట నే
        నతనిచే నోడ జీవితము నందు
రాముఁడో, త్రిశిరుఁడో రణమందు మరణించు
        వఱకును సాగు నీ ప్రథన, మీవు

చూడు మీవినోదమ్మును - సూడుతాఁడు
వచ్చిన, సుఖమ్ముగా జనస్థానమునకు
మరలి పొమ్మను మరణింపఁబరుఁడు పోయి
వైరితో డీకొనంగను వలను పడును 37

త్రిశిరునకున్ మృత్యువుపై
భృశముగ మోహమ్ముఁ గలుగునేమో - ఖరుఁడున్
త్రిశిరున కనుజ్ఞ నొసఁగెను
వశవర్తియు వెడలె రామునిపై దురమునకున్ 38

మూఁడు శిరములు కలిగిన ముష్కరుండు
మూఁడు శిఖరము లున్నట్టి భూధరమటు
లరదమున బోవునెడల జలార్ద్రమైన
దుందుభింబలెగర్జించె ద్యుమణికులుఁడు 39

అతని ధనుర్నినాదములు వ్యాప్తిని బొందెను దిగ్విదిక్కులన్
చితిజుఁడు రామునిన్ గవిసెఁ దేఁకువతో గజసింహముల్ మహో
ద్ధతి సమరంబు బొనర్చునటు దర్పముసూపుచుఁ బోరుసల్పగన్
బ్రతనయు దైత్యనాథుఁడు సభిగ్రహముం బరికించుచుండగన్ 40

జలదమ్ము నింగి ఘూర్ణిలి
జలధారల విడుచురీతి శరములఁ బఱపెన్
బలశాలి త్రిశిరుఁ డెన్నియొ
జలజాక్షుని పైని సమరచారిమ మెసఁగన్ 41

అతిథిగా స్వీకరించె నా యసుర ననఘుఁ
డతని రణపాండితిని గాంచి యబ్బురపడి
అధరసీమను మృదుదరహాస మమర
బవర మొసరింపసాగె నిబ్బరము మిగుల 42

పంకేజాక్షుఁడు యాతుధాను నలయింపన్ గుప్పె నారాచముల్
గొంకమ్ముల్ వెలయించుచున్ ద్రఢిమతోఁ బ్రోద్దామశౌర్యమ్మునన్
శంకల్ వైచుచువాఁడు తాను సతిధైర్యస్థైర్యముల్ సూపి ని
ష్కంపన్ సంకులయుద్ధమందంపె నుత్సాహమ్ము మిన్నంటగన్ 43

రాముని లలాటమున, త్రిశరములనాఁట
వేసెఁ ద్రిశిరుండు, నామూఁడు విశిఖములును
మూఁడు పువ్వులుగా మాఱి పొలిచె నొసట
సవితృవంశజుఁ డెంతొ యాశ్చర్యపడగ 44

"క్లీబుండఁ గాను దనుజా ।
నాబాణలమున్ గ్రహించినన్ సరియగుగా ।
నీబాణములకు బధులుగ -
పూబంతులువావు ప్రాణములఁ గొంపోవున్. 45

ని పదునాల్గు మార్గణము లారఘువీరుఁడు వైచి వాజులం
పనిమెను - సారథిన్ జిదిమెఁ గూల్చెను కేతనమున్ గ్రమమ్మగా
సుపడి వాని - యందొకడు వక్షము నందున నాఁట దానితో
నుగతి రాక్షసుండు జడుఁడై నిలువంబడె విస్తుపోవుచున్ 46

ఈయదనున రఘురాముం
డేయగ మఱి మూఁడు ములుకు లేర్చుచు నవియున్
గాయము నొనర్చి కంఠము
ధ్యేయము నెఱవేర్చి కూల్చెఁ ద్రిశిరమ్ము లొగిన్ 47

శిరములు మూఁడును మెల్లగ
ధరపైఁ బడె దానవుండు ధరణీధరమున్
బురుడించుచు రుధిరంబును
ఝురులై పాఱంగఁ సమసె సమరోర్వరలో 48

తిథిశిరమ్ము రామవిజయమ్మున కారతిఁ బట్టినట్లులై
తుకముఁ జూపు భూతములకున్ దలపించెను వంటపాత్రగా
పతిరఘు కంఠరక్తము విభాసిలె వహ్నివలెన్ బ్రతప్తమై
తులను జేసికొంచు వచనం బొనరించు విధమ్ముతోఁచెడిన్ 49

తలగుండు పడుచు సైన్యము
ఘననాశుఁడు విడుచు వాఁడి నాళీకములన్
గాంచుట తథ్యంబనుచును
పాఱెఁ జూచినతెల్లపగిది పోఁబరుగునన్

ప్రాణభయమ్ముతో పరువెత్తు దివిజారు
లను దైత్యనాశుండుఁ గనుల విస్ఫు
లింగములు రాలఁగ "పెంగలులారా! భీ
తిని వాఱిపోవ నీతియె? విరుద్ధ
మిది - భరసైన్యము కదనరంగమువీడి
వెనుకంజవేయునె? దనుజజాతి
కవమానమగుఁజుమి! భువనభీకరుఁడైన
పౌలస్త్యుఁడిదివిన్న బాధపడఁడె?

ఘనప్రతిష్ఠను భంగింప మానసీయ
మగునె? జగములు గేలిసేయగఁ జికాకు
కాదె! చిత్కా-మొగమ్ములుగా నరుగుట
తగునె? మరలుడు! రండు! సత్వరమె మీరు 5

శత్రుఘాతమ్ములకుఁ గూడ వణఁకరెపుడు
నభిలషితమును నెఱవేర్చ నాశలేదె?
చెఱచి చండాలముండేయ సిద్ధమగుట
లక్షణంబౌనె, వెనుకకు రండు! తిరిగి" 52

అని దానవపతి వాహిని
వెనుకకు రప్పింపఁ బలుక, విడినాడి భయం
బును ఖరుని యాజ్ఞమేరకు
వినయమున విధేయులగుచు వెడలిరి పెనఁగన్ 53

మృత్యువు తప్పదు రణమున
సత్యపరాక్రముఁడు రామచంద్రుని వలనన్
మృత్యుసముఁడు ఖరుచేతను
సత్యము మరణమ్ము తిరిగి చనకున్న క్రుధన్ 54

అతఁడు కోదండరాముఁడే! అద్భుతముగఁ
గసిమసంగెను నలవోకగా సమస్త
సైన్యమును దానొకండె - ఆశ్చర్యమిద్ది
స్వప్నమో ! వాస్తవమొ ! దైవబలమొ కాని 55

అర్థమయ్యెను ఖరునకు నంబుజాక్షుఁ
డెవ్వరో కొంచెముగఁగాని యెదురుకొనెను
హృదయమున భీతి యొకకొంత యుగురుకొనియు
పాల్కడలిపట్టిఁ బట్టు స్వర్భానుపగిది 56

భయము పొడసూప నేమాయె - ఖండనమ్మ
నెటుల నిలుపును - హతశేషపృతన రాము
పైకిఁ బురికొల్పి ఖరుఁడును వచ్చిపడెను
నముచి శక్రునిపై దండు నడపు రీతి 57

అంత సైన్య, మంతటి శూరులాజిఁగూలి
లొక్క రాముని చేతిలో నక్కజముగ
ముందు దుఃఖించెఁ ద్రిశిరుండు ప్రుందినందు
లకు - వెనుకఁ బౌరుషము హెచ్చి లజ్జపడెను 58

తేరు దూఁకించె రాముని దెసకు - చావు
తెగువ ఖరునిది - నింపె నాశుగములెన్నొ
పరుస మేఘుఁడు వృష్టిని గురిసినట్లు
బదులొసంగెను రాముఁడా ప్రదరములకు 59

ాశమ్మను సంవృతమ్మగుచు సప్తాశ్వుండు సంఛన్నుఁడై
కమ్మంతటఁ జీఁకటుల్ ముసరె నాలోకింపగా కష్టమై
కన్ దానవుఁడున్ బ్రయత్నమున నొప్పించెన్ వెసన్ బెక్కు నా
మ్ముల్ గురియించి భీకరముగా లేమావువేశన్ గ్రుధన్ 60

ఁడుఁబాశహస్తుఁడగు నంతకువోలె బరాక్రమించుచున్
ల నాశుగమ్ముల విచిత్రముగా విసరంగఁ జూచుచున్
కగణమ్ములున్ వణఁకిపోయెను భీతిని నస్త్రశస్త్రసం
ను, దుర్నిరీక్ష్యుఁగని తామరసాక్షుని దుస్థితింగనన్ 61

రాముఁడంతవఱకు రణముఁ గావించుచు
నలసియుండె ! ఖరుని కలఁతలేదు
దాన దీన జయము తథ్యమ్ము తనకని
ఖరుఁడు తలఁచె నెదఁద గట్టిపడగ 62

ఖరుని యాలోచన సరియైన దనుటకు
నవకాశమేలేదు - తివిరి రామ
భద్రుని మార్కొన వచ్చుట విహగంబు
పావకు నెదిరించు భంగిఁగాదె !
పంచాస్య మెపుడైనఁ బరిగణించునె క్షుద్ర
మృగముల నారీతి మిహిరకులుఁడు
నుక్కువుఁడగు దైత్యులెక్కపెట్టునె ? కాని
యధికశక్తితోడ నతఁడు తాఁకె

తన ధనుర్విద్యనంతయు ఘనుని ముందుఁ
జూపఁగగ్గెను- తొలుత విరూప సోద
రిందలంచుచుఁబగతోడ రేఁగి, యప్పు
డే రణోర్వికి వచ్చియహీనబలుఁడు

దుర్నిరీక్ష్యుండుగా తోఁచుచు ఖరనిశా
చరుఁడు రామునిపైకి నుఱికె భీష
ణంబగుధనువుతో నాళీక నారాచ
ముల గుప్పె పుంఖానుపుంఖములుగ
టంకమ్ముగా ధనుష్టంకారమును జేసె
మాటిమాటికి గిరుల్ మాఱుమ్రోగ
దిగ్భేద మావంతఁదెలియకుండెను ఖరుం
డును రామచంద్రుఁడు సునిశిత విశి

ఖముల నొందారుపై వైచు సమయమందు
సంబరము నిండిపోయె - ఖరాసురుండు
సామజము సంకుళమ్ముతోఁ జఱచునట్లు
భీకరాస్త్రము వేసి నొప్పించె ఘనుని 64

తేరిపై ధనుష్పాణియై కూరుచున్న
ఖరుఁడు కాలుని రీతిగాఁగానిపింప
ప్రకృతి సర్వము స్తంభించె వనమునందు
గాలి బిగబట్టె వారి సంగ్రామముఁగని 65

సంకులసమరము జరిగెను
పంకజనేత్రునకు దానవప్రముఖునకున్
జంకెను దేవగణమ్ములు
నంకాపొంకములతోడి యని నీక్షింపన్ 66

ఖరుడుఁజూపెను బాణలాఘవము కొంత
మొదట విల్లును మోపెట్టి వదలెఁబెక్కు
ప్రదరముల సారసాక్షుని పైకి రామ
చంద్రుఁడు వెలార్చెఁదన రణచారిమమ్ము 67

ఒక నారసంబున వికలంబుఁగావించె
ఖరుఁడు రాముని విల్లు - కవచ మేదు
నాళీకముల భేదనంబొనర్పఁగ నేల
పైఁబడినది - మేనిపై సహస్ర

విశిఖముల్ ఖరుఁడు గుప్పించెను దోర్త్రోన
        నింకనేమున్నది యినకులమణి
క్రోధఘూర్ణితనేత్ర కోణంబులన్ విస్ఫు
        లింగముల్ రాల్చుచు లిప్తలోన

వేఱొక శరాసనముఁగొనె వ్రేల్మిడి, నది
వైష్ణవధనుస్సు కుంభసంభవుఁడుమున్ను
తన కొసంగిన దానిని - దనుజపతి ప్ర
తాపవిస్ఫురణమ్మ్రుఁదా నాఁపుచేయ 68

మైమఱువు నేలరాల శ్రీరాము మేను
సర్వముం గడిమి పూచిన సరవి బాణ
ఘాతముల రక్తధారలు కాఱఁ జొచ్చె
ఖరుఁడు సింహనాదముఁజేసె గర్వితుఁడయి 69

ఔర్వ నేయప్రదానశరాసనమ్ముఁ
గమలలోచనుఁడుం బ్రయోగమ్మొనరిచి
ధరణిఁగూల్చెను ఖరరథధ్వజము - నద్ది
భూమిపైఁబడు రవిబింబముగఁబొలిచెను 70

నలినాక్షు నాల్గుబాణముల నొప్పించెను
        ఖరదానవుఁడు - వానిఁదిరుగఁగొట్టె
రఘుకుల తిలకుండు - రయమున దోమర
        మ్ములమోదె మాతంగమును బ్రహరణ

మును జేసినట్టుల నినవంశమణి కప్డు
గాయమ్ములయ్యెను గాయమంత
కోపంబు మిన్నంటఁగువలయాక్షుఁడు రెండు
విశిఖముల్ సంధించి విడిచి ఖరుని

బాహువుల నొవ్వనాఁటె వెంబడిని మూఁడు
శరములను వక్షమున గాడె. మఱియు నాల్గ
మార్గణమ్ములఁ దురగముల్ మడియ సార
థియును[మ్రం]దెను - వెనువెంటఁ దేరు విఱిగె 71

దైత్యుని శరాసనమ్ము విధ్వంసమయ్యె
మఱియుఁ బదుమూఁడు ప్రదరముల్ మాన్యుఁదేసి
ఖరుని బాధింప నాతండు విరథుఁడగుచు
క్షోణిపై దూఁకి గదనెత్తి కొనుచువచ్చె 72

అవచ్చు పురుషాదు నంబుజాక్షుఁడు చూచి
పలికె నిట్టుల 'నింతవఱకు సర్వ
లోకజుగుప్సితమౌ కంటకాధ్వమం
దేఁగుచు గడపితి వింతసైన్య
ముండియు సత్కర్మ లూఁకువఁజేయక
జగము లసహ్యించు పగిది దుష్ట
కార్యమ్ము లొనరించి, కాఁటియఁబెట్టితి
వా పాపఫల మీవె యనుభవింపఁ

గలవు - సర్వేశ్వరుండైనఁ గాని పనులఁ
జేసి కీడు నందకయున్నె? గాసిపడఁడె?
చెలఁగి లోకవిరుద్ధ కర్మల నొనర్చు
వాని నా కర్మయే చంపు వాస్తవముగ! 73

దుడుకు పనుల్ సేయు దుర్మార్గునిం గ్రూర
        సర్పమునుంబలె సంహరింతు
రే కాని విడుపరు - చేకొను లోభకా
        మమ్ముల వలనఁ బాపమ్ము నేతు
రెఱుఁగకయే ఫలంబించు కంతయు, వినా
        శము తప్పదాతఁడు చచ్చితీఱు
దండకాటవులలోఁ దాపసులెందఱి
        నో చంపినాఁడవు సుఖము నేసి

ఆయుషము నీశిరమ్ముపై నాడుచుండె
శీర్ణమూలద్రుమమ్ముగా జీవితమ్ము
సాగుచుండె - ఫలించె నీసమయమునకు
నీవొనర్చిన పాపముల్ ప్రోవుపడగ 74

పుణ్యపాపఫలమ్ములఁ బొందు జనుఁడు
వాని కాలమ్మునం గాని పాపమునకుఁ
గొన్నియెడల ఫలమ్ము చేకూరువెంట
వెంటనే మేరకుందగు విధము బలిమి 75

విసము కలిసిన బోనమ్ము మెసవినట్టి
ప్రాణి యసువులఁ గోల్పోవు భంగి, ఘోర
పాపము లొనర్చు వారల ప్రాణహరణ
మునకు వచ్చితి దండకమ్ములకు నేను 76

దుర్మతీ! నే నిమిత్తమాత్రుఁడనె తప్ప
నీవినాశనమునకును నిక్కముగను
క్రూరకర్మటె హేతువై గొంతుమీఁది
కిటుల ననుఁదెచ్చె తప్పదు కుటిల! చావు 77

ఎందఱి మౌనులన్ మునుపు హింసను బెట్టుచుఁ జంపినావొ, వా
రందఱి నీవు సైన్యము లయత్నముగాఁ గలియంగనౌను, నీ
చందము లన్నియున్ దెలియు సాహసివయ్యుఁ బిసాళిచేఁతలన్
గ్రిందును మీఁదుఁగానక, జరించితి వెంతయొ గర్వివై ఖరా! 78

రవివంశ ప్రభువైన పంక్తిరథు పుత్రజ్యేష్ఠుఁడన్ వేలు హే
తువునన్ ఘోరవనాళి నుంటి వినలేదో! మున్ను నాశౌర్యమున్
దివిజుల్ కోరెడివారు మాజనకుఁ బ్రత్యేకించి సాయమ్ము దా
నవులున్ స్వర్గముపైకి దాడివెడలన్ వారిన్ నివారింపగన్ 79

విధివిధానముఁ జూడు! విఱ్ఱవీఁగుచు దండ
కారణ్యమం దహంకారి వగుచు
నాడినదాటగాఁ బాడినదెల్లను
బాటగాసాగెను వాటముగను

వెనుక రావణుఁడుండె వీరుండ వీవంచు
        గణియింపవెవ్వరి గర్విపగుచు
బలిఁగొని నాబాణములు నిన్ను నిరయమ్ము
        నందుంచ హతులు మహర్షిగణము

లభిలషింతురు చూడంగ - నపుడు వారి
యాత్మలకు శాంతియగు - మనసారఁ గాంచ
నెంతసాహస మైనను బంతగించి
చేసినను నావశమ్ము నీశిరము ! నిజము ।। 80

ఘోరపాపముల మక్కువతోడఁ గావించి
        జగముల వేధించు సాహసికుల
జాల్ముల దండింప జనకుండు దశరథ
        పృథ్విపాలుని యాజ్ఞ విపినసీమ
కేతెంచితిని లోకభీతి నడంప నా
        బాణముల్ తోడు నీ ప్రాణములను
కుంభమున్ బాతిపైఁ గొట్టగ బ్రద్దలై
        పోవు రీతిగ సేన పోయె సర్వ

మును ఖరాధమః కాలమ్ము మూఁడె నీకు
పూన్కితో ముందునకు వచ్చి పోరిలోనఁ
జూపుమా నీబలమ్మును శూరతయును
తాటిపండూడునట్లు నీతలయు నూడు 81

ఖరుఁడున్ గ్రోధము తోడ వైరిని వషట్కారమ్ముఁ గావించుచున్
పరిధిస్థుల్ నశియింప, రూక్షముగఁ దాఁ బ్రత్యుత్తరంబిచ్చె 'నో
హరిదశ్వాన్వయుఁడైన పంక్తిరథపుత్రా! క్షుద్రసైన్యమ్ములన్
పరిమార్చన్ ఘనమౌనె? చాలును ప్రతాపంబుల్, పరీభావముల్ 82

దితిజులలోఁ జంపితి వీ
వతిసామాన్యులను దాని కై శూరుఁడవం
చతికృతసోత్ప్రాసంబున
మతిపోయినరీతిఁ బలుక మాన్యంబగునే? 83

బలుఁజాలుఁ బ్రగల్భముల్ వలుకగా క్ష్మాపాలురున్, సాహసుల్
లక్ష్యమ్ముగఁ దమ్ముఁ దామె పొగడన్ భావ్యంబె గర్వమ్ముతో
రాగీ విధిక్షత్రియాధములె కానీ డంబముల్ కొట్టగాఁ
బలుంగాని మఱెవ్వరీపగిది సంభూతిం బ్రదర్శింతురే! 84

ఈ తెఱఁగు మెచ్చకే యసహ్యించుకొనును
గా దెలోకము - శౌర్యముఁ గలిగినయెడ
యుద్ధరంగమ్ములోఁ జూపుమోయి! యితర
సంగతులఁ జెప్పఁ బనియేమి చెంగలించి 85

రంగు బంగరువలెనున్న తాయి తాను
మందువహ్నికణంబని మదిఁ దలఁచును
లాలసుఁడ వౌచు నీవ యల్పత్వ మడర
నన్ను వంటి శూరుని ముందె యెన్నెదేల? 86

నీయెదుట గదాధారిగ నిలిచియున్న
నన్నుఁ గదలింపలేని కొండగ నెఱుఁగవు
శమనుఁడే మూఁడు జగముల సంహరింపఁ
జాలునటు నిన్ను నేఁ జంప జాలుదు సుమి! 87

ఇదిగో! నాగద నీశిరమ్ము పయి నిల్లే వైచి మర్దించినన్
మదమాతంగమువోలె మట్టిఁ గఱపన్ మార్గంబిదే! ఆయువున్
మదముట్టన్ నిమిషంబు పట్టదిదె వాతూలమ్మునై వచ్చెదన్
వదరంబోవకుమాత్మవంచనల లేవల్ కావు సంగ్రామముల్ 88

పరువు, ప్రతిష్ఠ, వంశగతవైభవమున్ బ్రతివీరు ముందు నె
వ్వరు వచియింపఁ బొల్పఁడరు బంధురమైనను యుద్ధభూమిలో
సరకు గొనంగ సిద్ధమగు సాహసికుంగననేర మందుచే
పరిగణనమ్ము సేయను నృపాలకుమారక! నిన్ను నేనొగిన్ 89

నేనున్ నీవలెఁ బల్కఁ జాలుదును కానీ! తీఱ దిప్పట్టునన్
ఖానుండుం జరమాద్రి నెత్తములపై పాదమ్ము మోపెన్ నిమే
షానన్ బ్రొద్దును గ్రుంకు - నీవధ మవశ్యం బిప్డు - నీచావుతో
నానీతంబగుఁగాత ! శాంతి హతవీరాత్మల్ ప్రమోదింపగా" 90

గదను గిరగిరఁ ద్రిప్పుచు ఖరుఁడు రాము
పైకి విసరంగ నదివచ్చు పథమునందుఁ
గలుగు వృక్షాదులన్నియుఁ గదలిపడెను
దాని ఘూఘాతమునఁ దున్కలై నలఁగుచు 91

మృత్యుపాశమ్ముఁ బురుడించి మెఱసివచ్చు
గదను ఖండించె దాని మార్గమున రాముఁ
డదియు మంత్రౌషధ బలమ్మునంది చచ్చి
పడు మహానాగమటుఁ జిద్రుపలుగఁ బడెను 92

ఖండితంబైన గదఁ గని ఖరుఁడు సుంత
యైన బెగడొందఁ డొక బ్రహ్మాండభాండ
మదరి పోవగ గర్జించె ననఘుఁగాంచి
యేశ్వలేత సవ్యనరీతి యేపపడుచు 93

పవిత్రకులజుఁడు, ధర్మవత్సలుఁడు రాముఁ
డధరమందున దరహాస మలరఁబలికె
ఖరునితో "రాక్షసాధమ! సరియె దీని
తోడ నీబల సర్వస్వ ధూర్వహతయు 94

నీశక్తి యుడిపోయె నేఁటికింకనదేమొ
గర్జించెదవు - నీదు గర్వమువలె
గదకూడ ముక్కలైనది - నీవు క్షుద్రశీ
లుఁడవు - మిథ్యావృత్త, మఱఁచిపాటు
స్వాభావ్యమగు - చేయు పాపంబులే నిన్ను
చంపును - తథ్యమీ చావు నీకు
సర్వాంగముల ధూళి పర్వంగ, హస్తముల్
చాచి, బోర్లపడి, కష్టమ్ము మీఁద

లభ్యమగు ప్రియురాలుగా లలిని పృథ్వి
నివుడె కౌఁగిలించెదువీవు హీనబుద్ధి!
నీవు పెద్దనిద్రనుఁ జెంద నిఖిలభూత
ములును సంతోషవార్ధిని మునుఁగుటరిదె! 95

విపులమగు దండకములుఁ బవిత్రమగును
నేఁటినుండి జనస్థాన వాటినున్న
సర్వఋషికోటి బాధలు సమసిపోవు
నసురహృదయమ్ములను శోక మావరించు 96

ఇంతవఱకు నీపత్నులు చింత లేమి
యెఱుఁగకయె తేనెలను జుఱ్ఱెపుడు - నేఁటి
నుండి చేఁదును మేయుచు మొండిబ్రదుకు
నీడ్చికొనుచు జీవించుటయే ధ్రువమ్ము ! 97

ానితమైన ధర్మముల మంటను గల్పిరి - యజ్ఞయాగముల్
ొనులు చేయుచుండగను మాంసము, రక్తము గ్రుమ్మరించి, దు
మ్రనముతోఁ జరించిరి ప్రమాదము లెన్నియొ వచ్చెగా! జన
ినము మాటెనెంతొ భయదంబుగ మీవలనన్ దురాత్ముఁడా! 98

ము వారందఱు నాశనంబగుడు చింతాక్రాంతలై దానవ
ుదల్ నెత్తియు, నోరు బాదుకొని బాష్పంబుల్ వెసంజెక్కులన్
ులింపంగను దుర్దినమ్ము లవి రాఁగా - మౌనిబృందమ్ము లీ
ుయమ్మందున భీతిపోవఁ గడుహర్షంబంది జీవింపరే!" 99

అంతన్ దైత్యుఁడు రాము మాటలకుఁ గోపావిష్టుఁడై పల్కె" నీ
వెంతో గర్వముతోఁ జరించెదవు కాదే! భీతియొక్కింతయున్
స్వాంతంబందునఁ దోఁచ దెమ్మెయిని నిర్వాసమ్ముఁ గావించినన్
పంతమ్మూనుచుఁ జిన్నతల్లి నినుఁ గాపట్యమ్ముతో రాఘవా! 100

పరణముఖమ్ము నందుగల మానవుఁడింద్రియ పాటవమ్ములే
రయుఁడు మంచిచెడ్డల నయత్నముగాఁ బలుకంగ నేర్చుఁగా
ఒకటి మాటలాడగను గర్కశ మానసముల్ చలించునే?
తికిని కాదు నేను రణభీరువునా నరపాలనందనా! 101

ఎక్కటి వీరుఁడవే కద!
ఎక్కటివీరుండనేను నీసమరములో
నుక్కుమిగిలి సాధింపగ
మక్కువతోనుంటి సిద్ధమై నిల్వవలెన్ 102

అని ధిక్కరించి, కనుబొమ
లను ముడివడ, నొడుఁగఱచి, లోఁగిన హృదితోఁ
బనవుచు సమీపసాలముఁ
గొని రామునిపైకి విసరెఁ గ్రోధము మీఱన్" 103

"వచ్చెదవు మిసల వీర"నని
పెచ్చుపెరిగి రాక్షసుండు ప్రేలుచుఁ బెలుచన్
హెచ్చరికఁ జేసి ముందుకు
వచ్చెను - సాలమ్ము ధరణిఁబడఁ గొట్టఁబడెన్ 104

ఆశలన్నియు నడియాసలై పోయెను
ఖరునకు ఫలితమ్ముఁ గాంచినపుడు
కనులెఱ్ఱ వాఱఁగఁదనువు రోషమ్మున
నూఁగియాడగ – నెంతొయూర్జితుఁడయి
వేయి బాణమ్ముల విడిచి దైత్యునిమేను
తూట్లు, తూట్లుగఁ గొట్టె తోయజాక్షుఁ
డంతట రుధిరమ్ము ప్రాంతభూమిని ముంచె
కాలువల్ కట్టుచు కలనుఁ జూడ

ప్రస్రవణ పర్వతమునుండి పసుమతిపయి
జాఱు జలధారలటుఁ దోఁచెఁ బారమితుని
ప్రదరఘాతమ్ములన్ మూర్ఛపడుచుఁ గొంత
వడికి స్పృహవచ్చి రిపుఁదేఱిపాఱఁజూచె 105

మనసు చలించెను ఖరునకుఁ
దననెత్తురు వాసనకును దలనొవ్వగ ముం
దున కుఱికె నయోమయముగ
ఘనుని పయింగ్రుద్ధుఁడగుచుఁ గఱకఱిఁబడుచున్ 106

ఇదియు హతాత్సంభవమై
యుదిలకొనంజేయ రాముఁడుసికొను ఖరుపై
ప్రదరమువదలగ వీలుం
గుదరక యొకయడుగు వెన్కకునువైచెఁ ద్వరన్ 107

క్షణములో జానకీజాని వింటిని నొక్క-
బాణమ్ముఁ దొడిగెను - వహ్నిసన్ని
భంబై సదానిని, బలవైరి దత్తమై
బ్రహ్మదండముఛాతిఁ బరగుదాని
ఖరదైత్యుపైని విసరగ శ్వేతాటవి
శంభుఫాలాగ్ని భస్మమగు నంధ
కాసురువలె, వజ్రఘాతమ్మునం బడు
బల, వృత్తదానవుల్ పగిది, నముచి

రాక్షసుండోలి యఱచుచు వ్రాలె ఖరుఁడు
ధరణిపై ప్రాణరహితుఁడై - తన్మయమున
సర్వలోకము లానంద సాగరమున
మునిఁగె - భూతగణమ్ములు మోదమందె 108

ఖరుని మరణ వార్త గాలిలోఁ దేలుచుఁ
జేరె ధాత్రి నాల్గు చెఱఁగులకును
అమరగణము లెల్ల నాడగఁ బాడగ
మ్రోగె దేవదుందుభులు రయమున 109

దేవర్షులు, రాజర్షులు
చేవమిగుల ఖరునిఁ బృతనఁ జెండాడంగన్
వైవశ్యముతో ననఘుని
సేవింపగ వచ్చి యిటు వచించిరి భక్తిన్ 110

"పదునాల్గువేల బలమును
మదావిలుండైన ఖరుని మ్రందగఁ జేయన్
సదయాత్మ! జగచ్ఛ్రేయము
మదినెంచితి వసుర గణము మాయించి కృపన్ 111

శరభంగాశ్రమవాటి దేవవిభుఁగాంచన్ లేదె? యేదో మిషన్
బరమాత్మున్ నినుఁ దోడితెచ్చు కొఱకై బన్నంబులందెల్లి, యా
సురసంహార మొనర్ప వేఁడిరి మునుల్ చోక్షంబుగా నీవిటన్
ఖరునిన్, దూషణు, వాహినింగెడపి లోకక్షేమమున్ గూర్పవే! 112

మునుల సంకల్ప బలమునఁ దనిసె జగము
క్రూరకర్ములు మడిసిరి - ధీరుఁడవయి
ఒక్కఁడవె సంహరించితి వూహకంద
రాని విధమున నీవు నారాయణుఁడవె! 113

ఈవనము లన్ని రాక్షస సేవితములు
మునుపు - నీమూలమున శాంతి బొలుపు మీఱె
భీతి తొలఁగెను దండకవిపిననీమ
జనులు, మునులును మదినెంతొ సంతసింప'' 114

అనుచున్ రామునిఁ బ్రస్తుతించుచు మునుల్ హర్షించి దీవించుచున్
చనగా వీడ్కొని, పుష్పవృష్టి కురిసెన్ - సామర్థ్యమున్ జూచుచున్
ఘనుఁడా రాఘవుఁ డొక్కఁడే దనుజులన్ ఖండింపగా మెచ్చుచున్
దనివింజెందుచుఁ బాడిరా కథను తాదాత్మ్యమ్ముతో నిర్జరుల్ 115

వదినెను వెంటఁబెట్టుకొని వచ్చెను లక్ష్మణుఁ డన్న పాలికిన్
ముదితయుఁ దమ్ముఁడున్ ఘనుఁడు మోదము నందుచుఁ బర్ణశాలకున్
బదపడి చేర నంతఁ గులపాలిక జానకి నాథుమెచ్చుచున్
హృదయము పొంగఁగౌఁగిట గదించెను హర్షము మిక్కిలందమిన్ 116

రాముఁ డొక్కఁడె పెక్కురు రాక్షసులను
నాశమొనరించెనను తృప్తి నంద మొసఁగ
జానకీదేవి యెడఁద వసంత ముద్భ
వించి, ప్రేమార్ద్రదృక్కుల విభునిఁ జూచె 117

శత్రుహననమ్ము, మునికోటి సౌఖ్యకార
కత్వమును, క్షత్రియోచిత కార్యములగు
పరమధర్మమ్ములివి - వీరవరుని భర్తఁ
గాంచి యావీరపత్ని సొక్కదెప్రియపడి? 118

ఇట్టి యానంద సమయమందెట్టి పడఁతి
కుతుకమున నాథుఁ గౌఁగిట గొనక తలఁగు
వలను కలుగునె? యభిమాన ప్రకటనమ్ము
నకును, బరితోషమునకుఁ జిహ్నము కవుఁగిలి! 119

కాంతు కాయమ్మునం గల గాయములను
గాంచి మూర్తిని గొను బరాక్రమమెతోఁచ
పతికి నౌషధ ప్రాయమై పరిఢవిల్లఁ
జేయగను స్వయంగ్రాహమే సేపధియగు 120

ధర్మసంగ్రామ మందునఁ దన విభుండు
విజయలక్ష్మిని వరియింప వీరపత్ని
బాణఘాతములున్నను పరమహర్ష
జలనిధిని దలమున్కలై సాగు టరిదె? 121

రమణియాలింగ నానంతరమున ప్రభుని
కాయమున గాయమేదియుఁ గానరాక
పోయె నామెకుఁ బదపడి ముదితమాన
సమున గలిగిన యనుభూతి సవదరింప 122

రామచంద్రుని బలపరాక్రమము లన్ని
లక్ష్మణుఁ డెఱుంగు - నింతటి రణము మున్ను
కన్నులంజూచు భాగ్యము కలుగలేదు
తనువుఁ బులకింపఁజేసె నీదనుజవధము 123

రాముఁడొనర్చిన రాక్షససంహార
మాత్మలాభార్థమే యనగరాదు
ధర్మమ్ము నెఱపి, యధర్మమ్ముఁ బోనాడె
శరణు వేఁడిన మునివరుల కిడిన
సమయమ్ము మేరకు సమయించె ఖరదూష
ణత్రిశీర్షాది దానవుల - నద్ది
సామాన్య వాగ్దానమా ! మహత్తరమౌను
పురుషోత్తముండు రామునికె సాధ్య

మయ్యె విజయవంతముగఁ జేయగను - సీత
తొలుత శిరమూప కసురుల వలని ముప్పు
నభిలషింపక నాథున కడ్డు సెప్పె
కాని తనవిధి నిర్ణీతిఁ గలఁత వడెను

సీతఁగాంచి వచించె రాఘవుఁడు "రాశీభూత ధర్మంబవై
నాతాత్పర్య మెఱుంగకే పలుక నన్యాయ్యమ్ము కాదే! మునుల్
కాతర్యమ్మును బొందుచున్ దనుజదుష్కార్యమ్ములం దెల్ప, నే
చేతుల్ కట్టుక యేమి పట్టనటు లిస్సీ! నిల్వ ద్రోహంబుగున్ 1

రామునిమాట యొక్కటియు, రామునిచేత మఱొక్కటౌనె? నా
క్షేమము నెంచుచున్ మునుల చింతల దూరము సేయకుందునే?
స్థేమముఁ గల్గియున్ బరవశించుచు రాక్షసపీడ మాన్పకే
యేమని మిన్నకుండెద - క్షమింపదు క్షత్రియ ధర్మ మెన్నడున్ 1

ప్రాణముల వీడుటకు నేను బాధపడను
నిన్ను, సౌమిత్రి వీడెద - నిశ్చయమ్ము
విడువఁజాలను - ధర్మమ్ము సుడివడంగ
నూరకే యెట్లు చూచుచు నుండువాఁడ!" 11

మాఱుమాటాడలేదు క్షమాకుమారి
మహితులతో తాపసాశ్రమ మండలములఁ
దాను దర్శించు సమయాన ధర్మవిదుల
మాటలను వించు మనసును మార్చుకొనెను 12

రామనరపాలు ప్రతిన, శూర్పణఖ చెద్దు,
రాక్షసులమాయ, మునికోటి రాయిడులును
ధరణిపుత్రికిఁ గనులఁ బ్రత్యక్షమయ్యె
దానితో నర్థమయ్యె నెంతగనొ ధవుఁడు

తానొక్కటిఁ దలంచ దైవమొక్కటితలం
చును - ఖరదనుజుఁడుఁ జనెను రాము
ప్రాణములందీయ కాని నిజప్రాణ
ములనె కోల్పోయె రాముని కరముల
మిడిసిపాటున గ్రిందుమీఁదు నెఱుంగక
బాధించె, నొంచెఁ దపస్వివరుల
బెడఁద తోడను సుడ్డుగుడిచిరి ప్రతినిమే
షముఁగూడ భీతితో - కమలలోచ
నుండు బాపె భయమ్ము - దైత్యుండు సైన్య
నివహములతోడ మడిసెను - నింద్యజీవి
తమ్ముగడపెడి వారలు తథ్యముగ న
శించి ధర్మమ్ముఁ బునరుద్ధరించబడును

ఏలాగు పదునాల్గువేల రక్కసులను
చంపఁగల్గెను రామచంద్ర విభుఁడు
మనుజులెల్లరును సమానులుగారు - వా
రలశక్తి సామర్థ్యములనుబట్టి

వారలు నిర్వహింపగనుండు కార్య ప
రిమితి యుండుసు నవలీలఁ బనులు
బలవృద్ధులకు సాధ్యపడుఁగాని బలహీను
లకు సాధ్యమెట్లగు? లావుఁ గలిగి

వైష్ణవ ధనుస్సుతో దివ్యబాణములఁ బ్ర
యోగముంజేసి పరిమార్చె నొకఁడె తాఁగృ
తాస్త్రుఁడును. రణపండితుఁ డగుట వలన
శక్యమయ్యె రాఘవునకీ సంహరణము 131

రణము సేయగ రఘురాముఁడు సిద్ధమై
రమణిఁ గాపాడంగ లక్ష్మణునకు
నప్పగించెను జయమ్మది సాధ్యమని నమ్మి
ప్రబలవిశ్వాసము వారిశీల
మందుఁ బవిత్రత యందు నిల్పుచు - నట్లె
రక్షించె సౌమిత్రి లలన సీత
నిట్టి విశ్వాసమే యిరవు కొనెన్ రామ
చంద్రునిలోఁ బ్రవాసమ్ము సేయు
కాలమునఁ గంటికిన్ ఱెప్పకరణి రక్ష
ణము నొనర్చెను తల్లిగా నయము, భయము
భక్తిఁ జూపుచు ననిశంబు వనములందు
బాధపడు మైథిలింగాంచి భ్రాతసతము 132

తనతమ్ముఁడుగ్రకోపనుఁ డాతనింబంప
        దనుజులపైకి యుద్ధంబు సేయ
నాగ్రహావేశము లధికమై, భయదమై
        చట్రాతిపై కుండఁ జదుమఁబెంచి
క లగురీతిని భీతిఁ గలఁగి యథాయథ
        లై ప్రాణములతోడ నటులె బ్రదికి
యుందురు - పీడించు చుందురు మౌనుల
        తాను మహర్షుల తాపమడఁప

రాక్షసనిబర్హణముఁ జేసి రక్ష సేతు
ననుచు వాగ్దానముంజేసె మునుపె, సమయ
భంగ మొనరింపఁజాలక భారమంత
తన భుజస్కంధములపయిఁ దానె తాల్చె 133

కోపించిన యెవ్వానికి
చూపెదకు రణమ్మునందు సురలున్ భయమున్
చేపడుఁ గష్టములని తా
నీపని నెఱవేర్చె ననఘుఁడీపగిది వెసన్ 134

పదునాఱు గుణము లందున
చదురుఁడు పరిపూర్ణుఁడగుట సాహసమున నీ
పదునాఱవ గుణమే యిటు
పదునాలుగువేల రిపుల ప్రాణములఁగొనెన్ 135

తనవీర్య ప్రాభవమును
దన పౌరుషశక్తిఁజేసి తపనకులుండున్
ఘనముగఁ జూపగ జగములు
మునులును భయరహితులైరి ముప్పు తొలంగన్ 136

ఒక మనుజు డందుకొనియెడి సుకము వలన
నొక్కనికొ, కొంతమందికో యుండు సుఖము
మునులు సుఖియింపగా సర్వభూతములకు
సుఖము సమకూఱఁ గలదు ప్రచోదితముగ 137

విశ్వజగతి హితము విస్తరించును దాన
ప్రబలఁగలదు శాంతి బంధురముగ
తొలుత సీత రక్కసుల తోడివైరము
సమ్మతింపలేదు - సత్యమెఱిఁగె 138

తాము తలఁచిన భావముఁ దమవచనముఁ
దామొనర్చిన కార్యము తప్పటంచు
తెలిసినప్పుడు సహృదయుల్ తెలిచి కనుల
దిద్దికొనెదరు తమ తీరుతెన్నులరసి 139

అనురాగము, నడకువయును
చనవును, నాదర్శమును, విచక్షణ, క్షమయున్
వినయముఁ గారుణికత్వము
ఘనముగ భాసించుఁ బుడమికానుపు మదిలో 140

చిఱునవ్వుల్ తొలఁకించుచున్ బరముఁడున్ సీతాస్వయంగ్రాహమున్
నిరవద్యమ్ముగ నాత్మనెంతొ యభిమానించెన్ గుణోత్కర్షమున్
పరమానందము నందె లక్ష్మణుఁడు విశ్వక్షేమసంభావ్యుఁడై
పరగన్ రామ విభుండుఁ దృష్టిపడి నిర్వర్ణించుచున్ సర్వమున్ 141

అనుజుంగాంచి, క్షమాకుమారిఁగని 'ధన్యంబయ్యె నాజీవితం
బను లోకప్రియ మాచరించితిని వేల్పుల్ ప్రార్థనం జేయగా
ముని కార్యమ్మును నిర్వహించితిని దమ్ముల్ తేని దైత్యుల్ పగన్
మనకడ్డంకులఁ దెచ్చిపెట్టెదరుసుమ్మా! దుష్టభావమ్ముతో" 142

అన శ్రీరాముఁడు లక్ష్మణుండనియె 'మాన్యా! దైత్యసంహారకాం
క్షను నాహస్త్రములందు నుంచుమిఁక - కష్టం బేమి నీకుండ దీ
యనుజుండేమి యొనర్పఁ జాలఁడు దురూహాయత్తులై వచ్చు వా
రిని నిర్జింపగలేనె? నాబలముపై లేదేమి విశ్వాసమున్?" 143

అని భాషించు సుమిత్ర నందనునితో నాప్యాయితుండై వచిం
చెను శ్రీరాముఁడు' చుప్పనాక గొడవే చిత్రంబు - తా వృద్ధయై
నను గామంబుడివోవదాయమ ప్రయత్నంబుల్ ప్రలోభంబుఁజూ
చినగర్హ్యంబగుకాదె! దానవుల పొచ్చెమ్ముల్ విచార్యమ్ములా! 144

అప్రమత్తులమై యుండనగును మనకు
నెట్టియాపద లేరీతి నుట్టిపడునొ
తెలియదని జాగరూకులై తిరుగ నిశ్చ
యించి రాయన్నదమ్ములా పంచవటిని 145

వైరి నిర్యాతనమున శూర్పణఖ, ఖరునిఁ
బంపె దాశరథులఁ బొలియింపఁగావి
రామచంద్రుని చేతిలో మ్రందె నతఁడు
దూషణుఁడు, సైన్యమంతయుఁ దోడురాఁగ 146

ఇంకమిగిలిన దేముండె లంకకరిగి
రావణునితోడఁ జెప్పి సర్వమ్ముఁ జివ్వ
కొతనింగూడ కవ్వించి యవనిపుత్రి
దొంగిలగఁ జేయ నామె యుద్యుక్తయయ్యె 147

జరిగెను కొంతకాలము ప్రశాంతముగా జనకాత్మజాత సం
బరమున నుండఁ బంచవటి ప్రాణసమానముగాఁ గనంబడన్
ఖరుఁడు ససైన్యుఁడై మడియఁ గారణజన్ముఁ డటంచు నాథునిన్
గరిమ చెలంగఁ బ్రీతి మెయిఁగాంచుచు మౌనులుఁ బ్రస్తుతింపగన్ 148

తానొకఁడైనఁగాని పతి తాలిమి, బాహుబలమ్ము పేరిమిన్
దానవకోటులంజెనఁకి తాపసులన్ భయదూరులౌనటుల్
మానుగఁ జేయుచున్ బెడఁద మాపెను దండకసీమ యందు వా
గ్దానము మేరకున్ బరమకారుణికుండుగ విక్రమంబునన్ 149

పొందెను జానకీరమణి ప్రోన్నతు ధీరతఁగాంచి నిర్భరా
నందము - మెచ్చికొంచు నభినందనపూర్వకవాగ్విలాసముల్
విందులు సేయుచున్ ధవుని వీనులకున్ మఱి చుప్పనాకతో
చెందము భీతినందగఁ గడిందిగ, దానికి శాస్తిఁజేయగన్ 150

అంతకు ముందు నాథుఁడు వియాతుఁడటం చెలుఁగున్ - విరాధునిన్
బంతముఁబూని చంపుటది భావమునందున నిల్చెఁగాని, వి
భ్రాంతమనస్కయయ్యె ఖరరాక్షస సంహృతి, మూలముట్టుగా
నంతముసేయగా బలము నచ్చెరు వందెను సీత పెల్లుగన్ 151

ఎంతధైర్యము కలిగిన నెంతవిక్ర
మమ్మునెఱపిన సాధ్యమే మానవునకు
నంతమంది నొక్కరుఁడె తానంతమొందఁ
జేయుటన వింతపైవింత! చిదిమె ధవుఁడు 152

పంచవటి యందమైనది - భయదమైన
దగును - రాక్షసు లందఱుఁ దెగిరికాని
నిబిడవనములు, మృగములు నెలకొనునట
ప్రకృతిలో నేదొ మార్పు కన్పట్టుచుండె 153

ఒకొక్కెక్కయెడఁ జెవుల్ మిక్కుటంబుగను జి
ల్లులుపోవ ఝిల్లికల్ రొదలుసేయు
నొకొక్కెక్కయెడ నెవ్వ రూహింపరాని ని
ష్ఠురనీరవంబుతో వరలు చుండు
నొకొక్కెక్కయెడ భీకరోద్రిక్తగర్జార
వమ్ములు గుండెల భయముఁ గొలుపు
నొకొక్కెక్కయెడ మది సౌక్యఁజేయ శకుంత
కూజితమ్ములు హాయి కుదురు కొనును

తాపసుల తపశ్చర్యకు స్థానములుగ
కాంతి హావణిల్లు వేర్వేఱు ప్రాంతములను
హరిత శాద్వల భూముల హరిణచయము
నాశ్రమోపాంతసీమల నందగించు 154

ఆశ్రమప్రాంగణమ్మున నలరుతోటఁ
బెంచి ధరణిజ నీర్వెట్టు నంచితముగ
దినదినప్రవర్ధమానమై ననయఁ దృష్టి
మీఱఁదిలకించుఁ గనులవిస్మేర మొదవ 155

ప్రక్కను గల కొలనికిఁదా
నొక్కతె చని, జలముఁదెచ్చి యుత్సాహముతో
మొక్కలకు నీరు వోయగ
నక్కాకుత్స్థుండు వగచు నామెంగనుచున్ 156

ఆమె విదేహరాజసుత యయ్యుసు, రాఘవుఁ జెట్టపట్టినన్
బాములఁబొంద నీపగిది భామిని పూర్వపు వైభవమ్ముఁదా
నేమెయిదృష్టి యందిడక, హీనముగాఁ దలపోయకే శ్రమన్
భ్రామికతోఁ జరించుఁ దనరాజస మెల్లను ద్రోసిపుచ్చుచున్ 157

కాసెవోసిన చీర కట్టి పయ్యెద చెంగు
రొండిలో దోపుక మెండుకొనిన
సంతసమ్మున నొక సామాన్యవనిత య
ట్టులను మొక్కలకుఁ బాదుల నమర్చు

పూర్ణకుంభమ్ములఁ బురుడించు పాలిండ్ల
బరువుతో మధ్యమ్ము వంగుచుండ
చెమట చిత్తడి వల్లఁజికురముల్ ఫాలమ్ము
పై నంటు కొన వింత పరవశమ్ము
తోడ శైవల సహితమౌ తోయజమ్ము
వోలె లపనమ్ము భాసిల హేళికులఁడు
విధివిధానముఁ దలపోసి వెక్కసపడు
నెట్టి కష్టము వచ్చెనో యింతి కనుచు 158

అవటూద్దేశము పైని వేణి యొక సర్పాకారతన్ నాట్యమున్
నవరింపన్ - నఖకాంతి వ్రేళుల విలాసంబున్ ప్రపంచింపగన్
బువుఁదీవెల్ సరిచేయుచున్ మొగముపై మూగంగఁదేటుల్ వెసన్
దవులంద్రోలగఁ గేలితో నదలుచున్ ధాత్రీతనూజాతయున్ 159

పెంచిన పూలమొక్కల నపేక్షఁ గనుంగొను మించుబోఁడి, ప్రా
కించును దీఁగలన్ దరుల కెక్కగఁ జేయుచుఁ బాదులందు మ
శ్చించు జలమ్ముఁ గాలువల లిప్స మెయిన్ గలకంఠకంఠి యొ
ల్కించు సుధార్ఝురుల్ మధురగీతము లాలపన మ్మొనర్చుచున్ 160

చెంగున దూఁకుచున్ బరవశించుచుఁ జెంగటఁ బర్వులెత్తు సా
రంగచయమ్ముఁ గాంచి మధురమ్మగు పండ్లనుమెక్కి హాయిగా
రంగుల రామచిల్కలు ఛలంబునఁ బల్కుచునుండ నెంతయో
పొంగు ధరాకుమారి కడుమోదమునంది ప్రహృష్టచిత్తయై 16

గిరిసానువులనుండి క్రిందికి జాఱు ని
ర్ఝరములు గలగల డాల పైని
ప్రవహించుచుండ నవ్వడి కర్ణపేయమై
వినిపింపగాఁ దలమునక లగుచు
ఫలభారనతములౌ పాదపమ్ములఁదల
క్రిందుగా వ్రేలాడు కీశవితతి
కన్నులకును వింతఁగా కానిపింపగ
నుత్సుకతన్ జూచు నుండి, యుండి
పొదల దూరెడి శశముల పోఁడిమిఁ గని
భయముఁ గొలిపెడి భల్లూకపతులఁ గాంచి
కొండకొమ్ముల మేసెడి గోగణములఁ
దమినిఁ బరికించు పరినరి ధరణిజాత 162

పతి జయగాథలన్ సుదతి పాటలుగా మధురమ్ముగా కడున్
శ్రుతిహితమైనరీతి మలఁచున్ విజయమ్ముఁ దలంచు సారెకున్
గుతుకముతోడ స్వప్నములఁ గూడనివే పొలుచున్ విశిష్టతన్
జతి యొకవత్సరమ్ము గడపన్‌వలె సంచుఁ దపించు నాత్మలో 163

వఱువాతన్ వడిలేచి కాల్యముల నిర్వర్తించి, శ్రీరామునిన్
బరణాబ్జమ్ములనంటి మ్రొక్కి, క్షితి పూజంజేసి గోమాతలన్
మునులంబూజ యొనర్చు జానకి - పరాకుం జెందదే వేళఁదా
మఱఁదిన్ నందనునట్లు మన్ననను ప్రేమం జూపునాహ్లాదియై 164

తనచెల్లెండ్రను ముగ్గురిన్ దలఁచు నిత్యంబర్మిలిన్ - వారి చెం
తను నిల్వంగఁ బ్రతీక్షలన్ గడపు, సత్తల్ మూవురింగాంచగా
మనమందెంచుచు మాండవీధవుని ధర్మప్రాభవస్ఫూర్తికిన్
దనియున్, మెచ్చుఁగృతజ్ఞతన్ నెఱపు సీతాదేవి సంవిత్తిమై 105

గడచెను శాంతసుందరముగాఁ దరళించుచుఁ గొన్నినాళ్ల సం
దడి యిసుమంత లేక, ఖరదానవుఁడీల్గగ, వానితమ్ముఁడున్
మడియగ, సైన్యముల్ సమయ మార్కొను వీరులు లేకపోవుటన్
గడబడతగ్గె కాలము సుఖమ్ముగ సాగెను వారి కచ్చటన్ 166

చతుర్థవాహిని

హతశేషుఁ డకంపనుఁడను
దితిజుఁడు పరువెత్తె గుండె దిగులున, లంకా
పతి దశముఖునకుఁడా సం
గతులఁదెలుప జనస్థాన శాసన వధలన్

అంతరంగిక చారుఁడై యసురనాథు
నకు జనస్థానమున నిల్చు - నాతి శూర్ప
ణఖకుఁదెలియ దాతని వర్తనమ్ముఁగృత్య
ములు. రహస్యమ్ములును సుంత తొలుతనుండి 2

అనిలవేగమ్ముతో నరుగ, దైత్యేశ్వరుఁ
డచటఁబేరోలగమందు నుండె
వేగరి యగుటచే విభుని దర్శనమయ్యె
ననతి కాలమ్ములో నతని కపుడు
భక్తి ప్రపత్తులఁబరిఢవిల్లగ దశ
గ్రీవునకున్ మ్రొక్కి, కేలు మోడ్చి
రోదనామయముగా రూపమ్ము కనుపట్ట
విన్నవించెను సర్వ విషయము లిటు

'శత్రు మర్దన ! రావణ సార్వభౌమ !
సర్వ నాశనమే జనస్థాన సీమ
నెల్ల రాక్షసశవములే మల్లడిగొను
దండకాటవి మనకింక తావులేదు ! 3

ఖరదూషణాదులు మరణించి రాఘవు
మందు సైన్యమ్ములు క్రుంగె నకట !
సంహార కాండలో సమయక ప్రాణముల్
దక్కించుకొని నీదు చక్కటి కిటు
నే నరుదెంచితి నిఖిలలోకేశ్వర !
సర్వ వృత్తాంతముల్ సరగున విని
పింపగ" ననుచు నకంపనుండెలుఁగింప
మండిపడెను దాన దండి మగఁడు

పెళ్లుమని కొట్టినట్లయి త్రుళ్లిపడుచు
రావణుఁడు నిప్పులుమిసె నేత్రముల కొనల
తొలుత విభ్రాంతుఁడయ్యెఁజూపులను నెదుటి
వారలను గాల్చుచున్నట్లు భయముఁగొలిపె 4

ఎవఁడురా ! తెలుపుమా ! యేపారు మన జన
స్థాననాశమునకు సాహసించె ?
నంతటివాఁడయ్యెనా ! చెలగాటము
నాడునా మృత్యువు తోడ వాఁడు ?
నాకు కోపము వచ్చెనా మహావిష్ణువు
ధనదుండు, బలవైరి, దండధరుఁడు
బ్రదికియుందురె ? నేను యమునకు యముఁడను
వహ్నికి వహ్నిని, పవనునకును

బవనుఁడను - మి త్తికి మి త్తివంటి వాఁడ
వైరముంబూని యెవ్వఁడీ వరుస దనుజ
వీరులను సంహరించె - హంవీరుఁడగునె ?
వాని నామము నెఱిఁగింప వలదె నాకు ? 5

గడగడలాడె నకంపనుఁ
డడుగులఁబడివేఁడుకొనగనయ్యో - దశాస్యం
డడుగఁగఁదన ప్రాణములకె
యిడుమ పడుచు మాట రాకయే నిలిచెనటన్ 6

ల నవాక్కుగా నిలిచినట్టి యకంపనుఁగాంచి రావణుం
లనె యంచు వానికభయం బిడుచున్ గడముట్టఁజెప్పగా
గిటఁబండ్లు గీటి యడిగెన్ బ్రణిధిన్ - వెఱవీడి యాతఁడున్
వున విన్నవించె నృపతింగని సర్వవిశేషముల్ వెసన్ 7

దనుజాధిపతి ! యయోధ్యకు రాజు దశరథుం
డనువాఁడు - రాముఁడాతని సుతుండు
సాహసికుఁడు. వృషస్కంధుండు, వృత్తాయ
త మహాభుజుండుఁ బ్రతాప శాలి
సింహసంహనుఁడు, విశేషబాహు పరాక్ర
ముఁడు జనస్థాన భూముల ఖరాది
దానవనాశముం దానొక్కఁడే చేసె
ననహాయ శూరుఁడై యొసకమెసఁగ

సలిపె వీరవిహారమ్ము సమరభూమి
నెచటఁజూచిన రాముఁడే - యెన్నిసాయ
కములెటుల విడిచెనో కాని ఖరుఁడు, దూష
ణుఁడును బ్రతివీరులేకారు నుడువ నేల ? 8

శ్రీకరుఁడగు శ్రీరాముని
యాకారము, సౌష్ఠవమ్ము నభివర్ణింపన్
బ్రాకటముగ నావేగరి
సోకుల దొర రావణుండు చూచెఁ గుపితుఁడై 9

అదివిని దర్వీకరమటు
నదవదపడి రావణుఁడనె నతిదుస్సహుఁడై
"తుదముట్టించెద శక్రుం
డెదియేన్ సాయమ్ముఁ జేసెనే రామునికిన్" 10

చారుండంతట నుత్తరం బిడియె' "రాజా! రాఁడు పాకారి - సం
హారంబంతయు రాముఁడే సలిపె దివ్యాస్త్రమ్ము లెన్నుండెనో
నేరంబోల దెఱుంగ వీరులకు వర్ణింపంగ నాశక్యమా!
శ్రీరాముండు పురందరోపముఁడు, శౌర్యప్రాభవోపేతుఁడున్ 11

అగ్నికిన్ గాలితోడగునట్లు రాముఁ
నకుఁ గలఁడు తమ్ముఁడొకఁడు లక్ష్మణుఁడనంగ
రాము సంతటి బలపరాక్రమములున్న
వాఁడు - జాగరి - దుందుభిస్వనమువాఁడు 12

ధానుష్కులలో రాముఁడు
వీసు మిగులునట్టిమేటి వీరుఁడు - తమ్ముం
డో నేర్పరి యగును - జన
స్థానము రూపఱెను వారిశౌర్యాగ్ని నటుల్ 13

అతని ధనుర్బాణమ్ములె
యతనికి సందయగుఁ - బ్రక్క నను జుండుండెన్
బ్రతనయు లేదాతనికిన్
బ్రతివీరుఁడు లేడు దనుజపతి! చోద్యంబా! 14

దేవతలు, మహాత్ములు నరుదేర రటకు
రామచంద్రుడు విడుచు శరమ్ము లహులు,
సింహముల రీతి మాఱిగ్రసించె నసుర
వీరులను గయ్యి మొసరించు వేళ నృపతి!" 15

అనుచు సకంపసుం డటుల నారఘురాముని బాహువిక్రమం
బును స్తుతియించు చుండగ విభుండును రేచెనుగ్రుద్ధుఁడై - యకం
పనుఁడు వచించె 'రామునకు భార్య యొకర్తుకఁ గల్గు సుందరీ
మణి - త్రిజగమ్ములన్ గెలుచు మానిని యందములోన మిన్నయై 16

సీతానామముతోఁ దెలంగు వెలఁదిన్ జేకొన్నచో సౌఖ్యముల్
ప్రీతింబొందగ నౌను మిక్కిలిగ శోభించున్ జుమీ! చక్రవ
ర్తీ! తర్కింపక నామె నెట్టులయినన్ దెమ్ము! బహిః ప్రాణమా
సీతాదేవి నృపాలపుత్రునకు - గాసింబొందు దుఃఖమ్మునన్ 17

ఐనన్ రామునిపైకి యుద్ధమున కేలా తొందరల్ రాజ! యే
రేనిన్ రాఘవు గెల్వనోప రనిలో - హింసాక్రియల్ లేక దు
ర్మానిన్ నొంపగ వీలుకల్గు నిటులన్ సంగ్రామరంగమ్ములో
హానింబొందగనిచ్చగింపఁ దగునే? హైన్యమ్ము నీకేలనో? 18

వివరించెదను స్వామి! వినుము రాముని పరా
క్రమమెట్టిదో నీకు - గాఢకోపి
యగుచు దాశరథి యాశుగముతోడ నదీ ప్ర
వాహమ్ము నరికట్టు ప్రజ్ఞఁ గలఁడు
గ్రహములు, తారకల్ గలుగు నాకాశమ్ముఁ
బడఁ గొట్టనేర్చును బుడమిపైని
మున్నీటిలోపల మునిఁగి పోయెడిభూమిఁ
బై కెత్తుఁ దనబాహుబలము పేర్మి
నరితి చెలియలి కట్టనే చెఱపివైచి
పొంగు సంద్రమ్ముతో జగంబులను ముంచి
వైవగలశక్తిఁ గలవాఁడు - పవన వేగ
మాఁపగలఁడు - లోకమ్ముల మాపఁగలఁడు 19

జగములను నాశమొనరించి చతురిమమున
మరల సృష్టింపఁజాలు నామహితుఁడరిది
పాపులకు నాకసీమలో పాదమిడగ
సాధ్యమే? రాముగెల్వ నసాధ్య మటులె! 20

అతఁడు శత్రునిబర్హణుఁడతఁడు సున్న
తుండుఁగృతలక్షణుఁడు, ధర్మమండితుండు
నతని సామాన్య మానవునటులఁదలఁచి
నను ననర్థము వచ్చును దనుజ నాథ ! 21

నీవు యుద్ధమ్ములో గెల్వలేవు రాము
నతఁడు దుర్ధర్షుఁడగును, గృతాస్త్రుఁడగును
సర్వరాక్షస సైన్యముల్ సమరభూమి
కరిగినను గూడ జయము సాధ్యమ్ము కాదు 22

దేవతలు, రాక్షసులు కూడ తెగువఁబూని
వెడలినను జయము రాదేలఁబిడికిలింతు
వగ్నిఁబగతీయు నీవు సీతాపహరణ
కార్యమున కుద్యమింపుము కలఁతవీడి 23

పట్టుదలఁబూని నేనలఁ
గట్టాయితముంబొనర్చి, కదలి, కదన మం
దట్టిట్టులైనను తేవిడిఁ
గొట్టవె లోకములు - పరువుఁగోల్పడ మేలా ? 24

సీత యందము వర్ణనాతీతమగును
దేవజాతుల నామెకు దీటువచ్చు
తరుణి కనరాదు - సమవిభక్తమ్ములైన
యంగముల దేహమొప్పు సారంగనయన 25

వయసు ముమ్మరమందునఁబడఁతి యుండె
నంత చక్కని కాంత నీ చెంతనున్న
నెంతొ శోభించు - నా మాట సుంత వినుము
యోజన సలుప మేలు కాదో ! నృపాల 26

రాముఁడొక కాముకుఁడు - ప్రక్క రమణి లేక
క్షణము గడపడు - నిల్వఁగాఁజాలఁడసఘ !
అఁగి కోలేఁడు పత్నీవియోగ దుఃఖ
మతని ప్రాణములందీయు నద్భుతముగ 27

దూరంబాలోచింపుము
నారీ రత్నమును దెచ్చినన్ సుకరమగున్
నేరిమితో నామె బలా
త్కారముగాఁదోడితెమ్ము దనుజాధీశా ! 28

ఎన్నో విధముల రాముని
యౌన్నత్యము, శక్తి, గుణము లభినుతియును దా
నెన్నగ చారుఁడు రావణుఁ
డన్నియు విని కోప పడక యాశ్చర్యపడెన్ 29

దానవ చక్రవర్తికి నిదానముగాఁదలపోయగా జన
స్థానమునందు యుద్ధమున దాశరథిని గెల్చు కోరికన్
మానిన క్షేమ మౌననుచు మానిని జానకి లంకఁజేర్చఁగా
బూనికతో దశాస్యుఁడు ప్రమోదము నందెఁబ్రవృద్ధకాముఁడై

S. V. Cent
Library
and
Research Ce

ప్రణిధి వచస్సులన్ బెదరె రావణుఁడాతఁడు వాస్తవంబుఁదె
ల్పెను సమయోచితంబుగ నరిందము శక్తిని బాటవంబుఁదాఁ
గనులను జూచియే తనకు కల్పన సేయకయాచిచెప్పఁగా
దనుజకులాధినాథుఁడు విధానమెఱింగెను యోజనంద్రుటిన్

నచ్చెను గూఢచారి వచనంబులు రాక్షస భూమిజానికిన్
"చెచ్చెరపోయి బల్కె మెయి సీతను దెత్తు సతంపనా ! నినున్
మెచ్చెట ! నీ యుపాయము, సమీక్షణముంబొనరింప యోగ్యమౌ -
వొచ్చెము రాదు దీన నలపున్ గొలపున్ గనిపించదెమ్మెయిన్

నేనొకండనె పోయెద నెంత నిటకుఁ
దోడుకొని వచ్చెదను చూడు ! తోయజాక్షఁ
డింకఁగుందు, కనారిలు, నీసుపోవుఁ
గతకుఁగూలును ప్రియవియోగమ్ము వలన" 3

అనుచు సాగనంపె నాయకంపను దాన
వేశ్వరుండు - నాఁటివేఁగునందు
మాతులాఁడు మంత్రి మారీచు నాశ్రమం
బునకు మంత్రణమ్ము బొసఁగ వెతలె 3

అరయమునకు రత్నమ్ములు
ఖురములు - రజతవర్ణమర్కకాంతి, నయనమం
బరచుపమున మారీచుఁడు
పరికించెను మారమంచె ప్రభువుల రాకన్ 35

ఆశ్రమముఁ జేరఁ జని రథమాఁగె - దాని
తేజమున దిక్కులన్నియు దీప్తమయ్యె
జలదపంక్తి నిరోధింపఁ జంద్ర బింబ
మటుఁ బ్రకాశించె వ్యోమమ్మునందు తేరు 36

ఠీవిగా రావణుండును డిగ్గె రథము
స్వాగతించెను మారీచ సచివుఁడతని
కతిథి సత్కారములఁజేసి, యంజలించి
గౌరవమ్మను నెఱపి ప్రక్కను నిలిచెను 37

దానవియగు తాటకకున్
సూనుఁడు మారీచుఁ డమిత శూరుఁడు, లంకా
భూనాథుఁడు రావణుఁ డధి
మానించున్ - సలుపు నెపుడు మంత్రాంగమ్మున్ 38

గాధిజుయాగ రక్షణసేయ సరిగిరి
రామలక్ష్మణులు - పై దమ్ముఁబూని
తాటకయను నొకదనుజ, నందనులు మా
రీచసుబాహులు రేఁగిరక్త
మాంసముల్ కురియ వ్యోమమునుండి యజ్ఞవే
దికపైనిఁ దల్లి తాటక, సుబాహు
లను వధించెను రాముఁడనుకంపతోడ వా
రిధిఁ బడఁ గొట్టెమారీచు నప్పు

డాతఁడాంతరంగికుఁడు లంకాధిపతికి
సర్వవిధములఁ బౌలస్త్యు సాకు సముచి
తమగు నాలోచనలతోడ దానవేశ్వ
రుఁడును మారీచుఁ డనిన గురువుగ దలఁచు 39

"జయము లంకాధీశ! జయము దశగ్రీవ!
    జయము దానవలోక చక్రవర్తి!
కుశలంబె రాక్షస కువలయంబున కెల్ల
    త్వరపడి యింతలో వచ్చితేల?
అవిషయమ్ము నాకనుమానముగ నుండె
    హేతువేమియొ తెల్పుమీ నృపాల!
భయమేల? వదనము వాడి పోయెను చెప్పు
    మా"! యన మారీచు డాయ నరిగి

రావణుండును హీనస్వరంబుతోడఁ
బలికె నిటు "దెబ్బతినెను నావైభవమ్ము
రాముఁడను మానవునిచేత - ప్రాణములను
గోలుపోయె జనస్థానమేలు ఖరుఁడు 40

దూషణుఁడుఁగూలె వాహిని ద్రుంగె నంట
రాముఁ డొక్కని వలననే ద్రుంచె నఖిల
రాక్షసగణమ్ము - పగఁదీఱ రాముపత్ని
నపహరించెద నీసహాయమ్ము పేర్మి! 41

దండకాటవి మనకు పెత్తనము సాగ
దింక మీఁదట రాముఁడా వంకనుండఁ
గసిపెరిగిపోయె నిందఱిఁ గసిమసంగ
విద్విషుల నూరకే యెటు విడువగలను? 42

చెదరెన్ గుండెలు తాటకాత్మజునకున్ జేకొన్న కార్యక్రమం
బెదియోతెల్పగ రాక్షసాధిపతి "స్వామీ! తెచ్చెదే సీత ? నా
పదఁజేఁజేతుల నెత్తికెత్తెదవె? విశ్వాసమ్ము నామాటపై
కుదరం బోవల దట్టియత్నమునకున్ - గొడ్డమ్ము నీకేలనో? 43

మిత్రరూపములో నున్న శత్రులెవరొ
సీత విషయము నీతోడఁ జెప్పి రేమొ,
నీవలన శిక్షితుండయి నీవయిప్రతి
ఘాతి యెవ్వఁడొ చెప్పిన కరణిఁ దోఁచు 44

సీతన్ దొంగిలి తెచ్చినట్లయిన నిన్నీ ! లంకకుంజేటగున్
గాతర్యమ్మును బొందు దైత్యకులమున్ గామమ్మునైర్లజ్జమై
ఖ్యాతింగోల్పడఁజేయు - గౌరవము ముఖ్యంబౌను గాదే ! మఱి
చేతోంకుంజరితార్థుఁజేయు తలపుల్ చేడ్పాటుఁదెచ్చున్ జుమీ ! 45

ఎవనిగా నెంచితివి రఘువీరుని
నతఁడు మహానాగమగును - నిజము
అలవికాదా ఫణి తలలోని మణిఁదీయఁ
బ్రోత్సహించిన వాఁడు బ్రోన్నతుండె ?

నిన్ను నాశమొనర్పఁబన్నిన పదకమ్ము
కాని తదన్యము కాదు - కాదు
అట్టి దుర్బుద్ధితో నంతమొందెదవీవు
మెలఁకువతో నుండ మేలు కలుగు
సుఖముగా నుంటివిందన్క సూడుఁగొనిన
మంచి పనికాదు - రాముఁడు మానవుఁడని
తలఁచుచుంటి వామాన్యుఁడు తక్క జనుల
వంటి వాఁడేమియుంగాఁడు - పరముఁడగును

హరి విక్రముఁడు మహాగంధ నాగము
దాని తేజమ్మె మదంబు - బాహు
వులె విషాణమ్ములు - వెలయు వంశమె యగ్ర
హస్తము - రణభూమి నట్టె నిలుచు
స్థితియె వాలము - నరసింహసదృశుఁడగు
రాజస గుణముతో రాజిలు సుమి !
విశిఖముల్ నఖములు, విమతరక్షోమృగ
మ్ముల వధించును - ఖడ్గములగు కోఱ
లేల నిద్రించు సింహమ్ము మేలుకొలుపఁ
బూనెద వపాయకరము సుమ్మో నృపాల !
అతని కోదండ పాండిత్య మద్భుతమ్ము
స్వానుభవమున దెల్పుచున్నాను స్వామి !

రామచంద్రుండు పారావార సదృశుండు
శరములు, ధనువు మకరములు, ఝష
ములగును - సంధాన మోక్షణ రూపమౌ
భుజవేగమే దాని బురద - సాయ
కములె ధరింపగా కష్టమౌ కెరటము
లాహవోత్సాహమే యందుఁగలుగు
సుడిగుండ మగుఁగాన చూచి సంభ్రమ్ములో
దిగుటశ్రేయస్కరంబగునె చెపుమ !
తగదు సీతాపహరణమ్ము దాశరథికిఁ
గోపమేల రప్పించెద వాఁపుమట్టి
తలఁపులను దానవేశ్వర ! యలవు, సొలపు
లేని విధమున లంక నెల్లెని నిలుము 48

రాఁడు నీజోలి కాతఁడు - లంక వనధి
మధ్యమున నుండుటంబట్టి - మహితునకును
చెట్ట నేయక పోయిన నెట్టి బెడఁద
నీకుఁ బ్రాప్తము కాదు - పునీత సీత ! 49

దాశరథి విక్రమమ్ము పాతాళముఖ ము
పడితివా దానిలో నీకు బ్రదుకు దక్క-
దందుచే వెనుక కేఁగుచు నందమైన
భార్యలంగూడి సుఖములఁబడయ మేలు ! 50

ఏకళనుండెనో రావణుఁ
డూఁ కొనె మారీచు బోధ నొక విధముగఁ దా
మేకొని లంకానగరికిఁ
బ్రాకామ్యముతోడ దారిఁ బట్టెఁ బ్రవణుఁడై

ఆ దశాస్యుఁడు వెడలగ నంత వణకుఁ
బ్రాణముల నఱచేతిలో పట్టుకొనుచు
సదమదంబగు మారీచ సచివు డపుడు
విడిచె నొక వేఁడి నిట్టూర్పు బెడఁద యడఁగ

*　　*　　*

ఖరదూషణుల, నిశాచర సైన్య మంతటి
　　సంహరించెను రామచంద్ర విభుఁడు
దుష్కరం బెట్టి యోధునికైన నీ కార్య
　　మది శూర్పణఖ కాంచి యదరిపడెను
ప్రాణముల్ పోయెడు భంగి రోదించుచుఁ
　　బరువెత్తె నగ్రజు పాలి కామె
అరుణసంకాశ సింహాసనంబున సచి
　　వావృతుఁడైన దశాస్యుఁ జూడ
ధర్మవేది గతుఁడు పాపకురీతిని
జ్వలితమూర్తియగుచు వ్యాత్తవదనుఁ
డైన యంతకువలె నగుపడుచుండె, రా
వణుఁడు నిండు సభను బాహుబలుఁడు 5

దేవాసుర యుద్ధమ్ముల
దేవేంద్రుఁడు కులిశధార తీవ్రవ్రణముల్
కావించె మును దశాస్యుని
పీవరదేహమున కవియె పెట్టని సొమ్ముల్ 54

రావణుపేరురమ్మున బలంబునఁ గుంభముతోడఁ గ్రుమ్మసై
రావత వారణమ్ము సమరంబులు సాగెడివేళ గాయముల్
కావుడు నానవాళ్ల పొడకట్టును మానిన చోటులందు, సం
భావనసేయఁ దద్విపుల వక్షమదెంతటి వజ్రతుల్యమో! 55

అతఁడజేయుఁడై గెలుచు సన్ని జగమ్ములు నెత్తివచ్చినన్
భూతపిశాచ దేవగణముల్ రణమందున నిల్వఁ జాలకే
భీతిని సంచరించెదరు - వేదవిదుండును, శూరుఁడౌను సం
గీతకళాప్రగల్భుఁడు - చికీర్షువు కాముక కార్యలగ్నతన్ 56

సరసీరుహాననల్ ఛత్రచామరములు
పట్టియుండ, కిరీట వజ్రకాంతి,
మేనిపై తాల్చిన మేలిబంగారు భూ
షలనిగారమును, గుండలప్రదీప్తి
మిళితమై సభను శోభింప వెల్గులతోడ
వింతసోయగములు విస్తరింప
ధవళమ్ములౌచు ముత్యము లట్టులున్న దం
తములు మెఱయగ వదనములు పది

బాహు లిర్వది౯ గలిగి చూపఱకు మేరు
పర్వతము వోలె నతఁడు కన్పట్టుచుండె
వానిధై ర్యమునకు క్రిందు వారినిధులు
వేలుపులతోడి యుద్ధముల్ పెద్దవిందు 57

పరదారాభిగమమ్మె
పరమానందము నొసంగు౯ - బ్రాహ్మం డయ్యున్
కొఱగామి యగుచు నిరతము౯
దిరుగు జగత్త్రితయమందు౯ దెగువరి యగుచున్ 58

యాగముల్ పాడుసేయగ నుత్సహించు. మ
హాపర్వతమ్ముల హాళినెగుర
వేయ సమర్థుఁడు - విమల ధర్మంబన
సరిపడ దెప్పుడు - సకలశస్త్ర
సంధానమును. నుపసంహార మాతఁడు
బాగుగా నెఱుఁగు - రావణు డొకపరి
పాతాళమున భోగవతి పట్టణమ్ముపై
దండెత్తి వాసుకి దర్పమడఁచి
తక్షకునిపత్ని౯ జెఱ౯ బట్టె - యక్షనాథు౯
డైన సహ్యాకేశ్వరుగెల్చి యతని 'పుష్ప
కము' హరించెను 'నళిని' పుష్కరిణి౯ జైత్ర
రథవనము నాశముంజేసె లావు మిగుల 59

నముచిసూదను సుందర నందనమ్ముఁ
బాదతెను — రావణుని దుష్ట భావనమున
వాఁడి ఖడ్గమ్ముతో తెగి,పడగ నఱికి
నవశిరమ్ముల నర్పించె నలువ కెపుడొ

మిక్కిలిన వాని భక్తికి
నక్కజపడి మెచ్చికొనుచు నితనికి మరలన్
మక్కువతోఁ జతురాస్యుఁడు
దక్కించె శిరమ్ములెల్ల దైవాఱ కృపన్

సూర్యచంద్రోదయముల నసురపతి తన
చేతులడ్డుగ నిడియాఁపు చేయగలఁడు
క్రూరకృత్యము లొనరించి మేరమీఱి
మునివరులహింసఁ బెట్టు దుర్బుద్ధియతఁడు

దేవదానవ గంధర్వ ద్విరసనఖగ
జాతులతనిని నిర్జింపఁ జాలకుండ
వరముఁబడసె దశాస్యుఁడు — వానిదృష్టి
మానవులు నీచులగుటనే హానిరాదు

సర్వరాజ లక్షణములు సాహసాంకుఁ
డగు దశగ్రీవుఁడెంది కృతార్థమయ్యె
పైకి లేపెను కైలాస పర్వతమును
బాహువుల తీఁటతీఱ ధూర్వహాత మిగుల

దేవోద్యానములన్ విహారముల రక్తిన్ గాలముంబుచ్చు, భూ
దేవుల్ యజ్ఞములన్ దొనర్చునెడ నేతెంచున్ హవిస్సుల్ గొనన్
చేవన్ మించును లోకభీకరుఁడుగా - చెండాడు విద్వేషులన్
గావించెన్ బరమేష్ఠికై తపము దీక్షన్ వర్ష సాహస్రముల్ 65

దానిఁ బూనుటయన వాని జాతకమున
మందునకుఁగూడఁగనఁబడదెందు నెపుడు
దివ్య వస్త్రాభరణ మాల్య దీప్తి నెగడ
చండతేజస్వియై కొలువుండె నృపుఁడు 66

శూర్పణఖ రావణుం గాంచి యోర్పు వీడి
క్రుద్ధయై పల్కె నీరీతి రోఁతపడుచు
నేమియుంబట్టనటులఁ దా నిష్టగోష్ఠి
నున్న పౌలస్త్యు తోడ నిట్టూర్పు విడిచి 67

"అగ్రజా ! యిదియేమి ? అలజడి యేమియుఁ
గనరాదు నీలోన - వినగలేదొ ?
ఖరదూషణులును, త్రిశిరుఁడు ప్రుందిరి సర్వ
సైన్యమ్ముతో రామచంద్రుఁడనెడి
యొక మానవుని చేత నూర్జితులయ్యును -
నీకేమి పట్టదా ? నిర్విచార
ముగఁగూరుచుంటివిమ్మగను గామోపభో
గములతో మునుఁగుచు - కలిగి నట్టి

దారుణంబగు కష్టమ్ముఁదలఁపవేల ?
స్వైరవృత్తి నిరంకుశ భావములను
మెలఁగురాజు, నుపద్రవములను గడపఁ
బెట్టలేనిఁనృపాలుఁగాఁబట్టునెవ్రఁడు ! 68

పచ్చినాపద వాకిటి వఱకు - దాని
నెఱుఁగకే ప్రాలుమాలికఁదిరుగు నృపుని
పరిహరించి శ్మశానాగ్ని పగిది దూర
ముననె నిలుతురు క్షేమమ్ముఁగనక జనులు 69

ఎప్పుడే పనిఁజేసిన నింపౌలయునొ
యప్పుడా కార్యముంజేయనగును - దాని
నివ్వటింపని ఘూకాని నిధనమందు
దానితోపాటు - జాగ్రత్త - తప్పదన్న ! 70

పరదేశ సంగతుల్ పరికింపగ సమర్థు
 లైన చారుల సహాయ్యమ్ము లేని
క్ష్మాపాలునిన్ యుక్తసమయమ్ములను చర్య
 నమ్ము నొసంగని నరపతిని, ని
రంతరంబిటుల స్త్రీ లంపటుఁడైన మ
 హీక్షితు ననుచరులేఁటి బురద
నేసుగుల్ విడిచినట్లే విడనాడుదు
 రెంతయో భయమున - చెంత నిలుచు

వృద్ధులెవ్వరు రాజించు విధము లేదు
వార్ధిలోనున్న కొండలవలెను చార
చక్షువులు లేని క్షితిపుని కక్షిగతము
కావు వ్యవహారములు గ్రుడ్డిగా మసలిన

మును లానందము తోడఁదూఁగెదరు సుమ్మా ! రావణా ! దండక
మ్మున లేచేమిభయమ్ము రక్కసులనన్ ముద్దార రాముండొగిన్
దన సాహాయ్యము నిచ్చి మెచ్చుఁగొలువన్ ధానుష్కశౌండీరుఁడై
మును లేసట్టి కృపావిశేషమున దమ్మల్ వచ్చి వర్తించుచున్

రాము తగ్గి పిడుగు దీపసముంజూపి
యభయమిచ్చె మునుల కందఱకును
గడ్డిపరక నోలె గణియింత్రు రావణు
నూరకొనిన మేర మీఱగలరు 7

ఏ ప్రతీకారముండేయకెటుల నిలువ
గౌరవించునె నిన్ను రాక్షస గణములు
వాడిపోయిన పూదండ పగిది, వాడి
యున్న వస్త్రమ్ము వలె రాజ్యమున్న ఫలమె ? 7.

నమ్ముమీ! దండకముల స్థానమ్ము లేదు
మనకు - రాక్షస జాతికి మనుగడయెటు?
వెంటనే మేలుకొనుము - నీవంటి బలము
పుంజుకొనవలె దండకమ్ములను మరల 75

సకల విధమ్ముల శక్తిమంతులు దేవ
        గంధర్వజాతులు - కలుగు వారి
తో వైరమెవ్వేళ - ధూర్వహులగు చారు
        లను నియోగింపక, వనితల విడ
నాడక రాజ్యమ్ము నడపి దక్కించుకొ
        నంగసాధ్యమె నీకు? నగరజనులు?
బాలునివోలెను వర్తించు చుంటివి
        జయశీలుడవు - కాని సమరమందు
నమసిరందరు బంధువుల్ - చారులెవరు
నీకు లేనటు విదితమౌ - నీసచివులు
బుద్ధిహీనులు కాకున్న మోసమింత
జరిగియుండదు కద నిశాచరుల కన్న! 70

నీవు లుబ్ధుండవు - నీవు మత్తుండవు
        స్త్రీ పరతంత్రుడ వాపరాని
మోహమ్ముతోనుండు బూమెకాడవు, లక్ష్య
        పెట్టవెవ్వరిఁగూడ నట్టహాస
మునసంచరింతువు - కనికరం బిసుమంత
        లేనివాడవు - నీతి లేదు నీకు
ఆహేతువున గాదె యందఱి వీరులన్
        గోల్పోయితివి - గుండె గుబులు లేదు

దేశ కాలమ్ము లేమియుఁ దెలిసికొనవు
దాన గుణదోషములు సర్థమౌనె? యెదుటి
వారి నవమాన పఱచెదు క్రూరుఁడవయి
చేటు కాలము దరియవచ్చెను గ్రహింతె!"

అనుచున్ నిందయొనర్చు చెల్లెలినిఁ దా నాశ్చర్యముం బొందుచున్
దనుజాధీశుఁడు పల్కె నివ్విధిని" ఆర్తధ్వానముం జేయుచున్
మనుజుం డెవ్వఁడొ వచ్చి దండకములన్ మార్కొంచు హంవీరులన్
జెనఁజెన్ దానొకఁడే - పగం గెలిపి నిర్జింపంగ బొమ్మందువే!

ఎవ్వఁడా రాముఁడు? దివ్వలోఁ దలపడ
నేల? ఖరాదుల నెటులఁ జంపె?
వానిరూపం బేమి? వాని పరాక్రమ
మెట్టిది? జరిగినదేమి? చెపుమ
సురరాసవమ్మైన సుందర దండక
నేఁ బ్రవేశించె? నెట్టియాయు
ధముల ధరించె - హా స్తవకథఁ జెప్పక
యూరకయేడ్వఁ బ్రయోజనంబె?

రావణుని మాటలకును శూర్పణఖ బిట్టు
నవ్వి రాముని గూర్చి వర్ణనమొనర్చె
"నగ్రజా! వినుము సర్వమ్ము నవగతమ్ముఁ
జేసెదను - దశరామి వర్ణించితిఁ గదః

రాముఁడు వీరుండు - రాజవంశము వాఁడు
దశరథపుత్రుఁడు - తరణికులుఁడు
సువిశాలనేత్రుండు - సుందరరూపుఁడు
కందర్పసముఁడు - దీర్ఘభుజుఁ డమిత
బలశాలి, వారిదస్వనము గల్గినవాఁడు
ధీమంతు, డెంతొ ప్రఖ్యాతుఁడు, చీర
కృష్ణాజినాంబర కీలిత గాత్రుఁడు
స్నిగ్ధగల్లమువాఁడు, నిశితబుద్ధి
అతని కార్ముక మింద్రశరాసన నిభ
మగును - నాశీవిషోపమమైన బాణ
ములను వర్షించె నేలపై నిలిచి యూతఁ
డొక్కఁడే కూల్చె నందఱి నూర్జితుఁడయి 8

స్థిరుఁడుగ బాణముల్ వెలికిఁ దీయుట తూణముసుండి, తొడ్గుటల్
పరువడి నారి లాగుటలు. వంగు శరాసన మందు ముల్కులన్
వరుసగ గుప్పుటల్ తెలియు వైనము లేమియు నుండ వార్తితో
ధరణిని వ్రాలు రాక్షసుల ధ్వానములే వినిపించె నేడై అన్ 8

ఒక ముహూర్త మాత్రమ్ములో నొరగి పోయె
నంతరాక్షస సైన్యము - వింతకాదె!
పొదల దలసట రాముని వదనమందు
నిర్మలమ్ముగసుండెఁ ద్రినేత్రుని వలె

అతనికిఁ దమ్ముఁడుండె నతఁడంతటి వీరుఁడె పేరు లక్ష్మణుం
డతనుని మించు సుందరుఁ డహస్కర తేజుఁడు - ధర్మ నిష్ఠయున్
బ్రతిభయుఁ గల్గువాఁడు - పరువంబును, జక్కఁదనమ్ముఁ గాంతియున్
సతియగు సీతకున్ దనరు - సాహసి కాయమ ప్రాణమే సుమీ!

సుందరంబగు మేలివస్తువులఁ జేర్చి
బ్రహ్మ సీతను సృష్టించె - రామునియెడ
నెంతొ యనురక్త యాదేవి - కాంతి వలన
వెలిఁగిపోవును దండక విపిన వాటి

సీత రెండవలక్ష్మి - శుచివ్రతయగు
తప్తకాంచన వర్ణమాతరుణి దేహ
మమరికగనుండు రక్తతుంగములు నఖము
లమరభామల సంతతి కొమిరె లేదు. 8

ఆమె యెవ్వని భార్యయో యాతనికి మ
హేంద్ర భోగమ్ములం బనియేమి? దాని
నీకుఁ బత్నిగఁ గొనితేర నేను విఫల
యత్న మొనరించితిని సమ్ముమా! దశాస్య! 81

సుగుణయు, నసమాన సుందరియు, సుశీల
యగు సీత భార్యకాఁదగును నీకు
విస్తీర్ణజఘనయుఁ బీనపయోధర,
సైకతశ్రోణి నీసతిగఁ దెచ్చు

జతనమ్మలోన లక్ష్మణునిచే నేనిట్లు
పొగొట్టుకొంటిఁ జెవులును. ముక్కు
పూర్ణచంద్రవదన ముదిత వైదేహిని
నిర్వర్ణనము సేయ నీవు మదన
పరవశుఁడవయ్యెదవు - దాని భార్యవోలె
ననుభవింపఁ గోరిన యెడ నలసత వల
దిప్పుడే పొమ్ము! కూర్చుండ ముప్పువచ్చు
నతఁడె నీపైకి రావచ్చు నందువలన 87

నాయాలోచన సాగలేదు - పయిగా సన్‌బట్టి ముక్కుంజెవుల్
కోయన్ నేనటనేడ్చుకొంచు ఖరునింగోరన్ బ్రతీకారమున్
సేయన్ నాయెడఁగల్గు పేర్మి మెయి గాసించొంది యుద్ధమ్ముఁదాఁ
జేయంబూనుచు నాశమయ్యెనిటులం జేఁజేతనాశ్చర్యమౌ 88

నేను నీకోసమెంతొ యత్నించి భంగ
పడితి నీరీతిగా వైరి వధమొనర్చి
సీతఁ గొనితెచ్చి నీదానిఁ జేసికొనిన
సంతసింతును నాపగ నమయు దాన 89

నీవై భవమునకు నిజముగా రత్నకి
రీటమౌ జానకి కూటమి పర
మోచితమ్మగునుమి - యుగ్మలి నీయంతి
పురమునకే వెల్గు - బొల్పుమీఱు

అంతటిసుందరి చెంత నుండిన చాలు
　　కామోపభోగ్యయౌ కాంతయగును
నీజన్మ ధన్యమౌ నీజీవితము సుఖం
　　కరమౌచు రాజిలుఁ గాననింక

నేమిఁ జెప్పుదు - యత్నించు మామె లంక
కెట్టులోఁ జేర్చవలెను - నాపట్టుదలకు
రూపమిదు మంతవఱకు నాకోపమడఁగు
సావకాశములేదు - నాభావమిదియె

నీశుద్ధాంత మలంకరించుటకుగా నీకోర్కెఁ బండింపగా
నాసీమంతిని నీకు లభ్యమగుతన్ వ్యాకూతి నైనన్ మతే
పైశున్యమ్మననైనఁ జేకొనుము నాపంతమ్ము నీదేర్ప నా
కోసం బీపనిఁ జేసి సత్వరమె నాకుం గూర్పు మానందమున్

అనృశంసుఁడు రాముని, నతని తమ్ముఁ
డైన సౌమిత్రిఁ గడతేర్చు మన్నః తీర్చి
కొనుము - మృతవీరులకు ఋణంబును బిరాన
ఓర్చుకొను మెట్టు లెడఁదలనేర్చుచుండ

కుడికాలు సాచి కదలిన
నొడిదుడుకులు రావు - రాముఁడోడును లేదా
యొడికముతోఁగొనిరమ్మా
పడఁతినిఁగసుఁబ్రామి రాము - బ్రథనము వలదేన్

నా మాట నీకు నచ్చిన
చో, మానవ శక్తి కన్న సోఁకులబలమే
సోమించు ననుచుఁదెలుపుము
భూమిజఁగొని వచ్చి, పొంది, ముదమొందు మొగిన్ 94

చల్లగా నిచట మీనమేషముల లెక్క
పెట్టుకొనుచుఁగూర్చుండక గట్టి తనము
జగములకుఁజెప్పవలెఁగాని జంకమేలె ?
ఊరు, పేరును లేకుండ నుండఁగలవె ? 95

పడఁతినని యెంచి చంపక విడిచెనేమొ
నన్ను శ్రీరామచంద్రుఁడు - కన్ను, మిన్నుఁ
దెలియ కొంకచోటఁబడియుంటిఁదెలివి తప్పి
వచ్చితిని నీకెఱింగింప వార్తలన్న ! 96

మాయలాఁడి సంగతి నిటు మథ్యపఱచి
అన్న రావణుఁగవ్వింప నతని కపుడు
రోమహర్షణ మగుడు విరూప, చుప్ప
నాకపయి జాలిఁబూనె నన్యాయమనుచు 97

మంచికో, చెడ్డకో చెల్లె మాట వినుట
ముఖ్యమనిపించె నాతని మూఢ బుద్ధి
ఆ జనస్థాన వధ గూర్చి యాతఁడేమి
కోప పడుచునుఁబట్టించుకొనగ లేదు 98

తన బలము. నెదిరి బలమును
మనమున దర్శించుకొనగ మానవుఁడగు రా
మునిగెలువ సాధ్యమే యని
దనుజేశ్వరుఁడెంచి పిలిచెఁదనసూతునొగిన్ 99

రత్నభూషిత కాంచన రథము సిద్ధ
మయ్యె - ఖరములు దాని రథ్యములు - వాని
మొగములు పిశాచవదనముల్ - ఖగమువోలె
గగనమార్గమునంబోవగలుగునద్ది 100

రావణుండును మేలి వస్త్రముల దాల్చి
వజ్రవైడూర్య భూషణ వ్రజముతోడ
పదిశిరము, లిరువది భుజప్రకరమొప్ప
రథము నధిరోహణముఁ జేసె రమణమీఱ 101

్యవీథింజనుచున్న స్యందనము విద్యోతించి రోచిశ్ఛటల్
వింపన్ నవఘానుమండలము సాక్షాత్కారముంజేయుచున్
వన్ భూధరముల్, సరస్సు, లడవుల్ తోఁపింపగా చిన్నవై
వుల్ చిమ్ముచునుండఁబుష్పవనముల్, తగ్గెన్ వెసన్ దూరముల్ 102

ఇరువది బాహుల తోడను
శిరములు పదితోడఁ బొలిచె శ్రీరావణుఁడున్
మెఱపులతో కూడిన జల
ధరమో - దశశిఖరపృథివి ధరమో యనగన్ 103

అరదంబంత సముద్రతీరమునసే యత్యంత వేగమ్ముతో
నరుగన్ సాగెఁదపోధనుల్, జపతపోవ్యగ్రుల్, మహానైష్ఠికుల్
కరువుల్, చక్కని యాశ్రమంబులు, జలస్థానములున్, జన్నముల్
మురువౌ కొబ్బరితోటలున్, నగరముల్ పొల్పారఁగాన్పించెడిన్ 104

సాలతాలములు, తమాల వృక్షమ్ములు
పూలచెట్టులతోడఁబొలుపు మీఱి
కమ్మలతాంత సుగంధముల్ పర్వుచు
తన్మయత్వమును దనరఁజేయ
సారసహంసక్రౌంచములు గుంపులు గుంపు
లై కూయుచుండ నుల్లాసముగను
సురలు, గంధర్వు, లసురులును, గిన్నెరుల్
దేవవేశ్యల పొందు తెప్పఁదేల్చ
నృత్యవాద్య సంగీతముల్ నిత్యమచట
హర్షపాథోధిలో ముంచు నహరహంబు
ముత్యపుంజిప్పలును, శంఖములును, బగడ
ములును గుట్టలు, గుట్టలై ముదముఁగూర్చు 105

కానిపించెను మహాకాయమౌ న్యగ్రోధ
వృక్షమొక్కటి దానవేశ్వరునకు
శతయోజనాయత శాఖలు కలదాని-
కడువృద్ధమైన వృక్షమ్ము - దాని

పైమున్న గరుడుండు వ్రాలెను గజకచ్ఛ
పమ్ముల భక్షింప, బలము చాల
కొక కొమ్మవిఱుగ, దానికి నంటుకొని తప
మొనరించు వాలఖిల్యులు, మరీచి

పులును, వైఖానసులును ధూమ్రములు మొదలగు
మునులు మరణింతురనుచు ముక్కునను గఱచు
కొని నిషాదదేశమున నా కొమ్మవదలి
ఆమహర్షుల దీవెన లందుకొనియె 106

కొమ్మతో నిషాదులఁ జంపి, కూడ బలము
తినెను గజకచ్ఛపమ్ముల వినత కొడుకు
నాకమునకేఁగి యమృత భాండమ్ముఁదెచ్చి
తల్లి దాస్యమ్ము బాపె నాతండు భక్తి 107

ఆ మహావృక్షము 'సుభద్రమ' నఁబరగును
దనుజనాథుఁడు వీక్షించి. దాని దాఁటి
చేరె మారీచు నాశ్రమసీమఁ దపము
సలుపుచున్న నియతాహారు చాయకరిగె 108

రావణుని రాక గమనించి, రయమున విధి
యుక్తముగఁ బూజసేసి సభక్తికముగఁ
గుశలప్రశ్నల మారీచుఁ డశనివోలె
వచ్చిన దశాస్యునడిగెను భ్రాంతిపడుచు 109

మి మహాప్రభూ! మరల నెందులకున్ విజయమ్ముఁ జేసినా
మతి సేయ వచ్చెదఁ గదా! ప్రజకెల్ల సుఖంబె? లంకపై
ముఁడు చమ్మునిన్ గలసి రాయిడిఁ దెచ్చెనె? అద్ది సాధ్యమా!
ాయిడి యేదియో తెలుప రాదె ? వచించెదఁదోఁచు మార్గమున్ 110

ష నారంభముఁ జేసి రావణుఁడు పల్కన్సాగె మారీచుతో
పథతో నేత్రము లెఱ్ఱవాఱ నిటు "వాకోరాని కష్టమ్ముతో
షముంగానక కొట్టుకాడుచును విశ్వాసముతో నేఁడు నా
థ నీతోఁ దెలుపంగ వచ్చితిని - పోవం జెప్పుమీ మార్గమున్ 111

మొన్న నీతోడ మాటాడి ఖిన్నుఁడనయి
మరలి పోయితి లంకకు - మరలఁ గ్రొత్త
గా నొకటి వచ్చె శూర్పణఖను నిన్న
బన్న మందుకు నేను రావలసివచ్చె 112

నటులంకకేఁగితిని - నిన్నను వచ్చెను జెల్లెలున్ జన
ంసమునుండి - దానిఁగన సైరణ తప్పెను - క్రుంగిపోయితిన్
నులు, నాసికంజెనఁకి వేరిమిఁ జూపిరి రామలక్ష్మణుల్
ానులవోలె నాతి నిటు హింసను బెట్టగ సాహసించిరే! 113

రుఁడున్ దూషణుఁ డెట్టి వీరులు? వివేకస్ఫూర్తితో నుందురే!
ంరమందీల్గిరి - తక్కరాక్షసులు యోధుల్ వారు నట్లీల్గరే!
రమాశ్చర్యము కల్గు దీని విన మెక్కాలమ్మునన్ గాని యి
్కరణింజెల్లె విరూపఁ జేయగను నల్కంజిత్తమల్లాడెడిన్ 114

ఎవ్విధమున మన యోధులు
కవ్వింపరు - కైతవమునఁ గచ్చియకై కొ
ల్దువ్వెనఁట రాముఁడెంతగఁ
గ్రొవ్వెనొః మనుతెల్ల వేఁడఁగూల్చె నసురులన్ 11

శ్రీయని సందేహింపక
మాయించెను ముస్సునీడు మాతన్, మదిలో
స్త్రీయని చూడక నిర్దయఁ
గోయించెను ముక్కుఁజెవుల క్రుధఁ సోదరికిన్ 116

దండకాటవిలోన దనుజు లెవ్వరులేరు
సంహరించెను నిశాచరుల రాముఁ
డతనితండ్రియె వాని నడవులకుంగెంటెఁ
బాతకునిన్, గులపాంసను, సతి
తో వచ్చె వనులకు - దుశ్శీలుఁడున్, ధర్మ
దూరుండు, మూర్ఖుండుఁ గ్రూరుఁడింద్రి
య పరవశుండును, గృపణుండు, లోకకం
టకుఁడును,టకటొంకు, వికలబుద్ధి
హేతువేమియు లేక హింసించె సోద
రిని చెవులు, ముక్కుఁగోయించెఁగనులు నెత్తి
కెక్కెనో యేమొ ? పడఁతిని నెంత పరిభ
వమ్మొనర్చెనొ ? యెంత గర్వమ్మొ చూడు ! 117

ప్రతీకారం బొనరించి తీతెదను - దుర్మంత్రమ్ముతోఁ దెచ్చెదన్
సతిసీతన్ - పగఁదీర్చికొందునిటు నీ సాయంబు నర్థించెదన్
మతిమంతుండవు నీవు - సోదరులు క్షేమంబెంచు వారల్ కదా ।
హితముంగూర్చిన తెక్క సేయనెవరిన్ హింసించెదన్ - నొంచెదన్ 118

సాయం బనిననుయుద్ధము
సేయంబని లేదు - బలముఁజేవయుఁజూపన్
మాయోపాయముతో నీ
తాయోషను నపహరింపఁదలఁచితిఁగానన్ 119

దేవతలెత్తి వచ్చినను దేఁకువతో నెదిరించి గెల్చెదన్
జేవయు, దర్పముంగలిగి చెండెద-నీవు పరాక్రమమ్ముతో
మేవడికొఁడ వౌదు వుపమింపగరాని ప్రతున్న హేతుతా
భావమె నన్నుఁదెచ్చె ననుబంధము మిక్కుటమై చెలంగఁగన్ 120

మాయోపాయము లెన్నియో తెలియు - సామాన్యుండవే ? మమ్మ నీ
శ్రేయస్కామన చిక్కులం దొలఁచె - రాశీభూతనై భృత్యమై
నేయంబున్ మదిఁ బూని రాక్షసుల కెంతే పెద్ద దిక్కైన నీ
ధ్యేయంబున్ గొనియాడెదన్ సచివ ! నీ ధీశక్తి నగ్గించెదన్ 121

అది విన్న మారీచుఁ డదవదపడె శూర్ప
ణఖ కపమాన మొనర్చి రనగ
చేతమ్మునన్ విపరీత భయమ్మొదద
వంగ ప్రమాన్పడుచుఁ దాఁ గ్రుంగె నెంతొ

దితిజేశ్వరునకుఁ బ్రతీకారవాంఛ యే
మాత్రమ్ము లేదు - క్షమాకుమారి
పై వానికున్న యూఁపగరాని కామమ్మె
ప్రాతిపదికగ వచ్చె రావణుండు
మథనపడుచు మారీచుని మంత్రణ కయి
వానిఁ బొగడెను, వానినిఁ బ్రస్తుతించె
వాని ప్రతిభను గీర్తించె, వాని బూమె
కానితనము నుతించెఁ జక్కఁగ నతండు 122

సీతాపహరణమ్ముఁ జేయంగ నొక మార్గ
మును జెప్పెను దశాస్యుఁ డనునయముగ
ఈహామృగమ్ముగా హేమవర్ణమ్ముతోఁ
జిత్ర బిందువులతోఁ జెంగు చెంగు
మనుచుఁ జిందులఁ ద్రొక్కికొనుచు జానకి ముందు
నటు నిటుఁ దచ్చాడ నవనిజాత
ధవునితో నెంతొ ప్రార్థనసేయుఁ దెమ్మంచు
స్త్రీ మనస్తత్త్వమ్ము తెలియు నాకు
రాముఁడో లక్ష్మణుఁడో పట్టరాని తమక
మునను నినుఁ బట్టవత్తురు - మోహనముగఁ
బరుగుఁ దీయుచు, నాఁగుచు, మరల దూఁకి
కొనుచు దూరముగా, దీసికొనుచు పొమ్ము। 123

తరుణిఁ దనియింప దవుఁడె సాధారణముగ
నీ వెనుకవచ్చు - సౌమిత్రి పోవు వనికి
కందమూలమ్ములకొ, జలగ్రహణమునకొ
ఒంటిపాటున మైథిలియుండుఁ గుటిని 124

ఒకవేళ యొక్కఁడుండిన
సుకరము నా కతని మొఱఁగ సుందరి కొఱకై
నికటమున రథము నుంచెద
నకుతోభయతన్ హరింతు నవనిజఁ ద్రుటిలో 125

పరిసరప్రాంతమందు నొక పాదప మూలము మాటునుండి మీ
రరిగినతోడ మాయ యతి నయ్యెద నాశ్రమ వాటిఁ జేరెదన్
సరగున సీతఁ గాంచెదను జానకి వచ్చిన సత్కరింపగన్
కరము గ్రహించి బల్మిమెయి కాంచన గాత్రిని ముచ్చిలించెదన్, 126

మారీచా! యిది నిర్ణయంబగుమ - ధామందెచ్చుచే ముఖ్యమౌ
కారించెన్ గద రాఘవుండనుజ స్రుక్కంజేసి దుర్వృత్తిపై
దారింబోయెడి దానిఁ బిల్చి యిటు నిర్దాక్షిణ్యతన్ నొంపగా
పౌరీంద్రమ్మును రెచ్చఁగొట్టుటగుఁగా! ప్రాల్మాలికల్ కూడునే? 127

అతఁడు చెప్పిన వృత్తాంత మాలకింప
పెదవులెండెను - గుండెల బెదరుపుట్టె
నిలువుగ్రుడ్లతో నిలిచి వినీతుఁడగుచు
తేనికి నమస్కరించి మారీచుఁడనియె 128

అవధారు రావణా! ఆస్థానములలోన
ప్రియవాదులుందురు- పృథ్వీపాలు
తో నపథ్యమ్మైన మానిత ధర్మమ్ము
నెఱిఁగింప రొకవేళ నెఱుకపఱచి
నను రాజులంతగా వినఁబోరు, రాముని
సంగతిఁ దెలుపరు సరిగ నీకు
వాని విక్రమము నిర్వర్ణించినంగాని
గ్రహియించ కష్టమౌ - రాముఁ డాగ్ర
హించ రాక్షసకులము నశించి తీఱు
దీనికిన్ సందియములేదు - దేవి సీత
పైని నీకుఁ గల్గినయాశ పతనమునకె
కలిగినట్లుండె - క్షేమమ్ము కాదు - కాదు 129

లంకలో సుఖమ్ముగను గాలమ్ముఁ గడపు
చుంటి వింటన్క- రాముని జోలి కరుగ
నీవు మిగులవు - రక్కసుల్ నిలువఁబోరు
లంక లంకయే మిగుల దీ లంకెవలన ! 130

ఁకులనున్న మీనములఁ గూడ గ్రసించును జిహ్మగమ్ములన్
యుచు భక్షణమ్ము సలుపన్ దొరఁకొన్న సుపర్ణుఁ డాస్థతో
ఁయుచు రామచంద్రుఁడు ప్రభూ ! నినుఁ దాఁకినవేళ నల్పులౌ
వరి దైత్యులం జెనఁకఁ బోవుదు రంధఱుఁ గాలు వీటికిన్ 131

రాజు వీవు కదా! యిఁక రాజు చెడిన
రాజ్యమే చెడిపోవును - రాముని యెడ
నీ వొనర్చు నక్రమ మది నీ వొకనికె
పరిమితము కాదు - కులము సర్వమ్ముఁ జెడును 132

నీయపరాధమ్ముకై యాతుధాను లం
దఱు మరణించుట తప్పుకాదె ?
అల్ప పరాక్రముం డారాముఁ డని, కుల
పాంసనుండని నీకుఁ బలికి రెవ్వ

రవి వాస్తవమ్ములా ? అన్నియు నయదార్థ
ములె - ధర్మమూర్తి రాముండు నిజము !
తండ్రి యాతనిని వదలె ననుమాట య
సత్యమే - జనకుని సత్యసంధు
నిగ నొనర్పగ వనులకు నిగమ వేద్యుఁ
డరుగుదెంచెను దానుగ నెఱుఁగు మిద్ది
సర్వగుణశాలి యాతఁడు! సవతితల్లి
కైక కిఁకురించెఁ బుత్రునికై దశరథు ! 133

రామచంద్రుఁడు జనకు గౌరవము నిలిపె
సకల భోగమ్ములను, రాజ్య సంపదలను
తృణమువలె వీడఁజాలెను - గుణము లేదె ?
ఎటులఁ గులపాంసనుండును, బెటుకు నగును ? 134

ఇంద్రియ నిగ్రహం బెంతో విద్వాంసుఁడు
ధర్మావతారుండు - తరణి రాముఁ
డాతని ప్రభ సీత - యవనిజ లభ్యమ్మ
కాదు నీకును దేలికగ దశాస్య !
రాముఁడు కాలాగ్ని రణములో దూఁకిన
నీకాయువును మూఁడు నిక్కముగను
తేజస్వి, సురలకు దేవేంద్రుఁ డెట్టిఁడో
క్షత్రియులకు నట్టి సాహసికుఁడు
వదలు మీ మరణాంతక వక్రకార్య
మగ్నిలోఁ బడు శలభములై నశింతు
రెల్ల రాక్షస గణములు - చెల్లఁబోవు
నీకుటిల బుద్ధు లిఁక మీఁద నీరు గాఱు 135

వినుము చెప్పెదను నా యనుభవమ్ముల నీకు
దండకమ్ములనుండు తరుణమందు
స్వేచ్ఛగా నచ్చట విహరించు చుంటిని
కలుగఁగ వేయి యేన్గుల బలమ్ము
నే ననేక మునుల నిర్దయ సంహరిం
చితిని, భక్షించితిఁ గుతుకముగను
పరికించి నన్ను విశ్వామిత్ర మునివరుం
డంతట దశరథు నాశ్రయించి

యనుమతిం బొంది రామలక్ష్మణుల వెంటఁ
దీసికొనివచ్చి, తా యజ్ఞ దీక్షితుఁ డయి
యాగ రక్షణకై వారి నట నిలిపెను
వారు బాలురు నకృతాస్త్రు లపుడు నృపతి ! 136

కమలపత్ర నిభేక్షణుఁ డమల వస్త్ర
ధరుఁడు రాముఁడు బాలచంద్ర సముఁ డగును
దండకము లతని కాంతితో ధగధగ వెలిఁ
గినవి - సౌమిత్రి యుండెను కెలఁకున ప్రభు ! 137

రామునకును బండ్రెండేండ్లప్రాయ ముండు
నప్పటికి ధనుర్ధారియై నిప్పు వోలె
నిలిచె యుండెను - యువకుఁడ నేను - తప మొ
నర్చి వరములఁ బడసితి నలువ వలన 138

అబ్బురము కలిగె కాని నాగర్వితనము
వలన నాలోచనము సేయ నలవి కాక
మిన్నకుంటిని దాన నాపన్నుఁడ నయి
పరిభవము నందినాఁడ నా బాలు వలన 139

వాలాయమ్ముగ నేనలం గొనుచు విశ్వామిత్రు యజ్ఞమ్మునన్
గీలాలమ్మును, మాంసమున్ గురియ నగ్నిప్రాంతముం జేరితిన్
బాలున్ రాముని లక్ష్యపెట్టకయె - అబ్బా ! యొక్కబాణమ్ముతో
గూలం జేసె సముద్ర మధ్యమున దిక్కున్ మొక్కు లేకుండగన్ 140

శత యోజన దూరమ్మైన
నతి మానుష శక్తిఁ గలుగు నాళుగము నహాం
పతిఁ బడవై వగ నెట్టులో
బ్రతికియునే బట్టఁగట్ట వలసెను రాజా ! 141

వేయి గజముల బలముండి, హాయిఁ దిరుగు
నన్నుఁ బడనెట్టె వార్ధిలోఁ జిన్నవాఁడు
అప్పుడే యర్థమయ్యె నా కతని శక్తి
నాఁట గోలె సింహ స్వప్నమౌట యరిదె ? 142

ఎందుకో నన్నుఁ బొలియింప నిచ్చగించ
లేదు - నా ప్రాణములు దక్కె నీఁదు కొనుచు
లంకఁ జేరితి - సేనలు, లావుఁ గలిగి
సమసె నాతని కోదండ చారిమమున 143

తెలివి లేకుండఁ బడియుంటి దినము లెన్ని
గడచెనో కాని యర్థమ్మె కాకపోయె
బ్రదుకుటే చాలు ననిపించె రావణా ! ప్ర
తాప మంతటి దగుఁ జిన్నతనము నందె 144

ప్రాణ గొడ్డ మాతని తోడి పగయటన్న
సీత యనగను బరమ ప్రపూత చరిత
భస్మమై పోయెదవు గడ్డిపరకవోలె
హితము విని నిన్ను నీవు రక్షించు కొనుము 145

చేఁదైపోయెనె లంక ? - సౌఖ్యముల విచ్ఛేదింప యత్నించెదే ?
మీఁదున్ గ్రిందు నెఱుంగకే నగరిలో మేడల్ ముదం బీఁచవే ?
లేదే రత్నవిభూషితమ్మయిన నీ లీలావిహారస్థలి
ప్రాదుర్భావ రసాంచిత ప్రచుర నిర్వాహమ్ముపై కాంక్షయున్ 146

లంకావైభవ మా రఘూద్వహుఁడు కాల్పంజాలుఁ గోపాగ్నిలో
పంకేజాక్షునితోడి వైరమును జూపన్ సర్వ నాశంబె నీ
హొంకమ్ముల్ వెలయించు పత్తనము రూపున్ మార్చు భస్మమ్ముగా
సంకల్పింపకు లంక రెండవ జనస్థానమ్ముఁ గావింపగా 147

అవగతంబగుఁగాదె ! ఆతని బల పరా
క్రమముల సంగతి - ఖరుఁడు, దూష
ణుండును, త్రిశిరుఁడు ఖండింపఁ బడలేదె ?
చుప్పనాకేమియుఁ జెప్పలేదె ?
జలముఁ బాసిన మత్స్యముల భాతి నగుదురు
రాక్షసుల్ వారి శిరమ్ము లనిని
తాటికాయల భంగి ధరణిపైఁ బడు హత
శేషులు నటునిటుఁ జెదరి పోరె ?
పరసతిని గోరు కొనుటయే పాపమగును
సీతపైఁగాంక్షఁ బెంచుట చేఁదుమేయు
పనియె - కాలకూట విషము జనకపుత్రి
మాని యత్నమ్ము లంకకు మరలి పొమ్ము ! 14

వినుమయ్య మఱియొక యనుభవమ్మును దెల్పె
　　వాఁడను - దండకవనముల కతఁ
డేతెంచెనని విని, యిర్వురు రక్కసు
　　లను దోడుకొని పోయితిని - మృగముల
వలె మేము ఋషులను భక్షింప మొదలు పె
　　ట్టితి పట్లుఁ దిసుచుఁ జేరితిమి రాము
నాశ్రమమ్మును - నియతాహారుఁడై శుష్క
　　దేహమ్ముతో నుండ ద్వేషబుద్ధి
తపసివేషముతోనున్న తరణికులుఁడు
రాముఁడేమియొనర్చు నం చాముకొనుచు
నద్దగింపగ నాతఁడు నాశుగముల
మూఁడు విడిచెను మాపైని తోడుతోన 149

వాని శరములు సుపర్ణానిలవేగముల్
　　రక్తభోజనములు - రామబాణ
ములవేఁడి, వాఁడియు మున్నె నే నెఱుఁగుదుఁ
　　గాన నేఁబరువెత్తి కానలోనఁ
బాదపమ్ముల వెన్కఁ బ్రాణముల్ రక్షించు
　　కొనుటయే ప్రళయమయ్యెను దశముఖ !
నావెంటనున్న దానవులిద్దఱున్ బ్రమంది
　　రప్పటి నుండి నేనెప్పుడతని

జోలికేఁగ భయంపడి మూలనెచటొ
తపమొనర్చుచు నుంటిని - తరువు, తరువు
నందు శరచాపధరుఁడె ప్రత్యక్షమగుచు
సర్వమును రామ మయముగ నందడించు 150

ప్రవ్రజితుండుగ నేనిట
తీవ్రముగా తపముఁ జేతు దినముల్ గడపన్
సువ్రతుఁడ - దాశరథి పే
రే వ్రయ్యలు సేయు గుండె నిల్లిగులుగా 151

పాశహస్తుఁడు శమనుని పగిది తోఁచు
రామచంద్రుని రూపమే రాయి, రప్ప,
కొండ, కోనను, పుట్టను, గుట్ట సతము
కనపడును ధనుష్పాణియై కనులముందు 152

స్వప్నమందున రామదర్శనము కలుగ
వణఁకి పోవుచునుంటను ప్రభువరేణ్య !
తలతిరుగు 'ర' కారాది శబ్దములు వినిన
భయముతో నూఁగి పోయెదఁ బగలు, రాత్రి ! 153

పోవలదయ్య రాముపయి పోరునకున్ దనుజేశ్వరా ! పరీ
భావమునంది తీతెదవు - పాలనులందఱు నాశమొందురే !
నీవనుకొన్న దేదియును నిస్తులమై చనదెంత మాత్రమున్
చావును వచ్చు - తప్పుకొనఁ జాలవు - యోజన సేయ రాదొకో ! 154

రెట్టింపం బగఁబూననేలయని మారీచుండు - పౌలస్త్యుఁడున్
ధట్టించెన్ వెసఁ గాలచోదితుఁడుగా దర్పంబుతో నిట్లనెన్
"ఎట్టెట్టూ ! రఘు రాముఁడన్న మనుజుండే ! కైకవాక్యమ్ములన్
బట్టెన్ గాడె వనంబులన్ భరతు భూపాలుం బొనర్పన్ వడిన్ 155

రాముఁడొక మూర్ఖుఁడౌను - సామ్రాజ్యమెల్ల
వీడి, పినతల్లి మాటపై విపినములకు
వచ్చినాఁడేమి వీరుఁడు ? వనితమాట
కంత విలువయు ! రాజ్యము చింతలేదె ? 156

ఏదియేమైనను సీతకావలయు నాకేదేవతల్ చెప్పినన్
పదరంబోవదు - పొందితీతెదను - వాకోపూస రాదెమ్మెయిన్
విదలన్ సాధ్యముకాదు - నామనసులో వైదేహియే నిల్చె, నీ
మదనున్ బాదొనరింపఁ బోవకుము వ్యక్తావ్యక్తముల్ చెప్పుచున్ 157

న్ను మరల్పఁబూనకుము - నాఙతనమ్మును వీడఁజాల, నే
న్నము వచ్చినన్ దుదకు ప్రాణము మీఁదికిఁ దెచ్చినన్ సరే !
న్నవిధాలఁ జెప్పినను నించుకమారదు నిశ్చయమ్ము నా
న్నన వ్యూహమందు నిలువన్ గమకించెద నడ్డు చెప్పెదే ? 158

ప్రియవాదు లేవేళఁ బృథ్వీపాలునకు గౌ
రవముఁ దెచ్చేడి మాట నవదరింప
వలెఁ గాని యుత్సాహభంగమ్ముఁ గలిగింప
రాదు - జన్మించును రాజు సతము

పంచాంశములతోడ - వహ్నియు, చంద్రుఁడు
వరుణుండు, శమనుండుఁ బాకవైరి
యాశ్రయించుచు నుందు రాతని నౌష్ణ్యము
సౌమ్యత, దండ. ప్రసన్నతలును
విక్రమము రాజగుణములు - చక్రవర్తు
లెపుడు మాన్యు లీధర్మము నెఱుఁగక, ననుఁ
దూలనాడెదె ? నా గుణ దోషములను
వింగడింపగ భృత్యుల విధము కాదు 159

పాతపురాణము లేలను
నీతులు పలుకంగమేల ? నీహృదయములో
భీతియొకింతయు లేదే ?
సీతను దేవలదటంచుఁ జెప్పెదె ధృతితో 160

ెప్పకు ధర్మపన్నములు - చెప్పిన రీతిగఁ జేయుమంతియే
సుక్కవలేదు నాకు వెడమాటల వింటకు, దానవేశ్వరున్
రక్కవఁజేసి పక్కెదవె ? దాసుఁడ వయ్యును ధిక్కరించెదే ?
ెక్కచు నీకు నెంత తెగనీలుగు - కాలము వ్యర్థమై చనన్ 161

ినాయంతరముల్ గణింపకయె దుర్నీతిం బ్రదర్శించుటల్
హానిన్ నీకుగఁ దెచ్చికొంటకిది యాహ్వానంబె - నీ తెల్వితో
ినాయత్నములో సహాయపడరాదే ? సీతనెట్లైన నా
ానిన్ జేయక విగ్రహించెదవె యధ్యాసన్ విడంబించుచున్ 162

పాపాత్ముండును, మూర్ఖుఁడున్, మనుజుఁడున్, స్పర్ధాళువౌ రాముపై
కోపంబూనుచు నాలమున్ సలుప నెగ్గుంగూర్చునే ? తమ్ములన్
రూపున్ మాపగలేదె ? సోదరికి వైరూప్యమ్ముఁ గల్గింపఁడే ?
నైపన్ గష్టముకాదె ? దానికయి యోషారత్నముం దెచ్చెదన్ 163

నేను పొనరించు కార్యమ్ము మానితమ్మొ ?
కాదొ ? నిన్నడిగితినె ? మగటిమిఁ గలుగు
నాకు వేద్యమె యెంతొ వినయము తోఁప
కరములన్ మోడ్చి చెప్పగఁ గరముమేలు ! 164

క్ష్మాపతి శ్రేయముంగోరు సచివుఁడెప్పు
డేని వ్యతిరేకముగఁ జెప్పు హితము మృదువు
గా భయము, భక్తి యుక్తియు గదురఁ జెప్ప
వలయునే కాని నీవలె పలుక నగునె ? 165

పృథ్వీపాలుఁ డెంతయొ గౌరవింపఁ దగిన
వాఁడు- మంత్రియు గౌరవభంగమైన
పెంకెతనము మాటలను గన్పింప నీక
మాటలాడినఁ బొల్చుక్షేమమ్ము, సుఖము 166

గర్వంబేమయినన్ గనంబడిన నేక్ష్మాపాలుఁ డాపల్కుఁదా
నోర్వంజాలఁడు - మందలించు సచివున్ యోజింప కావంతయున్
సర్వజ్ఞుంబలెఁ బల్కఁ బూనెదవె ? యిష్టాగోష్ఠి కాదిద్ది, నే
నుర్వీనాథుఁడ, నీవు మంత్రివికదా ! ఊహింప వాసంగతుల్ 167

పరుషముల్ పలుకగ పాడియే ? నే నొక
పనిఁ జెప్పితిని - చేయవలయునంతె !
బదులు చెప్పకయె తోడ్పాటుఁ గావింపుము
సరగున నాజనస్థానమునకు
పోయి రామాశ్రమమ్మున సీత గమనింప
కాంచనమృగమవై కానిపింప
నినుఁ బట్టి తెమ్మని నిజనాథు నర్థింప
నీవెంటఁబడు రామునికి దొరకక
పరుగుఁదీయు మీలోన నేనరిగి సీత
బలిమిమై ముచ్చిలించెద ప్రక్కనున్న
రథముపై నుంచికొని వేగ లంక కామెఁ
జేర్చి వైచెద - నాపగఁదీర్చికొనెద 168

ఈ కార్యమ్మును నిర్వహించి చనుమీ ! యే నర్థరాజ్యమ్ము నే
చీకునన్ జింతయు లేకనే యొసఁగెదన్ జేద్పాటు లేదిందులో
నాకో సీతయు దక్కు - రాజ్య రమ మానస్థుండుగా వచ్చెడిన్
నీకో మంత్రి ! విరుద్ధ భావనల మన్నింపంగఁబోనెయ్యెడన్ 169

మారీచా ! తలఁదాల్చి యాజ్ఞలను బొమ్మా ! కార్యభారంబు నీ
వేరీతిందగఁబూర్తి చేసెదవొ కానీ చూతు సామర్థ్యమున్
మారీచమ్మున నిన్ను మించు ఘనునిన్ మంత్రాంగ సంశోభితున్
నేరం బోలునెచూడ ముజ్జగములన్ నేర్పుంబ్రదర్శింపుమా ! 170

ఎఱఁగావించెద నాకృపాణమున కిప్డే నీవు కాదన్నచో
మరణంబొందెద వీవు నా వలన సుమ్మా ; వేఱే రాముండుఁదా
శరసంధానమొనర్చి చంపని యెడన్ చాతుర్య మొప్పారఁ నీ
వరుగన్ మేలొనగూడు నీకవుడు సాధ్యంబౌను జీవింపగన్ 171

శ. రెండింట నొకండు చేయవలె మంత్రీ ; రాము దౌష్ట్యమ్ముతో
వారింపందగు హేతువుల్ కలుగ దౌర్బల్యమ్ముతో నాపదల్
ద్వారంబందున బొంచియుండగను దుర్వాదంబు సల్పంగ నౌ
రౌరా ; మంచిదె ? నీ హితమ్ము వినగా నాశ్చర్య మాశ్చర్యమౌ ; 172

ఆలోచించి యొనర్పు మెయ్యెదియొ - నేనాతన్వివై దేహినిన్
మాలంకాపురిఁజేర్చి తీతెదనులే మారీచ ; నీ సాయమున్
మేలుంగూర్పు నటంచునెంచితిని నెమ్మిన్ గాని నీ వొప్పవే ;
తూలంబుచ్చెదె ? ఆగ్రహంబు కలుగన్ దూలించువే తథ్యమౌ ;" 173

అని యధికార దర్పమున నా దనుజేశ్వరుఁడాన పెట్టగా
మనమున నెంతయో మసలి మంత్రి వరుండు సమాత్యు లెవ్వరో
పనివడి యీ దురాకృతము వంచనకై తలపెట్టఁబోలు హా
రిని సఖుకందగున్-నృపతి రేఁగె నటంచు వచించె నివ్విధిన్ 174

"ఈయుపదేశ మొంగఱపె నెవ్వఁడు ? నీ సుఖజీవనంబుఁగాఁ
జేయగ సాహసించె నిసిసీ ; యతఁ డెంతటి పాపకర్ముఁడీ
సాయము నేనొనర్చిన నృశంసుఁడనయ్యెద - ద్రోహినయ్యెదన్
మాయగఁజేయ నాకు తరమా ; హవణిల్లెడి నీ ప్రశస్తినిన్ 175

ఇది మృత్యుగహ్వరం బిందుఁగాలిడినచో
సర్వనాశనమగు - శత్రు హస్త
ములను స్వయంకృతమైన నేరమ్ముతో
నశియించునటు సేయు పశువులిట్టి
హితముఁగావించి రీకతమున పథ్యులు
వారు నిజమ్ముగ - ప్రభుత నిలిచి
ధర్మమ్ము యశమును, ధనమును మంత్రులు
పొందుదు రాష్ట్రమై భూపు వలన
నన్యథా చరియించిన నన్ని పోవు
రాజు క్షేమము ముఖ్యము - రాజు క్రూరుఁ
డైన, నీతియు, నియమమ్ము లేని యెడల
రాజ్యపాలన పొసఁగునే ? పూజ్యమగునె ? 176

రథము నడపెడి సారథి పథము వెంట
మిట్టపల్లముల్ సూడక నెట్టుకొనుచు
గుఱ్ఱములఁద్రోల రథమున గూలబడును
సారథియు నశ్వములుఁగూడ నమయు టరిదె? 177

అటులనే మంచిచెడ్డల నరయకుండ
పాలనము సేయఁబూను నృపాలుఁడేలఁ
గలఁడె రాజ్యమ్ము ఋజుమార్గమునఁ ? దాన
ప్రజలుఁబ్రభువును నశియింప వలసు కలదు 17

విషయలంపటుఁడవు - పట్టు, విడుపు లేదు
కఠినుఁడవు - దుష్టబుద్ధివి కాన దనుజా
తేలుబడిఁగూలిపోయెడి వీలు కలదు
మాను మాయత్నముఁ బునర్విమర్శఁజేసి 179

నీచే ప్రాణముఁ గోలుపోవుటకునై నే నెన్నఁడుం గోర మా
రీచుం డన్నను యోగిగా నెఱుఁగుమీ ! తేనిన్ విధేయుండుగా
గాఁచున్ దప్ప విపక్షఁ జూపి వ్యతిరేకం బేమియుం జేయఁ దే
వైచిత్ర్యమ్మది కాదె రావణుఁడు చూపన్ గత్తి ఖండింపగా! 180

స్వామి భక్తుఁడ తృప్తిగా, ప్రాణములను
రామమూర్తికి నే సమర్పణముఁ జేసి
నీ నియోగించు కార్యము నిర్వహింతు
పోవుదము పంచవటికి నిప్పుడె దశాస్య ! 181

సాక్షద్విష్ణువు రామచంద్ర విభుఁ డేసందేహమున్ లేద, నా
కక్షయ్యంబగు పుణ్యలోకములు ప్రాణాంతమ్మునన్ లభ్యమౌ
శిక్షం బొందను నీదు హస్తముల - వైశిష్ట్యమ్ము లేదందులో
రక్షించున్ నను, స్వామి తప్పక పునర్జన్మమ్ము లేకుండగన్ 182

ఒక్క నను మాత్రమే చంపి యూరకొనఁడు
చంపు నిన్నును, రాక్షస జాతి నంత
నాకు రామునిఁ జూడఁ బ్రాణములు వోవు
సీతను హరింప నీవు చచ్చెదవు - నిజము 183

నాసాయమ్మున సీత దొంగిలిన నన్నా ! నీవు తే, వేసునున్
కోసుల్, కోసులు నెట్టఁ జావసగు సుల్కాం బల్కు లేకుండ, వి
శ్వాసుల్ దైత్యులు కూడ లేనటులె - లేవల్ మాటు నామాటలన్
గాసింతైనను లెక్కసేయ వదియే గండంబగున్ రావణా ! 184

మనసారన్ వచియించు నాహితము నమ్మం జాల కేమేమొ, తో
చిన రీతిన్ బలుకంగఁ బూనెదవు - దాక్షిణ్యమ్ముఁ దోనాడుచున్
దనుజక్షేమము, రాక్షసేశ్వరుని భద్రం బెప్డు కాంక్షించు మం
త్రిని సన్నిధిఁ జిన్నఁ బుచ్చితివి కాదే ! రాజ ! నిందించుచున్ 185

మున్నొసంగిన నాహిత మెన్నఁడేని
నిన్ను వంచించెనా యేమి ? నేఁడు మనకు
లఘుత కలుగునె ? పచ్చు కులక్షయమ్ము
పెడచెవిం బెట్టెదవు - కల్గు బెడఁద నిజము 186

ముసముస లాడెద వెమ్మెయి
మసరి దురాలోచనలను మంత్రులు చెప్పన్
విసువాసముతో వినుముసు
మొసవెదవే శక్తిఁ గలుగు మేటరిపైనన్ 187

ధర్మప్రవర్తకుల్ ధరణీపతులు దుష్ట
మంత్రుల వలన ప్రమత్తులయి న
శించిపోయిరి మున్ను - కించిజ్ఞులను చేరఁ
దీసిన భూజాని తికమక గాని

కష్టముల్ పొందును - కడకు సహించును
నక్కల కిడఁ బెత్తనమ్ము మేష
ములు క్షీణమగురీతి మొఱకును, గృపణుండు
నగు భూపు పాలన నవయు జనత
నీవు చెప్పిన పనిఁ జేయఁబోవనియెడ
చంపెద నటంచు నను బెదిరింప ఘనమె ?
నేను కొనితెచ్చుకొంటినే దీని - త్రవ్వు
కొనుచు నుంటివి నీవె నీ గోతి నిటుల 188

ఇదియె సుమ్ము రావణ ! విచారింపఁ దగిన
సంగతి - విదేహనృప తనూజను బ్రతిఘట
న మొనరింపగఁ దెచ్చిన నాశమగుదు
వు జనస్థాన దైత్యుల ననుగమించి 189

చావఁ దలఁచిన మందును ద్రావ నిచ్చ
గింపఁడే రోగి - తద్భంగిఁ గిన్కతోడ
ప్రతిచికీర్షను నాగాములను గ్రహింప
వెంతగాఁ జెప్పినం గూడఁ జింతగించి 190

క్షేమమ్మును గోరి చెప్పితిని మన్నింపుడా ! హితం బెంతగా
గోతంబైనను నీచెవిం బడదు - మెచ్చుం గొల్ప దావంతయున్
శపాత్రునిగాఁ దలంచుచుఁ గరాసిం దూసి రూక్షేక్షికన్
క్షేపింపగ సిద్ధమైతివి - పరావృత్తిన్ బ్రపంచింపకే ! 191

సుడిగొను వినాశముం దెల్ప నంతయైన
వినక శిర మద్ధముగఁ ద్రిప్పె దనుజనాథు
డింక లాభము లేదని యెంచి తాట
కేయుఁడును పల్లె యనుచు సంగీకరించె 192

మారీచు: ఉటుల సమ్మతిఁ జూపి దీనాస్యుఁ
        డై నిల్వ దశముఖుఁ డతని గాఢ
ముగఁ గౌఁగిలించిఁ హాయిగసుండె నిప్పుడు
        సహకార మందింప సంతసింతుఁ
దొల్లిటివలె నీవు - ధూర్వహుండవు - కార్య
        శూరుఁడవగుదువు - క్షుద్ర రాశ
సునిగ నుంటివి కడు శోచనీయమ్ముగా
        వ్యవహరించి, నటించి, పలికినావు
కలదలను బం_త్తీముఖున కక్కఁ-ఆయె లేదు
వానితో - నీవెఱుంగుదు వానిజమ్ము
ఇపుడు నీవు మారీచుఁడవే! సచివుఁడ
వే! రథము నెక్కి- మనము పోయెదము! రమ్ము 19

ఏదో విధముగ జానకి
నాదానిగఁ జేయవలెను సమ్మతి మారీ
చా ! దంటవు నీరూపము
చే దంభన మాచరింప సీతను దెత్తున్ 1(

మఱుమాటఁ బల్కక మారీచ సచివుండు
        రావణుతో పాటు రథము నెక్కె
నాకాశమార్గమం దా యరదమ్ముఁ బోవ
        సాగెను - దారిలో వాఁగు లెన్నొ
వనము లెన్నియొ, పురవరము లనేకము
        నగములు, శిఖరముల్, నదులు పెక్కు
రాష్ట్రముల్ గడచుచు రయమున దండకా
        టవులఁ బ్రవేశించి మిపుల శోభ
సంతరించుచు నున్న పంచవటిఁ జేరి,
రథము నవరోహణముఁ జేసి, రాము పర్ణ
శాల పొలకువ గ్రహియించి, సచివుతోడ
పంక్తిముఖుఁడు కార్యారంభ పరతనుండె 195

పైకి మాత్రము ద్రఢిమ కన్పట్టుఁ గాని
తాటకేయుని హృదయమ్ము దందడిపడి
రామచంద్రుని రూపె నేత్రములఁ దోఁప
దశవదను నాజ్ఞకై నిల్చెఁ దనువువడఁక 196

రావణుని మానసమ్మున రమణి సీత
రూపమే నిండిపోయె విలోకనమున
కాతఁ డెంతయొ తహతహ లాడుచుండె
నెవ్వరేరీతిఁ బోయిన నేమి తనకు? 197

పంచమ వాహిని

ఖరముల్ వాహములైన కాంచన శతాంగమ్ముందరుచ్చాయలో
నరవిన్ నిల్పుచు మంత్రితో దిగుచుఁ బ్రస్తావించెఁ బౌలస్త్యుఁడి
క్కరణిన్ "రాముని యాశ్రమం బిదిగొ ! ప్రక్కంజూడఁ గాన్పించు, న
త్వరమే హేమకురంగ రూపమును దాల్పన్ బోవుమీ మిత్రుఁడా !

కదళీవనసంవృతమై
పొదలున్ గద యాశ్రమమ్ము - భూమిజ ముందున్
గదలుచు నట నాకర్షణ
మొదవఁ బ్రలోభింప వలయు యుక్తిన్ సచివా !

ప్రభువు మారీచుహస్తముల్ పట్టుకొనుచు
నెంతొయాప్యాయితుండుగ నెనకమెసఁగి
స్వామిభక్తిని కార్యమ్ముఁ జక్కఁబెట్టఁ
బ్రార్థన మొనర్చె మఱచుచు నంతరముల

విజ్ఞానపూర్ణుఁడు విశ్రవోబ్రహ్మకు
　　తనయుఁడై లోకముల్ తల్లడిల్లఁ
జేసివేల్పులఁ బరాజితులను గావించి
　　మేటి విద్వాంసుఁడై సాటిలేని
జగదేక వైణిక సార్వభౌముండయ్యు
　　సామవేదమున నిష్ణాతుఁడయ్యుఁ
బరమేష్ఠి మెప్పించి వరములఁ బడసియు
　　ఫాలలోచనునకు భక్తుఁడగుచు

సకలకళలఁ బ్రపూర్ణుఁడై సకలశాస్త్ర
ములఁ బరిజ్ఞానియై, ప్రౌఢు పొడుచుసరికి
మ్రొక్కి నవకోటి శివలింగములకుఁ బూజ
సేయు దశముఖునకుఁ గామచింత మిన్న!

విపరీతాకర్షణతో
రెపరెపలాడుచును బలకరించుచు సీతా
చపలాక్షి పొందుఁ గోరుచుఁ
గపటము నెఱపంగఁ బూనెఁ గామాంధుండై

మారీచుఁ డంతట మాయామృగంబుగా
మాఱెను - శృంగముల్ మణిమయములు
ముఖము సితాసితమ్మును, చెవు లింద్రనీ
లములుఁ గ్రిఁబెదవియుఁ గుముదపత్ర
సన్నిభంబగు - కుంద చంద్ర వజ్రోపమ
ముదరంబు - నిరుపార్శ్వములు మధూక
కుసుమ స్నిగ్ధమ్ములు - ఖురములు వైడూర్య
సంకాశములు - మృదుజంఘ లల్ప
ములు దృఢమ్ములుఁ బుష్పమ్ముఁ బొలుచు రత్న
సంయుతమ్మగు హరివిల్లు చందమగును
గ్రీవ మున్నతమై కనుగిలుపు మోహ
నమ్ముగా నిల్చె హేమవర్ణమున గ్రోల!

పరమ శోభనాకృతి నేత్రపర్వముగను
తాటకేయుఁడు మృగరూప ధారియగుచు
రామచంద్రుని యాశ్రమ ప్రాంతసీమఁ
గలయ దిరుగును హరిత శాద్వలములందు 7

ఆశ్రమము చుట్టుఁగలపెన్నొ యనఁటిచెట్టు
లటఁజెలఁగుఁగర్ణికారము లందు నిందు
నచటనే కిసాలమ్ముల విచలనమున
మృగము మేయుచుఁదోఁచు సమీపభూమి 8

చిత్రవర్ణ శోభితమౌ విచిత్రహరిణ
మపుడు దిక్కుల వెలిఁగించె నద్భుతముగ
దేహకాంతులఁ బ్రాంతమ్ము తేజరిల్ల
కల్పనయె వాస్తవత మించుఁగాదె సతము ; 9

సారంగ జాతిలో సహజంబుగా నట్టి
    సౌందర్య ముండదు - ఛద్మవేష
మూనెను దనుజుండు పూనికఁ గికురింప
    సీహామృగమ్ముగా నింపితముగ ;
పంక్తికంఠుండును వాని రూపముఁ గాంచి
    యాకర్షితుండయ్యె ననిన నేమి
మాయఁదెలియని యమాయికపు మాయ
    లేడిని వీక్షింప వేడుకపడ

సాధ్యమేయగు - కార్యమ్ముఁజక్కఁబెట్టు
నింక మారీచుఁడను తృప్తి శంకవీడి
సీత దక్కును తనకని ప్రీతి పడుచు
నారడమున నిర్వర్ణించు నసుర విభుఁడు 10

ఏఁగును ముందుకు - మరలను
వీఁగును వెనుకకును - భీతి కన్నుల గదురన్
మ్రాఁగన్ను వడును - లేచును
సాగును - కుప్పించుఁదరుల చాటగు మృగమున్ 11

ఇటుఁదిరుగుచు నటుఁబోవుచుఁ
బటుతాళించుచును బూరి పరకలఁగొఱుకున్
గుటముకడ నిలుచు హరిణము
చటులపతె నదృశ్యమౌను - సరగునఁదోఁచున్ 12

అడవిలో విహరించుచు నామృగమ్ము
నాశ్రమ ద్వారమును దరియంగఁబోవు
నంతలో వెన్కకేతెంచు నచటఁదిరుగు
లేళ్ల గుంపులఁగలియును - లీల మరలు 13

ఆకాంచన మృగముంగని
యాకానన మందుఁదిరుగు హరిణచయమ్మున్
వేఁకరము వచ్చుఁదప్పక
సోఁకు మృగంబనుచు వెఱచి స్రుక్కుచుఁదొలఁగున్ 14

శయనించు శాద్వలముపై -
భయమునఁబరువెత్తు, నిలిచి పరిశీలించున్
ప్రియపడి ధరణిజ చూడగ
నయగారముతోఁచి కోర్కెనసలెత్తంగన్ 15

అశ్రమోపాంత వనమున నపచయించు
తరుణమున మధురగీతమ్ము తన్మయముగఁ
బాడు కొనుచుండె వైదేహి భావి జీవి
తమున గలుగు శుభమ్ములఁదలఁచి కొనుచు 16

పదుమూడేండ్లు వనంబులన్ గడచి పోవన్ వత్సరంబొండె దుః
ఖదమై నిల్చె నయోధ్యఁజేరగల సత్కాలమ్ము వచ్చున్ సుఖా
స్పదమై సాగును జీవితంబులని హర్షంబొందుచున్ సీత దో
హద కార్యమ్ముల మగ్నమై గుసుమముల్ హార్దమ్ముమై కోసెడిన్ 17

చూచెను శుభలోచన యా
లోచన మధ్యమునఁగామరూపుని దనుజున్
తోఁచఁగ నిజమగు లేడిగఁ
బూచెను జెంగల్వ లవని పుత్రి యెడందన్ 18

చలితాలోకన విభ్రమ ప్రభల నా సారంగమాయాశ్రమ
స్థలికిం జేరుచు శాద్వలమ్ము పయి సుత్సాహంబునన్ సంచరిం
ప, లలిన్ మైథిలి దర్శనీయముగఁదోఁపన్ నాథుఁబ్రార్థింపగా
జెలగుం గాంక్షఁదపించె నాహరిణముం జేపట్ట నెమ్మైననున్ 19

అనవే వెఱఁదలు కన్నులు
సంతుష్టములగుచు వలలు రమణికి నపుడా
బిసిబిసి లేడింగనుగొన
సహజముగ మఱింత వెడఁదలయ్యె వెలుఁగునన్ 20

బంగరులేడి నెన్నడును భామిని చూడకపోయె, నట్టి సా
రంగము నాఁడు తోఁచెఁదమ ప్రాంగణ మందున నిన్నినాళ్లకున్
పొంగుచు, విస్మయింపడుచు భూమిజ రామునిఁ బిల్చె - లక్ష్మణుం
డంగలు వైచుచున్ శరశరాసనముల్ గొని వచ్చె నానపై 21

వారలకు హేమ హరిణము
మేరలు మీఱంగ హర్షమేదురమృతితో
దూరమున జూపి తమి దై
వాఱన్ ధవుఁగాంచెఁగనుల వాంఛలు తోఁపన్ 22

ఆమాయా మృగముంగన
సౌమిత్రి మొదందఁ బొడమె సంశయమేదో
ఆమారీచుని పనియిది
సామాన్యుఁడు కాఁడు వాఁడు సాహసి యనుచున్ 23

ఏరావణుఁడో ఏనిని
నిరూపముతోడ నిచటి కేఁగుమటన్నన్
గ్రూరాత్ముఁడు వంచనకై
చేరంగాఁబోలు ననుచుఁ జింతించె వ్యథన్ 24

హేమకురంగముఁ జూడగ
రాముని హృదయమ్ము రాగరంజిత మయ్యెన్
భామిని సంతోషించెను
సౌమిత్రి వచించె రామచంద్రున కిటులన్ 25

ఏదో కపటము - హరిణము
కాదని మదిఁదోఁచుచుండెఁ గార్పణ్యముతో
నే దుర్మార్గుఁడో వచ్చుఁగ
దే ! దనుజేశ్వరుని యానతిన్ వంచనకై 26

ఏమారీచుఁడో మోసపుచ్చుటకునై యేతెంచెఁ గాఁబోలునీ
సీమంగాని మతెచ్చటైన గనఁగా చిత్రంబు కాదే ! యతం
డే మున్నెందఱొ సంయమీంద్రులను దా హింసించి, భక్షింపఁడే
యీమార్గమ్మున గామరూపమున వాఁడేవచ్చె నీరీతిగా 27

వేఁటకేతెంచి నట్టి పృథ్వీపతులను
దానె బొలియించె మారీచ దానవుండు
వాని కపటమ్మునకు హద్దుపద్దులేదు
దీని నొక క్రొత్త యెత్తుగాఁ దెలియుమన్న ! 28

గాధితనయుని యాగమ్ముఁ గాఁచువేళఁ
దాటకసుబాహులను జంపి, దయతలంచి
వార్ధిలోఁ బడఁ గొట్టగ వాఁడు వచ్చె
నీప్రతారణ బుద్ధితో నిల్గనేమొ ! 29

వానిఁబట్టించు కొనవేల ? వాని జోలి
పొంటి మనకేల ? పోనిమ్ము ! చూడనేల ?
ఉండునో, ఊడునో మన మూరకొనిన
వాఁడె పోవును - పోకున్న వాఁడెచచ్చు !

చిరకాలము గహనంబులఁ
దిరిగితిమి యయోధ్య వీడి తిన్నన నొక వ
త్సరకాలముండె గడువుగఁ
బరికింపము కాదె హేమవర్ణమృగమ్మున్

ఏసందేహము లేదిది
మోసంబని తెలియు చుండె - మురిపించుచు రా
కాసి యరుదెంచె నిచటికి
భాసుర రూపమున - చూడవల దామృగమున్

లోకములో నెయ్యెడలం
బ్రాకటముగఁ గానరాదు రామా ! ఖరునిన్
బోకార్ప. దశగ్రీవుఁడు
సోఁకుననిపె మృగమురీతి సూడుకొని యిటుల్

ప్రశ్రితుఁడు సుమిత్రాసుతుఁ
డశ్రమముగ నసురరీతి నభివర్ణింపన్
ప్రశ్రయముగఁ జేసన్నను
సుశ్రోణి మఱంది నాఁపె శ్రుతపఱప నెదో !

ఆనందార్ణవమందు మున్కలిడుచున్ హాళింబ్రదర్శించుచున్
మేనెల్లన్ గఱుపాఱ చిత్రమృగసామీప్యస్థితింబొందగా
సూనాస్త్రోజ్జ్వలరూపు, నాథుదెస గచ్చుల్ మీఱువక్త్రంబుతో
దానీయమ్మృగలేడిఁ బొందగను సుత్సాహమ్ముతో నుండగన్ 35

రామచంద్రుఁడుఁ గూడ నాహేమమృగము
సొగసుఁగని నెమ్మనమ్మున సొక్కి, సోలె
ధరణిజ వచించె నీరీతి ధవునిఁ గాంచి
పాలసంద్రమ్మువలె పొంగి కేలుమోడ్చి 36

రామా ! చూచితె ! మృగ మది
రామముగా నుండి మనసు లాగుచునుండెన్
గోమున నాక్రీడార్థము
దీమసమున దెచ్చి బహుమతిగ నొసఁగఁగదే ! 37

దీని సౌందర్యమ్ముతో నిర్భరానంద
మును బొందితిని మేను పులకరింప
మన యాశ్రమమున జక్కని మృగమ్ములు పెక్కు
సంచరించుచు నుండు సారసాక్ష !
ఇది వానిలో నొక్కటేలఁగాకూడదు !
మారీచుఁడే యను మాట యేమి ?
బ్రతికి యుండగ దీనిఁబట్టి తెచ్చిన మేలె !
తెగటార్చి చర్మమ్ముఁదెచ్చిన సరె !

సుందరాజిన మందుఁగూర్చుండ నెంతొ
యందముగనుండు - నా కోర్కె నసఘ ! తీర్ప
వెడలి కోదండపాణివై వెంట నంటి
అభిలషించిన రీతి వేటాడి తెమ్ము ! 38

ఇంత తేజస్సు, చుఱుకు నాకింతవఱకు
నేమృగంబున గనరాదు స్వామి ! గహన
మంతటికి శోభఁగూర్చు సుధాంశుబింబ
మటుల రూపమ్ముఁగాంతియు నవఘశింప ! 39

చక్కని మేసును, మఱియుం
జక్కని నేత్రములుఁగలిగి చాంచల్యముతో
సొక్కించు లేడిఁగనుగొన
మక్కువ మిక్కిలెను - తెచ్చి మన్నింపఁదగున్ 40

ముద్దుల్ మూటలుకట్టు హేమ హరిణమ్మున్ గాంచఁబ్రహ్లాన్నతన్
హద్దుల్ మీఱును మానసమ్ము నిరపాయప్రాప్తిగా నాకు నీ
ప్రౌఢ్దున్ దెచ్చిన కాలమున్ గడప నింపుల్ సొంపుఁగలున్ బురిన్
ముద్దుంజేతురు సోదరీమణులు వ్యామోహమ్మునన్ దీనినిన్

మన వనవాసకాలమున మంచి వినోదము కాదె ! తోషణం
బనువు నొసంగుఁగన్నులకు నద్భుతమై యెసలారు - చూపఱన్
మునుచును దన్మయత్వమున మోదమునిచ్చి - యయోధ్యకేఁగినన్
వెనుకటి జ్ఞాపకమ్ములు ద్రవింపగఁజేయును మానసంబులన్

ఈ యాకర్షణ నామనంబునకు నెంతే హాయిఁగూర్చున్ ప్రభూ!
మాయోపాయము తోడ దైత్యుఁడిటు ఛద్మంబైన రూపమ్ముతో
చేయంబూనిన వంచనన్ జరుగు విచ్ఛిత్తిన్ దుదింటొందఁడే?
మాయంజేయగ మీ శరమ్ము నిశితంబై నాఁటి కూల్చున్ ధరన్ 43

దేహంబంతయుఁ బుల్కలంటొదలుఁగాదే! గుండె నూల్కొన్న వ్యా
మోహంబగ్గలమయ్యె - వేగఁగొని రమ్మో! ముద్దుఁదీర్పన్ మహా
బాహూ! నాయెడఁబ్రీతి కల్గిన ప్రతాపస్ఫూర్తి నెల్లైన సం
దేహంబేమియు నిల్పఁబూనక మదిన్ దీకొంచు నా ప్రార్థనన్ 44

మన రాజ్యపాలమునస నిది శుద్ధాంత
ముఁన కలంకారమై ముదముఁగూర్చ
భరత శత్రుఘ్నులు శ్వశ్రువుల్, చెల్లెండ్రుఁ
బరికించెదరు ప్రేమ భావ మలర
భర్తను దాను నిర్బంధింప నెట్టి కాం
తకుఁగూడఁదగదు - వాదము నొనర్ప
ధర్మమెట్లగు? దాని చర్మంబుఁగాంచఁగు
తూహలంబుగ నుండెఁదోయజాక్ష!
నేను మున్నెన్నడును గోరబోను దేని
నింతవఱకును గరుణింపవే! మహాత్మ!
ఆఁడు దానిని - తోడుగా నమరు నిద్ది
పంచవటి యందు నాకుఁబ్రవాసవేళ 45

ఇవె విల్లమ్ములు స్వీకరింపుము దయాబ్ధీ । నా మనంబూరకే
కనియుందనమృగ సాహచర్యమునకై కాంక్ష పరిష్కారహాన్
సవరింపందగు మోదవార్ధిమునుఁగన్ సాధిష్ఠ । సంభావ్యనై
వివశత్వమ్మున నుంటి లేడిఁగొని రావే । నాకునై ప్రేమతో 4

అనుచు నందించె బాణశరాసనములఁ
బతికి జానకి తమకమ్ముఁబట్టలేక
చిత్తము కురంగలబ్ధికై చెంగలింపఁ
దొందరించెచు మోహమ్ము క్రందు కొనగ 4

ఆ మాయా మృగవర్ణము
రాముని వంచించె - జనకరాజతనూజన్
గోమున గాంచుచు నాయమ
కామన నెరవేర్ప మిన్నగాఁదలపోసెన్ 4

అనఘుఁడు తోడ్తో మృగమును
వెనుదగులగ నుత్సహించె విస్మయ జడిమన్
తనకే వాంఛ గుబులొ్కొన
ననుజునితోఁ దెలిపె నిటుల నాంతర్యమ్మున్

"ఎందుండి వచ్చెనో మృగ
మందముతో విందునేయు నయ్యా । సుమిత్రా
నందన । మీవదినెయు నా
నందమ్మును బొంది కోరె ననుఁ దెమ్మనుచున్

నాకును మనసునఁ దట్టగ
నాకూతి వెలార్చె సీత హరిణమ్మునకై
పోకున్న ఖేదపడుగా ।
చేకూర్పగ నిశ్చయమ్ముఁ జేసితి ననుజా ! 51

ధనదుని చైత్రరథమ్ములోఁగాని స్వ
        ర్గములోని నందనారామవాటిఁ
గాని, దానవుల చక్కని వనంబులఁగాని
        యిట్టిహేమ కురంగ మెచటఁ గూడ
సంచరించుచునున్న జాడ కన్పట్టదు
        భూలోకవని నుండఁ బోవుటరిది
అదిగో ! చూడుము దాని వదనమ్ము రమ్యమ్ము
        గాలేదె? శంఖముక్తానిభోద
రమ్ముతో నెమ్మెఁ జూపు సారంగ మెవరి
మనసును హరింప కుండును - వనదమందు
మెఱపువలె దాని నాలుక యొఱపుఁ గాంచి
పొంగి తెమ్మనె సీత - నాయింగితమదె ! 52

స్వర్ణమయచిత్ర రూపమాశ్చర్య మొదవఁ
జేయకుండునె యెవనికి ? మాయయైన
లోకసామాన్య మదికాదు - లోలనేత్ర
సీతకీలేడిఁ దెచ్చి, యిచ్చెదను నేను 53

జానకి నను(గూడి సారంగ చర్మమ్ము
పై నధిష్ఠించెడి వాంఛ(దెలిపె
నీచర్మమెంతయో మృదువుగా నుండుగా ।
యే జంతువుల చర్మమిట్టులుండ
దని నాదు విశ్వాస మనుజ । వాస్తవముగా
మృగశీర్ష గగన మందింపు(గొలుపు
రీతిగా బంగరులేడి భాసించును
సృష్టి నీమృగములు రెండె దివ్య
మగును - జాగ్రత్తగా నుండు మయ్య ! కుటిని
దీని నసుఖులతో(బట్టి తెద్చువాడ ।
తప్పినను జంపి తెచ్చెద ముప్పు తప్ప
దితడు మారీచుడై పచో నీల్గు - నిజము 54

రాజుల్ వేటల(జంపరే మృగములన్ లావొప్ప మాంసార్థమై
రాజాధీనము లౌను భూమి(గల సర్వద్రవ్యముల్, వస్తువుల్
రాజుం జెందదె యీమృగమ్ము ? మృదుచర్మం బెంత యందమ్మొ ! రే
రాజున్ వీడి మృగమ్ము శోణికరుదేరంబోలు(గ్రీడార్థమై 55

మారీచుండిటు మాయవేషమున దుర్మార్గమ్మునన్ వచ్చినన్
వారింపందగు వాని దౌష్ట్యమును నాబాణప్రయోగమ్ముతో
చేరున్ దప్పక వాని పూర్వులను - భక్షించెన్ గదా మౌనులన్
మూరింబోవుచు వాని(జంపవలె నమ్మో తమ్ముడా ! శీఘ్రమే 56

మున్ను వాతాపిదైత్యుఁడు ముని యగస్త్యు
చేత నశియించినట్టులీ చెనఁటి దితిజుఁ
డంతమొందును నాచేత ననుజ ! చూడు
మాశ్రమముఁగాఁచుకొనియుండు మయ్య ! నీవు 5

సందేహం బదియేల ! సీతకు మృగీచర్మంబె ముఖ్యంబుగా
ముందే వెల్లడిఁజేసె కోరికను రాముండద్ది మన్నింపఁడే
మందప్రజ్ఞుఁడొ ! యేమొ ! మూర్ఖుఁడగుచున్ మారీచుఁడేతెంచె నా
నందంబొందుచు లేడి రూపమున వెన్కన్ముందులం జూడకే ! 5

మున్ను నాబాణములరుచి నెన్నొమారు
లతఁడు చూచియు మరల నాకృతిని మార్చి
కొనుచువచ్చెఁ గాలము మూఁడె - కుక్కమూతి
పిందె లుదయించుఁ జెడువేళ వృక్షమునకు 5

ఒక నాళీకమునన్ వధించెదను సుమ్మీ! లక్ష్మణా! దీని - నే
నిఁక వెంటాడుచుఁ బోవుచుంటి నిదిగో! యీ యాశ్రమమ్మందుఁ బొం
దికగా నిల్చి విదేహరాజతనయన్ దేవేరిఁ గాపాడుమా !
విశిరశ్రేష్ఠుఁడు తోడుగాఁగలఁడు నిర్భీతిన్ జరించున్ గదా! 6

జటాయువు బలశాలి, యాప్తమిత్రుఁ
డతిసమర్థుఁడు సతము సాయమ్ము సేయు
మనకుఁ బితృకల్పుఁడై కాఁచు - మాన్యుఁడగును
క్షేమమరయును రిపుల శిక్షింపఁగలఁడు 6

అయినను నపాయమేదియో యవనిజకును
వచ్చునను సందియమ్మున భద్రతమెయి
మసలుకొనుమని తమ్ముని మరల, మరల
హెచ్చరించుచు శ్రీరాముఁడేఁగె నపుడు 62

లెను రాఘవుండు తన కార్ముకముంగొని రాముఁ జూచుచున్
దలను దాఁగె నామృగము పొంకముగా - పొడ కానిపించకే
దపదనందె దాశరథి - యాహరిణమ్మునుదేలె నొక్కచోఁ
లక నిల్చెఁ గొంతవడి - గ్రక్కునఁ బోయె నతండు దగ్గఱన్ 63

రామునిఁజూచి దూరమునుండి మృగమును
దరువుల, గుబురుల దాఁగికొనును
మరలఁ గన్పించును మఱుగుననుండి వె
ల్వలకరుదెంచును రామచంద్రుఁ
డిట్టి పోయినచోటికెల్లఁ బోవుచునుండె
మిలమిల లాడుచు మెఱసిపోవు
మాయామృగంబును మ్రాన్పడు నొకపరిఁ
గుంచించు కొను నొడల్ గొరకఁజూచి
పాఱిపోవును భయపడు పగిది - మరల
నతిరయమ్మున బ్రత్యక్షమగు నెచటనొ
చెట్టులంబుట్టలంబట్టి బిట్టుబిళ్లు
క్రేళ్ళుఱుకుఁ బోయిచేరును లేళ్లగుంపు 64

అది క్షణమున కొక చోటను
బదపడి కనిపించు వడిగఁ బరువెత్తి వెసన్
బెదరును - చిగురులఁ గొఱుకును
కుదురుగ నిలుచుండ దొక్క-కుటనికటమునన్ 65

కనఁబడును - వెంటనంటినఁ గానఁబడక
మాయమగు సట్టులే - మేఘమండలమ్ము
చంద్రునకు నడ్డమైవచ్చు చందముగను
నిట్టి కడ్డమువచ్చె మహీరుహములు 6

ఆశ్రమమ్ము దాఁటి యడవి మార్గమ్మును
బట్టె లేడి - విభుఁడుఁ బట్టుదలగ
వింటినెక్కు-పెట్టి వెన్నడి పోయెను
దూరదూరములకు దారితీయ 6

సరవిన్ లేడి పరిభ్రమింపగను బశ్చాద్గామియై రాముఁడున్
బరుగుల్ తీయుచు సుందరభ్రాంతిఁ గొనకే బాణమ్ములున్ విల్లుఁబూ
ని, రుషన్‌బోవుచు నెంతొ కాంత మెయి దానింబట్టుటో, చంపుటో
జరుగన్ ముఖ్యమటంచు నెంచుచుఁ బరీప్సన్ సాగె నావేగియై 6

కనఁబడక యెచ్చటనొ దాఁగె కనకమృగము
కోపగించియు ముగ్ధుఁడై కూరుచుండె
నొకతరుచ్ఛాయ రాముఁడు - నికటభూమి
హరిణయూథమ్ములోఁ గాన నయ్యె నదియు 6

దానితో రాఘవుఁడుఁ బిచ్చివాని పగిది
తోడనే క్రోధమున నొక్కడూఁకు దూఁకెఁ
గాని హరిణ మదృశ్యమై కానఁబడక
కసులు మిఱుమిట్లుగొనగ నెక్కడనో తేలె ।

ఇంక లాభమ్ము లేదని యినకులుండు
నిశ్చయించె దానిని జంప నీరవుఁడయి
పట్టుదల రాము మోమున బ్రస్ఫుటించె
నేత్రములు నెఱ్ఱవాఱె నిర్ణీతికతన

దూరంబేఁగెను దాని వెంట మరలన్ దూఁగాడు చిత్తమ్ముతో
పూరిన్ మేయుచుఁదోఁచె లేడి యొకచో - పొంగారు కోపమ్ముతో
సారప్రజ్ఞుఁడు నాఁగమ్మొకటి తా సంధించి వేయంగ నా
నారాచమ్ముఁబెకల్చె దాని యెదలోనన్ గాఢమైనాఁటుచున్ 7

తాఁకినదే తడవుగ నా
సోఁకు మృగమ్మెగిరి, యెగిరి చోద్యమ్ముగఁదా
నాకారగుప్తి వీడుచు
వైకల్యముఁబొంది నేలపైఁబడె నపుడే 7

మరణముఖుండగు మారీచ దనుజుండు
        కృతక దేహము వీడి కేకఁబెట్టె
నడవి మాఱ్రోగంగ "హా సీత । హా లక్ష్మ
        ణా" యని రాము కంఠమున నఱచి

తెఱవ్రాలె నిటుల - నేతెంచె రాముండును
    నికటమ్మునకుఁగాని నిధనమందె
నప్పటికే దైత్యుఁడాతఁడు, రత్నభూ
    షణ భూషితుండు, దక్షత గలాఁడు
హేమమాలి, మహాదుష్టుఁడిలను గూలె
రక్తసిక్తాంగుఁడై మ్రోల రాఘవునకు
మనసులో నిల్చె సౌమిత్రి మాట తెలమి
ముందు చూపున్నవాఁడు తమ్ముండటంచు 74

ఇది మారీచుని మాయగాఁదెలిపె మున్నె లక్ష్మణుండెంతగా
విదితంబయ్యెనొ - జ్ఞప్తివాటె నితఁడీవేషమ్ముతో తొల్లి దు
ర్మదుఁడై దానవు లిద్దఱింగొనుచుఁజేరన్ వచ్చె మోసమ్ముతో
వదలన్ వాఁడి శరంబు లిర్వురును జావన్ వీఁడు పర్వెత్తెగా 75

మరల నిదేమి పాపము - సమర్థుఁడటుల్ చనుదెంచె మూర్ఖుఁడై
హరిణము వోలె రావణుఁడహంకృతిఁబంపిన వచ్చెనేమొ । యీ
మరణము వ్రాసియుండెను - భ్రమల్ విడిపోయె సమక్షణుండనై
పరుగున నెంతదూరము విపక్షుని వెంబడి వచ్చి నాఁడనో । 76

    ఆతఁడు నా గొంతుకతో
    భీతిని గొలుపంగ నఱచెఁబెద్దగ - వినినన్
    సీత వెఱచఱచుఁదమ్ముఁడుఁ
    గాతరుఁడౌ కాదె నేను కారణమగుటన్ 77

ఆ యార్తస్వరమును విని
వైయగ్ర్యముఁబొందితీఱు వైదేహి - మతే
రాయిడిఁదెచ్చునొ ? లక్ష్మణుఁ
ద్రోయునొ వని ? కన్న కొఱకు తొందరపడుచున్ 78

తన తొందరపాటునకున్
మనమున జింతించి యాశ్రమమ్మున కరుగన్
ఘనుఁడును మఱియొక జింకను
జెనఁకుచు మాంసము గ్రహించి చేరగ మరలెన్ 79

మారీచుని యఱపుల విని
ఘోరమ్ముగ నుస్సురనుచు వైదేహి భయం
బారటముఁబొంది నాథుని
కేరాయిడి వచ్చెనొయని యెదఁదఁదలంచెన్ 80

ఆమె కంటినిండ నశ్రువులయ్యెను
చాన తనువుఁగంపమానమయ్యెఁ
బతికిఁగీడురాగ సతి యెట్లు లోర్చును
వేదనామయమ్ము వెలఁదిబ్రదుకు 81

జానకీదేవి లక్ష్మణుని బిల్చి వచించె
ననుమానమున గుండె లవిసిపోవ
''మీయన్నకేదొయపాయము సంభవిం
చినరీతి కనిపించు - వింటివికద ।

అతని కంఠస్వర మార్తిని సూచించు
వేగమ్ముగాఁ బొమ్ము విపినమునకు
రాముఁడు లేకున్న బ్రదుకుట దుర్లభం
బగునాకుఁగావున నచట వలయు
సాయమొనరించి మాయావిఁజంపి, నాథుఁ
దోడుకొని రమ్ము సౌమిత్రి ! తొందరపడు !
మనసు, మనసులో నిలువదీమాయ వలన
నగ్రజుని నేమ మారయ నరుగు మిపుడె ! 82

అడవిని మహోక్ష మొక్కహర్యక్షమునకుఁ
జిక్కినట్టుల రాముండుఁ జిక్కె నసుర
మాయలోపడి – రక్షింపుమా మఱంది !
అతఁడాపన్నుఁడయ్యె నే నాసపడగ 83

అనుచున్ దొందరపెట్ట, లక్ష్మణుఁడు రామాజ్ఞందలం దాల్చి యా
వనితారత్నము మాటలన్ వినియు నేభావమ్ము నాస్యంబునన్
గనరాకుండగ నిల్చియుండె నెటుఁ బల్కంబోవకా సీత యా
తని మౌనంబును గాంచి పైఱియుదుచుఁ బ్రత్యాళన్ వచించెన్ గ్రుధన్ 84

సౌమిత్రీ! యిదియేమి? రాము దురవస్థంగాంచియుం గూడ ర
క్షోమార్గమ్మును జూడకీ పగిది వాక్కుల్ లేక మూఢుండవై
నామీఁదేదియొ యాశఁబెట్టుకొని యన్యాయ్యమ్ముఁ గావించెదే?
రాముండేమియొనర్చె నేగి? రిపువే? రాయింబలెన్ నిల్తువే? 85

వాస్తవమ్ముగ రాఘవు పట్ల నీవు
మిత్రరూపమ్ములోనున్న శత్రువగుదు
వన్నఁదెగటార్చు దుర్బుద్ధి యున్నరీతి
కానిపించును నా కొఱకై పనిపడి 86

ఏలను మిన్నకుండెదవు? హింస యటన్నను వేఱయున్నదే!
శీలములేదె? రాముఁడు నశించినఁ జాలునె? గుండెగూడులన్
గాలిమ తోఁచుచుండె నవకాశము వచ్చెనె? యెన్నినాళ్లగా
తూలుచు వేచి యుంటివి కదో! యిటనూర్మిళకూడ లేదుగా! 87

పాలవంటి కులమ్మునఁ బ్రభవమంది
లోకపూజ్యతఁ గల్గు సుశ్లోకుఁడైన
దశరథుని నందనుఁడవయి దారితప్పి
మోహపడుచుఁ జేసెదె భ్రాతృద్రోహమిటుల? 88

లక్ష్మణా! హేతువిదియె యాలస్యమునకు
రామునకు జరిగినట్టి దురాగతమ్ము
నింత తేలికగాఁ జూతువే ప్రియపడి ?
అతని కష్టము నీ కిష్టమా తెలుపును! 89

తియే దైవముగాఁ జరించెద నహంభావమ్ముతో నాపయిన్
పతి నిల్పందగునే? నృశంసుఁడవు - దుర్మానమ్ముకాదే? మహా
పతి నీయన్న! విరుద్ధమీనడత - సామాన్యుండవే? నీకు నే
తిసైనన్ గుటిలాత్మ! దక్కనెపుడున్ గాలుష్యమున్ వీడుమా! 90

నీకు రామునిపై లేదు స్నేహపూర్వ
కాభిమానము - దానితో నవినయమ్ము
బాహిరిల్లె నగ్రజున కపాయమొదవు
కాలమున నెంత నిశ్చింతగా మసలెదు! 91

ఎవని కోసము వసులకు నిష్టపడుచు
వచ్చితివొ వాని కిప్పుడు ప్రాణసంశ
యమ్ము కలిగిన సమయాన నాశ్రమమున
నుండి చేయ వలసినదేముండె చెపుమ ! 92

ఓయి! నీలోన నన్నుఁ గాఁ జేయు దుష్ట
బుద్ధి యున్నది కావునఁ బోవకుంటి
వన్నకడ కాలసించుచు నట్టె నిలిచి
మాటలాడకయుండ లక్ష్మణా! ఘనంబె ? 93

అన్నకు ఘటిల్లు నాపద
చెన్నఁటి! గమనింప వేమిచేయవు శిలవై
మిన్నక సంతోషించుచు
నున్నట్టులఁ దోఁచు నాకు నూరక నిలువన్ 94

చాలిఁక! నీయత్నమ్ముల
నేలికకుంగిడు కలిగె నేనియు - లొంగన్
బేలనె? దక్కను నీకెపు
డీలువురాలను - నిరాశ యెదురౌను సుమా! 95

భీతకురంగనేత్ర పలవించుచు నిష్ఠురముల్ వచింపగా
చేతము క్రుంగిపోవగ విశిష్టగుణాన్వితుఁడైన లక్ష్మణుం
డాతరళాక్షి మోముగని యశ్రులబాష్పము లేకధారగా
స్ఫీతములై స్రవింపగ గృశించెను బెల్లుగ బాధనందుచున్ 96

సీత మాటల కెడఁదలోఁజేయివెట్టి
కలఁచినట్లయ్యె నెన్నడుఁగలను సహిత
మెట్టి పాపముఁదలపోయనట్టి తనకుఁ
బెట్టె నిట్టియభాండము బెట్టిదముగ 97

సేవాభావముతోడ భక్తిమెయి వచ్చెన్ రాము సాన్నిధ్యమే
శ్రీవాల్లభ్యకరమ్ముగాఁదలఁచి మూరింబోవుచున్ నెమ్మి నెం
తే విశ్వాసము చెంగలింప నిదియేమీ ! తల్లిగా మన్ననన్
గావింపంగ దురుక్తులాడ నెడఁదన్ గారింపవే లక్ష్మణున్ 98

ఉవిద కనుల నశ్రులులగఁబెల్లుగ
నోటమాటరాక నొగిలెనెంతొ
ఇది యనూహ్యమైన సొదఁగూర్ప వికలుఁడై
లక్ష్మణుండు నిలిచెఁద్రస్తుఁడగుచు 99

పౌరుషమ్ము విచారము వదనసీమ
రంగులను మార్చుచుండ విరక్తుఁడగుచు
జనకరాజనందిని తోడ వినయముట్టి
పడగఁగలతెఱఁగెఱిఁగింపఁబలికె నిటుల 100

నాదురదృష్టమే యగుసు నన్ను నపార్థముఁజేసి కొంటచే
లే దిసుమంత నా హృదిని నీవు తలంచిన దుష్టభావ మీ
వాదము న్యాయమై చనదు - భావ్యమె బిడ్డను సంశయింపగన్
దూదిని మించి తేలికగుదున్ గద ! లోకముఁబ్రువ్వఁదిట్టదే ? 101

రాముని బాహువీర్యముఁబరాక్రమమెట్టిదొ నేనెఱుంగుదున్
దూముడి బంధమాతని నెదుర్కొ_న జాలరు దేవదానవుల్
దోమల వోలెఁజచ్చెదరు - తోయజనేత్రుని చేతిలో ఖరుం
డేమయిపోయె ? సైన్యముల నెన్నిటిఁదెచ్చిన నిల్వఁగల్గనే ? 102

అతఁడు పురందరోపముఁడహంకృతి నెట్టిరు లెత్తివచ్చినన్
బ్రతుకుట దుర్లభంబగు, నవధ్యుఁడు ఘోర రణంబులందునన్
ప్రతియగు వీరునిన్ గన నసజ్ఞతయేయగు - దానవుల్ దురా
గత మొనరింపఁబూనిరి వికల్పము నేయ, భయమ్ము మానుమా ! 103

ఎవనిగాఁదలఁచితివీ రఘురాముని ?
అతనిని నిర్జింప నలవి యగునె ?
లోకములన్నియు నేకమై వచ్చిన
నతని విక్రమము ముందాఁగ లేవు
కఱకైన రాముని శరములకున్ నిల్వ
లేవు - పలుకకు మశ్లీలములను
జనకజ ! యిటులాడఁజనదు - తానాశ్రమ
వాటికిం జనుదెంచు వలుకు నన్ను

కదలరాదని రాముండు మదలనిచ్చె
సతని యానతి దాటగ నగునె నాకు ?
దురమునన్ ఖరదూషణాదులు నశించు
నాటఁగోలెను బగఁబూనినా రసురులు 104

వారు క్రూరులు హింసావిహారు లెప్పు
డే విధమ్మున వత్తురో యెఱుఁగఁగష్ట
మతఁడు మారీచుఁడే నిశ్చయముగ - మదినె -
నచ్చు రాముఁడు భయపడ వలదు వదినె ! 105

ఒంటరిగా నినున్ విడువ నొల్లను - నిశ్చల మానసమ్ముతో
నుంట ఘనమ్ము కాని యిటులూరక నాపయి సందియమ్ముతోఁ
గంటకముల్ పచించుచు నకారణశాత్రవమూనెదేల ? నా
పంటవలంతి యల్లుఁడు శుభమ్ముగ వెన్కకు వచ్చు తల్లిరో ! 106

నిరపాయంబుగ నీవిభుఁ
డరుదెంచును లేడిఁజంపి యదవదఁగొనుచున్
బరుషములఁబలుకఁదగదీ
తరుణమ్మున - స్వరమునన్నదా ! కాదు సుమీ ! 107

దనుజుఁడు రాముని గొంతుక
ననుకరణముచేసి యఱచెఁ యనఘుని దనుచున్
మనమున నెంచుచు నివ్విధి
ననుమానము పడుచు దుఃఖమందగనేలా ! 108

రాక్షసమాయగాఁ దెలియరాదె ; యిదంతయు, నన్న దీనికిన్
శిక్షయొనర్చి వచ్చెదిని - సేవకవృత్తిఁ జరించు నేనన్
రూక్షిత మానసంబున విరోధము సూపెదు తప్పులేక సం
రక్షణసేయ నాకు ముదలన్ దయసేయగనేమి చెప్పుదున్ 109

ఏమైనన్ నిను వీడి యెచ్చటకుఁ బోనేపోను - మార్గమ్ములో
రాముండే యెదురైన గోపగిలుచున్ అవ్వాదఁడే? యూరకే
పైమత్యమ్మను బెంచికో దగునె? నాప్రాణమ్ములకన్ గష్టమే
దో ముంచన్ నిను - దుయ్యఁబట్టఁడెననున్ ద్రోహీ యటం చాడఁడే? 110

ఆగర్వశత్రుత్వ మసురులకున్ మన
కెప్పటినుండియో - యినకులేశు
లను మహేంద్రుఁడుఁ బిల్వఁ జని దానవుల యుద్ధ
ములను నిర్జించుట వలన ద్వేష
ముండెడి దది ఖరుం డూడిన దాదిగా
ముదిరెను - రాక్షసుల్ వదరుచుందు
రేదియో - చేయుదు రేమియో తోఁచిన
రీతిగా - దానికై భీతియేల ?
రామచంద్రుఁ డజేయుఁడు - క్షేమముగను
తిరిగి వచ్చును - దనుజుఁడు మరణమొందె
కూసె నటువలె రాముని గొంతుతోడ
వంచన నొనర్చెఁ జచ్చియు వాఁడు చూడు ; 111

ఇంకను నేదియొ పలుకగ
నుంకింప సుమిత్ర సుతుఁడు - నుఱుముచు సీతా
పంకజముఖి యందికొనుచుఁ
గొంకక భాషించెనెంతొ కోపముఁ గదురన్ 112

ఓయి! యనార్యుఁడ! క్రూరుఁడ!
ఓయి నృశంసుండ! చెనఁటి! ఓపాంసనుఁడా
రాయిడిఁ దెచ్చెదవిటు నీ
ధ్యేయము నాకర్థమయ్యె - నింగిత మిదియా! 113

వాకొఁటూనకు మెద్దియు
నాకుఁదెలియు సర్వ - మేను నమ్మను నిన్నున్
నీకంగిట జెల్లమ్మను
చేకుఱునాత్మను విషమ్మె చిరకాలముగా 114

నీ కూఁతల నిజమ్మనే వెఱుంగుదుఁజుమీ!
అకరుణారంభుఁడ వగుదువీవు
ప్రచ్ఛన్నచారివై వనుల కేతెంచితి
వెంతొమచ్ఛరముండె స్వాంతమందు
సవతుల బిడ్డల సామాన్యమది - భర
తుని వేగరిగవచ్చి దుడుకుఁడవయి
మాదుదౌర్బల్యముల్, మమతలు గమనించి
కపటోపచారమ్ము లపకరించి

నాశనమొనర్ప నీకు నానందమగును
పద్మపత్రేక్షణుండు రాముభార్య నేను
వలతునన్నుఁగొంటివా లాతివారి? - నాథు
తో వియోగమ్ముఁ గలిగిన ద్రుంగుదాన! 115

తొలుతటినుండి నాయెడలఁ దోఁచును నీకొక దుష్టభావమా
పొలకువనే గ్రహింపగల పోఁడిమిలేక మెలంగి తిప్పుడే
మెలఁకువవచ్చె నీనడత మేలిమి వెల్లడియయ్యె - రామునిన్
దలపవు కష్టకాలమున దన్మయతన్ హితరూపశత్రువై 116

నీయంతనీవు ముందుగ
నీయన్న సహాయమునకు నిభృతుఁడవగుచున్
బోయెద వనుకొంటిని కా
నీ! యిటుచేయుదనుచు మది నెంచగనైతిన్ 117

నేను పొమ్మని చెప్పిన నిలిచియేవొ
కథలు చెప్పుచు నిచటనే కదలకుండ
నుంటివనగ దురూహల నుంటి వనుచుఁ
దెల్లమయ్యెనుకద దుర్మతీ! యుపేక్ష 118

రాఘవేంద్రునకు హేరామివచ్చుట యిష్ట
మగు నీకు నాతని కసురులేదొ
యాపద ఘటియింపఁజూపవే యిసుమంత
తొందర - నీవు మా తోడ వచ్చి

వనముల, కేమియు పట్టనట్లుండుట
భావ్యమే యేదొ దుర్వాంఛయుండి
మిన్నకుంటివి కాని నన్నెన్నడుంబొంద
తరము కాదెంత యత్నమ్ము నేయ
నీవు, భరతుఁడు కోరిన నింద్య వాంఛ
లేవి నెఱవేఱఁబోవు నా యెడల నెపుడు
నేనయోనిజ నన్న గుర్తైన లేదె ?
కలుషమతి ! దుష్కృత మొనర్పఁగడఁగినావె ? 119

నీవును, నీ భరతుండును
గావించిన యత్నములకుఁగలుగవు గెలుపుల్
లావరి రఘుకుంజరునకుఁ
బావని సీతకును రావు ప్రత్యూహంబుల్ 120

శ్రీగివలెన్ జగంబునఁబ్రదర్శిత వర్తనతో వనంబులన్
బగములన్నియున్ విడిచి మోదముఁజూపుచుఁజేరి నాపయిన్
గముఁజూపనెంచితివె ? రాముని పత్నిని నన్నుఁబొందగా
రాగము పట్టఁబోవదు - నియుక్తనొనర్చితి నిన్ను - పొమ్మికన్ 121

దరహాస మెపు డధరసీమ భాసించు
వైదేహి మొగ మెట్టిహాతె మిగుల
మధుర భాషణము సమర్యాదముగఁ జేయు
మైథిలి తఱుసంటి మాటలాడె

మఱఁది లక్ష్మణునితో - నెఱవాదియయ్యు శీ
లమును శంకించె నాలస్యమగుడు
కాంతుని పైని యగ్గలమైన ప్రేమతో
భయము సమర్షంబుఁబరిగొనె మది
దానితో నవుగాముల తారతమ్య
మెంచకయె యొడలు మండి నిందించె నతని
వెఱఁగుపడి సుమిత్రాసుతుఁడఱిముఱిపడి
తేఱుకొని కొంత వడికిఁగథింపఁబూనె 122

నేతులు మోడ్చిలక్ష్మణుఁడు సీతను గాంచి వచించె నిట్టులన్
మాత ! నిరంతరమ్ము నిను మన్ననఁజేసెద దేవతంబలెన్
ప్రీతిని సంశయించితె ! వినీతుఁడ - నీకెపు డడ్డుచెప్ప, ని
ర్యాతనముంబొనర్చ్చ రఘురాముఁడు లేడిని-వచ్చు నింతలో 123

దోసిలియొగ్గి మ్రొక్కెదను - దూఱుచునుంటివి నిష్ఠురంబులన్
దోసము సుంత నా యెడలఁ దోఁచదు నేనెటువంటివాఁడనో
పీసము కూడ గుర్తెఱుఁగవే ! వనసీమల సేవఁజేయ, నీ
కోసము వచ్చినట్లు వెఱఁగుంబడఁబల్కితి విద్ది న్యాయమా ! 124

సరిగా నీవదనమ్ముఁజూచి యెఱుఁగన్ సమ్మానముంజేయుచున్
పరప్రేష్యుండుగ నుంటినేను - పరమాత్మంబోలె నా యగ్రజున్
పరిత్రాసుండుగఁగొల్చినాడ - నిటులన్ వైమత్యమూనంగ నా
దురదృష్టంబని తోఁచుచుండెఁ జననీ ! దూఱన్ బరిస్పర్ధతో 125

రామాజ్ఞందలఁదాల్పగా వలసె నేరంబయ్యె నాపట్ల - నీ
సేమమ్మున్ మదిఁగోరి నిల్వగను నాక్షేపించుచున్ శీలమున్
సామాన్యంబలె నెంచి శంకఁగొనగా సైరింప నాశక్యమే ?
కామాసక్తుఁడై లక్ష్మణుండెడఁద సంస్కారమ్ము లేనట్టిఁడే ? 126

మాది రఘువంశమమ్మ ! దుర్మార్గమునకుఁ
దావులేదెచటఁగూడ నుదాహరణము
కలదె ? యెవరైనను నధర్మ కామమునకుఁ
బాల్పడిరె నేఁటి వఱకు ? నభాండమేల ? 127

స్త్రీ స్వభావమునకు దీటుగా మాటాడి
తివి - యిది సహజంబె యువిదలందు -
మరియు విముక్త ధర్మలు వారు - చంచల
చిత్తలు - మాటలఁగత్తులుండు-
మనసుల విడదీసి, యనయమ్ము విసము వి
త్తుటలోన జాణలు - పెటుకు పల్కు-
లాఁడి నా చెవులలో వాఁడి బాణమ్ముల
వలె గ్రుచ్చుచుంటివి వదినె ! యిటుల
నింద యొనరింపఁబూనెదె? కొందలించె
నెడఁద - వనదేవతలు సాక్షి లేను నిర్మ
లుండ - నాకేమి లేదు కాలుష్య మన్న
మాట శిరసావహించితి మహితనూజ ! 128

నన్నిటు లాలించిన
నన్నియు ? తలపోయ ననవదా! దీనిఫలం
బెన్న దొనీవసుభవమగు
మన్న విశయమెయుఁగఁ జింతనొందెదవు సుమీ! 129

అమ్మరో! పోవుచుంటినరయన్! రఘుపుంగవు జాడ, దుర్మిమి
త్తమ్ములుతోఁచుచుండె భయదంబుగ - కీడు ఘటిల్లనేదొ, నీ
చెమ్మెయి నుండువో తెలియ దింక - రాముని చెంత నుండగా
నమ్మికతోడఁ గాంచగలనా ? యనిపించుచునుండె నేలనో! 130

ఆపదల వనదేవత లాదుకొంద్రు
గాత! నను - భద్రములు కల్గఁగాత! సీత
పలికె! రాముని గొనివచ్చు పలుకు రాను
సెలవుఁగైకొందుఁ బోయి వచ్చెదను నేను 131

తరుణి పలన పౌరుష్యము తగ్గలేదు
పలుఁడి యాలస్య మొనరింపఁ గొలకొలఁగొని
మేరమీఱుచుఁ బలికె సుమిత్ర కొడుకు
తోడఁ గనకనలాడుచుఁ దోఁచి నటుల 132

"తొందరగఁ బొమ్ము! రాముని తోడ మరలి
రమ్ము! నాథుఁడు లేనిచో రాక్షసముగ
నేను గోదావరింబాఁడి నిధనమొందు
దాన! తద్భిన్నుఁడాఁకఁ బాపము నన్నైన 133

ఒడలు కంపించుచునుండె వైదేహికి
కోపమ్ముతో నెద గ్రుద్దుకొనుచుఁ
బరుషమ్ముగా - నేడువగసాగె - సౌమిత్రి
వాక్యమ్ము లామె శ్రవణములఁ బడ
వేమిసేయు నతండు? రామునిపై లగ్న
మైన మానసముతో నదరి పడుచుఁ
బరిపరి బాష్పముల్ కురియఁ జిత్తడియైన
గండము లెఱ్ఱనై మెండుకొనగ
చీరచెఱఁగున నొత్తుచు సీతయుండె
నీప్రపంచమె మఱచుచు నిడియ దిటవు
ధరణిజకు లక్ష్మణుండుఁ బ్రదక్షిణించి
మ్రొక్కి వెడలెను రామచంద్రుని వెదకుచు 134

ఆరటమందుచున్ వనట నాశ్రమదేహళిలో నిషణ్ణయై
దూరము దృక్కులన్ బఱపి తోయజ నేత్రుని రాక కోసమై
భారముగాఁ బ్రతీక్ష నిలుపంగను జానకి - రిత్తచూపులే
సారసనేత్రకున్ మిగిలె సైరణ తప్ప నవారణంబుగన్ 135

సమాప్తము



సవరింతలు

	పద్యసంఖ్య	పం క్తి	తప్పు	ఒప్పు
	10	2	నిచ్చు	యిచ్చు
	72	5	డీ ప్త	దీ ప్త
	72	11	త్రిప్పుకొను	త్రిప్పికొను
	81	1	నరితిన్	నరిదిన్
	87	3	కరగిఁపోయి	కరఁగిపోయి
	102	3	స త్త్వములు	స త్త్వమ్ములు
	126	2	దెత్యపతి	దైత్యపతి
	131	1	నున్న	మున్న
	134	7	డీకాను	టీకాను
	139	2	వోసె	వోరె
	140	2	వీలాంబుద	నీలాంబుద
7	142	12	దృ స్తి	దృ ష్టి
3	144	2	దంబలు	దంటలు
0	152	3	స్వాంతమున	స్వాంతమునన్
0	156	1	ఏకపత్మి	ఏకపత్ని
3	166	2	విను	నిను
17	187	3	వాకొక	నాకొక
59	1	12	వప్రియము	నప్రియము
62	15	3	యూర్జిక	యూర్జిత
64	28	1	వరులట	నరులఁట

పుట	పద్యసంఖ్య	పంక్తి	తప్పు	ఒప్పు
65	29	2	ముదలఁగొనుచు	ముదలవెట్టి
68	48	2	ప్రదేశము	ప్రదేశమున్
70	55	4	లాపముల	తాపముల
74	75	9	వంచలింపక	సంచలింపక
74	75	12	పందటి	సందటి
75	78	3	తవ	తన
75	80	2	అధరమ్ములన్	లధరమ్ము సన్
76	83	1	వారలల్	హారలన్
80	99	4	పక	లక
81	105	3	సై వికుల్	సై నికుల్
82	105	10	ధారురై	ధారులై
82	106	7	మ్సత్యముల్	మత్స్యముల్
83	108	3	సర్వసైన	సర్వసైన్య
85	119	3	భారుణమున్	భారుణముల్
90	132	1	మధరముల	మధరమున
95	151	11	నుక్కడగింప	నుక్కడపగను
97	154	3	యేమియు	మేమియు
97	156	3	జపి	జంపి
111	45	2	బాణలమున్	బాణములన్
111	49	4	వచసం	పచనం
128	108	4	చాతి	భాతి

పుట	పద్యసంఖ్య	పంక్తి	తప్పు	ఒప్పు
138	146	2	గావి	గాని
142	162	12	పరినరి	పరిపరి
142	163	3	ఐతి	బతి
144	3	9	మర్డన	మర్దన
161	61	2	నితనికి	నతనికి
166	78	4	జెసఁకెన్	జెనఁకెన్
167	80	11	నేలవై	నేలపై
167	81	4	నేడై బన్	నేర్తైబన్
173	104	3	స్థానములున్	స్థానమ్ములున్
181	132	3	వాకనికె	కొకనికె
182	135	11	రెల్ల	నెల్ల
202	11	2	కన్నుల	విస్మృతి
204	22	2	మృతితో	మతితో
208	41	3	గలున్	గ్లగున్
209	45	1	పాలమునన	పాలనమున
210	46	2	పరిష్కారహాన్	పరిష్కారమున్
210	46	2	కలియున్	కవియున్
210	47	4	దొందరించెచు	దొందరించెను
220	89	4	తెలుపును:	తెలుపుము:
230	126	4	కామాస క్తుడై	కామాసక్తుడై

035,1N24,1 MP
...TESWARA CENTRAL LIBRARY & RESEARCH ... TIRUPATI.

అభిప్రాయములు

్యనారాయణగారి శైలి సరళమయ్యు శక్తిమంతమై, ప్రౌఢమయ్యు సర్వసు
భావగంభీరమయ్యు ధారాశుద్ధి శోభితమై, ఆధునికమయ్యు నిర్దుష్టమై
ంచుండును. ఈ రోజులలో నిన్నిపద్యముల నింతహృద్యానవద్యముగా
ారు-రచింపగలవారు- ఎందఱోలేరు. శ్రీ సత్యనారాయణగారేది వ్రాసినను
తో వ్రాయుదురు.

-డాక్టర్ దివాకర్ల వేంకటావధాని M.A. (Hons) Ph D.

ందర్భాలలో శ్రీ సత్యనారాయణగారు కావ్యార్థసూచన ధ్వనిప్రాయముగా
ు. అది అలవోకగా చిత్రితమైనది. కవిగారు పాత్రచిత్రణలో ప్రతియోగము
ist) నాశ్రయించడం వల్ల ఆయాపాత్రల శీలవృత్తులు, ఆకారవికారాలు
ుతున్నాయి. కవిగారి వర్ణనలో యిది మరీ మనోహరంగా సహృదయ పాఠ
స్సులను చూరగొనే అంశంగా ఉండడం కవిగారి కమనీయ రచనావిశిష్టతకు
నక, ఊహ, కార్యకారణ సంయుతమైన కల్పన మనోజ్ఞంగా చేయగల
విగారు. చెప్పేతీరులో సున్నితమేకాదు. ఔచితీసహంగా ఉండడం విశేషం.

-డాక్టర్ యస్. గంగప్ప M.A. Ph.D.

ూరి సత్యనారాయణగారు తెలుగులో పద్యరచనలో సుకుమారమైన కథా
 నలవరచుకొన్నవారు. ఏ వర్ణనచేసినను, ఏ సంభాషణా చమత్కృతి
, ఏ సన్నివేశ కల్పనచేసినను మాటలలో మెత్తదనము, రచనలో
, శైలిలో ప్రసన్నతయు జెనికిపోనీయరు. పద్యమునకు బాహ్యసౌంద
ాటించుటతో బాటు అంతఃసౌందర్య పోషకమైన భావగాంభీర్యమునకు లోటు
. ఈ కవి సీసపద్యరచన విశిష్టమైనది. వర్ణనలకు, కథాకథనమునకు,
లకు అనువుగా సీసములను కడుసొగసుగా నడపుట చెప్పుకోదగినది.

-శ్రీ పేరాల భరతశర్మ M.A.